


ఆగస్టు 2013
రూ. 12/-


విపుల

విశ్వకథా వేదిక


- తెలుగు కథ
  కీ.శే. చలం
  హత్య విచారణ ... 73
- ఆఫ్రికా కథ
  నోబెల్ గ్రహీత నదీన్ గార్డిమర్
  నిధి ... 81



ఈ పాపి, కల్తీ నెయ్యి వ్యాపారం చేసేవాడు! వేడి నూనెలో వేయించండి!
నూనె పడదు! సార్! నెయ్యిలో వేయించండి!


వచ్చిన ప్రతీ పేషెంట్ కీ యోగా చెయ్యమని చెప్పడం ఎందుకు? ఇప్పుడు పేషెంట్లు రావడంలేదని బాధ పడ్డం ఎందుకు?!.. ఏమండి! కనీసం సిగ్గైనా పడండి!
MBBS, MD.
SARMA



నాకు డెబ్బై ఏళ్ళు, ఇంకా పెళ్ళి కాలేదు!
నాకు ఎనభై, ఇంకా


నాకు తెలీకడుగుతా స్వాతంత్ర్యం అంటే ఏవిటి??
.... కాంతం...!!
47
—Ravindra


మా ఆవిడ కింకా స్వాతంత్ర్యం రాలేదోయ్.....
.....అదేనోయ్.....టీవీ సీరియల్స్ నుంచి.....
Ravindra

పరమాత్మతత్త్వం రతి!

ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల్లో మానవ జీవితానికి ఉత్కృష్టమైన, పరమార్థమైన మోక్షాన్ని పొందడానికి తక్కిన మూడూ సాధనాలు. పురుషార్థమంటే 'పురుషేణ అర్థ్యతే ఇతి' పురుషుడు ప్రయత్నించి పొందాలనుకునేది అని అర్థం. ధర్మార్థాల మాట ఎలా ఉన్నా 'కామం' మోక్షసాధనమనేదే మింగుడు పడని అంశం. సాధారణంగా కామ మనగానే భావనలు మరోవైపు మళ్లుతాయి. నిజానికి ఈ లోకం మోక్షాన్ని మాత్రమే ఆరాధించే ముముక్షువుల వల్ల వృద్ధి చెందలేదు.. చెందదు కూడా. ధర్మం, అర్థం, కామం అనే త్రివర్గాలను ఉపాసించే వారివల్లే లోకం వృద్ధి చెందుతుంది. ధర్మంతో, అర్థంతో కూడిన కామం లోకోపకారకం, లోక కల్యాణకారకం కూడా. 'ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ!' ధర్మవిరుద్ధం కాని కామం నేనే అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పి ఉన్నాడు. విశ్వసృష్టికి ఆధారభూతం, విశ్వజనీనం, సకల ప్రాణికోటికి సమాన ధర్మమూ అయినందువల్ల శృంగారాన్ని రసరాజంగా కీర్తిస్తున్నారు. కేవలం కామోద్రేకం శృంగారం కాదు. కామాతీతమైన అనుబంధం, పవిత్ర దాంపత్య జీవితంలో అనిర్వచనీయమైన దివ్యానుసంధానాన్నే శృంగారంగా భావించారు. స్త్రీపురుషుల సంయోగాన్ని జీవాత్మ, పరమాత్మ సంయోగంగా భావిస్తూ భక్తిని కూడా శృంగార రస ప్రభేదంగానే పరిగణిస్తున్నారు.

రతి కేవలం కామోద్రేకం కాదు. అదొక పరమాత్మ స్వరూపం. అదొక యజ్ఞం. ఎంతో ఉన్నతంగా, అమలినంగా భాసిస్తుంది.

రతి చిత్పదార్థమది పు
ష్పితమయి స్త్రీపుంసయోగ చిరశిక్షా స్నే
హితమయి సుమానుషభవ
క్రతు కల్యాణంబునకగు రమ్యముగ సుధీ

సాక్షాత్తు పరమాత్మ తత్త్వమైన రతి స్త్రీపురుషుల్లో వికసించి, చిరకాలం వెలుగొంది, సంతాన రూపంలో ఒక యజ్ఞంలా మంగళకరమవుతుంది.

భరతుడు నాట్యశాస్త్రంలో కామాన్ని నాలుగు విధాలుగా విభజించి చెప్పాడు.

ధర్మకామోర్థ కామశ్చ మోక్షకామస్తథైవచ
స్త్రీపుంసయోస్తు సంయోగో యః కామస్సతు సంస్మృతః

ధర్మకామం- అర్థకామం - మోక్షకామం - కామం - అనే నాలుగింటిలో మోక్షకామం మాధుర్యభక్తి మూలం. ఈ శృంగారానికి లౌకికమైన స్త్రీపుంస శృంగారానికి దేహాత్మలకున్నంత అంతరం ఉంది. భక్తులు భగవంతుని వివిధ భావాలతో ఆరాధిస్తారు. వాటిలో శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మాధుర్య భావాలు ముఖ్యమైనవి. పరమాత్మనే ప్రాణనాథుడుగా భావించి ఆరాధించడం మధురభక్తి. ఈ మాధుర్యభావం శృంగార సమ్మిళితమై ఉంటుంది. దీన్ని ఉజ్జ్వల శృంగారంగా పరగణిస్తారు. ఇది లౌకికం, ఐంద్రియంగాక మోక్షదాయకం. శ్రీకృష్ణుని విషయంలో గోపికల మధురభక్తి అప్రతిమానంగా వెలుగొందుతుంది. మధుసూదన సరస్వతి 'భక్తి రసాయనం'లో భక్తుని పదకొండు అవస్థలను వివరిస్తూ భగవత్ప్రేమ పరాకాష్ఠ చిట్టచివరి భూమికగా చెబుతారు. ఈ దశలో భక్తుడు భగవంతుని విరహాన్ని ఒక్క క్షణం కూడా సహించలేడు. దుస్సహమైన గోపికల విరహం ఈ తరహాకు చెందిందే. పరమాత్మ వియోగానికి తల్లడిల్లే ఈ గోపికల విరహాన్ని జీవాత్మ విరహంగా చెబుతారు. ఒక గోపిక శ్రీకృష్ణుని ఎడబాటును సహించలేక...

నీవడవిం బవల్ దిరుగ
నీ కుటిలాలక లాలితాస్య మి
చ్ఛావిధి జూడకున్న నిమిషంబులు మాకు
యుగంబులై జనున్
కావున రాత్రులైన నిను గన్నుల నిండుగ
జూడకుండ ల
క్ష్మీవర! రెప్పలడ్డముగ జేసె నిదేల
విధాత క్రూరుడై

తన కన్నులకు రెప్పలు అడ్డంగా చేసి శ్రీకృష్ణుని సమ్యక్సందర్శనానికి భంగం కలిగించాడని బ్రహ్మదేవుని క్రూరాత్మునిగా నిందిస్తోంది.

గోపికలు శ్రీకృష్ణుని ఆత్మేశ్వరునిగా భావించి అనిర్వాచ్యమైన ప్రేమను, నిర్మలమైన భక్తిని ప్రకటించారు.

విషజలంబు వలన విషధర దానవు
వలన రాలవాన వలన వహ్ని
వలన నున్నవాని వలన రక్షించి
కుసుమశరుని బారి గూల్పదగునె?

కుసుమశర ప్రస్తావన వలన ఇక్కడ భక్తి శృంగార మిళితమై ఉండటమే కాక, స్త్రీపురుష సంబద్ధమై ఉండటం చేత కామంగా కనిపిస్తుంది. ఇంకా గోపికల భావనలో సురతం, కుచాలింగనం, చుంబనాదులు కనిపించడంతో లౌకిక శృంగారమనే భ్రాంతి కలగడం సహజం. బాహ్యదృష్టికంతే. కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే అందులోని నైర్మల్యం గోచరిస్తుంది. మధుర భావంతో కూడిన భక్తి శరీర సంయోగ మాత్రమయ్యే తుచ్ఛ కామానికి సంబంధించింది కాదు. గోపికలు శ్రీకృష్ణుని తాత్త్వికదృష్టితో భావించారని తెలుస్తుంది.

మానవజన్మానికి పరమార్థమైన మోక్షాన్ని పొందడానికి జ్ఞాన - కర్మ - భక్తి మార్గాలను నిర్దేశించారు. వీటిలో 'మోక్షసాధన సామ గ్ర్యాం భక్తిరేవ గరీయసీ' అని భక్తిమార్గానికి అగ్ర స్థానం ఇచ్చారు. ఎందుకంటే పండితపామర, స్త్రీపురుష, బాలవృద్ధ, ఇలా ఏ వివక్షా లేకుండా సర్వులూ అనుసరించడానికి అనువైంది భక్తి. 'పరానురక్తిరీశ్వరే - సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా-' అని నారదాదులు భక్తిని నిర్వచించారు. పరమాత్మ విషయంలో ఉత్కృష్టమైన ప్రేమను కలిగి ఉండటమే భక్తి. మానవ హృదయాలకు ప్రేమించే శక్తి పుష్కలంగా ఉంటుంది. అది లౌకికంగా ప్రవర్తించినపుడు ప్రేమగా, రక్తిగా ఉంటుంది. అదే భగవంతుని దెసకు ప్రయుక్తమైనపుడు భక్తిగా శోభిస్తుంది. ముక్తికి మార్గమవుతుంది.

మధుర కోమల కాంత పదావళితో నిండిన జయదేవుని 'గీతగోవిందం' శృంగార రసార్ణవం. రాసలీలా వర్ణనం. ఇందులో మూడే పాత్రలు. రాధ, శ్రీకృష్ణుడు, సఖి. విరహవేదనే ఇందులోని విషయం. ఇందులోనిశృంగారం ఆధ్యాత్మిక స్పర్శతో పారలౌకికానుభూతిని కలిగిస్తుంది. భక్తి, శృంగారాలు విడదీయలేనంతగా కలగలిసిపోయాయి. స్వామి శృంగారలీలను రసరమ్యంగా భావించి తరించడం భక్తి తన్మయత్వంలో ఒక దశ. ఇందులో రాధ నాయిక.. జీవాత్మ. శ్రీకృష్ణుడు నాయకుడు.. పరమాత్మ. నాయికానాయకుల - జీవేశ్వరుల సమాగమానికి పురుషకార భూత అయిన సఖి ఆచార్యస్థానీయురాలు.

యది హరిస్మరణే సరసం మనో
యది విలాసకలాసు కుతూహలం
మధుర కోమల కాన్త పదావలీమ్
శృణు తదా జయదేవ సరస్వతీమ్

ఇందులో రాధాకృష్ణుల ప్రణయ లీలలను విప్రలంభ, సంభోగ శృంగారాలను వర్ణించినా అదంతా మధురభక్తిమయమే. జీవుడు ముక్తిని పొందడం తత్త్వార్థం. జీవుడు (రాధ) పరమాత్మ విషయంలో మధుర భక్తిని పొంది ఉండటమే విశిష్టత.

శ్రీకృష్ణుని ప్రేమించిన గోపికల మధురభక్తి మార్గాన్నే ఎంచుకొని అనుసరించి తరించింది గోదాదేవి. గోదాదేవి కృష్ణ భక్తిప్రేరకంగా ఎన్నో రచనలు చేసింది. ముప్పది పాశురాలను రోజుకొకటి చొప్పున స్వామికి అర్పించింది. శ్రీమన్నారాయణుని అర్చారూపంలో సమ్మోహకరమైన శ్రీరంగనాథునే వరించింది. ఆ స్వామినే వివాహమాడి, ఆయనలోనే ఐక్యమైంది.



ఎందరు ఎన్ని రూపాల్లో మోక్షాన్ని పొందినా, వారందరిలో అంతర్లీనంగా కనిపించేది కామమే. అందుకే మహాభారతం అశ్వమేధ పర్వంలో కామం తన గొప్పతనాన్ని అద్భుతంగా చెప్పుకుంటుంది.

యో మాం ప్రయతతే హన్తుం మోక్షమాస్థాయ పండితః
తస్య మోక్ష రతిస్థస్య నృత్యామిచ హసామిచ

మోక్షాన్ని ఉద్దేశించి నన్ను (కామాన్ని) చంపడానికి ప్రయత్నించే పండితుడికి కూడా మోక్షం విషయంలో రతి ఉంది కాబట్టి అలాంటి వాడిని చూసినపుడు నాట్యం చేస్తాను అంటుంది. ఈ మోక్షరతే భరతుడు చెప్పిన మోక్షకామం.

– చారి



★ విశ్వకథావేదిక 'విపుల' నవరసభరితం. జులై సంచికలో కథలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా అమ్మ, దొంగ, కైకేయి కథలు నాకు బాగా నచ్చాయి.

– *సీతాదేవి,* ఆత్రేయపురం

★ 35 సం. 'విపుల' ప్రయాణంపై ప్రముఖుల అభిప్రాయాలన్నీ అక్షరసత్యాలే. అప్పటి ఆణిముత్యాలను నేటి పాఠకులు చదవగలగడం అదృష్టం. 'జ్ఞానధార' విజ్ఞానదాయకం. జులై సంచికలో 'కనబడుటలేదు' కథ, కార్డు కథలు బాగున్నాయి.

– *శ్రీమతి మంచాల శ్రీలక్ష్మి,* విశాఖపట్నం

★ విపులను గత దశాబ్దం పైగా ఇంటిల్లిపాదీ చదువుతున్నాం. వివిధ ప్రాంతాల, వివిధ దేశాల జనజీవనం, జీవన పరిణామ దశలు, సంస్కృతి, వేషభాషల్లో వస్తున్న మార్పులను చదివి అర్థం చేసుకుంటున్నాం. విపుల విశ్వకథావేదికే కాదు, జగదైక కుటుంబాల సమాచారాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకునే వారధి. జులై సంచికలో వృక్షరహస్యం, కైకేయి, అమ్మ, దొంగ, ఉరిశిక్ష, గొప్పోళ్ళ న్యాయం, తపోఫలం... ఇలా ఒకటేమిటి.. ఏ కథకి ఆ కథ ఆణిముత్యమే.

– *సంకేపల్లి నాగేంద్రశర్మ,* కరీంనగర్

★ ముఖచిత్రం ముచ్చటగొలిపితే, లోపల కథలన్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'అమ్మ, ఉరిశిక్ష' హృదయాన్ని కదిలించాయి. రచయిత త్రిపురగారి గురించి కొన్ని విషయాలు తెలుసుకోగలిగాం. జ్ఞానపీఠ గ్రహీత యు.ఆర్. అనంతమూర్తిగారి పరిచయం పూర్తిగా ఇచ్చి ఉంటే బాగుండేదనిపించింది.

– *సంజీవిగారి నాగశ్వేత,* బెంగళూరు

★ జులై సంచికలో లింగరాజుగారి 'గొప్పోళ్ల న్యాయం' ఆకట్టుకుంది. కార్డుకథలు, ముషాయిరా బాగున్నాయి.

– *బిక్కునూరి రాజేశ్వర్,* పొన్కల్

★ జులై సంచిక చాలా బాగుంది. ప్రతీ కథ ఆలోచింపచేసేలా ఉంది. 'అపార్ట్‌మెంటాలిటీ' నేటి మనుషుల మనస్తత్త్వాలకు అద్దంలా ఉంది.

– *ఎమ్. ప్రవల్లిక,* తుని

★ జులై 'విపుల'లో 'వార్తాతురాణాం' కథలో ఎలక్ట్రానిక్ మీడియా వైఖరిని ఎండగట్టారు. 'అపార్ట్‌మెంటాలిటీ' కథలో మనమెదుర్కొనే సమస్యలను హాస్యంగా చిత్రీకరించారు. 'వృక్షరహస్యం' తెల్లవాడి దమననీతిని తేటతెల్లం చేసింది. 'దొంగ' కథ చాలా హృద్యంగా ఉంది.

– *లహరి,* కె.టి.పి.పి.చెల్పూర్, వరంగల్ జిల్లా

సాహితీ ధ్రువతారలు



నేను సాహిత్యాన్ని శ్వాసగా భావిస్తాను. 2006లో అనుకుంటా.. 'విపుల'లో 'అభిప్రాయమాలిక' అనే శీర్షిక ద్వారా 'తెలుగుభాష'పై చర్చ నిర్వహించారు. అందులో '...పరభాషాపరులంతా దేశభాషలందు తెలుగులెస్స అంటే మనవాళ్లు మాత్రం తెలుగు 'లెస్' అంటున్నారని, అందువల్ల తెలుగు మహాసభలు మళ్లీ జరపాలి' అంటూ నేను రాసిన అభిప్రాయం ఫోటోతో ప్రచురించారు. అది చదివి మా కాశీబుగ్గలో అందరూ అభినందించారు. 'విపుల' అనువాద కథలు మా మది దోచుకుంటున్నాయి. ఈ జంట పత్రికలు సాహిత్య వినీలాకాశంలో 'సాహితీ ధ్రువతారలు'గా వెలుగొందాలని ఆశిస్తున్నాను.

- *మహ్మద్ రఫీ (ఈవేమన),* శ్రీకాకుళం

సత్కాలక్షేపం



విపుల, చతుర ప్రారంభకాలంలో నేను మారుమూల పల్లెలో వుండడం మూలాన అవి దొరికేవి కావు. ఒకసారి హైదరాబాదు ప్రయాణంలో ఖమ్మం బస్టాండులో రెంటినీ కొన్నాను. హయత్‌నగర్ వచ్చేసరికి రెంటినీ చదివేశాను. ప్రయాణం చేసినట్లే అనిపించలేదు. ఆ రోజుల్లో విపుల, చతురల సమీక్షలకు బహుమతులు ఇచ్చేవారు. ఆవిధంగా నేను కవల పత్రికల సమీక్షలకు రెండేసిసార్లు నగదు బహుమతులు పొందగలిగాను. చాలా గర్వంగా అనిపించింది. పదవీ విరమణ పొందిన తరువాత ఇప్పుడు 'విపుల, చతుర'లకు మరింత దగ్గరయ్యాను.

– *నెల్లుట్ల సుదర్శనరావు,* హైదరాబాద్

కంగారు



కానిస్టేబుల్: సర్, నిన్న రాత్రి జైల్లో ఖైదీలంతా కలిసి రామాయణం నాటకం వేశారు.

జైలర్: ఇది చాలా మంచి విషయం, దాని కెందుకంత కంగారు పడుతున్నావు?

కానిస్టేబుల్: ఎందుకంటే సర్, హనుమంతుడి పాత్ర వేసిన ఖైదీ సంజీవని కోసం వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదు!



కా'రణం'

"మీ ఆయన రెండో పెళ్ళి చేసుకుంటానంటే సిగ్గుశరం లేకుండా ఒప్పేసుకున్నావట ఎందుకు? "

"మా అత్తగారితో పోట్లాడటానికి నేనొక్క దాన్నే సరిపోవడం లేదు, అందుకనే...."



కూలీ

ప్లాట్‌ఫాం మీద సామాన్లు పెట్టుకొని ఒక అమ్మాయి కూర్చొని ఉంది.

కూలీ: మేడమ్! కూలీ కావాలా?

అమ్మాయి: అక్కర్లేదు, నాకూడా నా బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు.

కూలీ: !? !? !!? !



ఏడుపే బాగుంది!

"మీ అబ్బాయి ఏడుస్తున్నప్పుడు నీవెందుకు జోలపాట పాడి సముదాయించవు? " స్నేహితురాలు రాణిని అడిగింది మాధవి.

"నేను జోలపాట పాడినప్పుడల్లా పక్కింటివాళ్లు వచ్చి మీరు పాడకండి, మీ పిల్లవాడి ఏడుపే మాకు బాగుంది" అంటున్నారు చెప్పింది విచారంగా రాణి.

ముచ్చటగా మూడు



లెక్కల టీచర్ కొత్త విషయం నేర్పిస్తోంది.

'వెయ్యి కేజీలని టన్ను అంటారు. రాముా నువ్వు చెప్పు, వెయ్యి కేజీలు ఒక టన్ అయితే మూడువేల కేజీలు ఎంత? '

రాము: టన్ టన్ టన్

రేటెక్కువ!



వెంగళప్ప భార్యతో కాఫీషాప్‌కి వెళ్ళాడు.

"తొందరగా తాగు, కాఫీ చల్లారిపోతుంది"

"చల్లారిపోతే ఏంటట? "

"రేట్లు చూడలేదా? హాట్‌కాఫీ రు. 15, కోల్డ్ కాఫీ రు. 45"



తమాషా

భార్య: నాకు ఒంట్లో బాగాలేదండీ!

భర్త: అయ్యో! నేను నిన్ను షాపింగ్‌కి తీసుకెళ్దామనుకున్నానే!

భార్య: అరె నేను తమాషాకి చెప్పానే...

భర్త: నేనూ తమాషాకే చెప్పాను, ఇక లేచి వంట చెయ్!

ఎమర్జెన్సీ



అర్ధరాత్రి రాణి భర్తను నిద్ర లేపింది.

రాణి (రహస్యంగా): ఏమండీ, ఓ దొంగ మన వంటగదిలోకి దూరి నేను చేసిన గారెలన్నీ తినేస్తున్నాడండీ...

రాజు (కంగారుగా): అయితే ముందు అంబులెన్స్‌కి ఫోన్ చేద్దాం!



- శ్రీదేవీకృష్ణన్

మరణంలేని ప్రణయం

భారతీయాంగ్ల కథ

హీత్రూ విమానాశ్రయంలోని ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో వున్న ఖరీదైన బార్‌లో స్ట్రాంగ్‌డ్రింక్‌ను తాగుతూ చుట్టూ చూశాడు కెప్టెన్ జాన్. మూలగా కూర్చుని వున్న ఓ వృద్ధ జంట. ఎదురుగా సోఫాలో సూట్ వేసుకున్న ఓ వ్యక్తి తప్ప బార్ అంతా ఖాళీగా వుంది. చెన్నై వెళ్ళే విమానం ఎక్కేందుకు ఇంకా నాలుగు గంటల టైముంది జాన్‌కి. మామూలుగా అయితే ఎదుటి వ్యక్తుల్ని పరిచయం చేసుకుని కెప్టెన్‌గా సముద్రయానం చేస్తూ తను గడించిన సాహసోపేత అనుభవాలను వారికి చతురోక్తులతో వివరించేవాడు జాన్. సంభాషణా చాతుర్యంతో ఇతరులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ విఫలం కాలేదతను. కానీ ఇప్పుడు కొత్తవారిని పరిచయం చేసుకుని వారితో మాట్లాడే మూడ్‌లో లేడతను.

ఇన్నాళ్ళుగా సాగర జలాల అనుబంధంగా సాగిన తన జీవన సరళికి స్వస్తి చెపుతున్నందుకు సంతోషంగా వుందతనికి. తన స్వస్థలమైన కేరళలో పచ్చిక బయళ్ళు, పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటలు, పరుగులు తీసే సెలయేళ్ళ మధ్య తను గడపబోయే జీవితాన్ని తల్చుకుని ఉద్వేగానికి గురయ్యాడు. అన్నిటికీ మించి తన జీవితంలో మొదటిసారిగా తనను అమితంగా ప్రేమించే భార్య, కొడుకు అశ్విన్‌లతో కలిసి గడపబోయే రోజుల్ని తలచుకున్నప్పుడు అతని మనసు ఆనందంతో నిండిపోయింది.

ధనిక వర్గానికి చెంది, ఆధునిక సంస్కృతికి అలవాటుపడిన మిత్రులను తను చేసుకున్న మూడవ వివాహం ఎంతగా ఆశ్చర్యపరుస్తుందో జాన్‌కి తెలుసు. దాదాపు అరవై వసంతాలకు చేరువలో ఉన్న తను ఓ మధ్యవయస్కురాలైన స్కూల్ టీచర్‌ను చేసుకున్నందుకు తను ఎంత అపహాస్యానికి గురవుతాడో, ఎలాంటి వ్యంగ్యపూరిత వ్యాఖ్యలను వినవలసివస్తుందో అతను వూహించగలడు. సారాను తన మాజీ భార్యలతో పోల్చి ఆమెను ఎంత తక్కువ చేసి మాట్లాడతారో అతనికి తెలుసు. ఎవరేమనుకున్నా తనను అంకిత భావంతో ప్రేమించే అర్ధాంగిగా, తన కొడుకు అశ్విన్‌కు తల్లిగా వున్న సారాతో సాగబోతుంది తన కుటుంబ జీవనం. నాగరికత ముసుగులో స్వచ్ఛత కానరాని ఆడంబర సమాజానికి ఇకనైనా దూరంగా వుండాలనే నిర్ణయానికి వచ్చాడు జాన్.

విజయం, ధనం, కీర్తి- వీటినే తన అంతిమధ్యేయంగా భావించి, ఇవి సాధించేందుకు తన జీవితకాలంలో అధికభాగం వృథా చేశాడు. ఇన్ని సంవత్సరాలుగా అతను ఎంతో డబ్బు సంపాదించాడు. కానీ ఈ సంపద కోల్పోయిన వయసును, అశ్విన్ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి ఇవ్వగలదా? ఇప్పటికైనా అశ్విన్ భవిష్యత్తు గురించి, సంతోషాన్ని గురించి ఆలోచించాలి.

జాన్ ఆలోచనలో పడ్డాడు. వయసుతో పాటు మనిషికి పరిణతి వస్తుందంటారు. కానీ నిజంగా తనలో పరిణతి వుందా? అది లేకపోవటమే తన రెండు వివాహాల వైఫల్యానికి కారణమా? లేకుంటే ఇది తన కర్మఫలమా? రినీని తను కలవకుంటే ఖచ్చితంగా తన జీవితగమనం మరోలా ఉండేది. రినీ ఎలా విజయవంతంగా సర్వ నాశనం చేయగలిగింది? ఎంత అందంగా వుంటేనేం ఆమె నిజంగా ఓ స్త్రీయేనా?

తనకు దగ్గరయిన ప్రతి ఒక్కరి జీవితంతో ఆడుకుని అధోగతిపాలు చేసింది రినీ. రినీ కారణంగానే జాన్ తన జీవితంలో కొన్ని చేదు అనుభవాలు చవిచూడవలసి వచ్చింది. తండ్రికి దూరంగా ఓ బోర్డింగ్ స్కూల్‌లో బాల్యాన్ని గడపవలసిన దుర్గతి అశ్విన్‌కు పట్టిందంటే అందుకు రినీయే కారణం. రినీ విసిరిన వలపు వలలో జాన్ చిక్కుకుని వుండకపోతే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

మరచిపోయిన గతం తిరిగి కెప్టెన్ ముందు నిల్చింది. అలసి పోయిన అతని మదిని ఓ పెగ్ విస్కీ ఉత్తేజపరిచింది. తన జీవితంలో అత్యంత దురదృష్టకరమైన ఆ రోజు అతని స్మృతిపథంలో మెదిలింది. ఆ రోజు మొదటిసారిగా రినీని తను కలుసుకున్న రోజు. అది తన అంకుల్ కెప్టెన్ మాథ్యూస్ 'ఆదిత్యప్రభ' అనే షిప్‌లో ఇచ్చి





న పార్టీ. అతిథులను ఎంటర్‌టైన్ చెయ్యాలంటే కెప్టెన్ జాన్ పార్టీలో తప్పక వుండి తీరాలి అనుకునే వ్యక్తి మాథ్యూస్. తన మేనల్లుడి ప్రతిభను చూసి గర్విస్తూ వుంటాడు మాథ్యూస్.

జాన్‌ది చూడగానే ఆకట్టుకునే పర్సనాలిటీ కాకపోయినా పొడవుగా, లేత గోధుమ రంగు కళ్ళతో, వత్తుగా వుండే రింగుల జుట్టును పైకి దువ్వి, అచ్చమైన మళయాళీలా కన్పిస్తాడు. తన తెలివితేటలతో ఆసక్తికరమైన హాస్య సంభాషణతో అన్ని వయసులవారినీ అలరిస్తాడు.

నీట్‌గా, అందంగా వున్న గ్రే కలర్ సూట్‌లో షిప్‌లో జరిగే పార్టీకి ఆ రోజు కొద్దిగా ఆలస్యంగా వచ్చాడు జాన్. అందుకు అందరికీ క్షమాపణలు చెపుతూ చుట్టూ చూసిన జాన్‌కి అప్పుడే లోపలికొస్తున్న ఓ అమ్మాయి కనిపించింది. బ్లూ షిఫాన్ చీరలో అందుకు మ్యాచ్ అయ్యే ఇతర అలంకరణలతో అత్యంత అందంగా వుంది ఆ అమ్మాయి. జాన్ ఒక్కడిదే కాదు మిగిలిన అతిథుల దృష్టి కూడా అందమైన ఆ అమ్మాయిపై నిలిచింది. ఆమెను వెంటనే అందరికీ పరిచయం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాడు మాథ్యూస్.

'హాయ్! రినీ! స్వాగతం. నీ లాంటి అందమైన అమ్మాయి పార్టీలో వుం డటం గౌరవంగా భావిస్తున్నాం' అంటూ ఆమెను కెప్టెన్ జాన్ నిలుచున్న చోటుకు తీసుకొచ్చాడు మాథ్యూస్.

'జాన్, మీట్ రినీ! రినీ సైమన్! రెండు మాసాల క్రితం ఆమె విడాకులకు సంబంధించిన వార్తలను అన్ని దినపత్రికలలో చూసే వుంటావ్. రినీ! ఇతను నా మేనల్లుడు జాన్. జాన్! ఇక నీ గురించి చెప్పుకో. నేను మిగతా అతిథులను చూస్తాను' అంటూ అక్కడ నుంచి వెళ్ళాడు మాథ్యూస్.

జీవితంలో మొదటిసారిగా మాట్లాడేందుకు మాటలు కరువయ్యాయి జాన్‌కి. రినీ విడాకుల కేసుకు సంబంధించిన వార్తలను పత్రికల్లో చదివాడు జాన్. ఆమె లైంగిక సామర్థ్యం లేదనే కారణంగా సైమన్ నుండి విడాకులు పొందింది. కేరళకు చెందిన సిరియన్ క్రిస్టియన్లలో విడాకుల కోసం కోర్టుకెక్కిన స్త్రీని గురించి అప్పటి వరకు వినివుండని జనంలో రినీ విడాకుల వార్త సంచలనాన్ని కలిగించింది. రినీలాంటి సౌందర్యరాశి ముందు ప్రత్యక్షంగా నిలిచి ఆమెతో మాట్లాడే అవకాశం వస్తుందని జాన్ కలలో కూడా వూహించలేదు.

మొదట్లో నెర్వస్‌గా అన్పించినా గ్లాసులోని విస్కీని ఒకే గుక్కలో ఖాళీచేసి ధైర్యం తెచ్చుకున్నాడు జాన్. తను వెళ్ళి ఆమె కోసం జెర్రీని తెచ్చాడు. అది ఆమెకు అందిస్తూ నాజూకుగా వున్న ఆమె చేతివేళ్ళను తాకి, ఆ స్పర్శ కలిగించిన మృదుత్వానుభూతిని పొందాడు. తదేకంగా ఆమె వైపు చూశాడు. మెరుస్తున్న మేను, లేత గోధుమవర్ణపు నయనాలు, తీర్చిదిద్దినట్లున్న కనురెప్పలు, కోటేరు ముక్కు, వీటన్నిటికీ మించి పైపెదవి పైభాగంలో నల్లటి పుట్టుమచ్చ. ఆమె ఎక్కువగా నవ్వుతూ వుండేది. నవ్వినప్పుడల్లా ఆమె బుగ్గల్లో కనిపించే సొట్టలను జాన్ గమనించేవాడు.

స్టీవార్డ్ అందిస్తున్న లిక్కర్ గొంతులో జారుతూ వుండగా చల్లగా వీస్తున్న సముద్రపు గాలికి చెదిరిన తన మృదువైన ముంగురులను సర్దుకుంటూ అడిగింది రినీ 'జాన్, నీ జీవితం ఎలా సాగుతుందో చెప్పటం మరిచిపోయావ్!'

రినీని ఆకట్టుకునేందుకు ఇదే మంచి తరుణమని భావించిన జాన్ కాలిరిడ్జ్ కవితను విన్పిస్తూ తాను ఏకాకిగా విశాల సముద్రం నడుమ ఒంటరితనంతో వ్యథ చెందుతూ ఉన్నానని, కాని తను ఇక వ్యథాభరితమైన హృదయంతోగాక, ఆనందం నిండిన హృదయంతో ఈ సాగర



యానం సాగించబోతున్నానని అన్నాడు. రినీతో తిరిగి నెమ్మదిగా అన్నాడు 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను రినీ! ఏదైనా అంతా నీ నిర్ణయంపై ఆధారపడి వుంటుంది'

తన మనసులోని మాటల్ని అంత ధైర్యంగా ఎలా చెప్పగలిగాడో జాన్‌కి తెలీదు. ఓ అందమైన స్త్రీ అనురాగాన్ని పొందాలని ఆమెను తన సొంతం చేసుకోవాలనే బలమైన ఆకాంక్ష తనకా ధైర్యాన్ని ఇచ్చి వుండొచ్చు. ఏమైనా ఆ తర్వాత రినీని తాను పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయం తన తల్లిని ఎలా దుఃఖానికి గురిచేసిందీ, ఆమెతోపాటు మాథ్యూస్ కూడా రినీని పెళ్ళి చేసుకోవద్దని ఎంతగా వాదించి, నివారించేందుకు ప్రయత్నించాడో గుర్తుకొచ్చింది జాన్‌కి. కోర్టు నుండి విడాకులు పొంది న తర్వాత అవమానభారంతో సైమన్ ఆత్మహత్య చేసుకున్నాడని, అందుకు కారణమైన రినీని పెళ్ళి చేసుకోవద్దని శ్రేయోభిలాషులంతా కోరినా, రినీ అందచందాలకు దాసోహమన్న జాన్ అందరి సలహాను తోసిపుచ్చి సామాజిక కట్టుబాటును కాదని ఆమెను పెళ్ళాడాడు.

పెళ్ళయిన కొత్తలో జాన్‌తో కలిసి రినీ తను ఇష్టపడిన నగలను, వస్త్రాలను సేకరిస్తూ ఆనందంగా షిప్‌లో సాగరవిహారం చేసింది. ఆమె తనను తాను తప్ప ఎవరినీ ప్రేమించేది కాదు. ఆమెకు మాతృత్వంపై మక్కువ లేదు. తల్లి అయితే అందం క్షీణిస్తుందని ఆమె భయం. ఆమె ఆలోచన అర్థరహితమనీ, అమ్మ అయిన తర్వాత ఆమెలో పరిణతి వస్తుందని ఆశించాడు జాన్. ఇలా ఆశించడమే అతను చేసిన పెద్ద తప్పయింది. అశ్విన్ పుట్టి వుండకపోతే అతను రినీతో పదేళ్ళు కాపురం చేసి వుండేవాడు కాదు. పదేళ్ళంటే, ఎప్పుడూ సముద్రంపై తిరిగే అతనికి సుదీర్ఘకాలం కాకపోవచ్చు. కానీ ఎప్పుడో ఓసారి వచ్చి పోయే జాన్‌కు ఆమె ఇతరులతో ఏర్పరచుకునే సంబంధ వ్యవహారాలు గురించి తెలిసేది కాదు. ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేసే రినీ సెక్స్ స్కాండల్స్ అనే సాలెగూడులో చిక్కుకుంది. ఇద్దరు పిల్లల తండ్రి అయిన ఓ ధనిక వ్యాపారితో ఆమెకు సంబంధం వున్నట్లు చివరగా తనూ విన్నాడు.

రినీ తన జీవితం నుంచి ఎలా నిష్క్రమించిందీ గుర్తుతెచ్చుకున్నాడు జాన్. ఓసారి అందర్నీ ఆశ్చర్యంలో ముంచేయాలనే ఉద్దేశంతో ముందుగా చెప్పకుండా, రినీకి అశ్విన్‌కు బహుమతులు తీసుకుని చెన్నై వచ్చాడు జాన్. చెన్నై పోర్టు నుండి రినీకి ఫోన్ చేశాడు. ఎంత ప్రయత్నించినా ఏ జవాబూ రాకపోవటంతో తన ఆప్త మిత్రుడైన కెప్టెన్ బాలికి ఫోన్ చేశాడు. నెల క్రితం అశ్విన్ ఓ బోర్డింగ్ స్కూల్లో చేరాడని, రినీ జాన్‌కి అందించమని ఓ లెటర్ తనకిచ్చి ఈ దేశాన్ని విడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని చెప్పాడు కెప్టెన్ బాలి. ఆ వార్త విని కృంగిపోయాడు జాన్.

కోశీ వర్గిస్ అనే ఓ ఢిల్లీ వ్యాపారితో రినీ ప్రేమ వ్యవహారం నడిపిందనీ, వివాహిత, ఇద్దరు పిల్లల తండ్రి అయిన ఆ వ్యాపారితో కలిసి దేశం విడిచి వెళ్ళిపోయిందని బాలి ద్వారా తెలుసుకున్నాడు జాన్.

రినీ రాసిన లెటర్ కాని ఆ నోట్‌లో ఒకే ఒక వాక్యముంది. "ఇక నేను నీ భార్యను కాను" అని. తన మనసును గాయపరచటమే కాక తనను అతి దారుణంగా అవమానానికి గురిచేసినట్లుగా భావించాడు జాన్. ఆమెను చంపి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ఆమె ఎక్కడ వుందో తెలు

అనువాదం : లక్ష్మీనారాయణ

సుకోవటం ఎలా? ఎలాగో మిసెస్ కోశీ వర్గీస్ అడ్రస్ సంపాదించాడు. ఆమె ద్వారా రినీ ఎక్కడ వుందో తెలుసుకోవచ్చుని, ఎర్నా కులం బయలుదేరాడు మిసెస్ వర్గీస్‌ను కలుసుకునేందుకు.

మిసెస్ వర్గీస్ అసలు పేరు ఎలైస్. ఆ మెను తను కొచ్చిన్ నావల్ మెస్‌లో కలుసుకున్న రోజు గుర్తుకు తెచ్చుకున్నాడు జాన్. దాదాపుగా నలభై ఏళ్ల వయసులో వున్న ఆమె శరీరపు ఛాయ బాగానే వున్నా, చట్టిముక్కుతో, చిన్నకళ్ళతో, పెద్ద పొట్టతో లావుగా వుంది. ఎలైస్ భర్త ఎందుకు అందమైన రినీ పట్ల ఆకర్షితుడయినాడో అర్థమయింది జాన్‌కి. అయినా ఇద్దరు పిల్లల తండ్రి అలా ఆమెని నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళటం బాధనిపించింది జాన్‌కి. ఎలైస్‌తో మాట్లాడిన తర్వాత ఆమె కాపురం కూలిపోవటానికి కారణం రినీ అని తెలుసుకున్నాడు జాన్. ఎలైస్ ఇంటికి వచ్చిన జాన్ ఆమె పిల్లలు సజీవ్, సుజిత్‌లను చూశాక వారిపై ఆ క్షణం నుండే ప్రేమను పెంచుకున్నాడు.

ఓ రెండు మాసాలు గడిచాక తనలో ఎలైస్ పట్ల సానుభూతి పెరగటం గమనించాడు జాన్. ఎలైస్ ఆమె పిల్లలతో పాటు అశ్విన్‌పై చూపే ప్రేమానురాగాలు చూశాక తను కూడా పిల్లలకు తండ్రి పాత్ర పోషించసాగాడు. అశ్విన్ శెలవల్లో వచ్చి సజీవ్, సుజిత్‌లతో సంతోషంగా గడిపేవాడు. కాలక్రమేణా జాన్ రినీ పట్ల పగను మరిచిపోయి, అశ్విన్‌కు దగ్గరవుతున్న ఎలైస్‌ను ఇష్టపడసాగాడు. ఎలైస్‌నీ, పిల్లల్నీ చెన్నై తీసుకొచ్చి, అక్కడి ఓ పోష్ బంగ్లాలో వుంచాడు. పిల్లల్ని బాగా పేరున్న ఓ స్కూల్లో చేర్చాడు.

చెన్నై వచ్చాక అక్కడి సొసైటీకి అనుగుణంగా తనను తాను మార్చుకునేందుకు ఎలైస్ చేసే ప్రయత్నాలను మెచ్చుకున్నాడు జాన్. బ్యూటీపార్లర్‌కు వెళ్ళి తన శరీరాకృతిని సరిచేసుకుని, తన రూపానికి తగ్గ మెరుగులు దిద్దుకుని, అందమైన దుస్తులు ధరించి, ఆకర్షణీయంగా మారింది ఎలైస్. డ్రైవింగ్ నేర్చుకుని అందరితో మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఒదిగిపోయిన ఎలైస్‌ను చూస్తే గర్వంగా అనిపించింది జాన్‌కి. ఆ తర్వాత కొద్దిరోజులకే జాన్, ఎలైస్ భార్యాభర్తలయ్యారు.

జాన్ ఓ సంవత్సరంపాటు జపాన్‌లో వుండి కొత్తగా నిర్మితమవుతున్న షిప్‌ను పర్యవేక్షించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ షిప్‌ను మొదట ప్రయాణంగా ట్యూటికోరన్ తీసుకొచ్చాడు. అక్కడి నుండి ఓ బాడుగ వాహనంలో చెన్నై చేరాడు జాన్. వస్తూ తనతో ఎలైస్‌కు, పిల్లలకు అరుదైన కానుకలను కూడా తెచ్చాడు.

ఇంటికి చేరిన జాన్ ఎలైస్‌ను చూసి



షాక్ తిన్నాడు. స్లిమ్‌గా, షార్ట్ జీన్స్‌లో వున్న ఆమె పడుచు పిల్లలా కనిపించింది. ఎలైస్ నీ వెయిట్ అంతా పోయింది. ఇప్పుడు చాలా అందంగా కన్పిస్తున్నావు. ఏమిటి నీ సౌందర్య రహస్యం! అన్నట్టు మన పిల్లలంతా ఏరి? ఎప్పటిలాగా శెలవల్లో నీకు శ్రమ కలిగిస్తున్నారా? అంటూ ఎలైస్‌కు దగ్గరగా రాబోయిన జాన్‌ను నెమ్మదిగా పక్కకు నెట్టి, 'పిల్లలా! అశ్విన్ కేరళలో వున్న మీ సిస్టర్ దగ్గరకు, నా పిల్లలు లండన్‌కు వెళ్ళారు' అంది.

ఎలైస్‌లో ఒకప్పటి అనురాగం, ఆత్మీయత లోపించటం, ఓ విధమైన ఉదాసీనత చోటుచేసుకోవడం గమనించాడు జాన్. అశ్విన్‌ను తన కొడుకుల నుండి వేరు చేసినట్లుగా మాట్లాడటం బాధించింది జాన్‌ని. పేకమేడలా తన జీవితం మళ్ళీ కూలిపోయిందని గ్రహించాడు జాన్.

ఆ తర్వాత రినీ, ఎలైస్ మాజీ భర్తకు విడాకులిచ్చిందని, అతను పశ్చాత్తాపపడి తిరిగి ఎలైస్‌కు, పిల్లలకు చేరువయ్యాడని తెలుసుకున్నాడు జాన్. కష్టాల్లో వున్న ఎలై



స్‌పై జాలిపడినందుకు, తన డబ్బును ఉప యోగించుకుని, చివరకు తననే త్యజించి నందుకు ఎలైస్‌పై మండిపడ్డాడు జాన్.

'పరిస్థితులకు తగ్గట్టు అప్పట్లో మనం పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. నీ కొడుకుని నేను ప్రేమతో చూశాను. నీవు కూడా నా పిల్లల్ని ప్రేమతోనే చూసావు. అయినా నేను అశ్విన్‌కు తల్లిని కాలేను. నీవు నా పిల్లలకు తండ్రి కాలేవు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునే హక్కు నాకుంది. మన పెళ్ళి మూలంగా ఆరు సంవత్సరాలపాటు నీ కొడుకు ఓ తల్లిని, నాపిల్లలు ఓ తండ్రిని పొందగలిగారు. ఈ విధంగా ఇద్దరం లాభ పడ్డాం!'

ఎలైస్ అన్న ఈ మాటల్లోనూ నిజముం దనిపించింది జాన్‌కి. గతకాలపు ఆలోచ నల నుండి తేరుకుని వర్తమానంలోకి వచ్చాడు జాన్. సిగరెట్ వెలిగించి, గట్టిగా పీల్చి, రింగులుగా పొగను బయటకు వది లాడు. సారా తనకు ఎలా దగ్గరయింది అతనికి గుర్తొచ్చింది.

కేరళలోని వితంతువైన తన చెల్లెలి ఇంట్లో ఆరునెలలు గడిపాడు జాన్. ఈ కాలంలోనే అతను సారాను కలుసుకోవటం జరిగింది. ఆమె తన చెల్లెలు ఇంటి పొరు గునే వుండేది. ఆమె ఓ స్కూల్ టీచరు. తన చెల్లికి వంటలో సాయం చేసేందుకు ఇంటికి వచ్చిన సారాను జాన్‌కు పరిచయం చేసింది జాన్ చెల్లెలు. సారా తండ్రి రైల్వే లో క్లర్క్‌గా పనిచేసేవాడు. రెండు దశాబ్దా ల క్రితం ఆయన చనిపోయిన దగ్గరి నుండి కుటుంబ భారమంతా సారాపై పడింది.

కుటుంబ పోషణ కోసం సారా చదువు మాని ఉద్యోగం చేయవలసి వచ్చింది. తమ్ముడిని చదివించింది. చెల్లెలికి ఆమె ఇష్టపడిన వ్యక్తితో పెళ్ళి చేసింది. సంవత్స రాలు గడిచాయి. కుటుంబం కోసం తన యవ్వనాన్ని త్యాగం చేసింది సారా.

ఇదంతా జాన్‌ని కదిలించకపోయినా సారాకు ఇప్పుడెవరూ లేరని, తమ్ముడు కువై ట్‌లో, చెల్లెలు తన భర్త పిల్లలతో బొంబేలో వుంటూ ఆమెను పట్టించుకో వటం లేదని తెలుసుకున్న జాన్ చలించి పోయాడు. నిజంగా ఎంత కృతఘ్నత! ఎందుకు ఆమె జీవితంలో మంచి రోజుల కు తావులేకుండా పోయింది. యవ్వనంలో అందంగానే వుండి వుంటుంది సారా. ఇప్పు డు ఆమెను ఎవరు పెళ్ళి చేసుకుంటారు! ఆమె జీవితం ఇలా వృథా కావలసినదేనా!

ఓ వారం తర్వాత సారా చర్చి నుండి తిరిగి వస్తూండగా ఆమెతో చాలాసేపు మాట్లాడాడు జాన్. జీవితంలో ఎన్ని ఒడి దుడుకులను ఎదుర్కొన్నా చెదరని ఆత్మవి శ్వాసాన్ని ఆమెలో చూశాడు జాన్. ఆమె చిరునవ్వులో పసివాళ్ళ అమాయకతను చూశాడు. ఆమె కళ్ళలోకి చూసిన జాన్‌లో ఎన్నో అనుభూతులు. ఆమె పట్ల కరుణ, ఆమెకు ఆ వ్యథ నుండి విముక్తి కలిగించేం దుకు ఏదో చేయాలనే తపన. సారా అంటే తనకున్నది రినీ పట్ల వున్న ఆకర్షణ కాదు. ఎలైస్ పట్ల వున్న జాలి కాదు. ఇది ఓ స్త్రీ పట్ల తనలో పొరలివస్తున్న అనురాగం. ఓ రాత్రంతా తీవ్రంగా ఆలోచించాడు జాన్. తనను పెళ్ళి చేసుకుని తన జీవిత భాగస్వా మిగా, అశ్విన్‌కి తల్లిగా వుండమని సారాను అడిగేందుకు నిర్ణయించుకున్నాడు.

మరునాటి ఉదయం తనను పెళ్ళి చేసు కోమని జాన్ అడిగినప్పుడు సారా ఎలాం టి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయలేదు. ఆమెలో ప్రశాంతత, పవిత్రత కన్పించాయి జాన్‌కి. ఓ షరతుపై జాన్‌తో జీవితం పంచుకునేం దుకు అంగీకరించింది సారా. వివాహం అతిసామాన్యంగా చర్చిలో జరగాలని ఆమె అభ్యర్థన. అందుకు అంగీకరించాడు జాన్. తన మూడవపెళ్ళిని మొదటిసారిగా చర్చిలో జరుపుకోబోతున్నాడు జాన్. 'ఈసారి మా మధ్య ఎడబాటు కలిగించేది మరణమే! అనుకున్నాడు జాన్. V



- ఎమిలియా పార్డో బజాన్

తొలిప్రేమ

స్పెయిన్ కథ

అప్పుడు నా వయసు పన్నెండో పదమూడో వుంటుంది. విరిసీ విరియని ఆ వయసులోనే నా మనసులో తొలిప్రేమ మొలకెత్తింది. అందుకనేనేమో... దక్షిణాది దేశాల్లోని పిల్లల హృదయాలు త్వరగా పరిపక్వమౌతాయంటారు. ఆరోజుల్లో... ప్రార్థన చేసుకోవటంకోసం మా పిన్ని చర్చికి వెళ్ళేది. ఆమె అటు వెళ్ళగానే ఆమె గదిలో నేను ప్రవేశించేవాడ్ని. ఓ మూలగా వున్న పెట్టె తెరచి.. అందులో సర్ది పెట్టివున్న వస్తువులన్నింటినీ తీసి, పరిశీలనగా చూస్తూవుండేవాడిని.

ఎన్నో అరలతో వున్న ఆ పెట్టె నాకొక మ్యూజియంలా కనిపించేది. పాతకాలంనాటి వస్తువు ఏదో ఒకటి అందులో దొరుకుతూ వుండేది. అద్భుతమైన మంచిగంధపు పరిమళం వెదజల్లుతూ వుండే ఆ పెట్టెలోని వస్తువులన్నీకూడా సుగంధపూరితమై వుండేవి. గుండుసూదులు గుచ్చే శాటిన్‌కుషన్ రంగు వెలిసిపోయి వుంది.

చేతులకు తొడుక్కునే అల్లిక గ్లౌజుల్ని సన్నటి రేపర్‌లో చుట్టి భద్రపరిచారు.

మహాపురుషుల చిత్రాలూ, కుట్లూ, అల్లికలకు పనికి వచ్చే పరికరాలూ, పల్చటి వల లాంటి నీలిరంగు ముఖమల్ బట్టతో చేసిన మనీపర్సూ.... దానిమీద అల్లిన కొంగలూ!

ఓ మూలగా పడున్న అత్తరు సీసాలూ... వాటికి దగ్గరగా ఓ వెండి దండా. వీటన్నిటినీ తీసి పరీక్షగా చూసి మళ్ళీ పెట్టెలో సర్దేస్తూ వుండేవాడిని.

అలా పెట్టె సర్దుతుండగా ఒకరోజున... పై అరలో ఓ మూలగా.. మెడపట్టీ లాంటి బట్టమీద, లేసుతో చుట్టిన వస్తువొకటి మెరుస్తూ కనిపించింది.

మెరుస్తున్న బంగారపు కేస్... అందులో ఇంచుమించు మూడంగుళాల పొడవున్న చిన్నదంతపు బొమ్మా కనిపించాయి. కేస్‌కూ బొమ్మకూ మధ్య పలుచని చలువరాతి పొర వుంది.

చూడచక్కని ఆ అందాలబొమ్మ నన్ను అమితంగా ఆకర్షించింది. కిటికీలోంచి ప్రసరించే సూర్యకిరణాలు ఆ బొమ్మ వెనకభాగంలోపడి, అక్కడున్న చీకట్లను తొలగించటంతో... తళతళా మెరుస్తున్న ఆ బొమ్మ నా దగ్గరకు నడిచి రావాలనుకుంటున్నట్లనిపించింది.

కౌమారవస్థలో వున్న నేను... కలలో తప్ప... ఇలలో అటువంటి అద్భుత వస్తువును ఇంతకుముందెన్నడూ చూసి ఎరుగను! ఆ బొమ్మరూపంలోని మహిళ వయసు ఇరవైకి కొంచెం అటూఇటూగా వుంటుందనుకుంటాను.

కోలముఖం... చిరునవ్వులు చిందిస్తూ సగం విచ్చుకున్న నిండైన పెదవులూ.. ఆమె కళ్ళు మాత్రం ఎందుకనో నిరుత్సాహ పూరితమైన దృష్టిని వెదజల్లుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. కామదేవుడు ఆమె బుగ్గలమీద వేలితో రాస్తూ... ఆడుకుంటుంటే పడినట్లుగా



వున్న పెద్దగుంట... ఆమె ముఖానికి మరింత అందాన్నిస్తోంది. ఆమె కేశాలంకరణ విచిత్రంగా వున్నా అందంగానే వుంది.

కణతలను తాకుతూ... సన్నగా దువ్వి గట్టిగా అల్లబడిన వెంట్రుకల చుట్ట... ఆమె తలమీద బుట్టలా అమరింది. ఆ పాతకాలపు శిరోజాలంకరణతో, ఆమె మెడ వెనుక భాగం పూర్తిగా కనిపిస్తోంది.... కోమలంగా అందంగా!

ఇక బట్టల విషయానికి వస్తే... నడుం పైభాగమంతా అనాచ్ఛాదితంగానే వుంది. నడుముకు ఇరువైపులా... చర్మపు ముడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వలలాంటి సన్నని బట్టతో వక్షస్థలాన్ని బిగించి కట్టటంతో... ఎత్తైన స్తనాలు మంచుశిఖరాల్లా ఇరువైపులా అమరి... మధ్యలో ముత్యాలహారం అలంకరించుకునేందుకు మాత్రం సన్నని దారి వదిలినట్లున్నాయి.

అందమైన డిజైన్‌తో అల్లబడిన చక్కని రుమాలును ఒకచేత్తో పట్టుకున్నట్లుగావున్న ఆ బొమ్మను చూడగానే... నన్ను ప్రేమోన్మాదం ఆవహించింది. ఊపిరి తీసుకోవడం కూడా మరిచిపోయి... కళ్ళు విప్పార్చుకుని దాన్ని అలా చూస్తూ వుండిపోయాను.

స్త్రీల అందచందాలను ప్రదర్శింపజేసే చిత్రాలను అంతకుముందు కూడా నేను... బొమ్మల పత్రికలలోనూ, హోటల్స్ బయటా, కొన్ని కొన్ని గృహాలముందూ అప్పుడప్పుడూ చూశాను.

ఇంకా యౌవనంలోకి అడుగైనా పెట్టకుండానే పక్వమైన నా హృదయాన్ని అవి అమితంగా ఆకర్షించేవి. అయితే... పెట్టెలోని ఆ బొమ్మ నన్ను ఆకర్షించటంతోపాటు... అమితంగా ఉత్తేజపరచటం మొదలుపెట్టింది.

అది చిత్రకారుని మనోజనితమైన ఊహాకల్పిత చిత్రం కాదు. రక్తమాంసాలతో నిండిన నిజమైన స్త్రీమూర్తి! నా వెంటే వస్తున్న లోతైన వెచ్చని రంగుల నీడ!

ఆ చిన్న ముత్యపు చిప్పలాంటి బొమ్మ చర్మం కింద.. గోరువెచ్చని రక్తం ప్రవహిస్తున్నట్లుగా అనిపిస్తోంది.

తళతళ మెరిసే దంతాలను దర్శింపచేసేందుకా అన్నట్లు పెదవులు కొద్దిగా విచ్చుకున్నాయి. మాయాజాలాన్ని అత్యంత సహజంగా చూపించటానికా అన్నట్లు, ఆ బంగారపుకేస్‌లో నలువైపులా అసలైన వెంట్రుకలను వుంచారు. ఆక్రోట్ పళ్ళరంగులో... పట్టులావున్న నొక్కుల జుట్టు.... కణతల మీద సహజంగా మొలిచినట్లుంది. వెరసి ఆ దంతపు కళాకృతి... ఒక బొమ్మలా కాకుండా, ఒక సజీవ స్త్రీమూర్తిలా నన్నలరించసాగింది. పలుచటి చలువరాతి పొరను చీల్చుకువచ్చి.. నా నరనరాన్నీ స్పృశించి... నా హృదయంలో నిండిపోయింది.

★ ★ ★

ఒక రోజున...

నాలోని ప్రేమనంతా కళ్ళలో నింపుకుని... తన్మయత్వంతో ఆ బొమ్మనే చూస్తూ మైమరిచిపోయిన నాకు, వరండాలోకి మా పిన్ని రాకను సూచిస్తూ అడుగుల శబ్దం వినవచ్చింది. ఉబ్బసపు ఆయాసంతో కూడిన ఆమె దగ్గునూ, వాత రోగపు నొప్పులతో... ఈడుస్తూ వస్తున్న ఆమె కాళ్ళ చప్పుడునూ విన్నాను.

బొమ్మను యథాస్థానంలో పెట్టి... ఆ పెట్టెను మూసేసి, ఏమీ ఎరగనట్లుగా ఆమె ఎదుట నిలబడేందుకు వ్యవధి లేదు.

మూలుగుతూ... ముక్కుతూ లోపలికి వచ్చేసింది పిన్ని. అసలే ఆమెను బాధపెడుతున్న జలుబు చర్చిలోని చల్లదనంతో మరింత ఎక్కువైనట్లుంది.

ముడతలు పడిన ఆమె కళ్ళు నన్ను

అనువాదం :
శీతంరాజు పద్మావతి

చూడగానే మెరిశాయి. ప్రేమతో నా వీపు మీద ఓ దెబ్బ వేసింది పిన్ని.

పెట్టెలోని వస్తువులన్నింటినీ చక్కగా సర్దుతున్నట్లు నటిస్తూ కూర్చున్నాను నేను.

"నీకు ఇష్టమని దాచి వుంచాను. ఇంద... తీసుకో" అంటూ కాగితం సంచిలో నుంచి... కేక్‌కు అతుక్కుపోయిన రెండు బర్ఫీ ముక్కలను తీసింది.

"ఒద్దులే పిన్నీ!"

"ఒద్దా? ఏం? ఎందుకనీ? ... ఇది నీకు ఇష్టమైన మిఠాయి కదా! చేతికి అంటుకున్నదాన్ని... నాకి నాకి మరీ తింటావ్‌గా!"

"నువ్విచ్చే మిఠాయి కోసం ఎగబడటానికి నేనేమన్నా చిన్నపిల్లాడినా? "

"అబ్బో! అంత పెద్దవాడివెప్పుడైపోయావ్? " అంటూ పడీపడీ నవ్వసాగింది.

బతుకు పరుగులో ఏళ్ల తరబడి పరిగెత్తడంతో చూడ్డానికి కూడా అసహ్యంగా తయారైన శరీరం. ముడతలు పడిన ఒళ్లూ, ఊడిపోయిన దంతాలూ, ఎదురుగా ఉన్న వస్తువును కూడా పోల్చుకోలేనంతగా మందగించిన చూపూ, ఎండిపోయి, మూడంగుళాల మేర సాగిన మూతీ... దాని మీద మొలిచిన మొరటు వెంట్రుకలూ, వేళ్ళాడిపోతూ పెరూ పక్షి ఈకల గుత్తిలా వున్న మెడా... సంక్షిప్తంగా మా పిన్ని రూపం ఇది!

అసలే వికృతంగా వున్న ఆ రూపం... ఆమె నవ్వుతో ఊగుతూ మరింత రోత పుట్టించడంతో... నాకు ఆమె చేతిలోని మిఠాయి ముక్కలు తీసుకోబుద్ధి కాలేదు.

శరీరమంతా ఊగిపోయేట్లుగా ఆపకుండా ఆమె నవ్వుతూ వుండటంతో ఆమెకు తెరలుగా దగ్గురావటం మొదలెట్టింది. దగ్గూ, నవ్వూ కలిసిపోవడంతో.. ఆమె లాలాజలం నామీద తుంపర్లు తుంపర్లుగా... అసహ్యంగా... నేను పరిగెత్తుకుంటూ మా అమ్మ గదిలోని బాత్రూంలోకి వెళ్ళి, సబ్బునీళ్ళతో ఒళ్ళంతా కడుక్కుంటూ ఆ బొమ్మలోని స్త్రీమూర్తిని తలుచుకుంటూ మామూలు స్థితికి రావటానికి ప్రయత్నించాను.

★ ★ ★

ఆ రోజు నుండీ ఆ బొమ్మను గురించిన ఆలోచనలతోనే గడుపుతున్నాను. అటు పిన్ని బయటకు వెళ్లగానే .... ఇటు ఆమె గదిలో దూరి, ఆ బొమ్మను చేతుల్లోకి తీసుకుని కాలం గడపటం మొదలెట్టాను.

నా దృష్టిలో అది బొమ్మ కాదు... నా స్వప్నసుందరి... నా ప్రియురాలు! ఆకర్షణీయమైన తన కనురెప్పల చాటు నుండి ఆమె చిద్విలాసంగా నన్నే చూస్తున్నట్లనిపించసాగింది. అలా చూస్తున్న ఆమె తెల్లటి ఛాతీ ఎగిరెగిరి పడుతున్న భావన! నేను ఆమెను అక్కడ ముద్దు పెట్టుకున్నట్లూ.. నా మొరటుతనానికి ఆమె కోపగించుకున్నట్లూ... అది తెలిసి నేను సున్నితంగా హృదయానికి హత్తుకున్నట్లూ... నా చెక్కి



లిని ఆమె చెక్కిలితో చేర్చి. ఈ ఊహలన్నీ నాకు అనుభవంలోకి వచ్చేవి. శిష్టాచారాలకు విరుద్ధంగా, అసాంఘికంగా నేను ఆమెతో ప్రవర్తించసాగాను. అయితే... ఏది చేసినా... సున్నితంగా ఆమెను పువ్వులాగా చూసుకుంటూనే చేశాను. పిన్నిగదిలోకి ప్రవేశించే ముందు శుభ్రంగా తలంటుపోసుకుని, జుట్టు అందంగా దువ్వుకుని... ప్రేయసిని కలుసుకోవటానికి వెడుతున్న ప్రియుడిలా తయారై వెళ్ళేవాణ్ణి!

నా సమవయస్కులెవరైనా బజార్లో తారసపడినప్పుడు తమ ప్రేమికుల ఫొటోలు... వాళ్లు రాసిన ఉత్తరాలూ... పంపిన పువ్వులూ చూపించి గొప్పలు చెప్పుకుంటూ, "ఉత్తరాలు రాయటానికి నీకు గర్ల్ ఫ్రెండ్స్ లేరా? " అని అడుగుతూ వుండేవారు.

నేను సిగ్గుపడుతూ, ఏదో ఒకటి చెప్పి తప్పించుకునేవాణ్ణి.

ఫొటోలు చూపించి, తమ ప్రేమికుల అందచందాలను గురించి వాళ్ళు అడిగితే, "బాగానే ఉన్నార్లే..." అని తేలిగ్గా తీసిపారేసేవాణ్ణి. ఆ సమయంలో నా శిల్పసుందరి నా తలపుల్లో మెదిలేది... 'వీళ్లెవరూ ఆమెకు సాటిరారు' ఈ భావనతో స్వాంతన పొందేవాణ్ణి. ఉదయమూ, సాయంత్రమూ కలిపి, రెండు మూడు గంటలన్నా మా పిన్ని చర్చిలో గడిపేది. అంతసేపూ ఆ బొమ్మతో గడిపినా ఇంకా తక్కువే అనిపించేది. అందుకని... ఒకరోజున ఆ బొమ్మను నా జేబులో పెట్టుకుని చక్కా వచ్చాను!

అయితే, అప్పట్నుంచీ ఏదో తప్పు చేసినవాడిలా, అందర్నీ తప్పించుకు తిరగసాగాను. నా జేబులో వుంటే ఆ బొమ్మకు జైల్లో ఉన్నట్లుంటుందేమో అనే భావన నన్ను బాధపెట్టేది.

నాకు అక్కడ దురద పుట్టినా... నేను మేజోళ్ళు విప్పాలన్నా... దానికి ఇబ్బంది అవుతుందేమో అనే మూర్ఖపు ఆలోచనతో, అటువంటి సమయాల్లో దాన్ని బయటకు తీసి, ఏదన్నా సురక్షిత స్థానంలో వుంచి, తరవాత నా పని ముగించుకునేవాణ్ణి.

ఆ బొమ్మను దొంగిలించాక నా బుద్ధి చాపల్యం అంతకంతకూ పెరగసాగింది.

రాత్రివేళ నా దిండుకిందే... నా తల తగలకుండా దాన్ని దాచిపెట్టి కాపలా కాస్తున్నవాడిలా.. ఓ పక్కగా ఒదిగి పడుకునేవాణ్ణి.

కొన్నాళ్లు పోయాక, దిండు కింద నుంచి తీసి, నా చొక్కా లోపల ఎడంవేపున పెట్టుకుని అటే తిరిగి పడుకోవటం మొదలుపెట్టాను. ఆ బొమ్మ తాలూకు కేసు గుర్తులు నా ఛాతీ మీద ఒరుసుకుపోయి స్పష్టంగా కనిపించేవి. నా ప్రియమైన చిన్నారి బొమ్మ సంపర్కంలో నాకు తియ్యటి కలలు వచ్చేవి.


ఆ బొమ్మలోని అమ్మాయి... ప్రాణం పోసుకున్న ఆడపిల్లలా సుశోభితమైనదై... కలుపుగోలుతనంతో నన్నలరిస్తూ... రైలు బండి ఎక్కించుకుని నన్ను తన మహల్‌కు తీసుకెళ్లిపోతానని అంటూ వుండేది.

నన్ను తన పాదాల దగ్గర పీట మీద కూర్చోమని మధుర స్వరంతో శాసించేది. తన కళ్లలో ప్రేమను గుమ్మరిస్తూ... నా కళ్ళలోకి కళ్లుపెట్టి చూసేది. మృదువుగా వున్న తన అందమైన చేతులతో నా తలను ప్రేమగా నిమురుతూ వుండేది.

నేను ఆమె క్షేమంకోసం ప్రార్ధన చేస్తూ... ఆమెకు పుస్తకం చదివి వినిపిస్తూ వేణువు వూదుతూ... నిరంతరం ఆమె సమక్షంలోనే గడిపేవాణ్ణి. నా చర్యలు తనకు ఆనందాన్ని కలుగజేస్తున్నాయంటూ, చిరునవ్వుతో నాకు ధన్యవాదాలు తెలియజేసేదామె!

ఆ అందానికి దాసోహమంటూ... ఆమె కోసం పడిగాపులు పడుతున్నట్లు ఊహించుకుంటూ... అస్తమానం ఆ బొమ్మలోని ఊహాసుందరిని గురించి తపన పడుతూ వుండడంతో... ఆ ప్రభావం నా ఆరోగ్యం మీద పడి... చిక్కి శల్యమైపోసాగాను.

నా కళ్ళచుట్టూ నల్లటి వలయాలు ఏర్పడ్డాయి. పెదవులు ఎండిపోసాగాయి. ఆకలి



మందగించడంతో తిండి సరిగ్గా తినక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని రోజురోజుకూ క్షీణించిపోసాగాను.

నన్ను చూసి అమ్మా నాన్నా దిగులుపడసాగారు.

"పిల్లవాడు యౌవనంలోకి అడుగు పెడుతున్న ఈ దశ కీలకమైంది. మనం చాలా జాగ్రత్తగా వాడిని కనిపెట్టి వుండాలి" అన్నారు నాన్న.

ఆయన చికిత్సా సంబంధమైన పుస్తకాలు బాగా చదువుతారు.

"తిండి తగ్గించేశావెందుకని? అందుకనే ఆరోగ్యం పాడైపోతున్నట్లుంది. చక్కగా కడుపునిండా తిను. తోటి పిల్లలతో కలిసి



హాయిగా ఆడుకో” అన్నారు నాన్న.

“అందుకు నా మనసొప్పటంలేదు”

నా మాటలతో వ్యాకులపడిన ఆయన నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపసాగారు. నా చదువు మానిపించేశారు.

అప్పటికప్పుడు పితికిన పాలను నురుగు తోసహా నాతో రోజూ తాగించటం మొదలెట్టారు. నా నాడులన్నీ దృఢంగా తయారవ్వాలనే సదుద్దేశంతో... రోజూ నా తలమీదా, వీపుమీదా చల్లటి నీళ్ళు ధారగా పోస్తున్నారు.

‘గుడ్‌మార్నింగ్’ చెప్పటానికి నేను ఆయన గదిలోకి వెళ్ళినప్పుడు... ఆయన ప్రేమతో నా వెన్నుపామును పైనుంచి కిందివరకూ చాలాసేపు మృదువుగా ఒత్తుతున్నారు. నన్ను మాటల్లో పెట్టి.. నా దిగులుకు కారణాలు తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ఆ అపేక్షకు కరిగిపోయి, నేలచూపులు చూస్తూ.. అపరాధ భావంతో కృంగిపోతూ... చచ్చిపోతే బాగుండుననుకుంటూ ఉండేవాడిని.

నన్ను ఒంటరిగా వదిలిపెట్టకుండా థియేటర్లకు తీసుకువెడుతూ, నాతో కబుర్లు చెప్పటానికి వీలుచేసుకుంటూ, నాపట్ల మరింత ఆప్యాయతను కురిపిస్తున్నాడాయన. అమ్మా, నాన్నగారూ నా వెన్నంటి ఉంటుండడంతో, నా శిల్పసుందరితో గడిపే సమయం తక్కువైపోతోంది నాకు.

దొరుకుతున్న ఆ కాస్త సమయంలో ఆమెకు మరింత చేరువ కావాలనే తపనతో... ఆ దంతపు బొమ్మ మీద అమర్చిన పలుచటి చలువరాతి పొరను తొలగించెయ్యాలని నిశ్చయించుకున్నాను. కానీ, ఆ పని చెయ్యటానికి నాకు ధైర్యం చాలటం లేదు.

నేను చేస్తున్నది మంచిపని కాదనీ, అపవిత్రమైనదనీ నాకు తెలుస్తూనే వుంది.

కానీ... నా ప్రేమోన్మాదం... ఆ పొరను తొలగించటానికే ప్రోత్సహించటంతో... ఎంతో కష్టపడి... బొమ్మ ఏమాత్రం దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఆ పని పూర్తిచేశాను.

వెంటనే నా పెదవులతో ఆ బొమ్మ పెదవులపై ముద్దు పెట్టుకున్నాను. దాని జుట్టు విరజిమ్ముతున్న పరిమళాలను తనివితీరా ఆస్వాదించాను.

దాన్ని సజీవ స్త్రీమూర్తిగా భావిస్తూ... ఒణుకుతున్న చేతులతో పొదివి పట్టుకున్నాను. అంతే... కళ్ళుతిరిగి... నా చేతులలో బంధించిన బొమ్మతోసహా సోఫామీద పడిపోయి, అచేతనావస్థలోకి వెళ్లిపోయాను.

★ ★ ★

నాకు తెలివి వచ్చేసరికి... అమ్మా, నాన్నా, పిన్నీ... నా మీదకు వంగి చూస్తూ కనిపిం

చారు. వాళ్ళ ముఖాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"ఏం భయంలేదు. నాడి కొట్టుకుంటోం ది. అయితే... చాలా జాగ్రత్తగా వింటేనే గాని తెలీడంలేదు" అన్నారు నాన్న.

నా గుప్పిట్లోంచి బొమ్మను విడదియ్యాలని ప్రయత్నిస్తోంది పిన్ని.

మహిమాన్వితమైన ఓ యంత్రాన్ని చేజా రిపోనియ్యకుండా పట్టుకుంటున్నట్లు... నా పట్టు బిగించసాగాను.

"ఆ బొమ్మని వదిలిపెట్టరా బాబూ! నీ ఉడుంపట్టుకు అది దెబ్బతింటుందో ఏమో..." ప్రేమగానే అర్థిస్తోంది పిన్ని. "నిన్ను నేను తిట్టబోవటం లేదులే! నీకె ప్పుడు కావాలంటే అప్పుడు చూపిస్తాను గానీ... ఇప్పుడు మాత్రం ఆ బొమ్మని వది లెయ్! త్వరగా వదిలిపెట్టు!"

"దాన్ని వాడి దగ్గరే ఉండనియ్యి! పిల్లాడికి ఒంట్లో బాగుండలేదుగా!" అంది అమ్మ.

"వాడి దగ్గరే ఉండనివ్వాలా? ఎందు కూ? ...పాడుచెయ్యటానికా? నేను యవ్వ నంలో ఉండగా తయారు చేయించుకున్న స్వీయశిల్పం అది. నన్ను ఎదురుగా నిలబె ట్టుకొని చూస్తూ చెక్కిన శిల్పం. అప్పుడు అంత చక్కగా వుండేదాన్ని. అందుకనే, జాగ్రత్తగా పెట్టెలో దాచుకుని అప్పుడప్పు డూ తీసి చూసుకుని మురిసిపోతున్నాను. నా బొమ్మ నాక్కావాలి" అంటూ లాక్కోబో యింది పిన్ని.

"నిజంగా అది నీ బొమ్మేనా పిన్నీ?" ఒణుకుతున్న గొంతుతో అడిగాను.

"ఎవరు నమ్మినా నమ్మకపోయినా అది నా బొమ్మే! నేను ఢంకా బజాయించి మరీ చెబుతున్నాను. అది నా బొమ్మే! అప్పుడు నా వయసు ఇరవైలోపే ఉంటుంది. ఇప్పు డెంతో నాకే తెలీదు. అప్పుడున్నట్లుగా ఇప్పు డుండమంటే ఎలా వుంటాను? అప్పుడు ఎంతో ఇష్టంతో కష్టపడి చేయించుకున్నాను. అది విరిగితే అతికేవాళ్ళుగానీ, మళ్ళీ అటు వంటిదే తయారుచేసేవాళ్ళు కానీ ఇప్పుడె వరూ వుండరు. అయినా అది నీ చేతిలో కెలా వచ్చింది? దాన్నిండా మురికి పట్టించి నట్టున్నావ్. పాడు చేసేస్తున్నావ్..." అంటూ అరుస్తోంది పిన్ని.

"అందులో వున్నది నువ్వా? అది నీ బొమ్మేనని నాకు తెలీదు పిన్నీ! అపరాధం! అపరాధం!" అంటూ నా మీద నేనే చిరాకుప డుతూ పళ్ళు కొరుక్కోసాగాను. భయంతో ఒణికిపోతూ బొమ్మను వదిలేశాను.

మా నాన్న నన్ను తన చేతుల మీద ఎత్తి మంచం మీద పడుకోబెట్టారు. నా నోట్లో ఏవో మాత్రలు వేసి చెంచాడు మద్యం పోశారు.

మళ్ళీ అచేతనావస్థలోకి వెళ్ళిపోయాను నేను. ఆ స్థితి నుంచి మళ్ళీ నేను కోలుకోవ టానికి చాలాకాలం పట్టింది.

కోలుకున్నాక మళ్ళీ పిన్ని గదిలో అడుగు పెడితే ఒట్టు! Ⓥ

7

35 ఏళ్లనాటి విపుల కథ

విపుల 36వ వసంతంలో కాలుమోపిన సందర్భంగా 'ముప్పైఅయిదేళ్లనాటి విపుల కథల్ని' నేటితరం పాఠకలోకానికి అందిస్తున్నాం. అనువాద కథల్ని మాత్రమే ఈ శీర్షిక కింద పునర్ముద్రిస్తున్నాం. దీనికోసం సుప్రసిద్ధ రచయితలు, కథకులు విపుల ఆవిర్భావం నుంచి ఒక్కో సంచికను కూలంకషంగా చదివి ఒక్కో కథను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 1978 ఆగస్టు విపుల నుంచి డా. టి. సంపత్‌కుమార్ ఎంపిక చేసిన కె.ఎ. అబ్బాస్ ఉర్దూ కథ మీకోసం!

ఈనెల 30 న పుట్టినరోజు జరుపుకుంటున్న డా. టి. సంపత్‌కుమార్ గారికి జన్మదిన శుభాకాంక్షలు!

కఠినగుండె

పగలంతా ప్రపంచానికి వేడినీ, వెలుగునూ ప్రసాదిస్తూ అలసిపోయిన సూర్యుడు పడమటి కొండలవైపు పరుగులు తీస్తున్నాడు. ఊరికి పడమటి దిక్కున ఉన్న మామిడి తోటపైని ఆకాశం జేగురు రంగు పులుముకుంటోంది.

గొడ్డూ గోదా ఇంటికి చేరుకునే ఆ గోధూళి వేళ పొలం నుంచి తిరిగి వస్తూ ఊళ్ళో అడుగుపెట్టాడు రహీమ్‌ఖాన్. ఏభై ఏళ్ళు పైబడ్డా రహీమ్‌ఖాన్ కండబలం, గుండెబలం తరిగిపోలేదు. ఎద్దుల్ని అదిలిస్తూ, నాగలికొర్రు భుజాన వేసుకుని ఇంటివైపు నడిచిపోతూ ఉంటే బజారు బజారంతా పక్కకు తప్పుకుని గుసగుసలాడినవారే గాని ఎదుటపడి పలకరించిన వారు ఒక్కరూ లేరు.

ఊరికి ఉత్తరం వైపు రచ్చబండమీద లోకాభిరామాయణం సాగుతోంది. పనీ పాటా లేని పడుచువాళ్ళూ, పనివున్నా చెయ్యలేని వృద్ధులూ, సాయంత్రం అయ్యేసరికి రచ్చబండ దగ్గరికి చేరారు. అప్పడాల రుచి దగ్గర నుంచి ఆటంబాంబు ప్రమాదాల వరకూ అన్నివిషయాల మీదా సుదీర్ఘంగా చర్చ సాగుతోంది.

రహీమ్‌ఖాన్ అడుగుల చప్పుడు వినగానే అంతా సద్దుమణిగింది. ఎవరికి వారు శిలాప్రతిమల్లా ఉండిపోయారు. సూటిగా అతనివైపు చూసిన వాళ్ళు ఒక్కరూ లేరు. మలుపు తిరిగిన రహీమ్‌ఖాన్ మరికొంత దూరం పోగానే అందరూ చేతనావస్థలోకి వచ్చారు.

"కటిక మనిషి.. వాడి హృదయం కన్నా బండరాయి నయం"- అయిదు నిమిషాలు పట్టుకుని ఉన్న హుక్కాగొట్టం నోటి దగ్గరికి తీసుకుని గట్టిగా ఒక్క దమ్ములాగి, పక్కనున్న నన్నాకు అందిస్తూ అన్నాడు కల్లూ మహాశయ్.

"ఏమిటో ఆరోజుకారోజు మరీ కసాయివాడైపోతున్నాడు. మొన్నటి మటుకు మొన్న - ఆ రామయ్య కొడుకు తన ఎద్దు





మీద రాయి విసిరాడని వాణ్ణి చితకతన్నాడు" కరణం మాటకు వంత పలుకుతున్నట్లుగా అన్నాడు మిఠాయి అమ్మే మరిడయ్య.

"నిన్నంటే నిన్న- పాపం పుణ్యం ఆ భగవంతుడికి తెలియాలిగానీ, చేలో జొరబడ్డాయంటూ మా గొడ్లని చావబాది వదిలాడు. ఎర్రగిత్త కుంటుతోంది కూడాను.."

తన గొడ్లు ప్రమాదవశాత్తూ రహీమ్‌ఖాన్ చేలో జొరబడలేదనీ, అది తన సుపుత్రుల పన్నాగమేననీ, తనకు తెలిసినా- ఆ మాట మాత్రం పైకి అనలేదు మునసబు.

ఆవలిస్తూ ఆఖరిమాట అందుకున్నాడు ఆచార్యులవారు.

"రామ! రామ..! ఎంతగా బండ బారిపోయాడు..! పసిపిల్లలమీదా, పసరాల మీదా జాలీ, దయా లేనివాడి బతుకెందుకు..? ఇంత కటిక మనిషి కాబట్టే చేతికెదిగిన కొడుకులిద్దరూ కనిపించకుండా పారిపోయారు"

రచ్చబండ మీద రహీమ్‌ఖాన్ యింటి విషయాల చర్చ సాగే వేళకు అతను కూడా ఇంటికి చేరుకున్నాడు. పల్లెపట్టు ప్రజలతో అతనికున్న సంబంధానికి ప్రత్యక్ష నిదర్శనంగా ఆ ఇల్లు కూడా ఊరికి దూరంగా, ఒంటరిగా ఉంది. చూరు పొడుచుకోకుండా తలవంచి గొడ్లసావిట్లోకి వెళ్ళి, గుమ్మం పక్కనే ఉన్న కట్టుకొయ్యలకు ఎద్దుల్ని కట్టేశాడు.

"రహీమ్ భయ్యా!" సరిగ్గా గొడ్లసావిట్లో అడుగుపెట్టే వేళకు ఎంత ప్రయత్నించినా, దాచుకోలేని భయంతో నెమ్మదిగా పిలిచింది పొరుగింటి ముసలమ్మ.

"ఏంటది? "- విసుగూ, కోపం, అసహ్యం మూడూ కలిపి ఒక్క కేక పెట్టాడు రహీమ్‌ఖాన్.

పిడుగు పడ్డట్లు ఆ కేక వినిపించేసరికి ముసలమ్మకు నోట మాట రాలేదు. గడగడా వణికిపోతోంది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. పిచ్చి చూపులు చూస్తూ అలాగే నిలబడింది.

"ఎందుకలా మిడిగుడ్లేసుకుని చూస్తావ్? నిన్నేం మింగెయ్యనులే.. ఏమిటి సంగతి? మీ కోడలికి మళ్ళీ పురుడొచ్చిందా? "

ధైర్యాన్నంతా చిక్కబట్టుకుంది ముసలమ్మ.

"నీ భార్య..." ఆ తర్వాత మాట లేదు.

"... లేచిపోయింది.. అంతేనా..? " వాక్యం పూర్తిచెయ్యటమే కాకుండా ఎదురు ప్రశ్న వేశాడు రహీమ్‌ఖాన్.

"అబ్బెబ్బె! ఏం కాలేదు.. నాగవరంలో అన్నగారింటికి వెళ్ళింది. రెండు మూడు రోజుల్లో తిరిగి వచ్చేస్తుంది" ఏదో ఒకటి చెప్పాలనే ఆత్రుత ముసలమ్మ కంఠంలో తొంగిచూసింది. గొడ్డును బాదినట్లు ప్రతి రోజూ చావగొడుతుంటే చూడలేక తనే రహీమ్‌ఖాన్ భార్యను పుట్టింటికి పంపేసింది ముసలమ్మ.

"చావనీ.." భార్యమీద కోపం తలుపు మీద చూపించాడు. తోపుకు గడియ విరిగిపడి తలుపులు దభాల్న తెరుచుకున్నాయి. ఎప్పుడు జారుకుందో ముసలమ్మ అక్కడి నుంచి మెల్లగా జారుకుంది. భార్య తిరిగి రాదని రహీమ్‌ఖాన్‌కి బాగా తెలుసు.

ఇంట్లో చాలా చీకటిగా ఉంది. దీపం వెలిగించటానికి బద్ధకం వేసి, చాపమీద చతికిలబడ్డాడు. పొయ్యిలో నుంచి అప్పుడే లేచిన పిల్లి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని 'మ్యావ్' మంటూ తుర్రుమంది. క్షణం ఆలస్యం చేస్తే దానికి ఆయువు మూడేదే.

పొలం నుంచి తిరిగి రాగానే కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చే వాళ్ళెవరూ లేరు. 'వడ్డించాను రండి'.. అంటూ పిలిచి భోజనం పెట్టేవారూ లేరు. అన్నింటినీ మించి, తనచేత తన్నులూ, బండ

బూతులూ తిని కిక్కురుమనకుండా ఉండే వాళ్ళూ లేరు. భార్య వెళ్ళిపోయినందుకు బాధ లేదు. కానీ ఏదో అసంతృప్తిగా ఉంది. అలవాటైన దినచర్యలో అర్ధాంతరంగా మార్పొచ్చింది. రోజూ తన కోపాన్నంతా భార్యమీద చూపించేవాడు. భార్య పుట్టింటికి పారిపోయినందుకు రహీమ్ ఖాన్ కోపం మరింత ఎక్కువయింది.

'అయితే వెళ్ళిపోయిందన్నమాట..' మంచం మీద కాళ్ళు ముడుచుకుని పడుకుంటూ తనలో తాను గొణుక్కున్నాడు. అయితే ఆ పూటకింక ఏకాదశే!

భార్యతో కాపురం చేసిన ముప్ఫై ఏళ్ళలోనూ అనుకుంటూనే ఉన్నాడు.. ఆమె ఏదో ఒకరోజు పారిపోతుందని. 'పీడా విరగడైతే బావుణ్ణు' అనుకున్న రోజులు కూడా లేకపోలేదు. ఆరేళ్ళయిందేమో! అవును.. అంతే అయి ఉంటుంది. ఆ రోజు మామూలు కన్నా కొంచెం ఎక్కువ మోతాదులో తన్నులు తిన్న పెద్దకొడుకు 'బుందూ' ఇల్లు వదిలి పారిపోయాడు. 'పోతే పోయాళ్లే వెధవ' అనుకున్నాడు రహీమ్‌ఖాన్- అంతకంటే ఏ మార్పూ లేదు. మూడేళ్ళ తర్వాత చిన్నకొడుకు 'నూరూ' అన్న చూపిన దారే పట్టాడు. ఆ క్షణం నుంచీ అనుకుంటూనే ఉన్నాడు. ఏదో ఒకరోజు భార్యకూడా పారిపోతుందని.. ఆ ఘడియ ఇన్నాళ్ళకొచ్చింది. భార్య పారిపోయినందుకు విచారించలేదు గానీ రోజూ కూర్చోవటానికి అలవాటుపడ్డ కుర్చీ విరిగిపోయినట్లయింది. అంతే, భార్య అంటే అతనికి ప్రేమ ఎప్పుడూ లేదు. ఇంట్లో మిగిలిన ఆ ఒక్క ప్రాణి కూడా పారిపోయిం తర్వాత 'తిట్లూ, తన్నులూ తినేవాళ్లు ఎవ్వరూ లేరే' అని మాత్రం బాధపడ్డాడు.

ముప్ఫై ఏళ్ళు.. ఈ ముప్ఫై ఏళ్లుగా తన కుటుంబం మీద, సంఘం మీద, బతుకు మీద ఉన్న కసినంతా భార్య మీద తీర్చుకున్నాడు.

మంచి యవ్వనంలో ఉన్న రోజుల్లో ఊళ్లో అతనికి ఎదురేలేదు. కుస్తీ పోటీ అయినా, కబడ్డీ ఆట అయినా అతనిదే పైచెయ్యి. నదిపైని వంతెన మీద నుంచి దూకి, ఆ ఒడ్డు నుంచి ఈ ఒడ్డుకి, ఒక్క దమ్ములో ఈత కొట్టగల మొగాడు ఆ వూళ్ళో ఇంకెవరూ లేరు. ఆ వయస్సులోనే సర్కస్‌లో చేరుదామని ఉండేది. ప్రేమకలాపం వెలగబెట్టింది కూడా ఆరోజుల్లోనే.

అప్పుడు ఊళ్ళో సర్కస్ ఆడుతోంది. 'తన అభిరుచికి తగింది, తన మనస్సుకి సరిపోయేది- సర్కస్ మాత్రమే' అని ఒక నిర్ణయానికి వచ్చాడు. సర్కస్ కంపెనీలో ఉంటే చాలా ఊళ్లు తిరగొచ్చు. అందమైన అమ్మాయిల మధ్య హాయిగా కాలం గడిపెయ్యవచ్చు. అంతులేనంత ధనం సంపాదించటం మాట ఎలా ఉన్నా అపారమైన

అనువాదం :
శారదాశర్మ

కీర్తి సంపాదించవచ్చు. ఇలా సాగిపోయేవి ఆలోచనలు ఆరోజుల్లో..

కలల్లో కనిపించే ఊహాసుందరి పోలికలు రాధలో కనిపించాయి. రాధ కిరాణా కొట్టు రామచెంచయ్యశెట్టి కూతురు. ఆరోజు ఏదో కుస్తీపోటీ జరుగుతోంది. అప్పుడే మొట్టమొదటిసారి చూశాడు రాధని. ఆ పిల్ల కళ్లల్లో, తనవైపు చూసిన ఓరచూపుల్లో ఏదేదో కనిపించింది రహీమ్ ఖాన్‌కి. ఆరోజు తన ప్రత్యర్థిని చిత్తుచిత్తు చేశాడు. పందెం గెలిచిన గర్వం.. రాధ కళ్ళల్లో వెలుగుతున్న ఆరాధన చూసిన తర్వాత రెట్టింపయ్యింది. ఆ తర్వాత చాలాసార్లు కలుసుకున్నారు వాళ్లిద్దరూ. పుస్తకాల్లో చదువుకున్న మాటలు ఒకరికొ



కరు అప్పజెప్పుకున్నారు. 'నువ్వు లేకపోతే జీవితమే లేదు' అనుకున్నారు ఇద్దరూ.

కానీ పొంగుతున్న పాలల్లో నీళ్ళు చల్లారు రహీమ్‌ఖాన్ తల్లిదండ్రులు. అంతే కాదు, పోసిన నీళ్ళు యిగిరిపోకుండా నిప్పు కూడా చల్లార్చేసి జాగ్రత్తపడ్డారు. సర్కస్ కంపెనీ మాట వినగానే నిప్పుతొక్కిన కోతిలా ఎగిరిపడ్డాడు రహీమ్‌ఖాన్ తండ్రి. మనది పరువూ, మర్యాదా వున్న వంశం - అని జ్ఞాపకం చేశాడు. బజారు తిరుగుళ్ళు పనికిరావని నొక్కి చెప్పాడు. ఆఖరిమాటగా యిల్లు కదిలితే కాళ్ళు విరుగ్గొడతానన్నాడు అంతే! అంతటితో ఆ ప్రకరణం ఆగిపోయింది. ముత్తాత, తాత, తండ్రి - తన వంశంలో అందరూ పొలం దున్నారు. ఆస్తి పెద్దగా లేకపోయినా కౌలుకు తీసుకుని మోతుబర్లని తయారుచేశారు. ఆ గాడి తప్పని గానుగెద్దు జీవితానికే తలవంచింది ఈ కోడెదూడ కూడా. అంతే..!

వేడిరక్తం పొంగులో తండ్రిమీద తిరగబడదామనుకున్నాడు చాలాసార్లు. తరతరాలుగా వంశంలో ప్రవహిస్తున్న రక్తం కలిసిరాలేదు. తండ్రి మూర్ఖపు పట్టు పడుతున్నాడు. నిజమే! అయినా తండ్రికి ఎదురు తిరగటం ఆ వంశంలో ఎప్పుడూ జరగని పని. కొత్తదారి తొక్కే ధైర్యం లేకపోయింది. తనలో తానే కుతకుతలాడుతూ వుండిపోయాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే సర్కస్ కంపెనీ వాళ్ళు డేరాలెత్తేశారు. ఆరోజు రహీంఖాన్ అన్నం ముట్టలేదు. అయితే అంతకన్నా ఎక్కువ ప్రమాదం జరగలేదు.

ప్రేమాయణం కూడా అర్ధాంతరంగానే ముగిసింది. విషయం పసిగట్టిన రహీమ్ ఖాన్ తండ్రి అట్నుంచి నరుక్కొచ్చాడు. "ఏమయ్యా శెట్టీ! పిల్లదానికి మూడుముళ్ళు వేయించవా ఏం? " అంటూ పలకరించి, ఆలస్యంగా పెళ్ళిళ్లు చేస్తే కలిగే అనర్థాలను దృష్టాంతాలతో సహా ఏకరువు పెట్టాడు. శెట్టిగారి పెద్దన్న గురించి జ్ఞాపకం చేశాడు. "వంశం పరువు ప్రతిష్ఠ గంగలో కలిసిం తర్వాత యింక తలెత్తుకు తిరగలేవు" అని ముగించి వూర్కున్నాడు.

ఈ ప్రబోధం బాగానే పనిచేసింది. వారం తిరక్కుండా రాధ పెళ్లి నిశ్చయమయింది. ద్వితీయం - అయితేనేం పిల్లా పీచు లేరు. కాకపోతే పెళ్లికొడుకు పొట్ట సరిగ్గా చాకలి బాన అంత వుంది. అది పెద్ద అడ్డుగా కనిపించలేదు చెంచయ్య శెట్టికి.

అప్పటికి తెలిసింది రహీమ్‌ఖాన్‌కి జరుగుతున్నదేదో. తండ్రి ఎదుటపడే ధైర్యం లేక తల్లితో మెల్లగా వూది చూశాడు "పవిత్రమైన ముసల్మాన్‌గా పుట్టి కాఫిర్ కూతుర్ని ఎలా కట్టుకుంటావురా? నలుగురూ నోట్లో ఉమ్మేయ్యరూ" అని రాగాలు తీసింది తల్లి.

రాధ పెళ్ళి జరిగిపోయింది. చదువుకున్న కథల్లో రాజకుమారుడు లాంటి రహీమ్‌ఖాన్ దక్కనందుకు చాటుగా కన్నీళ్లు పెట్టుకున్నా, త్వరలోనే ఆదర్శగృహిణిగా తయారయింది రాధ. ఇప్పుడు ఆరుగురు పిల్లల తల్లి కూడాను..!

ఆ తర్వాత త్వరలోనే రహీమ్‌ఖాన్ పెళ్ళి కూడా జరిగింది. అతని ప్రమేయమేమీ లేకుండానే.. తల్లిదండ్రులు పిల్లని, ముహూర్తాన్నీ కూడా ఒకేసారి నిశ్చయించారు. వధువు కోసం వెండి నగలు చేయించారు. పెళ్ళిబట్టలూ అవీకొని, వున్నంతలో రహీమ్‌ఖాన్‌కి ముస్తాబు చేసి, కళ్ళు కనిపించనంతగా మల్లెదండలు తగిలించి గుర్రం ఎక్కించి, మేళతాళాల మధ్య వధువు యింటికి తీసుకుపోయారు. 'నిఖా' జరిగిపోయింది. కాజీ అడిగిన ప్రశ్నలకి యాంత్రికంగా తల ఆడించాడు రహీమ్ ఖాన్. అక్కడ మరోవిధంగా జరిగే అవకాశం లేదు. మూలగదిలో పట్టుచీరెల

అబ్బాస్ చెక్కిన అక్షర శిల్పం



'విపుల' వినూత్న ప్రయోగంలో నేనూ భాగస్వామిని కావడం చక్కని అనుభవం. అప్పటికే 1978 ఆగస్టు సంచిక నాకు చేరి మూడువారాలు దాటింది. పనిరీత్యా ఢిల్లీ- కోలకతా ప్రయాణాలు రావడం వల్ల బాగా మాగిన ఆవకాయ మాదిరి 35 సంవత్సరాలనాటి 'విపుల'లో పదహారు కథల్ని భూమికి సరిగ్గా ముప్పయి ఐదు వేల అడుగులకి పైగా ఎత్తు ఆకాశంలో నాలుగు గంటలపాటు ఆస్వాదించాను. అంటే విమానయానం చేస్తూ చదివానన్నమాట. పదహారు కథల్నీ వడబోసి ఐదు కథల్ని.. ఐదు నుంచి మూడు.. చివరగా మూడు నుంచి రెండు.. టై.. ఉర్దూ - తెలుగు కథల మధ్య! 'రెండు కథల్ని ఎంపిక చేయమంటే ఎంత బాగుండేది?' అని మనస్సులో ఓ వెర్రి ఆశ.. చివరకు భారమైన హృదయంతో ఉర్దూ అనువాద కథ 'రాతిగుండె'ని ఎంపిక చేసి తేలికపడ్డాను.

కే.శే. కె.ఎ. అబ్బాస్ ఉర్దూ కథ 'రాతిగుండె'లో నాయకుడు రహీమ్‌ఖాన్. పెరిగిన ఇంటి వాతావరణం, తండ్రి హుకుం, గ్రామస్థుల ప్రవర్తన.. ఇంకా.. ఇంకా.. అన్నీతోడై అతన్ని కఠినాత్ముడిగా మారుస్తాయి. రహీమ్‌ఖాన్‌కి సర్కస్ కంపనీలో చేరి కీర్తిని సంపాదించాలని గాఢమైన కోరిక. అంతేకాదు ప్రేమించిన అమ్మాయి 'రాధ'తో జీవితం పంచుకోవాలనుకున్నాడు. కానీ అలా జరగలేదు. దాంతో అతని గుండె ఘనీభూతమవుతుంది. ఈ కథని చదువుతుంటే మన రాష్ట్రంలో పిల్లలు తల్లిదండ్రుల ఒత్తిడితో, వారికే నచ్చిన కోర్సుల్లో చేరి మరబొమ్మల్లా జీవితాన్ని గడుపుతున్న నగ్నసత్యం నా మెదడులో మెదిలింది.

జీవితంలో తాననుకున్నది ఏదీ నెరవేరకపోవడంతో ఆ నిరాశ క్రోధంగా మారుతుంది. ఆ క్రోధాగ్నికి సమిధలయిన భార్య-పిల్లలు ఇల్లు వదిలిపోతారు. రహీమ్‌ఖాన్ పాషాణ హృదయాన్ని కరిగించడానికి అబ్బాస్ చాకచక్యంగా జంట పిచ్చుకల్ని, వాటి పిల్లల్ని ముఖ్యపాత్రలుగా ప్రవేశపెడతాడు. ఈ నూతన బంధంతో రహీమ్‌ఖాన్ పాత్రలో నిజమైన రూపాంతరాన్ని చూపుతాడు. పిచ్చుకలు - రహీమ్‌ఖాన్ బంధాన్ని సరళమైన, పొందికైన పదాలతో వర్ణించి పాఠకుల హృదయాలు ద్రవించేలా కథనాన్ని ముగిస్తాడు. నాకు నచ్చిన ఆ తరం కథ.. మా తరాన్ని దాటుకొని ఈతరం కథాప్రియులకి ముఖ్యంగా 'విపుల' పాఠకులకి తప్పక నచ్చుతుందని ఆశిస్తున్నా.

– డా. టి. సంపత్‌కుమార్,
న్యూఢిల్లీ

ఉత్తమ కథకుడు

'లియోసా' కథ ద్వారా తెలుగు కథాసీమకు పరిచయమైన ఉత్తమ కథకుడు టి. సంపత్ కుమార్ న్యూఢిల్లీలోని కెనడియన్ హై కమిషన్‌లో సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో జన్మించిన సంపత్ కథాసంపుటితో పాటు వందకు పైగా సునామీ నానీలను రాసి పుస్తకంగా తీసుకువచ్చారు. ఆయన కథలు ఆంగ్ల, హిందీ, పంజాబీ భాషల్లోకి అనూదితమయ్యాయి. పలు సంస్థలు పురస్కారాలతో సత్కరించాయి.

మధ్య కూర్చున్న పెళ్ళికూతురు ఇష్టాయిష్టాలు అడిగినవాళ్ళే లేరు.

పెళ్ళి సందట్లో భార్యని వంటరిగా పట్టుకొని "చూశావుటే? ఎలావుంది? వంచిన తల ఎత్తాడా వెధవ, ఏదేదో ఊహించి భయపడిపొయ్యావ్ నువ్వు.. వాడు నా కొడుకే..! అయినా ఈనాటి కుర్రకుంకల సంగతి నాకు బాగా తెలుసు.. పెళ్ళి కాస్త ఆలస్యమైతేనే వీళ్ళ ప్రేమల కబుర్లు. మెడకో గుదిబండని తగిలిస్తే కిక్కురుమనకుండా పడివుంటారు.." అని మీసం మెలేసుకుంటున్నాడు రహీమ్‌ఖాన్ తండ్రి. గర్వంతో కూడిన చిరునవ్వు గడ్డం చాటున దాక్కుంది.

శోభనం గది గడపమీద కాలు పెట్టినప్పుడే రహీమ్‌ఖాన్‌లో రాక్షసుడు నిద్ర లేచాడు. అణిచిపెట్టిన ఉద్రేకం, పగ అప్పుడే బుసలుకొట్టాయి. తండ్రి మీదా, కుటుంబం మీదా, సమాజం మీదా కసి తీర్చుకోవాలంటే యిన్నాళ్ళకి అతనికి ఒక లక్ష్యం అంటూ దొరికింది. తన భార్య! తన కలలన్నీ తలకిందులవటానికి భార్యే కారణం అనిపించింది. ఇన్నాళ్లూ తనని అణచిపెట్టారు. ఇప్పటికి తనకా అవకాశం వచ్చింది. తన కసి తీర్చుకునే అవకాశం లభించింది.

వినయవిధేయతలతో వెన్నముద్దగా తీర్చిదిద్దబడ్డ మనస్సు ఆ క్షణంలో పాషాణం అయింది. తలుపు తోసుకొని గదిలో అడుగుపెట్టాడు.

అది ముప్ఫై సంవత్సరాల క్రితం మాట.. మంచం మీద బద్ధకంగా పడుకున్న రహీమ్‌ఖాన్ ఒక్కసారి గతాన్ని సింహావలోకనం చేసుకున్నాడు. అవును.. కసి తీర్చుకోలేదా తను.. ముప్ఫై ఏళ్ల నుంచి తన భార్యనీ, పిల్లల్నీ, ఆఖరికి పశువుల్నీ రాచిరంపాన పెట్టాడు. ఊళ్లో రహీమ్‌ఖాన్‌తో పోట్లాడని వాళ్ళంటూ ఎవ్వరూ లేరు. అంతేకాదు.. అందరూ కలిసి సమష్టిగా అసహ్యించుకునే మనిషి కూడా మరెవ్వరూ లేరు. అందరి మీద కసి తీర్చుకుంటున్నానన్న తృప్తి మాత్రం మిగులుతోంది అతనికి.

నవ్వుతూ, తుళ్ళుతూ వుండే చాకులాంటి కుర్రాడు యిలా కటికవాడుగా మారిపోవటానికి కారణమేమిటి? అన్న విషయం మాత్రం ఆలోచించిన వాళ్ళు ఎవ్వరూ లేరు. మొదట్లో యీ ధోరణికి కొంచెం ఆశ్చర్యపడ్డారు. తర్వాత తర్వాత భయపడ్డారు. అలవాటుపడ్డ భయం అసహ్యంగా మారటానికి ఎంతోకాలం పట్టలేదు. రహీమ్‌ఖాన్ మనసులో చెలరేగుతున్న బడబాగ్నిని అర్థం చేసుకున్న వాళ్ళుగానీ, సానుభూతి చూపించిన వాళ్లుగానీ ఒక్కరూ లేరు. ఈ పరిస్థితి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. రహీంఖాన్‌లో పైశాచిక ప్రవృత్తి విలయనృత్యం చేసింది. 'భార్య' అన్న ప్రాణి మీద సమాజం తనకిచ్చిన అధికారాన్ని అక్షరాలా వినియోగించుకున్నాడు.

ముప్ఫై ఏళ్ళుగా నానా చిత్రహింసలూ భరించింది రహీమ్‌ఖాన్ భార్య. తిట్లూ దెబ్బలూ ఎంతగా అలవాటైపోయాయీ అంటే వంటి మీద దెబ్బపడని రోజు ఏదో దూరమైపోయినట్లుండేది.

రహీమ్‌ఖాన్‌కి మగతగా నిద్రవస్తోంది. గతాన్ని నెమరేసుకుంటూ- 'ఇక ముందు బతకటం ఎలా? ' అని ప్రశ్నించుకున్నాడు. భార్య దగ్గరలేని లోటు అతనికప్పుడు తెలిసొచ్చింది. అంటే అమాంతం పెళ్ళాం మీద ప్రేమ పుట్టుకొచ్చిందని కాదు. 'ఒంటరిగా బతకాలే' అన్న దిగులు. తను ప్రతి క్షణం హింసించే భార్య తన బతుకులో యింత ముఖ్యమా? అని ఆశ్చర్యపోయాడు కూడాను. అలాగే నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాడు.

లేచేసరికి బాగా పొద్దెక్కింది. పొద్దున్నే నిద్ర లేపడం భార్యవంతు. ఈ రోజు పొద్దెక్కేసరికి పారిపోయిన పెళ్ళాన్ని బండబూతులు తిడుతూ మంచం మీద నుంచి లేచాడు. రాత్రి బద్ధకం ఇంకా వదల్లేదు.

మెల్లగా కాలకృత్యాలు తీర్చుకొని, తాపీగా పాలు తీశాడు. రాత్రికూడా భోజనం లేదేమో కడుపులో పేగులు ఆకలికి నకనకలాడుతున్నాయి. వంటింట్లో కనిపించిన క్రితంరోజు చపాతీలు పాలల్లో ముంచుకొని తిన్నాడు. ఆత్మారాముడు కొంచెం శాంతించాడు. తనకు అత్యంత ప్రియమైన, హుక్కాగొట్టం దగ్గరకు లాక్కుని మంచం మీద కూర్చున్నాడు.

ఉదయం సూర్యుడి కిరణాలు తెరిచిన కిటికీలోంచి తొంగిచూస్తున్నాయి. కిటికీపైన కట్టిన సాలెగూడు స్పష్టంగా కనిపి



స్తోంది. పైన ఎక్కడ చూసినా బూజుదారాలు వేలాడుతున్నాయి. ఇల్లు కూడా చిందరవందరగా వుంది. ఇక ఆ రోజుకి పొలానికి పోగూడదని, యిల్లు శుభ్రం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ఒక పొడవైన గడకర్ర తీసుకుని దాని చివర పాతగుడ్డలు చుట్టాడు. తాటాకు కప్పుకింద చాలా సాలెగూళ్లున్నాయి. ఒక్కొక్కటే దులుపుతూ శుభ్రం చేస్తున్నాడు. ఒక మూల చూరు కింద రెండు పిచ్చుకలు ఒకటే రొద పెడుతున్నాయి. అక్కడే వుంది పిచ్చుకగూడు.

కర్రతో గూటిని లాగి పారేద్దామనుకున్నాడు, మొదట.. కానీ ఎందుచేతనో ఆ ప్రయత్నం మానుకున్నాడు. కర్ర కిందపడేసి, మూలనున్న బల్ల లాక్కుని దానిమీద ఎక్కి గూట్లోకి తొంగిచూశాడు. ఇంకా రెక్కలు రాని పిల్లలు రెండు నెత్తుటి ముద్దల్లా వున్నాయి. పుట్టి యింకా ఒకరోజైనా అయివుండదు. రహీమ్‌ఖాన్ గూటి దగ్గర తల పెట్టేసరికి. పెద్ద పిచ్చుకలు రెండూ విజృంభించాయి. గూట్లోకి చూశాడో? లేదో? తల్లి పిచ్చుక ఒక పోటు పొడిచింది.

'ఆసినీ జిమ్మడ! గుడ్లు పీకేశావు గదే!' అనుకుంటూ నెమ్మదిగా నవ్వుకున్నాడు రహీమ్‌ఖాన్. కిందికి దిగి బల్లని మామూలు స్థానంలోకి జరిపేడు. వాటి గూటినీ, పిల్లల్నీ రక్షించుకునేందుకు పిచ్చుకలు చేసే ప్రయత్నం చూస్తూంటే అతనికి ఆశ్చర్యం వేసింది. మొత్తానికి ఆరోజుకి పిచ్చుక గూడుకి ఏ ప్రమాదమూ రాలేదు. రహీమ్‌ఖాన్ గుడిసె కూడా ప్రశాంతంగా వుంది.

మరుసటి రోజు నుంచి తన మామూలు దినచర్య ప్రారంభించాడు. ఇంకా ఊళ్ళో ఎవరూ అతన్ని పలకరించలేదు. చద్దన్నం తిని, పొద్దున్నే పొలానికి పోవటం, దున్నటం, మళ్ళు చేసి నీరు పెట్టడం, బాగా పొద్దెక్కిన తర్వాత- సూర్యాస్తమయం లోపు యింటికి తిరిగి రావటం-యిదీ అతని దినచర్య. మంచం మీద పడుకుని హుక్కా పీలుస్తూ, పిచ్చుకల సంసారాన్ని చూస్తూ కాలం గడపటం కూడా అతనికి అలవాటయిపోయింది. పిల్లలు కొంచెం పెరిగి పెద్దవయ్యాయి. రెక్కలొచ్చాయి. ఆ పిల్లల్ని చూస్తూంటే చాలాకాలం క్రితమే యిల్లు వదిలి పారిపోయిన కొడుకులిద్దరూ జ్ఞాపకం వచ్చారు. రహీమ్‌ఖాన్ 'నూరూ', 'బుందూ' అని తన కొడుకుల పేర్లే పెట్టాడు పిచ్చుక పిల్లలకి. ఆ నాలుగు పిచ్చుకలే అతని స్నేహితులు. అవే అతని ప్రపంచం.

పొరుగువాళ్ళకెవరికీ ఇప్పుడు రహీమ్‌ఖాన్ తిట్టే బూతులు వినిపించటం లేదు. అతని రెండెడ్లకి కొత్తగా వాతలు కనిపించలేదు. పాత దెబ్బలు కూడా మాని, గార కడుతున్నాయి. ఈ ప్రవర్తన అందరికీ ఆశ్చర్యంతోబాటు అనుమానం కూడా కలిగించింది.

వర్షాకాలం.. ఆకాశమంతా దట్టంగా మబ్బులు పట్టాయి. ఆరోజు మామూలు కన్నా ముందుగానే యింటిముఖం పట్టాడు రహీమ్‌ఖాన్. రోడ్డుమీద పిల్లలు ఆడుకుంటున్నారు. రహీమ్‌ఖాన్‌ని చూడగానే పెద్దపులిని చూసినట్లు అందరూ పారిపోయారు. ఆ తొందర్లో అక్కడ వదిలేసిన చెప్పుల్ని కూడా ఎవరూ గమనించలేదు.

"ఒరేయ్! ఎందుకురా పారిపోతారు? నేనేం కొట్టను" అని కేకలు పెట్టిచూశాడు. అయినా ఒక్కడూ వెనిక్కి తిరిగి చూడలేదు. అప్పుడే సన్నచినుకు మొదలయింది. చకచకా ఇంటిదారి పట్టాడు రహీమ్‌ఖాన్.

ఇల్లు చేరుకుని సావిట్లో ఎడ్లని కట్టేసేవేళకి కుండపోతగా వర్షం మొదలయింది.

తలుపు తెరచి దీపం వెలిగించాడు. వంట చేసుకొనేముందు పొద్దున మిగిలిన మెతుకులు పిచ్చుకలకి పెట్టడం అలవాటై

పోయింది. ఆరోజు కూడా పళ్ళెంలో అన్నం పెట్టి పిచ్చుకలకోసం ఎదురుచూశాడు. ఒక్కటీ రాలేదు. "ఒరేయ్ బుందూ! నూరూ! పిచ్చిమొహాల్లారా! వచ్చి అన్నం తినండ్రా!" అని కేకలు పెట్టాడు. అప్పటికీ రాలేదు పిచ్చుకలు. "ఏమయిందిరా!" అంటూ గూటి దగ్గరికి వెళ్ళి చూశాడు. సరిగ్గా గూడు ఉన్నచోట చూరు కారుతోంది.

పిచ్చుకలన్నీ రెక్కలు విప్పుకుని భయం భయంగా ఒదిగి కూర్చున్నాయి.

అంత వర్షంలోనూ నిచ్చెన వేసుకుని, ఇంటి కప్పెక్కి కురుస్తున్న చోట వత్తుగా గడ్డి కప్పాడు రహీమ్‌ఖాన్. 'ఇక ఫరవాలేదు' అనుకునేసరికి పూర్తిగా తడిసి ముద్దయిపోయాడు. ఇంట్లోకి వస్తూనే పెద్దపెట్టున తుమ్మాడు. 'ఫర్వాలేదులే' అనుకుంటూనే పడుకున్నాడు. తెల్లారి లేచేసరికి పెద్దపెట్టున జ్వరం.

చాలారోజుల వరకూ రహీమ్‌ఖాన్ కనిపించక పోయేసరికి ఊళ్ళోవాళ్ళకి ఆశ్చర్యం వేసింది. క్రమం తప్పని దినచర్య అతనిది. 'ఏం జరిగిందా? ' అని ఆసక్తితో కొంతమంది ఇంటి దగ్గరికి వెళ్ళారు.

తలుపులు వేసి ఉన్నాయి. కన్నంలోంచి చూస్తే చిక్కి, శల్యమై మంచానికి అంటుకుని పడి ఉన్నాడు రహీమ్‌ఖాన్. "ఒరేయ్ బుందూ! నూరూ! నేను పోయిం తర్వాత మీకు తిండెవడు పెడ్తార్రా? " అని కలవరిస్తున్నాడు.


"పాపం ముసలాడికి పిచ్చెక్కింది" అనుకున్నారు ఊళ్ళోవాళ్ళు. గత ముప్పై సంవత్సరాలుగా రహీమ్‌ఖాన్ మీద లేని జాలీ, సానుభూతీ ఇప్పుడు కనిపించింది. వెంటనే భార్యకి కబురు పంపించారు.

తెల్లారేసరికల్లా పిల్లల్ని తీసుకుని గొల్లుమంటూ వచ్చింది రహీమ్‌ఖాన్ భార్య. ఇరుగు పొరుగువాళ్ళు కూడా చేరారు. తలుపు లోపల గడియవేసి ఉంది. ఎంత కొట్టినా తియ్యకపోయేసరికి పగలగొట్టారు. మంచానికి అడ్డంగా పడి ఉంది రహీమ్ ఖాన్ శవం.

కిచకిచమంటూ, రెక్కలు కొట్టుకుంటూ హడావుడిగా తిరుగుతున్నాయి నాలుగు పిచ్చుకలూ.. అంతకుమించి ఏ శబ్దమూ లేదు.

గమనిక: *ఈ శీర్షికలో ప్రచురిస్తున్న ఆయా భాషల కథలు విపులలో తెలుగు అనువాదంగా వెలువడి 35 ఏళ్లయిందని గ్రహించగలరు. మొదటిసారి మూల రచయిత / అనువాదకులకు విపుల పారితోషికం చెల్లించింది కనుక వారికి మరోసారి పారితోషికం ఉండదని మనవి.*

తెలుగు కథ



కట్టుకోలు సుబ్బారెడ్డి

పక్కింటి మొగుడు

ఆఫీసు నుంచి ఆనందరావు వచ్చేటప్ప టికి రాత్రి తొమ్మిదయ్యింది. ఆఫీసు అయి దింటివరకు అయినా అదనపు పనులు చూసుకొని వచ్చేటప్పటికి, చలికాలమవ్వ టంతో అర్ధరాత్రా అనిపిస్తోంది. అదనపు పనులంటే ఎవరికి స్ఫురించే అర్థాలు వారికి స్ఫురిస్తాయి.

చాలామంది అనుకునేది, చెప్పటానికి



గౌరవప్రదంగా అనిపించేది ఓవరు టైము డ్యూటీ అని. అయితే కొన్నిసార్లది నిజమే గానీ అన్నిసార్లూ కాదు.

అతను ఇంటికొచ్చేది- అనేకసార్లు వైను షాపు నుండిగానీ, బారునుండిగానీ అయి వుంటుంది. అక్కడ పెట్టే ఖర్చంతా ముప్పాతిక మువ్వీసం సార్లు ఇతని ఉద్యోగ జీవితంతో అవసరమున్నవారు భరిస్తుంటారు. అమావాస్యకో పున్నానికో ఎవరూ లేకపోతే అలవాటు బలంచేత ఇతనే భరించాల్సివస్తుంది.

మద్యపానానికయ్యే ఖర్చునైతే ఇతరులు తమ అవసరార్థం భరిస్తారేమోగానీ, దాని వల్ల సమాజంలో కలిగే అప్రతిష్ఠను మాత్రం వారెవరూ భరించరు. శరీరారోగ్యానికి జరిగే నష్టాన్ని సైతం ఎవరూ భరించరనీ, భాగం కూడా పంచుకోలేరనీ ముఖ్యంగా శృంగార జీవితానికి తగిలే గొడ్డలిపెట్టుకి సానుభూతి కూడా చూపరనీ, చాటుగా నవ్వుకుంటారనీ ఆనందరావుకు తెలియదు.

వేరుకుళ్ళు తెగులొచ్చి చావబోతున్న చెట్టుకు ఓ కొమ్మ ఎండి మరో కొమ్మ పచ్చిగా ఉంటుందా? పుంసత్వభంగమనే కాదు. ఏ రకపు నష్ట కష్టాలైనా వాటన్నిటినీ తనే భరించవలసి వుంటుందనేది ఆనందరావు గ్రహించవలసి ఉంది.

ఇటీవలి అతని ప్రవర్తన చూస్తూవుంటే తనకు కలిగిన, కలుగుతున్న శారీరక, మానసిక నలతలను రవ్వంత గుర్తించాడా అనిపిస్తోంది.

కాస్త లోతుగా ఆలోచించగలిగితే కారణాన్ని గ్రహించగలిగి అవును అదే? అనే సమాధానమొస్తుందేమోనని భయపడి ఆలోచన చివరివరకూ సాగకుండా జాగ్రత్త పడుతున్నట్లుంది. అబ్బే అదేంకాదులే అనే ఆత్మవంచన అతనికి ఆనందం కలిగిస్తోందన్న నిజాన్ని గుర్తించటానికి అతని అంతరంగం నిరాకరిస్తోంది!

నిర్వర్తించటం తప్పనిసరి అయినపుడు కోపాన్నో, అనారోగ్యాన్నో అభినయిస్తున్నాడు. చేయదలచిన పనిలో ఎదురయ్యే ఓటమికి కారణాన్ని కనుగొని దాన్ని నివారించడానికి బదులు అసలాపనే తలపెట్టడం లేదు. పాసు కాలేనేమోనన్న భయంతో పరీక్షలే ఎగ్గొట్టే విద్యార్థిలాగా పరాజయపు భయంతో ప్రయత్నమే మానుకుంటున్నాడు!

ఆనందరావు స్నానం చేసి వచ్చేక అతనూ రమణీ ఇద్దరూ కలిసి భోజనానికి కూర్చున్నారు. భర్తకి తీపి పనికిరాదు కనుక గారెలు, పులిహోరా చేసింది. వాటిని చిన్న పింగాణి ప్లేటులో పెట్టి భర్తకొకటిచ్చి తానొకటి పుచ్చుకొంది. వంట గదిలో సవరింపులవీ చేసుకొని పడక గదిలోకి వెళ్ళీవెళ్ళడమే ఆలస్యంగా...

“ఏమండీ అమ్మాయి నాకు మెసేజిచ్చింది. మీక్కూడా ఇచ్చిందా?” అనడిగింది, తాంబూలంతో ఎర్రబడ్డ పెదవులతో, ముఖమంతా నవ్వుల మతాబులను నింపుకొని.. సమాధానం కోసం ఓరగా చూడసాగింది. అసలే అందగత్తె, దాంపత్యానుభవంతో మౌగ్ధ్యాన్ని విడిచిపెడుతున్న పరిణతి చెందిన వయసు, ఆ పైన ధగధగ మెరిసే ట్యూబులైటు కాంతిలో లేతరంగు పల్చని నూలుచీర, తలస్నానం చేసి వదులుగా వేసుకున్న వాలుజడా, పువ్వులూను, అన్నిట్నీ మించి మనసులోలోపలి పొరల్లోంచి తన్నుకొస్తున్న ఆహ్లాదపు జ్వాలా తోరణాలు.. చందమామ కథల్లో విద్యాధర రాకుమారి బొమ్మలాగుంది!

ఆనందరావుకు సూచనప్రాయంగా విషయమర్థమౌతూనే వుంది. ఈవేళ ఆనందరావూ రమణీల పెళ్ళిరోజు. జ్ఞాపకశక్తి విషయంలో ఇతనితో సాటివచ్చేవారు ఎక్కువ మంది వుండరు.

“మనకిలాంటి పెళ్ళిరోజులు మరోవెయ్యి

రావాలని మెసేజిచ్చింది" అంటూనే అనేక సార్లు చదివినది జ్ఞాపకాల్లో నిలబడక పరీక్షకెళ్ళ బోయేచివరి క్షణంలో మరోసారి చదువుతున్న విద్యార్థిలాగా దిగాలుగా పిరికి నవ్వొకటి నవ్వాడు.

దంపతులిద్దరూ ఎదురుబొదురుగా వున్న సమయంచూసి మన్మథుడు తన చెరకు విల్లును చేతిలోకి తీసుకొన్నాడు. పెద్దగా పదును లేకుండా చేసిన మొదటి అంబుని సంధించి ఆట్టేలాక్కుండా విడిచి పెట్టాడు. అది రమణీ ఆనందరావుల లోనుంచి దూసుకుంటూ వెళ్ళి వెనుతిరిగి మళ్ళా మన్మథుని చేతిలొకొచ్చింది.

ఆనందరావు అతి నెమ్మదిగా చేతులు చాచి అప్పటికే దగ్గరగా జరిగిన రమణిని నడుము వద్ద పట్టుకుని అక్కడ ఏర్పడ్డ ముడతలను సుతారంగా మీటాడు, ఆపైన మెత్తగా నిమిరాడు.

రమణి మేనిపై పుష్పదళమొకటి వికసించింది. ఆనందరావు తనూ తంతువొకటి శృతికొచ్చింది.

మన్మథుడు ఈ దఫా రెండు బాణాలను చేతిలోకి తీసుకొని ఎక్కుపెట్టాడు. వాటి రెండిటికీ చిరుపదును కల్పించాడు. గురిచూచి అల్లెత్రాడు బిర్రుగాలాగి రెంటినీ ఏకకాలంలో వదిలాడు.

భర్త స్పర్శతో పులకలు రేగుతున్న శరీరాన్ని అతనికేసి హత్తుతూ, రెండుచేతులనూ ఆనందరావు చుట్టూవేసి ముఖాన్ని పైకెత్తి అతనికి అనుకూలంగా వుండే విధంగా అందించింది రమణి. ఆనందరావు కూడా చేతులను నెమ్మదిగా ఒక్కబెత్తెడు పైకి జరిపి తమ ఇద్దరిమధ్యకూ తీసుకొచ్చాడు.

భర్త (బాణాలు) స్పర్శతో... చర్యతో ఇంతికింకో రెండుదళాలు వికసించాయి. కళ్ళు మూతలుపడి పెదవులొకింత విప్పారాయి.

దేన్ని గురించైనా బెంగపడటం ప్రారంభమైన వెంటనే బెంబేలు పెరుగుతుంది. బెంబేలు భయంగా మారటానికి ఆట్టేసేపు పట్టదు. భయం పెద్దదైన కొద్దీ సమర్థత సన్నగిల్లుతుంది. అలాటి తడబాటులో భంగపాటుల శాతమూ పెరుగుతుంది.

వజ్రాలకన్నా బలిష్టమైన బీపీ షుగర్లను తాకిన ఆ రెండు అమ్ముల మొనలూ వంకరపోయాయి! శృతిపక్వానికి రావలసిన రెండు తీగలు శబ్దంలేకుండా తెగాయి.

జీవిత సహచరులిద్దరూ యౌవనంలోనే వున్నారు. పడకమీద చేరి ఎవరికివారు తమతమ చర్యలమీద నెమ్మది నెమ్మదిగా నియంత్రణను కోల్పోవలసిన వివాహ వార్షికోత్సవ సందర్భమూ, రాత్రి పది పదకొండు గంటల సమయమూను! దీనిలో ప్రకృతికి విరుద్ధంగా గానీ, వ్యక్తుల వ్యతిరేకత గానీ, వ్యవస్థకు భిన్నంగానీ అణువంతైనా లేదు.

ఇంక తానక్కడుండటం అట్టే బాగోదనుకున్న మన్మథుడు తన చివరి రెండుబాణాలనూ హడావుడిగా చేతిలోకి తీసుకున్నాడు. కరుకైన పదును కల్పించాడు. తొందరగా ఎక్కుపెట్టాడు. ఉభయులకూ తగిలేలాగా గురిచూశాడు. నారిని సైతం బాగా చెవి వరకూ లాగిపెట్టి వదిలాడు.

రమణి పంచేంద్రియాలూ తమ తమ విధ్యుక్త ధర్మాలు ఓసారి మందకొడిగానూ, ఓసారి అతిచురుకు గానూ, చాలా అస్తవ్యస్తంగా నిర్వర్తిస్తున్నాయి. మనసూ, మెదడూ జారీచేసిన ఆజ్ఞలకు ప్రతిఫలం కోసం, మనశ్శరీరాలు చూస్తున్నాయి. మామూలప్పటికన్నా విజృంభించి గుండె పంపిస్తున్న రక్తపు వడికి తోడైన హార్మోనులు శరీరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రమణికి ఎంతో ప్రయత్నం మీద కానీ బాహ్యస్పృహలో ఉండటం సాధ్యం కావటం లేదు!

ఆనందరావు శరీరంలో చేరిన అదనపు బరువూ, పగలు చేసిన పని తాలూకు



అలసటా, తీసుకున్న సరుకు కలిగిస్తున్న మైకమూ, భుక్తాయాసమూ, అనాసక్తతా కలగలిసి ఒక బాణాన్నీ, సరియైన పెర్ఫా ర్మెన్సు చేయలేకపోతానేమో?... ఔనౌను చెయ్యలేను... ఆ సంగతి ఇంతకుముందో కసారో, అరసారో చూసాగదా... అనే పని కిమాలిన ఆలోచనా భూతమొక్కటే రెండో బాణాన్నీ నిర్వీర్యం చేయటానికి సిద్ధంగా వున్నాయి!

అర్జునుడు గాండీవాన్ని సముపార్జించక ముందు విజయాలనే సాధించ లేదన లేము. అతని ప్రతి విజయానికీ గాండీ వమే కారణమనుకోవటం తెలివైన పని కాదు. దృఢ సంకల్పమూ, మనోబలమూ లేకపోతే ఎవరూ విజయాలను నమోదు చేయలేరు. శల్యుడు గనుక కర్ణుని మనో దారుఢ్యాన్నీ, స్థైర్యాన్నీ మాటలతో చీల్చి చెండాడకపోతే... కర్ణుడు మరికొన్ని రోజు లపాటు మరింత మెరుగైన పోరాటం చెయ్యగలిగేవాడనటం సత్యదూరం కాదు.

యద్భావం తద్భవతి అనీ, సిరి అంటక పోయినా చిలుము త్వరగా అంటు కుంటుందనేవి ఆర్యోక్తులు.

కుర్రతనంగాని కూడపెట్టడానికి కుదిరేద యితే ఆనందరావు తప్పక కూడపెట్టేవాడే! దురదృష్టవశాత్తూ ఇది అప్పుచెయ్యడానికి కూడా అలవికానిదయ్యింది.

శారీరక పటుత్వం డబ్బులాటిదైతే దాన్ని అక్కరలేనంతగా ఆర్జించటమే కాక బ్యాంకులో దాచి... దాచి... దానిమీద వడ్డీకూడా పొందేవాడే! పదిమంది ఖర్చుపె ట్టినా ఫరావలేదన్నంతగా ఇంట్లో కూడా నిలువ చేసేవాడే!

వ్యసనాసక్తుడై తెచ్చిపెట్టుకున్న తలనొ ప్పికి తలవంచక తప్పలేదు. పారిపోయే పరిస్థితి కూడా లేనప్పుడు- నాలుగు కాళ్లనూ కూడా చిప్పలోకి లాక్కున్న తాబే లులాగా ఆనందరావు అటుతిరిగి పడుకుం డిపోయాడు!

ఇటీవల కొన్నిసార్లు పెద్దగా కాదుగదా కొద్దిగా సైతం పట్టించుకోని ఆనందరావు వైఫల్యం- రమణి పాలిటిప్పుడు దారు ణంగా ఉంది. జీవితంలో తొలిసారి నిగ్ర హించుకోలేకపోతోంది.

మరి పెళ్ళికాక పూర్వం చిన్నవయసులో ఆ ప్రాకృతిక పరవళ్ళనెలా సంబాళించుకో గలిగిందంటే- కుటుంబ నేపథ్యమూ, కట్టు బాట్లూ, సమాజ నియమాలూ ఆమెపై అంతటి ప్రభావం చూపగలిగాయి!

నైతిక నియమ పునాదులు అంతలో తుగా, మీరకూడనంత కట్టుదిట్టంగా, ఛేదిం చలేనంత శక్తివంతంగా పూర్వులు నిర్మిం చారంటే మానవ జీవితాల్లో ఒడిదుడుకు లుండరాదని వారెంత తపించారో అర్థమౌ తుంది.

వయోభేదం లేకుండా మానవులందరూ ఇష్టంగా పాటించవలసిన నియమాలు నిర్ణీత వయసులోని యువతీయువకులకు మాత్రమే వర్తిస్తాయా? అందరినీ బంధి స్తాయా అన్న ప్రశ్నకు తావేలేదు. వాటిద గ్గర అందరూ సమానులే.

మరి అవి నిజంగా లక్ష్మణరేఖలే గను కైతే... కొద్దిమందైనప్పటికీ... వాటిని దాటిన దాఖలాలు లేకపోలేదు? మరలాటి వారిలో అన్ని వయసులవారూ ఉన్నారే అన్నదానికి- ధాన్యం తూర్పార బట్టేట ప్పుడు... ఒకటో రెండో గట్టిగింజలు కూడా కొట్టుకుపోతాయనేది సమాధానం.

పురుషుల వ్యసనాలు- జీవిత సహచ రుల ఉత్సాహ భంగాన్నీ, అసంతృప్తులనీ గ్రహించలేనంత గుడ్డివా? కుటుంబ బంధాలనూ, దశాబ్దాల సాహచర్యాన్నీ, తోసిరాజనేంత బలిష్ఠమైనవా? సామాజిక శృంఖలాలను ఖండింప జేయగలిగేంత తీక్షణమైనవా? ఏ ఆలంబనతోటి కొద్ది మంది మగవాళ్ళు శాసనాలను అనేకసార్లు ధిక్కరిస్తున్నారు? గడ్డిపరకకన్నా చులక నగా తీసేస్తున్నారు? వారి ధీరత్వమంతా



మగవారవ్వటమేనా? ఆనందరావు కూడా ఆ కోవలోనివాడేనా?

కానేకాదు... అతనామెకు భర్త మాత్రమేకాదు గురువు కూడాను. అది వ్యసనంలోని తాత్కాలిక ఆకర్షణ మాత్రమేననుకోవాలి.

రమణికి కళ్ళు పొడిబారి మూతలుపడలేదు. తమ పెళ్ళయిన కొత్తరోజులు గుర్తుకు రాసాగాయి.

★ ★ ★

పెద్దపెట్టున సిగ్గును ప్రదర్శించినా, అభినయించినా ఫరవాలేదుగానీ, చిరుసిగ్గుని సైతం అనుభూతించరాదని నేర్పించాడు. మగవాడు పడగ్గదిలో పెచ్చురిల్లిపోవటానికి కావలసినంత నగ్నత్వాన్ని చూపించటానికి వెరువకూడదనీ, కావలసినప్పుడో.. ఏకాంతంలోనో.. కాస్త విచ్చలవిడితనం అవసరమనీ, అది మగవాడికి అపారానందాన్నిస్తుందనీ అహాన్ని ఉపశమింపజేస్తుందనీ... ఆత్మకు సంతృప్తిని కలుగజేస్తుందనీ, దానితో మగవాడు సుఖాన్ని ఇబ్బడిముబ్బడిగా ఎదురిస్తాడనీ నేర్పించి నిరూపించాడు.

శృంగారానందాన్ని దోసిళ్ళతో తాగాలంటే బిడియాన్ని సడలించుకోవటమో, ఇంకావీలైతే వదిలించుకోవటమో చేయా

లనీ, అప్పుడే తాను భర్తలోని సంపూర్ణ పురుషత్వాన్ని వెలికితీయగలననీ, మరలా మరలా ఆవిష్కరించగలననీ సంవత్సరాలు గడచిన అనుభవం మీద తానే తెలుసుకొని ఆచరణలో పెట్టింది.

ఉన్న ఒక్క కూతురూ హాస్టల్లో వుండి చదువుతుండటంతో కొంతకాలంగా ఆమె తాను తల్లిననే విషయం మరచిపోయింది. భర్త చర్యలు కూడా ఈమె భార్య అనుకోవటాన్ని మరచిపోయేట్లుచేశాయి. కొంతకాలంగా తనలో తాను గృహిణిని మాత్రమే అనుకుంటోంది. ఇప్పుడు ఆకస్మాత్తుగా తనలో కోరిక పెరిగి తాను గృహిణి మాత్రమేకాక ఒక స్త్రీననే ఎరక కలిగింది.

లోపల ఖాళీలేనంతగా వత్తిడి పెరిగిపోయి ఆవిరి కుక్కరులాగావుంది రమణి స్థితి. కాల్షియం ఇంజక్షను చేసినట్లుగా శరీరంలోపలినుండి ముఖ్యంగా చెవుల వెనుక నుండి ఆవిర్లు వస్తున్నాయి.

ఆలోచనలలో నుండి బయటపడి... గదిలో ఊపిరాడనట్లుగా వుండడంతో పెరటి తలుపు తీసుకొని బయటకొచ్చింది.

పక్కవాటా కిటికీనుండి సన్నగా వెలుతురు రావటం అనుకోకుండా కంటపడింది. అప్రయత్నంగా అటు నడిచింది. ఆ సమయంలో ఆమె మనసులోని ఒక అత్యంత అల్పభాగం సభ్యప్రపంచపు మహిళది కాదు. గుహావాసాలలో ఉంటున్న పురాతన మానవుల ఏ కట్టుబాటూ లేని నాటిది. ఆ భాగం అప్పటివరకూ నిద్రాణంగా ఉండి ఆ క్షణంలో తల బైటకు పెట్టింది.

రెండుమూడు వెంట్రుకల మందమున్న చీలికలో నుంచి లోపలి దృశ్యాన్ని చూడసాగింది. చలికాలమైనా ఒంటికి చిరుచెమట్లు పోయసాగాయి.

కొన్ని కొన్ని ఆలోచనలకూ, జ్ఞాపకమొచ్చే విషయానికీ పొంతన ఉండదు. తర్కానికి కూడా అందరు. ఒక్కో దృశ్యం ఎందుకు గుర్తొస్తుందో ఒకపట్టాన చెప్పలేము. పున్నమిరాత్రీ... పూవులరాత్రి... అనేపాట గుర్తుకొచ్చింది.

పక్కవాటాలో కొత్తగా కాపురానికొచ్చిన జంట తమకు మాత్రమే ఆ రేయివుంది అనుకుంటున్నవారిలా స్వేచ్ఛగా తమ పనిలో తామున్నారు. ట్యూబులైటు విద్యుత్‌ను ఖర్చు చేయటమనే విద్యుక్త ధర్మాన్ని పాటిస్తోంది.

ఆటంకాలూ, అడ్డుకట్టలూ లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో శృంగార రాజ్యాన్ని ఏలుతున్న వారిద్దరూ అనంగుని అర్చిస్తున్న భక్తులలాగా వున్నారు. తమ కార్యక్రమ నిర్వహణలో నిమగ్నమైన జంట... ఏకాగ్రత సాధించిన సాధుకులలాగా ప్రపం

చంతో పనిలేనివారిలాగా ఒకరివంక ఒకరు చూసుకుంటున్నారు. యవ్వనం వారి శరీరాలలో విజయవిహారం సాగిస్తోంది.

దృశ్యాన్ని చూస్తున్న రమణి మనసు పడే ఉద్వేగానికీ, ఆవేశానికీ తగినట్లు రక్తాన్ని వడివడిగా సరఫరా చేయాల్సిరావటంతో పిడికెడంత గుండె తాను పనిచేసే వేగాన్ని పెంచవలసి వచ్చింది.

★ ★ ★

పక్కవాటాలో అద్దెకుంటున్న కొత్తజంటలో మగవాడికి పగలు పన్నెండు గంటల దగ్గర నుండీ పనిచేసే పార్టుటైము లెక్చరరుగా ఉద్యోగం. ఆ అమ్మాయి ఏదో కాన్వెంటులో పనిచేస్తోంది. తొమ్మిదిగంటలకొచ్చే కాన్వెంటు వ్యానులో వెళ్ళింది.

రాత్రి తాలూకు హేంగోవరు తగ్గని కారణంగా రోజూకంటే ఆలస్యంగా ఆఫీసుకెళ్లాడు రమణి భర్త.

రాత్రి గడిచి పగటికొచ్చినా... నిర్వేదంలోనే వున్న రమణి నిత్యకృత్యాలు మందకొడిగా చేస్తోంది.

ఆలస్యంగా పగటికొచ్చినా డ్యూటీ పన్నెండు గంటలకు కావటంతో తీరికగా పేపరు చూస్తున్న లెక్చరరును చూడగానే...

"ఏమండీ... మీ ఇంట్లో టీవీ వస్తోందా?" అంటూ అడిగింది... మంచి ఉపమానం తట్టగానే.. సందర్భశుద్ధి లేకపోయినా.. వెంటనే ఉపయోగించాలని ఉబలాటపడే ఔత్సాహిక రచయితలాగా.

రాత్రి అనుభవాన్ని నెమరు వేసుకుంటున్నాడో, పేపరులో లీనమయ్యాడో గానీ అతనీమాటలు వినిపించుకోలేదు.

"ఏమండోయ్... వింటున్నారా మీ టీవీ వస్తోందా అనడుగుతున్నాను?" ఆ ఏమండోయ్ అనటంలో 'ఏమండోయ్ శ్రీవారూ ఒకచిన్నమాట' అనే పాటలాగా ఒక చిత్రమైన గొంతుతోటి సాగతీతగా అడిగింది అప్పుడు వినిపించుకున్న అతడు-

"ఆ... ఆ... వస్తోందండీ... వస్తోందే" అన్నాడు త్వరత్వరగా, అంటూనే లేచి నిలబడి ఆమె వంకచూశాడు.

అతను తనవంక చూడగానే రెప్పలు టపటప లాడిస్తూ ముఖాన్ని పెడమరలుగా ఓ పది డిగ్రీలు పక్కకు పెట్టింది. అంతకు మునుపెన్నడూ ఆ రకమైన చూపును సాధన చేయకపోయినా ఇప్పుడు అతిలాఘవంగానూ, సవ్యంగానూ చెయ్యగలిగిందంటే ప్రకృతి పుట్టుకతోనే కొన్నిటిని నేర్పి పంపుతుంది కాబోలు. ఆ భంగిమలో ఆమెను చూసిన తెలుగు లెక్చరరు

ఆరోజు తారకూడా చంద్రుణ్ణి అచ్చంగా ఇలాగే చూసివుంటుందను కున్నాడు!

"మాది రావటంలేదే, ఒకసారి ఇటొచ్చి చూస్తారా" పది పన్నెండు సంవత్సరాల వయసు దాటిన వారు అలా ముద్దుగొంతు తోనూ, గోముగానూ మాట్లాడాలంటే ప్రయత్న పూర్వకంగా మాత్రమే సాధ్యం.

"ఇలారండి... ఇలారండి... కాస్త తల వంచండి... మీరసలే పొడవుగా ఉంటారు? " అంది శ్రావ్యమైన సంగీతపు మైకంలోపడి అసభ్య సాహిత్యాన్ని పట్టిం చుకోని శ్రోతలాగ. సాలోచనగా నవ్వుతూ కర్టెను తప్పించి తమవాటాలోకి దారి చూపించింది. అతను లోపలకు రాగానే మళ్ళా కర్టెను దగ్గరకు వేసింది.

అతను ముందు కర్టెను వైపూ... తరు వాత టీవీ వైపూ... చిట్టచివరగా ఆమెవైపు చూసాడు.

టూరింగు టాకీసులోని సినిమా మధ్యలో రెండురీళ్ళు మిస్సైన తరువాతి కథలోలాగా... వారిద్దరూ ఎదురు బొదు రుగా దాదాపు ఒక గజం దూరంలో నిల బడి వున్నారు.

'మేలుకో శ్రీరంగా మేలుకోవయ్యా.. మేలుకొని..' అంటూ ఫోను పిలిచింది. గొంతు తియ్యగా వున్నా ఖంగుమన్నట్లే అనిపించింది.

అర్ధరాత్రి ఇంట్లోకి దొంగ వచ్చిన అలికి డికి దిగ్గున మెలకువ వచ్చిన ఇంటి ఇల్లాలి లాగా ఫోనందుకుంది రమణి. పెళ్ళిరో జెలా గడిచిందోనని అడగటానికి హాస్టలు నుండి వాళ్ళమ్మాయి చేసిన ఫోనది.

ఫోనులో మాట్లాడుతున్న మొదటి నిముషంలోనే ఆమెలోని మాతృత్వమూ, వివేకమూ జమిలిగా మోసులెత్తాయి. మరు నిముషానికి మారాకులేపాయి. మూడో నిముషానికి మానులుగా మారాయి.

కూతురుతో మాట్లాట్టం అయిపోగానే రమణి ముఖం పత్యం మెతుకులుతిన్న పేషెంటులా మారింది.

"కేబులు వదులయ్యిందండీ... మరేం కాదు... ఇప్పుడు చూడండంటూ" అతను టీవీ పెట్టాడు.

'పెళ్ళంటే నూరేళ్లపంట అది పండాలి' అంటూ టీవీలో పాటవినపడసాగింది... మరోక్షణం తరువాత కనపడసాగింది.

"చాలా థ్యాంక్సండీ మేస్టారూ" అంది పాలిపోయిన ముఖంతో తలదించుకొన్న రమణి.

మనసూ శరీరమూ తెప్పరిల్లిన తరు వాత... స్థిమితంగా తేరిపార జూసుకొంటే అనర్థం జరగబోయిన క్షణం భూతకాలం లోకి జారిపోయి చాలాసేపయ్యిందని గ్రహించింది రమణి.

ముందుగా ఆ మాత్రపు సంభాషణ సైతం జరిపి ఉండాల్సింది కాదనుకొని మరోక్షణం తరువాత... అసలు పలకరిం చాల్సిందే కాదనుకుంది, ముప్ఫైనలభై ఎత్తుల ముందుచూపు కాదు గదా మూడు నాలుగు ఎత్తుల ఫలితాలు ఊహించలేని చదరంగపు క్రీడాకారిణిలా ప్రవర్తించానా? అనికూడా అనుకుంది.

కాదుకాదు చదవటం అయిపోయిన తరువాత సాక్షాత్తూ తన సంపాదకత్వపు దినపత్రికలనైనా తూకానికే వేస్తారని తెలి సిన సంపాదకుడిలా వ్యవహరించాను.. నన్ను నేను కాపాడుకున్నాను.

భగవంతుడు ఏకకాలంలో సర్వాకా రుడూ, నిరాకారుడూనూ అని పెద్దలం టూంటారు. ఇప్పుడు ఫోనురూపంలోనూ, టీవీ రూపంలోనూ నన్ను కాపాడింది కూడా భగవంతుడే అని అనుకుంది.

రకరకాలుగా ఆలోచనల రాపిడికి రమణి బుర్ర పదును బారుతోంది.

తరువాత్తరువాత ఆనందరావు రాత్రి పదిగంటలలోపు రావటం లేదు. రమణి వాళ్ళ టీవీ మరెప్పుడూ చెడలేదు! Ⓥ



యహూది కథ

ప్రేమపరీక్ష

- సులమత్ ఇశ్-కిశోర్

ఆరు గంటలకు ఇంకా ఆరు నిముషాలున్నాయి అని గ్రాండ్ సెంట్రల్ స్టేషన్ విచారణ కేంద్రం పైనున్న గడియారం చూపిస్తోంది. అప్పుడే స్టేషన్‌కు వచ్చిన లెఫ్టినెంట్ సూర్యుని తాపానికి తన ముఖాన్ని ఎత్తి, కళ్ళను చిన్నగా చేసి సరైన సమయం ఎంత అని చూశాడు. కంగారుగా కొట్టుకుంటున్న తన హృదయ స్పందనను అదుపులో ఉంచడం సాధ్యం కాకపోవడాన్ని గమనించి అతడికే ఆశ్చర్యం వేసింది. మరో ఆరు నిముషాల్లో గత పదమూడు నెలల కాలంగా

తన జీవితంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన స్త్రీని అతడు చూడబోతున్నాడు. ముందెన్నడూ చూడని, ఎవరి ఉత్తరాలు అయితే అతడి మనసులో నిలిచిపోయి అతడ్ని కాపాడాయో ఆ స్త్రీని అతను చూడబోతున్నాడు.

అతను విచారణ కేంద్రానికి వీలైనంత దగ్గర్లో, గుమాస్తా ముందు గుమికూడుతున్న ప్రయాణికుల గుంపుకు ఆవల నుంచున్నాడు. లెఫ్టినెంట్ బ్రాండ్ ఫర్డ్‌కు ఒకానొక ప్రత్యేక రాత్రి గుర్తొచ్చింది.

ఆ సమయంలో అతడి విమానం శత్రు విమానాల చక్రవ్యూహంలో చిక్కుకుంది. శత్రు వైమానిక దళాల అట్టహాసపు ముఖాలు అతడికి కనిపిస్తున్నాయి. కొంత కాలం క్రితం ఆమెకు రాసిన ఒక ఉత్తరంలో అతను తనకు అప్పుడప్పుడు భయం కలుగుతుంది అని రాశాడు. ఈ యుద్ధం జరగటానికి కొన్ని రోజుల ముందు ఆమె సమాధానం ఇచ్చింది. అందులో "భయం కలగటం సహజం... చాలా మంది ధైర్యవంతులకూ భయం వేస్తుంటుంది. డేవిడ్ ప్రభువుకు భయం లేదా? అందుకే ఆయన 23వ స్తోత్రాన్ని రాశారు. మరొకసారి నీకు భయమేసినపుడు ఈ మంత్రోచ్చారణ వినాలి. "అవును, నేను మృత్యునీడలున్న లోయలో నడుస్తున్నప్పటికీ, నాకు చెడు కలగదు. ఎందుకంటే నీవు నాకు తోడుగా ఉన్నావు" అతడికి ఆ క్షణంలో ఆ వాక్యాలు గుర్తుకొచ్చాయి. అతను ఆ మాటలు పలుకుతున్న ఆమె కాల్పానిక కంఠస్వరాన్ని విన్నాడు.

అనువాదం :
రంగనాథ రామచంద్రరావు

మరుక్షణం అతడిలోని శక్తియుక్తులు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి.

ఇప్పుడు అతను ప్రత్యక్షంగా ఆమె కంఠస్వరాన్ని వినబోతున్నాడు.

ఆరు గంటలకు ఇంకా నాలుగు నిముషాలున్నాయి.

అతడి హృదయం ఉద్వేగంతో నిండిపోయింది.

అత్యంత కాంతివంతమైన నక్షత్రాల వంటి విద్యుద్దీపాలున్న కప్పు కింద జనం వేగంగా నడుస్తున్నారు. అది బూడిద రంగు వల. లోపల రంగుల దారాలను నేస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక అమ్మాయి అతడి సమీపం నుంచి సాగిపోయినపుడు లెఫ్టినెంట్ బ్రాండ్ ఫర్డ్ కంగారుపడ్డాడు. ఆమె సూట్ మీద ఎర్రగులాబీ పువ్వును అలంకరించుకుంది. అయితే అది వాళ్ళు నిర్ణయించుకుంటున్నట్టు ఎర్రగులాబీ కాక లేత ఎరుపు రంగుతో ఉన్న మరొక పుష్పం. అంతేకాకుండా ఆ అమ్మాయి చాలా చిన్నది. సుమారు పద్దెనిమిదేళ్ళుంటాయి. అయితే హోలిన్ మేనెల్ తనకు ముప్ఫయి ఏళ్ళని చెప్పింది. "సరే, ఇప్పుడేమైంది? నాకు ముప్ఫయి రెండేళ్ళు" అని అతను సమాధానం ఇచ్చాడు. వాస్తవానికి అతడికి ఇరవై తొమ్మిదేళ్ళే.

అతడి మనస్సు మళ్ళీ ఆ పుస్తకం వైపు మళ్ళింది. "ఫ్లోరిడా ట్రైనింగ్ క్యాంపుకు పంపిన వందలాది లైబ్రరీ పుస్తకాలలో దేవుడే తీసి తన చేతికి ఇచ్చినట్టు ఆ పుస్తకం అతడి చేతికి వచ్చింది. అది "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" అనే నవల. ఆ పుస్తకం నిండా ఓ స్త్రీ చేతిరాతతో కూడిన అభిప్రాయాలున్నాయి. అలా పుస్తకాల్లో అభిప్రాయాలను రాయటాన్ని అతను ద్వేషిస్తాడు. అయితే ఈ అభిప్రాయాలు, విశ్లేషణలు భిన్నంగా కనిపించాయి. ఒక స్త్రీ ఒక మగవాడి హృదయాన్ని ఇంత మృదువుగా, ఇంతగా లోతుగా అర్థం చేసుకోగలదని అతను ఎన్నడూ ఊహించలేదు.

ఆమె పేరు పుస్తకంలోని బుక్‌ప్లేటులో ఉంది. ఆమె పేరు హోలిన్ మేనెల్. అతను న్యూయార్క్ టెలిఫోన్ డైరెక్టరీని తీసి ఆమె చిరునామాను వెదికాడు. చిరునామా దొరికిన వెంటనే ఆమెకు ఉత్తరం రాశాడు. ఉద్యోగరీత్యా మరుసటి రోజే అతడు ఓడ ఎక్కి బయలుదేరాల్సి వచ్చింది. అయినా అటు తరువాత వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగాయి.

పదమూడు నెలలు ఆమె క్రమం తప్పకుండా అతడికి సమాధానాలు రాసింది.

జవాబివ్వటం కన్నా ఇంకా ఎక్కువే చేసింది. అతడి నుంచి ఉత్తరాలు రాకపోయినప్పటికీ ఆమె రాస్తుండేది.

కొంత కాలానికి అతడికి తాను ఆమెను ప్రేమిస్తున్నట్లు, ఆమె తనను ప్రేమిస్తున్నట్లు నమ్మకం ఏర్పడింది.

అది అర్థం కాగానే అతను ఫొటో పంపమని ఆమెను ఎంత వేడుకొన్నా ఆమె అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. అందుకు కారణమూ చెప్పింది. "నా పట్ల నీ అభిమానం వాస్తవమైతే, నిజాయితీతో కూడుకుని ఉంటే నేనెలా ఉన్నానన్నది ముఖ్యం కాదు, ఒకవేళ నేను అందమైనదానినైతే, నేను అందంగా ఉంటాననే కారణంగానే నీవు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నావనే భావన ఎల్లప్పుడూ నన్ను వేధిస్తూ ఉంటుంది. అలాంటి ప్రేమ నాకు జుగుప్స కలిగిస్తుంది. నేను చూడటానికి సాధారణంగా ఉంటే (చాలా వరకు, ఇదే వాస్తవం కావటానికి సాధ్యమని నువ్వు ఒప్పుకోవచ్చు) నువ్వు ఒంటరిగా ఉండి, మరెవరూ దొరకని కారణంగా నాకు ఉత్తరాలు రాస్తున్నావనే భయం నన్ను ఎప్పుడూ పీడిస్తుంది. అందువల్ల నా ఫొటో అడగకు. నువ్వు న్యూయార్క్‌కు వచ్చినపుడు నన్ను చూడవచ్చు. అటు తరువాత నిర్ణయించుకోవచ్చు. 'మనకు ఎలా అనిపిస్తుందో అలాగే నడుచుకోవటానికి మనమిద్దరం స్వతంత్రులం' ఈ విషయాన్ని గుర్తుంచుకో..."

ఆరు గంటలకు ఒక్క నిముషం...

అతను సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ములాగాడు.

అదే సమయంలో ఓ యువతి అతని కంట పడింది.

లెఫ్టినెంట్ బ్రాండ్ ఫర్డ్ హృదయం అతడు నడిపే విమానం కూడా ఎగరనంత ఎత్తుకు ఎగిరింది.

ఆ యువతి అతడి వైపే వస్తోంది.

ఆమె స్లిమ్‌గా, పొడుగ్గా ఉంది.

ఆమె మృదువైన చెవుల మీదుగా బంగారు రంగు జుత్తు ఉంగరాలు ఉంగరాలుగా భుజాల మీద పరుచుకుని ఉంది.

ఆమె కళ్ళు జలపుష్పాల్లా నీలంగా ఉన్నాయి.

ఆమె పెదవుల్లోనూ, చుబుకంలోనూ ఒక మృదువైన దృఢత్వం ఉంది.

ఆమె లేత ఆకుపచ్చరంగు సూటులో వసంత రుతువే సజీవంగా వచ్చి ముందు నుంచున్నట్టుగా కనిపిస్తోంది.

అతను ఆమె వైపు కదిలాడు.

అయితే ఆమె ఎలాంటి గులాబీని పెట్టుకోలేదనే విషయం అతను సంపూర్ణంగా మరచిపోయాడు.

అతను తనవైపు కదలగానే ఆమె పెదవులపై అల్లరి నవ్వు మెరిసింది.

"నా కోసం వచ్చారా సోల్జర్? " మెల్లగా అడిగిందామె.

అతను తనకు తెలియకుండానే ఆమె వైపు అడుగువేశాడు.

సరిగ్గా అప్పుడే అతడికి హోలిస్ మేనెల్ కంటపడింది.

అమె సరిగ్గా ఆ లేత ఆకుపచ్చసూట్ వేసుకున్న అమ్మాయి వెనుకే నుంచొని ఉంది.

ఆమెకు నలభై ఏళ్ళు దాటాయి. ఆమె తెల్లబడుతున్న తన జుత్తును ఒక పాత హ్యాటులో దూర్చింది. ఆమె కాస్త లావుగానే ఉంది.

హైహీల్ షూలో ఆమె లావాటి మాంస ఖండాలతో కూడుకున్న పాదాలు కనిపిస్తూ ఉన్నాయి. ఆమె తన మడతలుపడ్డ కందువర్ణపు కోటు మీద గులాబీని అలంకరించుకుని ఉంది.

లేత ఆకుపచ్చరంగు సూట్ ధరించిన యువతి అతడ్ని దాటుకుని వేగంగా అక్కడి నుంచి కదిలిపోయింది.

బ్రాండ్ ఫర్డ్‌కు తాను నిలువునా చీలిపోయినట్టుగా అనిపించింది. లేత ఆకుపచ్చ సూట్ వేసుకున్న ఆ అమ్మాయిని అనుసరించాలనే కోరిక అతనిలో చాలా తీవ్రంగా కలిగింది. అయితే అతడిలో చైతన్యం ఉడిగిపోకుండా తన చైతన్యంతో కాపాడిన ఆ స్త్రీ పట్ల అతడి అభిమానం చాలా గాఢమైంది. సాక్షాత్తు ఆమె వచ్చి ఇప్పుడు ఎదురుగా నుంచుని ఉంది. ఆమె తెల్లటి, లావాటి ముఖంలో మాధుర్యమూ, వివేకమూ తొంగి చూస్తున్నాయి. ఆమె నవ్వులు చిందించే కళ్లలో కారుణ్యం తొణికిసలాడుతోంది.


లెఫ్టినెంట్ బ్రాండ్ ఫర్డ్ సంకోచించలేదు. అతడి వేళ్ళు "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" పుస్తకాన్ని గట్టిగా పట్టుకున్నాయి. ఆమె ఆ పుస్తకం ద్వారా అతడ్ని గుర్తించాల్సి ఉంది. ఇది ప్రేమ కాదు. అయితే అంతకు మించిన అమూల్యమైన అనుబంధం. ప్రేమ కన్నా అపూర్వమైనదేదో అయి ఉంటుంది. అతను రుణగ్రస్తుడు. సదా రుణగ్రస్తుడై ఉండాల్సిన స్నేహం వారి మధ్య ఉంది.

అతను తన వెడల్పయిన భుజాలను నిటారుగా చేసి ఒక సెల్యూట్ చేశాడు. చేతిలోని పుస్తకాన్ని ఆమె వైపు చాపాడు.

"నేను లెఫ్టినెంట్ బ్రాండ్ ఫర్డ్‌ను. మీరు... మీరు మిస్ మేనెల్ కదా? మిమ్మల్ని కలవటం చాలా సంతోషంగా ఉంది. నేను మిమ్మల్ని భోజనానికి తీసుకెళ్ళవచ్చా? " అని అభిమానంగా అడిగాడు.

ఆ స్త్రీ ముఖం నవ్వుతో వికసించింది.

"ఇదంతా ఏమిటో అర్థంకావటం లేదు బాబు. ఆ పచ్చ సూట్ ధరించిన యువతి ఇప్పుడే ఇక్కడి నుంచి వెళ్లిందే- ఆమె నా దగ్గరికి వచ్చి ఈ గులాబీని నా కోటుకు గుచ్చింది. ఒక వేళ నీవు నా దగ్గరికి వచ్చి నన్ను ఎక్కడికైనా డిన్నర్‌కు వెళదామని పిలిస్తే ఆమె ఈ రోడ్డుకు అవతల ఉన్న పెద్ద హోటల్లో నీకోసం ఎదురుచూస్తూ ఉంటానని చెప్పమంది. ఇది ఒక విధమైన పరీక్ష అని కూడా ఆమె నాకు చెప్పింది. నీలా నా ఇద్దరు పిల్లలూ అమెరికా సైన్యంలో ఉన్నారు. ఆ కారణంగా ఆమెకు సహాయం చేయటంలో తప్పేముందని అంగీకరించాను" అందామె నవ్వుతూ.



నల్లటి మేఘసమూహాలు ఆకాశమంతటా వ్యాపించాయి. మౌనపోరాటం సలుపుతోంది సరయూ నది... పోగైన నీలి మేఘాలు సూర్యభగవానుణ్ని పూర్తిగా మూసేసాయి. అందుకే పగటి సమయంలో కూడా చిరుచీకట్లు అలుము కున్నాయి.

సూదులు గుచ్చుతున్నట్లుగా అతని ఆచ్ఛాదనలేని శరీరం మీదపడే వానచినుకులను లక్ష్యపెట్టకుండా నదీతీరంలో కూర్చుని వున్నాడు. అతని పేరు గుణాలుడు. పేరుకు తగ్గట్టు అతికొద్దిమంది వుండే ఆ దేశంలో సార్థకనామధేయుడు ఎవరయ్యా అన్న ప్రశ్నకు అందరు చెప్పే



సమాధానం గుణాలుడే...! కానీ అదే అతనికి విరోధిగా మారింది.

నదీతీరానికి అటుపక్కనున్న పూదోటలోని పూలు వికసించి వాటి పరిమళం చుట్టుపక్కల పరిసరాల్లో వ్యాపించింది...

అరసచెట్లలోంచి ముగ్గురు యువతులు చంకలలో బిందెలు పట్టుకురావడం చూశాడతను. ఇప్పుడు వాన కాస్త వెలిసింది. ఆకాశంలోని మేఘసమూహాలు దేన్నో పట్టుకోవాలన్నంత వేగంగా పరుగులుతీస్తున్నాయి. గాలికి అరస చెట్ల ఆకులు గలగలమని చప్పుడు చేస్తున్నాయి. ఆచ్ఛాదన లేని అతని శరీరాన్ని గాలి తాకుతూ వెళుతోంది.

ముఖ్యపట్టణమైన పాటలీపుత్రానికి మధ్యలో వున్న సుగన్‌కేయూ (బంగారు రాజప్రాసాదం)లో చక్రవర్తి రోగ పీడితుడై మంచం పట్టాడన్న సంగతి గుర్తుకొచ్చి అతన్ని బాధించింది.

అనువాదం : అరిపిరాల సువర్ణ

ప్రేమించడం మాత్రమే ముఖ్యం అనుకున్న చక్రవర్తి వుండే ఆ రాజాంతఃపురంలో పేరాశ, స్వార్థమే ముఖ్యం అనుకునే నీచులు కూడా నివసిస్తున్నారు.

వసంతరుతువులో వేడుకగా జరిగే వసంతోత్సవంలో పాల్గొనమని మహారాజు తనని శ్రావస్థీ నగరానికి పంపించటం మంచిదైంది అనుకున్నాడతను.

సరయూ నదికి అటుపక్కనున్న అయోధ్యానగరంలోని దీపాలు సరయూ నదిలో ప్రతిఫలించి మెరుస్తున్నాయి.

అంతఃపుర సేవకుడు పురందరుడు వచ్చి అతనికి నమస్కారం చేసి "రాకుమారా తమర్ని మహారాణీ దిష్యరక్షితాదేవి (అశోక చక్రవర్తి మూడో భార్య) పిలుస్తున్నారు. తమరాక కోసం వేచివున్నారక్కడ. వెంటనే వెంటపెట్టుకురమ్మని ఆజ్ఞాపించారు నన్ను..." అని విన్నవించాడు సంకోచపడుతూ...!

పాటలీపుత్రంలో నన్ను బాధించింది చాలదనా మళ్లీ ఇక్కడికీ దాపురించింది నా పాలిట... అని మనసులో అనుకుని సేవకునితో వెళ్లాడు గుణాలుడు.

"తల్లిగార్కి నమస్కారం...!" అతని స్వరంలో భక్తిమర్యాదలు ధ్వనించాయి.

"గుణాలా నేనెన్నిసార్లు నీకు చెప్పాను నన్నలా పిలవద్దని... నన్ను తల్లిగా భావించవద్దన్నాను...!"

"వరస అదేగా తల్లీ...? !"

"వరసేమిటి? మహా పెద్ద వరస... అది నాపాలిట మహాశత్రువు...! నిండు యవ్వనంలో మహా అందంగా మెరిసిపోతున్నాము ఇద్దరమూ... నా అందం, యవ్వనం రెండూ అడవిగాచిన వెన్నెలైపోయాయి. చక్రవర్తి నాకేవిధమైన సుఖమివ్వలేదు... నా ఆకాంక్షలను నువ్వే తీర్చాలి గుణాలా...! పాటలీపుత్ర అంతఃపురంలో చక్రవర్తి ముఖ్యమంత్రి రామగుప్తుడు, గురువు ఉపగుప్తుడు ఎల్లప్పుడూ నామీద ఓ కన్నేసి వుంచుతారు... అందుకనే వారెవరికీ తెలీకుండా వారి కళ్లుగప్పి ఇక్కడకొచ్చాను... వసంతరుతువు ప్రజలకు మాత్రమే కాదు. మనకు కూడా... అదిగో ఆ నల్లటి కారుమేఘాలను చూసి నెమళ్లు ఆనంద పరవశంతో పురివిప్పి ఎంత అందంగా నర్తిస్తున్నాయో చూడు.... ఆనందంతో గంతులేసే లేళ్ల సమూహాలను చూడు...! అదిగో బంగారు కాంతులీనుతూ ఉదయిస్తున్న చంద్రుడ్ని చూడు...! ప్రకృతిని ఇంత శోభాయమానంగా, ఇంత ఆకర్షణీయంగా భగవంతుడెందుకు సృష్టించాడు? ఆ అందమైన ప్రకృతిని మనలాంటి యవ్వన వంతులు అనుభవించి తరించడానికే! రా రాకు

మారా... వచ్చి నన్ను ఆలింగనం చేసుకో...! నీ బిగికౌగిలిలో నన్ను బంధించు యువరాజా!"

దిష్యరక్షితా గుణాలుని వైపు మత్తుగా చూస్తూ రెండు చేతులూ చాచి ఆలింగనం చేసుకోవాలని వస్తున్నది. ఆమె కామ వాంఛతో తనను సమీపిస్తున్నదని గ్రహించిన గుణాలుడు ఆమె చేతులకందకుండా తప్పించుకున్నాడు.

"ఛీ.. ఛీ... నువ్వు ఒక స్త్రీవేనా...? స్త్రీ సహజమైన మానం, మర్యాద, సిగ్గు, లజ్జ, పవిత్రత అనే సద్గుణాలు నిన్ను వదిలేసి వెళ్లిపోయినట్లున్నాయి. అందుకే ఇంత నీచానికి ఒడిగట్టావు... ఇకపైన స్త్రీనని చెప్పుకోకు. అది స్త్రీజాతికే అవమానం...!" అని కర్ణకఠోరమైన పదప్రయోగం చేశాడు గుణాలుడు.

"ఒరేయ్ మూర్ఖుడా! నా కోరిక తీర్చక పోగా నన్నే అనరాని మాటలని అవమానిస్తావా...? నా కోపాగ్నికి నువ్వు బలైపోతావు చూడు..." అంటూ కోపాగ్నిలో దహించుకుపోతూ వణికే పెదవులతో నిప్పుకణాలు వంటి మాటలు అతని మీదికి విసిరింది దిష్యరక్షిత.

కొన్ని నెలల తరువాత ఒకరోజు...

పాటలీపుత్ర రాజాంతఃపుర శయనమందిరంలో అశోక చక్రవర్తి నిద్రిస్తున్నాడు.

గంగానది మీదినుంచి వీచే చల్లటిగాలి హాయి గొలుపుతున్నది... ఆ గాలితోపాటు వినిపించే పాట చక్రవర్తి చెవులకు వినపడి మెలకువ వచ్చింది. కళ్లు తెరిచారు.

"హూ... ఎవరక్కడ...?" చక్రవర్తి సింహగర్జనలాంటి పిలుపు బయట కాపలాకాస్తున్న కాపలాదారుని లోపలకొచ్చేట్లు చేసింది... చక్రవర్తికి నమస్కరించాడా సేవకుడు.

"కింద మన గుణాలుడి పాట ఎవరో పాడడం వినిపించింది... వారెవరైనా నా సమక్షానికి తీసుకురా.." ఆజ్ఞాపించాడు...

చక్రవర్తి ఆజ్ఞను రెప్పపాటు కాలంలో నెరవేర్చాడు సేవకుడు. కళ్లను పోగొట్టుకుని వీణను వాయించుకుంటూ వెడుతున్న గుణాలుడు, అతని భార్య కాంచనమాల చక్రవర్తి ముందున్నారు.

"ఆ... ఇదేమిటి... ఎంతటి క్రూరం... నేను నా ప్రాణంతో సమానంగా చూసుకున్న నా ధర్మపత్ని పద్మావతి కొడుకా కళ్లను పోగొట్టుకుని నా ముందున్నది...?" అశోక చక్రవర్తి కన్నీరు ఏరులై పారింది.

తక్షశిలలో జరిగే అంతఃకలహాలు సమసిపోవడానికి గుణాలుని పంపించాడు. అక్కడ మహారాణి దిష్యరక్షిత ఆజ్ఞప్రకారం తలారులు అతన్ని చంపకుండా కళ్లను మాత్రం తియ్యడం లాంటి విషయాలన్నీ కాంచనమాల అశోకునికి వివరించింది.

అది విన్న చక్రవర్తి కోపోద్దీపితుడయ్యాడు... అతని కళ్లనుంచి విస్ఫులింగాలు విస్ఫోటనం చెందాయి.

"ప్రధానమంత్రి గారూ దిష్యరక్షిత ఎక్కడున్నా వెతికి పట్టుకుని శిరచ్ఛేదం గావించండి" అని ఆజ్ఞాపించాడు చక్రవర్తి.

"గుణాలా... నా ప్రియపుత్రా! నువ్వే నా తదనంతరం ఈ రాజ్యం పరిపాలించాలి... ఈ సింహాసనం అధిష్ఠించి రాజ్యపాలన చేసే నా వారసుడివి!... రాజ్యం పరిపాలించేందుకు సంప్రీతి నీకు సహాయపడతాడు. కళింగదేశం మీదికి దండెత్తి యుద్ధంచేసి ఎంతోమంది అమాయకులను చంపాను... జరిగే నాశనాలన్నింటికీ నా ఆశ.. అత్యాశగా మారడమే కారణం అని బుద్ధ భగవానుడు చెప్పాడు. అందుకే ఆశను నాశనం చెయ్యమన్నాడు..."

"బుద్ధం శరణం గచ్ఛామి సంఘం శరణం గచ్ఛామి" అన్న అశోకచక్రవర్తి నినాదం ఆ రాజాంతఃపుర గోడల్లో ప్రతిధ్వనించి అక్కడున్న వారికే కాదు, ప్రపంచానికంతటికీ వినిపించింది. V



- కాండూరి వెంకట సన్యాసిరావ్

అలిగితివా ప్రియా!

తెలుగు కథ

ఆలికి చీరకొనడం ఊరికి ఉపకారమన్నట్టు అంతెత్తున లేచాడేంటి శ్రీరామ్? కొద్దో గొప్పో సంపాదించుకుంటున్నా ఈ అభద్రత నాకెలా వచ్చింది? కొత్త చీరలు, నగలు స్త్రీల జీవితాలతో ముడిపడి ఉన్నవే కదా. నేనొక్కర్తినే ఎగబడుతున్నట్టు అంత చిర్రెత్తుకొచ్చిందెందుకో? అలకలు తీరి సంసారం చక్కబడుతున్న సమయంలో పండగ ఒకటి రావటం, కొత్తబట్టలు సమస్య అయి కూర్చోవడం. ఇలా ఎన్నాళ్ళు?

మైథిలి అన్యమనస్కంగా టిఫిన్ కానిచ్చి బెడ్‌రూంలో కొచ్చింది. ఎదురుగా నీట్‌గా చీరలు సర్ది ఉన్న బీరువా. మైథిలి చీరలన్నిటినీ ఆప్యాయంగా తాకింది. ఆరోజు కట్టుకోవలసిన చీరని అపురూపంగా ఎంచుకుంది. ఇన్ని చీరలున్నా కొత్తవి కావాలనడం అవివేకం అంటాడు శ్రీరామ్. పండగకి కొత్త చీర వద్దా? నైటీలోంచి చీరలోకి మారి అద్దంలో తనని తాను చూసుకుంది మైథిలి. పక్కన శ్రీరామ్ ఫొటో నవ్వుతూ కనబడింది.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన దగ్గర్నుంచి నా వెంటపడి గలగల చెప్పే కబుర్లు వినిపిస్తున్నట్టే ఉంది, మూతి ముడుచుకుని టిఫిన్ అయినా చెయ్యకుండా విసురుగా వెళ్ళిపోయాడు! దీని ప్రభావం కనీసం రెండురోజులు గ్యారంటీ. ఉలకడు, పలకడు! బుజ్జిబాబుని బతిమాలినట్టు బతిమాలుతూ చిలిపి చేష్టలెన్నో చేస్తే, ఏ కళనుంటాడో నవ్వేస్తాడు!

ఎప్పుడూ నేనే బుజ్జగించుకోవాలి! ఈ రోజు నేనూ పట్టుపడతాను. చూస్తాను! ఎన్నాళ్ళకి దారిలో కొస్తాడో? అనుకుంటూ కాలేజీకి బయలుదేరింది మైథిలి.

నా విద్యార్థులు నా పాఠాన్ని ఎంత శ్రద్ధగా వింటారో, మైథిలి మేడమ్ క్లాసంటే ఎవ్వరూ ఎగ్గొట్టరు! అలాంటి నన్ను, నా తెలుగు డిగ్రీని, నా లెక్చరర్ జాబ్‌ని ఏమీ కానట్టు తీసిపారేస్తాడు శ్రీరామ్. అయినా సహిస్తున్నాను. ఒక్క కొత్తచీర ప్రస్తావన వచ్చినప్పుడే కదా! అలా పూనకం ఎత్తిపోతాడని సర్దుకుంటున్నాను. ఏమిటిది? ఈ ఆలోచనలు ఆపాలి! ఎప్పుడూ ఉన్నతంతే!

దీని ప్రభావం బోధన మీద పడితే పాఠం తేలిపోతుంది. పిల్లలు చప్పగా ఫీలవుతారు! అనుకుంది మైథిలి.

"విద్యార్థినీ విద్యార్థులకు శుభోదయం" అంటూ క్లాస్‌లోకి వచ్చింది. మేడమ్ రాకను చూసి పిల్లలందరూ లేచి నిల్చుని మైథిలిని విష్ చేసారు. పిల్లల్ని కూర్చోమని చెప్పి పాఠం మొదలెట్టింది.

"పారిజాతాపహరణం- ఇది నంది తిమ్మన రచించిన ప్రసిద్ధ ప్రబంధం" అని చెప్పి, ముక్కు తిమ్మనగారి రచనా ప్రతిభని, కృష్ణదేవరాయల కళాపోషణని గురించి విద్యార్థులు ముగ్ధులయ్యేలా బోధించింది. ఈ ప్రబంధ రచనకు కారణం,



నిద్రావశమున తిరుమలదేవి కాలు రాయలవారికి తగిలింది. రాయలు కోపించి ఆమె అంతఃపురం వైపు వెళ్ళలేదు. రాణి గారి విచారకారణం తొలగించడానికే తిమ్మన పారిజాతాపహరణం రచించి అందులో సత్యభామ కృష్ణుడిని కాలితో తన్నడం ప్రవేశపెట్టాడు. కృష్ణదేవరాయలు ఈ ఘట్టాన్ని తిమ్మన నోటివెంట విని అలకమాని సౌమ్యుడయ్యాడు. తిరుమలదేవి వెంట అరణపు కవిగా వచ్చిన తిమ్మన తన విధ్యుక్తధర్మాన్ని చక్కగా నిర్వహించాడని చెప్పింది మైథిలి.

ఇంతలో బెల్ మోగింది. మైథిలి పాఠాన్ని అక్కడితో ఆపేసింది.

★ ★ ★

ఇంటికొచ్చిన మైథిలికి మనసు మనసులో లేదు. బలవంతాన మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తూ పనులు చేసుకుంది.

"నను భవదీయ దాసుని మనంబున.... అల్క మానవుకదా ఇకనైన అరాళకుంతల!" పద్యాన్ని చదువుకుంటూ వంట పూర్తి చేసింది. ఆమెకి మనసుతో పాటు శరీరం కూడా భారంగా అనిపించింది!

శ్రీరామ్ రాకకోసం ఎదురు చూడలేకపోయింది. వేడివేడిగా ఇంత తినేసి మంచం మీద నడుం వాల్చింది.

ఒడ్డూపొడుగూ, పచ్చని మేని ఛాయ, తేజోవంతమైన ముఖము, నడకలో ఠీవి. చూపుల్లో చురుకుదనం. పట్టు పీతాంబరాలు, బంగారు కిరీటం, నవరత్నఖచిత హారములు. అన్ని వేళ్ళకి అంగుళీయకములు, మహారాజులా ధగధగ మెరిసిపోతున్నాడు శ్రీరామ్.

చెయ్యబోయే ప్రతి చేష్టలో రసికత ఉట్టిపడి రాణిగార్ని కట్టి పడెయ్యగలనన్న భరోసానిండిన గుండెతో శయ్యాగృహమున ప్రవేశించాడు. రాజావారి రాకతో రాణివాసపు చెలికత్తెలు గదినుండి తొలగి మహారాణి మైథిలిని ఏకాంతంగా ఉంచారు.

మహారాణి మైథిలి మేలిముసుగు సవరించుకుంటూ మనసునిండా ఆనందం తాండవిస్తుండగా, అంతవరకు చెలులు చేసిన పరాచికాలు గుర్తొచ్చి సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కగా, రాజావారికి భయభక్తులతో, అనురక్తితో చిరునగవుని కనబడనీయకుండా దాచుకునే ప్రయత్నం చేస్తూ స్వాగతం పలుకుతున్నట్లు లేచి నిలబడింది.

ప్రియసఖిని తన చేతుల్లోకి తీసుకుని "అలిగితినని ఆగ్రహమా? " అన్నాడు మహారాజు.

పతి బాహుబంధాలలో కరిగిపోతూ "వేదన" అంది రాణి.

"వేదన తీరే మార్గం సెలవిచ్చిన అనుసరించెదము" అంటూ నుదుటిపై ముద్దిచ్చాడు.

"ఫాలభాగము చుంబించినంతనే పావు భాగము వేదన ఎగిరిపోయింది"

"అయినచో మిగిలిన మూడు భాగముల వేదన తొలగించుట సాధ్యమే"అంటూ రాణిని హంసతూలికా తల్పముపై పరుండబెట్టాడు మహారాజు.

"మహానుభావులకు సాధ్యము కానిదేమున్నది? "

"మానవమాత్రుణ్ణే కదా దేవీ"

"మహనీయులని నేను విశ్వసిస్తున్నాను"

"పొగడ్తలదేముందిలే" అంటూ నయనాల్ని పెదవులతో స్పృశించాడు.

"ఈ చుంబనంతో ఎంతభాగము వేదన తగ్గినది? " చిలిపిగా ప్రశ్నించాడు.

"నలుబది భాగము" కొంటెగా జవాబిచ్చింది రాణి.

"ఫాలము, నయనములు, తదుపరి నాసిక!" అన్నాడు.

"నాసిక కొరకకండి నాథా"

"ఆc! మరేమి చేయవలెనో సెలవీ

యండి దేవీ!" అంటూ ఆమె నాసిక కొనను తన నాసికతో కలిపి రాపిడి చేసాడు.

"పికముల ప్రేమవోలెనున్నది, బాగున్నది" అంది రాణి చిలిపిగా.

"అవును. నువ్వు కీరం, నేనేమో గోరువంక" అంటూ ముఖాన్ని కొంచెం కిందికి దించాడు.

"స్వామీ! ఏమిటిది? " అంటూ భర్త ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని తొలగించడానికి ప్రయత్నించింది.

"నాసికను నాసికతో కలిపిన బాగున్నదంటివని, అధరములకు అధరములు కలుపబూనితిని!"

"నా వేదన సంపూర్ణముగ మాయమైనది! చిలిపి చేష్టలు తగ్గించండి ప్రభూ"

"ముదితలు మాటలలో కడు సమర్థులు సుమా!"

"నేనేమంటిని? నా సామర్థ్యమేమి అగుపడినది? "

"సంపూర్ణముగా వేదన తీరిన, ఆపమన వలెగాని తగ్గించమనుటయందు అంతరార్థమేమి? "

"గొప్పవారికి అన్నింటా అంతరార్థములు గోచరించును" మత్తుగా చూస్తూ చెప్పింది.

"నేడు ఈ మందిరమున రెండు నిండు పున్నమి చంద్రుళ్ళను చూడవలెనని నా కోరిక"

"నాథా! ఇటుల బాధించుట మీకు ఉచితమా? "

"ఉచితమోకాదో ఎవరినడుగవలె, నీవు తప్ప వేరెవ్వరు లేరుకదా"

"నూతన వరునివలె ప్రవర్తించుచుంటిరి నరవరులు!" అంటూ రవికముడి దొరకనీకుండా వేళ్ళను అడ్డుంచింది మహారాణి.

"స్వామీ!"

"ఏమి? "

"నాభి అంచును మీ అధరములు స్పృశించుచుండ తమరి మీసము నాభిగహ్వరమున చొరబడి చక్కిలిగింతలిడుచున్నది"

"చక్కిలిగిలి శృంగార సౌధారోహణమునకు ఒకమెట్టే కదా!"

"ఆ గిలిగింతలకు తనువు పులకరించి రవికముడి విప్పదీయుట సాధ్యం కాదు"

"నీ సహకారముండిన అసాధ్యములన్నీ నాకు సుసాధ్యములే"

"ముద్దులు చాలునయా మురిపాల మగడా!"

"చొరవగ నీవు పలికిన పలుకులు నాకు మధురముగా తోచుచున్నవి"

"నా చొరవమాటకేమి? మీ చొరబాటు నన్ను దహిస్తున్నది"

"ఎడబాటే బాగున్నదేమో? "

"ఎడబాటు మిగుల దుఃఖింప జేసినది!



చౌరబాటు మిక్కిలి బాధించుచున్నది!"

"బాధను ఉపశమింపజేయు ఉపాయ మేదో చెప్పరాదూ? "

"నాకేమి తెలియును? సకల జనుల బాధలు తొలగించు మహరాజులు, ఓ మగువ బాధ తొలగింపలేరా? "

"అది తొలగించవలెనన్న ముందు కొన్ని తొలగించవలె!"

"సఖా! మీ సంభాషణాచాతుర్యము నన్ను నిలువనీయకున్నది!"

"ఎటు పరుగెత్తి పారిపోవుదువు? కౌముది లోనికా? "

"విడిచిపెట్టిన కదా, వెళ్ళేది!"

"ఇట్టులనే? " భార్యవైపు చూస్తూ అడిగాడు రాజు. రాణి కూడా తనను తాను చూసుకుని సిగ్గులమొగ్గయ్యింది!

"స్వామీ! నన్ను చంపకండి!"

"యుద్ధభూమి కాదు కదా! శయ్యాగృహమని ఎరుగనివాడినా ఏం? నీ మేని సోయగం మమ్ములను అంతగా మైమరపింపజేసినది నిజమే! అయిననూ కొంత విచక్షణ కలదు. మరికొద్ది సమయంలో అదీ పోవునేమో? "

"మీ పలుకులు, చేష్టలు నన్ను సిగ్గుతో చంపుతున్నవని- నా మాటల భావమని ఎరుగని పండితవర్యులా తమరు? "

"చంపుట నా అభిమతం కాదు, గెలుచుట మా అభీష్టము"

"ఏమి గెలిచెదరు? "

"హృదయేశ్వరి హృదయము"

"అది ఇదివరకే గెలిచితిరి"

"ఎంత గెలిచినా కాంక్ష తీరదు. మరొక్కమారు కొల్లగొట్ట నిశ్చయించితి"

"అతి పరాక్రమవంతులు అబలనిట్టుల ఆక్రమించుట తగునా? "

"ఆక్రమించుటయేనా? ఉపక్రమించి, అతిక్రమించరా? అని చెలిపలుకులకు భావము! మాకర్థమైనదిలే!"

"అన్ని అర్థములు మీ స్వంతముగ గ్రహించుదురు. అది కాదు ఇది అనిన ఆగ్రహించుదురు"

"ఆగ్రహమెక్కడిది? అంతరించెను కదా!"

"అనుగ్రహము కూడా విపరీతముగా నుండి మధురముగా బాధించుచున్నది"

"సామ్రాజ్ఞీ!"

"నాథా"

"నీవు నా ప్రతి చేష్టను అడ్డుకొన ప్రయత్నించుచుండ, నీ చేతి గాజులు లయబద్ధముగా కదిలి గలగల స్వనములు చేయుచున్నవి. అవి మా కర్ణములకు ఇంపుగ తోచుచున్నవి!" అన్నాడు మహరాజైన శ్రీరామ్.

నిజంగానే, గాజుల గలగలలకు మైథిలీకి మెలకువ వచ్చింది! చిన్నగా, సిగ్గుగా నవ్వుకుంటూ చూస్తే శ్రీరామ్ వెల్లకిలా పడుకొని ఆదమరచి నిద్రిస్తున్నాడు.

"ఎప్పుడొచ్చి పడుకున్నాడో మా అలకల స్పెషలిస్టు! ఇంకా కోపం తగ్గి ఊరుకున్నాడో? నేను నిద్రపోతున్నానని నిద్రాభంగము చెయ్యడమెందుకని ఊరుకున్నాడో తెలిసేదెలా? " అనుకుంది మైథిలి.

మైథిలికి తిరుమలదేవి గుర్తొచ్చింది! ఆమె నిద్రావశమున చేసిన పని, నేను నిద్రనటిస్తూ చేస్తే? అనిపించింది. వెంటనే సత్యభామ గుర్తుకురావడంతో పాదతాడనానికే మనసు మొగ్గింది. అంతే, శ్రీరామ్ కాలుమీద ఒక తాపు తన్ని, ఏమీ ఎరగనట్టు నిద్ర నటించింది.

శ్రీరామ్ ఒక్కసారిగా గతుక్కుమంటూ లేచాడు. మైథిలి అమాయకంగా నిద్రపోతున్నట్లు అనిపించిందతనకి.

భార్యస్థితికి జాలేసింది. ఆమెని దగ్గరగా తీసుకుని పాదవి పట్టుకున్నాడు. తన పథకం పారినందుకు మైథిలి లోలోన మురిసిపోతూ భర్త కౌగిలిలో బందీ అయింది!



- లిండా ఎల్లెన్

పేపర్ క్లిప్ నెక్లెస్

స్కాటిష్ కథ

ఫిలిస్ రచయిత్రి కావాలనుకోగానే ఆమె మిత్రులంతా ఇచ్చిన సలహా 'చదువు, చదువు, ఇంకా చదువు' అని. ఒకో మిత్రురాలు తను చదివిన ఒకో నవలని తెచ్చి ఫిలిస్‌కి ఇచ్చింది. అవన్నీ రొమాంటిక్ నవలలే. ఫిలిస్ సోఫాలో ముడుచుకుని పడుకుని వాటిని శ్రద్ధగా చదవసాగింది.

దాదాపు ఓ డజను నవలలు చదివాక, అవి చదవడం వల్ల కాబోయే రచయిత్రులకి ఎలాంటి సహాయం అందదని ఫిలిస్‌కు అర్థమైంది. అవన్నీ నిజజీవితానికి అతి దూరంగా, ఓ ఫార్ములాకి అతి దగ్గరగా ఉన్నాయి. అవి కేవలం మెదడుకి చూయింగ్ గమ్ లాంటివని, వాటికి రుచి, శక్తిని ఇచ్చే సామర్థ్యం ఉండదని, కేవలం కాలక్షేపానికి మాత్రమే పనికి వస్తాయని గ్రహించింది. సన్నటి నడుము, ఎత్తైన వక్షోజాలు, ప్రతి దానికి విపరీతంగా స్పందించే మనసుగల బేలలే హీరోయిన్స్ అని, బాగా డబ్బుండి, ఏ వృత్తి లేదా ఉద్యోగం లేక



డబ్బు ఖర్చు చేసే అందమైన అబ్బాయిలే హీరోలని కూడా గ్రహించింది. ఆ ఇద్దరిలో గ్రహింపు శక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యత లేని కారణంగా ఒకరి మనసులోది మరొకరు గ్రహించలేని పరిస్థితిలో అపార్థాలతో బాధ పడతారని కూడా తెలుసుకుంది.

'నిజజీవితంలో తన భర్త తనతో రొమాంటిక్‌గా ప్రవర్తించనప్పుడు అసలు తను అలాంటి నవలలని ఎలా రాయగలదు? ' అని అనుకుంది.

ఫిలిస్ భర్త రేయాన్ ప్రాక్టికల్ మనిషి. పాత బూట్లు తొడుక్కుని, ముక్కుకి సెంట్ రాసుకున్న బట్టని చుట్టుకుని సెప్టిక్ టేంక్‌ని శుభ్రపరుస్తాడు. అతను తన వైవాహిక జీవితంలో ప్రవర్తించే ప్రేమ ఆ విధంగా ఉంటుంది తప్ప ఫిలిస్ కోరుకున్నట్లుగా, గులాబీల గుత్తిని కొని తెచ్చి బహూకరించి అతని భార్యని ఆశ్చర్యపరిచేలా ఉండదు. ఓ సందర్భంలో అతను ఫిలిస్‌తో చెప్పాడు కూడా.

"కొవ్వొత్తుల వెలుగులో షాంపేన్ సీసా తెరిస్తేనే ప్రేమ అనుకోకు. అది ప్రేమకి కొలబద్ద అనుకోవడం అవివేకం. మానసిక దౌర్బల్యానికి గుర్తు. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకోకుండా ఇంటి గోడలకి రంగు వేయడం నా దృష్టిలో ప్రేమని ప్రదర్శించడం అవుతుంది"

వేలంటైన్ రోజు వేలంటైన్ కార్డుని ఇవ్వని, తమ మేరేజ్ యానివర్సరీకి ఖరీదైన డ్రస్ కొనివ్వని, తన పుట్టినరోజుకి బహుమతిని ఇవ్వని భర్తంటే ఫిలిస్‌కి బాధ. అతనిలోని ఆ ఉదాసీన గుణం ఆమెని సదా బాధిస్తూంటుంది. తరచు ఆ రొమాంటిక్ నవలలు చదివే అనేకమంది ఆమె ఫ్రెండ్స్ తమ భర్తలు తమని ఆ నవలల్లోని హీరోల్లా ప్రేమించడం లేదని చెప్పి బాధపడుతూంటారు. కాని ఫిలిస్ తన జీవితంలో కూడా సరిగ్గా అలాంటి విషాదమే ఉందని వారికి ఎన్నడూ చెప్పలేదు. తన స్వవిషయాలని ఆమె ఎవరికీ చెప్పుకోదు.

★ ★ ★

ఓ రోజు సాయంత్రం ఆఫీస్ నించి ఇంటికి వచ్చిన రేయాన్ ఫిలిస్‌కి చెప్పాడు.

"సారీ డార్లింగ్. నాఉద్యోగం పోయింది"

"అదేం? " ఫిలిస్ నివ్వెరపోతూ అడిగింది.

"ఏటా తీసేసే సిబ్బందిలో ఈ ఏడు నేను కూడా ఉన్నాను. అంతకు మించి ప్రత్యేక కారణం అంటూ ఏం లేదు. ఇంకో ఉద్యోగం కోసం రేపటి నించే ప్రయత్నం మొదలెడతాను. ఉద్యోగం వచ్చేదాకా ఇక మీదట పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్ నేనే తయారు చేస్తూంటాను" చెప్పాడు.

ఎప్పటిలా ఫిలిస్ ఆఫీస్‌కి వెళ్లి తిరిగి వచ్చేసరికి సోఫాలో పడుకుని, ఆమెకు తన ఫ్రెండ్స్ ఇచ్చిన రొమాంటిక్ నవలలని చదివే రేయాన్ కనిపించేవాడు.

అతను రకరకాల ఉద్యోగాలకి ప్రయత్నం చేయసాగాడు. ఉద్యోగం నచ్చితే జీతం నచ్చదు. జీతం నచ్చితే ఉద్యోగం నచ్చదు. రెండూ నచ్చితే పని గంటలు నచ్చవు. ప్రాక్టికల్ మనిషి కావడంతో రేయాన్ ఇంటి ఖర్చులని తగ్గించేశాడు. వాటిలో తమ బెడ్‌రూంలో వాడే ఎయిర్ ఫ్రెషనర్ కూడా ఒకటని ఫిలిస్ గమనించింది. అతనికి తన మీద ప్రేమ ఉందని, కాని దాన్ని ప్రకటించడం రాదని నిశ్చయించుకుంది.

★ ★ ★

ఓ రోజు ఫిలిస్ ఆఫీసు నించి ఇంటికి తిరిగి వచ్చేసరికి రేయాన్ ఇంట్లో లేడు. నిజానికి అతనికి ఉద్యోగం పోయినప్పటి నుంచి ఆ సమయంలో అతను ఇంట్లో లేకపోవడం అదే మొదటిసారి.

తలుపు తెరుచుకుని లోపలికి వెళ్తే ఎదురుగా గోడకి బాణం గుర్తులో కట్ చేసిన రంగు కాగితం అతికించి కనపడింది. అది చూసి ఎవరు దాన్ని అక్కడ అతికించారా అని నివ్వెరపోయింది. ఇంట్లో తన భర్త



తప్ప ఇంకెవరూ ఉండరని తెలిసినా, అలాంటి పని చేయడని ఆమె నమ్మకం.

ఆ బాణం గుర్తుని అనుసరించి వెళితే, ఇంకో బాణం గుర్తు సీలింగ్ నించి కిందికి వేలాడుతూ వంటగది తలుపుని సూచిస్తూ కనిపించింది. ఫిలిస్ ఆశ్చర్యం రెట్టింపైంది. వంటగదిలోకి వెళ్ళి చూస్తే ఫ్రిజ్ డోర్ మీద 'నన్ను తెరు' అన్న రంగు అక్షరాలు అతికించి కనిపించాయి. ఫిలిస్ తెరిచి చూస్తే ఎదురుగా ఇంట్లో వండిన ఓ చక్కటి కేక్ కనిపించింది. దానిమీద తారీకు ఆ రోజుది. కాని నాలుగేళ్ళ క్రితం సంవత్సరం వేసి ఉంది. ఆమెకి ఆ తారీకు ప్రాముఖ్యత తెలీలేదు. అలసి ఆకలితో వచ్చిన ఆమె కేక్‌ని కోసి తినసాగింది.

అరగంట తర్వాత రేయాన్ లోపలికి వచ్చాడు. అతని మొహంలో విజయోత్సాహాన్ని చూసి అడిగింది.

"ఏమిటి? ఎక్కడికి వెళ్లారు? "

"డబ్ల్యు బ్రాడ్లీ అండ్ కంపెనీకి. నీకు చెప్పనేలేదు కదూ? ఈ రెండు నెలల్లో నేను కొన్ని రొమాంటిక్ నవలలు చదివాక 'ఈ మాత్రం నేను రాయలేనా? ' అనిపించి ఒకటి రాసి బ్రాడ్లీ వాళ్లకి పంపాను. ఆ నవల తమకి నచ్చిందని, మాట్లాడడానికి రమ్మనమని వాళ్ల నించి ఉత్తరం వచ్చింది. అయిదు వేల పౌన్ల పారితోషికాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారు. రెండు నెలల తర్వాత ఇంకో పదివేలు ఇస్తారు" జేబులోంచి చెక్‌ని తీసి గర్వంగా చూపిస్తూ చెప్పాడు.

కొద్దిసేపు ఫిలిస్ అతని వంకే అచేతనంగా చూస్తుండిపోయింది. చివరికి గొంతు పెగుల్చుకుని అడిగింది.

"నిజమా? మీరు రొమాంటిక్ నవలని రాసారా? "

అవును. దానిపేరు పేపర్ క్లిప్ నెక్లెస్. బీదవాడైన హీరో ధనవంతురాలైన హీరోయిన్‌కి ఆమె పుట్టినరోజు బహుమతిగా రంగురంగుల పేపర్ క్లిప్స్‌తో చేసిన నెక్లెస్‌ని ఇస్తాడు. చివరికి వారిద్దరికీ పెళ్లయి, విమానంలో హనీమూన్‌కి వెళ్లడంతో కథ ముగుస్తుంది. విమానంలో ఆమె మెళ్లో ఆ పేపర్ క్లిప్ నెక్లెస్ ఉంటుంది."

"హౌ రొమాంటిక్! రేయాన్. నువ్వు ఎన్నడూ నాకు అలాంటి నెక్లెస్ ఇవ్వలేదు. ఇస్తే ఎంతో సంతోషపడేదాన్ని" ఫిలిస్ ఫిర్యాదు చేసింది.

"అంతకు మించిన వెర్రిపని ఇంకోటి ఉండదు. పేపర్ క్లిప్స్‌తో హారం చేస్తూ టైం వృథా చేసుకునే బదులు ఓ కేక్ చేస్తే ఇద్దరం తినచ్చు. అన్నట్లు కేక్ తిన్నావా? "

"ఆ, దానిమీద తారీఖు ఏమిటి? " ఫిలిస్ అడిగింది.

"గుర్తు లేదా? మనిద్దరికి పరిచయం అయిన రోజది. వెస్ట్ఎండ్‌లోని సబ్‌వేలో రైల్వే ఫ్లాట్‌ఫాం మీద నాలుగేళ్ల క్రితం ఇదే రోజు మనకి పరిచయం అయింది. నా నవల్లోని మొదటి దృశ్యం ఇలాగే బాణం గుర్తులతో మొదలవుతుంది. ఇలాంటి నాన్సెన్స్‌తో నవలంతా నడుస్తుంది" నవ్వాడు.

అనువాదం :
మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ క్షణంలో తన భర్త తనని ముద్దు పెట్టుకోవాలని ఫిలిస్ ఆశించింది. కాని అతనా పని చేయలేదు.

నీళ్లల్లో తడిపిన స్పాంజిని తీసుకుని గోడకి అతికించిన రంగు కాగితం బాణం గుర్తువైపు వెళ్లాడు.

అచ్చయి వచ్చాక 'పేపర్ క్లిప్ నెక్లెస్' చదువుతున్న ఫిలిస్‌కి ఆశ్చర్యం వేసింది. తను ఏ ఏ సందర్భాల్లో తనని తన భర్త ముద్దు పెట్టుకోవాలని, ఫలానా విధంగా ప్రవర్తించాలని ఆశిస్తుందో ఆ నవల్లోని హీరో సరిగ్గా అలాగే ప్రవర్తించాడు! ఆ కేక్ సన్నివేశంలో కూడా. V

కథ కుటుంబం లైబ్రరీ - 37

ఎరుపు

- ఆర్.ఎస్. సుదర్శనం

ఆకాశం రక్తం కక్కింది. చూస్తుండగానే ఎరుపు చీకట్లలో కలిసి మాయమవుతున్నది. ఎదురుగుండా గుడిసెలో దీపం వెలిగింది. అది కూడా ఎంతోసేపు ఉండదు. తర్వాత చీకటి. ఏమీ కనిపించదు.


ప్రొద్దున ఏడు గంటల నుంచీ పదింటిదాకా, సారథి మేడ వెనుక వైపు వరండాలో కూర్చుని గమనించే సమయంలో- ఆమె, ఆ గుడిసెలోని స్త్రీ- వంట ప్రయత్నంలో ఉంటుంది. ఆ గుడిసెకీ బయట తడికల్తో అమర్చిన నీళ్ళ గదికీ మధ్య ఎన్నోసార్లు రాకపోకలు సాగిస్తూ ఉంటుంది. ఒక చట్టి, ఒక గిన్నె, ఒక గరిటె, ఏదో ఒకటి తెచ్చి కడిగి తీసుకువెళ్ళడమో, నీళ్ళు నింపి తీసుకువెళ్లడమో చేస్తూ ఉంటుంది. కోళ్ళకు గింజలు చల్లుతూ ఉంటుంది.

ఆమె కదలికలు, రాకపోకలు చూడ ముచ్చటగా ఉంటాయి.

సాహిత్యంలో ప్రజాస్వామికవాది

సాహితీ ప్రపంచంలో ఆర్.ఎస్.గా ప్రసిద్ధి చెందిన రాటకొండ సుబ్బయ్య సుదర్శనం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఉత్తమ రచయితగా, సద్విమర్శకుడుగా, కవిగా పలురచనలు చేశారు. ఆంధ్రాంగ్ల సాహిత్యాలను మథించి, తులనాత్మకంగా పరిశీలించి తెలుగు సాహిత్యవిమర్శకు స్పష్టత కల్పించారు. వీరి రచనల్లో అద్వైత, తాత్విక ధోరణులు కనిపిస్తాయి. సాహిత్యంలో ప్రజాస్వామికవాదిగా, పాత - కొత్తధోరణులకు వారధిగా కనిపిస్తారు. వీరి నవలలు సృజనాత్మకతకు, సంప్రదాయాలకు, మానవకాంక్షలకు మధ్య జరిగే సంఘర్షణకు ప్రతిరూపంగా నిలుస్తాయి. 'సంసారవృక్షం' నవల హిందీ, గుజరాతీ, ఆంగ్లం - ఇలా పలుభాషల్లోకి అనువదితమైంది. కథాసాహిత్యాన్ని పరిశీలిస్తే ఆధునిక మానవ ప్రవృత్తిని వేదాంత పరమైన అస్తిత్వవాదానికి అన్వయించి చక్కగా విశ్లేషించారు. సామాన్యుల కోరికలు, కష్టసుఖాలు, ఆశ నిరాశలు వీరి పాత్రల్లో కనిపిస్తూ సజీవంగా కళ్ళ ముందు కదలాడుతాయి.

ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పండితులైన సుదర్శనం అనువాద రచనల్లోనూ అందెవేసిన చేయి. నేషనల్ బుక్ట్రస్ట్ ఇండియా, కేంద్ర సాహిత్య అకాడెమీ కోసం ఆంగ్లంలో నుంచి తెలుగుకు, తెలుగు నుంచి ఆంగ్లానికి పలు అనువాదాలు చేశారు. కట్టమంచి రామలింగారెడ్డిగారి శతజయంతి సందర్భంగా వచ్చిన పుస్తకాల కోసం వారి పీఠికలు, వ్యాసాలు కొన్ని ఆంగ్లంలోకి అనువదించారు. శ్రీవాణి పత్రికలో ప్రచురించిన వీరి 'వేమన అద్వైతం' వ్యాసం పండితుల ప్రశంసలు అందుకొంది. 'కాన్సెప్ట్ ఆఫ్ ఫ్రీడం ఇన్ తెలుగు రొమాంటిక్ పొయిట్రీ' అన్న వ్యాసం తెలుగు యూనివర్శిటీ ఎండోమెంట్ లెక్చర్ గుర్తింపు పొందింది. 'సమాజము - సాహిత్యము' అనే విమర్శన వ్యాసం, 'సంసార వృక్షం' అనే నవల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారాలు పొందాయి. కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా సంఘ సభ్యులుగా కూడా నియమితులయ్యారు.



పేరు	:	**ఆర్.ఎస్. సుదర్శనం**
జననం	:	1927వ సంవత్సరం డిసెంబరు 13 వతేది
జన్మస్థలం	:	చిత్తూరు జిల్లా మదనపల్లె.
ప్రసిద్ధి	:	ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా, ఉన్నత విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. కథా, నవలా రచయితగా, సాహితీ విమర్శకులుగా సుప్రసిద్ధులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారంతో సత్కరించింది. రోటరీ క్లబ్, నూతలపాటి గంగాధరం సాహితీ అవార్డు, రాజమండ్రి హితకారిణీ సమాజం వారి సత్కారం పొందిన ఘనులు.
రచనలు	:	కాలం తెచ్చిన మార్పు (7 కథలు), మధుర మీనాక్షి (8 కథలు) **నవలలు :** అనుబంధాలు, మళ్లీ వసంతం, అసుర సంధ్య, సంసార వృక్షం **విమర్శక గ్రంథాలు :** సాహిత్యంలో దృక్పథాలు, సాహిత్య నేపథ్యం, నూరు సమీక్షలు, గుడిపాటి వెంకటాచలం మోనోగ్రాఫ్, సమాజము-సాహిత్యం **పద్యకావ్యాలు :** ప్రకృతి పూజ, నిశాంతం
మరణం	:	2001 వ సంవత్సరం డిసెంబరు 14 వ తేది

సాయంత్రం నాలుగ్గంటలకు ముంగిలి ఊడ్చి, నీళ్ళు చల్లుతూ మళ్ళీ దర్శనమిస్తుంది. ఆ పని పూర్తికాగానే స్నానం చెయ్యడానికి తడికలచాటుకి వెళుతుంది. కుచ్చెళ్ళు పోసి పురితిప్పి తెచ్చుకున్న చాకింటి చీరని ఒకవైపు తడికె మీద పెడుతుంది. కట్టుకున్న బట్టలు విప్పి సారథి వైపున్న తడికె మీద వేస్తుంది. వివస్త్రగా నిల్చున్న ఆ క్షణంలో ఆమె ముఖం, చెయ్యి, భుజం, అలా కనిపించి లిప్తలో అదృశ్యమవుతాయి. ధ్వని ప్రధానమైన వాక్యంలాగా ఆ దృశ్యం అతనిలో రసానుభూతి కలిగిస్తుంది. ఆమె కదలికల్ని చూస్తూ ఉండటంలో కలిగే మొత్తం ఆకర్షణకీ అది తారస్థాయి.

స్నానం పూర్తిచేశాక, చీర చుట్టబెట్టుకుని గబగబా లోపలికి వెడుతూ కనిపించే దృశ్యంలో ఆకర్షణ ఉండదు. ఏదో చెప్పరాని నిర్వేదం అతని మనస్సుని ఆవరిస్తుంది.

సాయంత్రం అయిదున్నర, ఆరు ప్రాంతాల్లో ఖాకీ దుస్తుల్లో వున్న ఒక వ్యక్తి - ఆమె భర్త - అక్కడికి వస్తాడు. వాకిటి ముందు మంచం వాల్చుకుని కూర్చుంటాడు. ఆమె టీ తెచ్చి ఇస్తుంది. అతను కబుర్లు చెబుతూ ఉంటాడు. ఆమె అటూ ఇటూ తిరుగుతూ, కాస్సేపు వాకిలి ముందు, సారథికెదురుగా నుంచునీ, కాస్సేపు భర్త దగ్గరగా నుంచునీ- నవ్వుతూ మాట్లాడుతూ ఉంటుంది. తాను ఆమెని చూస్తున్నట్లే, తన ఉనికిని ఆమె కూడా గమనిస్తూ ఉంటుందనే సారథి అనుమానం.

ఆ భర్త రోజూ కనిపించడు. రెండు మూడు రోజులకూ, ఒక్కోసారి వారం రోజుల తర్వాతా కనిపిస్తాడు. బస్సు డ్రైవరో, లారీ డ్రైవరో కావచ్చు. అతనెవరో, ఆమే, అతనూ భార్యాభర్తలు అవుతారో కారో కూడా సారథికి తెలీదు. తెలుసుకోవాలనీ లేదు. ప్రత్యక్షంగా కనిపించేదేదో అందంగా, ఆకర్షకంగా ఉండగా, దాని అనుభూతితో సంబంధంలేని లౌకికమైన వివరాల్ని ఎందుకు తెలుసుకోవడం? తెలుసుకోవడంలో అర్థం, ఆనందమేమీ లేనప్పుడు!

నిస్సారమైపోయిన జీవితంలో ఇదే తనకు మిగిలిన సెక్స్ అనుభూతి. శారీరకమైన సెక్స్ నిషిద్ధం అన్నాడు డాక్టర్. అయిదు నెలల క్రితం రక్తం పడింది. క్షయ అని నిర్ధారణ అయినప్పుడు భయం వేసింది. మిగిలింది నిస్పృహ. వ్యాధి ప్రారంభ దశలోనే ఉన్నదనీ, శానిటోరియమ్‌కి ఎక్కడికీ వెళ్లనక్కరలేదనీ ధైర్యం చెప్పాడు డాక్టరు. వెళ్ళినా వెళ్ళకపోయినా శరీరం పనికిరానిదైపోయింది!

భార్య పుట్టింటికి వెళ్ళింది. ఆమెకు వ్యాధి సంగతి తెలీదు. వ్యాధి బయటపడడం, ఆమె ప్రయాణం కావడం రెండూ ఒక సమయంలోనే తటస్థించాయి. ఆలోచించడానికి వ్యవధి లేదు. పురుడు పోసుకోవడానికి వెళ్తున్న ఆమెతో వ్యాధి సంగతి చెప్పడమెందుకని చెప్పలేదు.

ఆమె వెళ్ళిపోయాక క్రమంగా అర్థమైంది. తన జీవితంలో వచ్చిన మార్పు. సెక్స్ నిషిద్ధమని డాక్టరు చెప్పినప్పుడు అర్థం కాలేదు గాని, ఇప్పుడు తెలుస్తోంది. మనస్సు శరీరం నుంచీ వేరుపడుతోంది. క్రమంగా అలా వేరుపడటంలోనే ఇదివరలో గుర్తించని సత్యాన్ని గుర్తిస్తోంది!

ఎదురుగుండా కనిపించే గుడిసెలోని ఆ స్త్రీ భర్తతో అలా కబుర్లు చెబుతూ, నవ్వుతూ ఉంటే మొదట్లో తనని కవ్విస్తూ ఉన్నట్లుండేది. సారథిలో అసూయ, బాధ కలిగేవి. లేచి వెళ్ళిపోయేవాడు. మంచం మీద పడుకుని అదే పనిగా ఆలోచించేవాడు. ఎన్నో ఊహలు వచ్చేవి. ఆ ఖాకీ దుస్తుల వ్యక్తి గొప్ప అదృష్టవంతుడుగా కనిపించేవాడు. అతనిలో 'పరకాయ ప్రవేశం' చేసి ఆ జీవితాన్ని ఊహించుకునేవాడు. అలా మనస్సు రెక్క విప్పడంతో క్రొత్తసంగతులు అర్థమయ్యాయి. ఆ స్త్రీ మీద చొరవ,

అధికారం లభించడం, ఆమెకు చేరువకా వడం, ఆమెను అనుభవించడం ఎంతో బావుంటుందని కోరిక చెబుతుంది. కానీ యథార్థంలో తను ఆ ఖాకీ దుస్తులవాడైన ప్పుడు, తనకు అసలు నీళ్లగది సన్నివేశం కనిపించదు! అప్పుడు ఆ సమయంలో తను ఏ బస్సునో, లారీనో నడుపుతూ 'డ్యూటీ' మీద ఉంటాడు. సాయంత్రం టీ తాగుతూ ఎన్ని కబుర్లు చెప్పినా, రాత్రికి గాని, ఆ గ్రుడ్డిదీపం కాస్తా ఆర్పివేశాకగాని, అంటే చీకట్లోగాని ఆమె చేరువకాదు. చీకట్లో అందానికీ, ఆకారానికీ- తను మనసు ఇప్పుడు పొందే రసానుభూతికి- ఆస్కారం ఎక్కడ? అప్పుడు అంతా ఒకటే! సర్వం జగన్నాథం! ఆ చీకట్లో ఆమె ద్వారా లభించే శారీరకానుభూతికీ, ఇదివరకు తానె రిగి ఉన్న శారీరకానుభూతికీ తేడా ఏమైనా ఉంటుందా? ఉంటే ఎలా ఉంటుంది? తేడాలు ఏవైనా దృష్టి, మనస్సు తెచ్చి పెట్టేవే. కేవలం శరీరమే, స్పర్శే అయితే చీకట్లో దానికి తేడాలు తెలీవు! అలాంట ప్పుడు ఆ లారీ డ్రైవరును చూచి అసూయ పడటం దేనికి?

అసలు సెక్స్ మనస్సుకి సంబంధిం చిందా? శరీరానికి సంబంధించిందా? అని ప్రశ్న. భార్యను దూరం నుంచీ, కేవలం స్త్రీగా చూస్తుంటే, ఎంతో ఆకర్షణగా ఉంటుంది. ఆమె భార్యగా దగ్గర చేరి సంసార విషయాలూ, బంధువుల్ని గురించీ, డబ్బు గొడవా మాట్లాడినప్పుడు, ఆ ఆకర్షణ ఉండదు. చికాకు కలుగుతుంది. ఆమెతో పక్కమీద చేరడంలో ఆకర్షణ తాలూకు ప్రేరణ ఉద్రేకాన్ని కలిగించినా, అనుభవ పర్యవసానంలో దాని స్పృహే కనిపించదు. పర్యవసానం నిస్సారంగా మృత్యువులా ఉంటుంది. రసరాహిత్యమే తప్ప రసాను భూతి తోచదు. మొదటి నుంచీ, పెళ్ళయి నప్పటి నుంచీ, ఈ అనుభూతి అలానే ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. సెక్స్ అలవా టుగా, విధాయకంగా మారడంవల్లే మృత్యు స్పర్శగా తయారైందని సారథి ఊహ. అంకురించడానికి కూడా ఆ 'మృత్యుస్పర్శే' కారణం అయి ఉంటుందని అతని అను మానం. అలాంటి శారీరకమైన 'సెక్స్' అను భవాన్ని వదులుకోవడానికి తను సంసి ద్ధుడే!

'క్షయ రావడానికి కారణమేమిటి? ' అని డాక్టర్ని సూటిగా ప్రశ్నించాడొకసారి. డాక్టరు రామం తన స్నేహితుడు. అతను ఏవేవో కారణాలు సూచించాడు. అవన్నీ తన విషయంలో వర్తించేవి కావు. క్షయ తన వంశంలో లేదు. తనకెప్పుడూ మలే రియా రాలేదు. తను బలహీనుడూ కాలేదు. పరిసరాల్లో, తిండిలో, ఎక్కడా లోపం రాలేదు. కాని తనలో ఏదో అసం తృప్తి మాత్రం- మనస్సుకీ శరీరానికీ మధ్య అవ్యక్తమైన సంఘర్షణ ఫలితం కాబోలు అది - క్రమంగా ప్రస్ఫుటమవుతూ వస్తోంది. అది పిల్లలు లేకపోవడం వల్ల కాబోలు అనుకున్నాడు. పెళ్ళయి అయిదేళ్ల వుతోంది. ఇప్పుడు తను తండ్రి కాబోతు న్నాడు. క్షయ వచ్చింది. రెండింటిలో ఏదో ఒకటి జరగకపోతే అర్థం ఉండేది. రెండూ ఒకసారే జరగటం జీవితం ఎంత అర్థరహి తమో నిరూపిస్తోంది.

సెక్స్ అనుభూతి విషయంలో మనస్సుకీ, శరీరానికీ విభేదాన్ని కల్పించడం తర్కించి చూస్తే సబబుగా తోచదు. కంటికి మాత్రమే కనిపించి (కన్ను మూసినా తెర చినా) స్పర్శకి అందుబాటులో లేనిదాన్ని 'మానసిక'మనీ, స్పర్శ వగైరా ఇంద్రియాలకి అందుబాటులో ఉండేదాన్ని 'శారీరక'మనీ వింగడించడం సవ్యంగా తోచదు. అన్ని ఇంద్రియాలూ శారీరకత చెందినప్పుడు ఏ ఇంద్రియంతో అనుభవించినా అది శారీరకా నుభవమే అవుతుంది. పోనీ నిర్వచనంలో ఇంద్రియాలకు బదులు ఇంద్రియార్థాలకే ప్రాధాన్యం ఇస్తే, అప్పుడు సర్వవిధాలైన



అనుభూతులూ, స్పర్శ, సంపర్కం, రుచి కూడా మానసికమేనని సిద్ధాంతం చేయాలి. మరి కంటితో అనుభవించడానికీ, కౌగిలితో అనుభవించడానికీ తేడా ఏమిటి? తాత్త్వికంగా ఏమీ లేదు! కంటితో అనుభవించి ఎందుకు తృప్తిచెందరాదు?

పోతే కంటికీ, వంటికీ ఒక సంబంధం ఉంది. కంటితో చూస్తే కలిగే ఆకర్షణే, స్పర్శకూ, కౌగిలింతకూ ప్రేరణ అవుతున్నది. చూచినదాన్ని అందుబాటులోకి, స్వాధీనంలోకి తెచ్చుకుని దాన్ని 'నిజం' చేసుకోవాలనే తాపత్రయమే మనిషికి అన్ని ఆవేదనలూ. కనిపించే ఇంద్రధనుస్సు 'నిజం'కాదా? అది అక్కడ లేదు! చంద్రుణ్ణి చేరుకోవచ్చుగానీ- ఇంద్రధనుస్సుని అందుకోవడం వీలుపడదు కదా! ఇంద్రధనుస్సు రంగులు మన కన్నులు మాత్రమే అనుభవించగలిగే నిజం. అందుకే మనుష్యులు దాన్ని గట్టి 'నిజం'గా పరిగణించరు!

ఆకాశంలో చంద్రుడు అమృతమూర్తిగా కనిపిస్తాడు. ఐస్‌క్రీంలా తినెయ్యాలనే కోరిక పుడుతుంది. ఆ చంద్రలోకం ఎంత అందంగా, హాయిగా ఉంటుందో అనిపిస్తుంది. మానవుడు చంద్రుణ్ణి గూర్చి తరతరాలుగా కన్న కలలు సాహిత్యం నిండా వ్యాపించి ఉన్నాయి. కాని చంద్రుడు మానవునికి అందుబాటులోకి వచ్చేప్పటికి ఆ అనుభవం ఎలా ఉంది? వెడితే అక్కడ కొండలూ, గోతులూ, ఎడారీ తప్ప మరేమీ లేదు! అలా నిజమైన చంద్రుణ్ణి ఏం చేసుకోను! అక్కడి నుంచీ చూస్తే భూమి దివ్యసుందరంగా దర్శనమిచ్చిందట! చూపులో ఉన్న ఆనందం, పొందటంలో లేదే!

తన మనస్సు 'శరీరం' నుంచీ వేరుపడుతోంది. అలా వేరుపడటంలోనే స్వచ్ఛమైన ఆనందం ఉన్నది. స్వేచ్ఛ ఉన్నది. శరీరాన్ని గూర్చి, శారీరకమైన 'సెక్స్'ని గూర్చి ఇక తను తాపత్రయపడక పోవడమే వివేకం అనుకున్నాడు సారథి.

ప్రొద్దున సూర్యోదయ దృశ్యం ఎంత ఆహ్లాదకరంగా ఉంది! తర్వాత కాస్సేపటికి రిక్షాలో డాక్టరు దగ్గరికి వెడుతుంటే, ఆ సూర్యుని కిరణాలు శరీరానికి కలిగించిన బాధని సహించలేకపోయాడు. మనుష్యులు దూరం నుంచీ చూస్తున్నంతసేపూ చైతన్యంతో, ఏదో చేస్తూ, మాట్లాడుతూ, నవ్వుతూ, కోపగిస్తూ అద్భుతంగా ఆసక్తినీ, ఆనందాన్నీ కలిగిస్తారు. మానవజాతి సమస్తాన్నీ తను ప్రేమిస్తున్నట్లే ఉంటుంది. కానీ ఒక రిక్షా మాట్లాడుకోవాలన్నా, ఒక అంగడిలో వస్తువులు బేరం చేసినా, మనుష్యులు చేసే జాప్యం, పెట్టే పేచీలూ, తికమకలూ, పాలవాడూ, కూరగాయలవాడూ చేసే మోసాలూ, విసుగునీ, చిరాకునీ కలిగించడమే కాదు, ద్వేషాన్ని కూడా రగిలిస్తాయి! మనుష్యుల పట్ల సామూహికంగా తనకు ద్వేషం లేదు. పెద్దగా ప్రేమా లేదు! కానీ ఒక్కొక్క వ్యక్తి పట్ల తనకి ఆసక్తీ, జాలీ, ఆప్యాయతా కలుగుతాయి!

డాక్టరు చేత ఇంజక్షను చేయించుకోవడం కంటే, నర్సు నిర్మల చేత ఎక్స్‌రే తీయించుకోవడమే సరదాగా ఉంటుంది! ఆమె చాలా నాజూకుగా, మల్లెపువ్వులా ఉంటుంది. పొంకంగా ఉన్న ఆ వక్షానికీ, నీటైన స్పష్టమైన హావభావాలకూ తగినట్టు, ఎందుకోగాని ఆమె కళ్ళల్లో చురుకుదనమూ, ఆహ్వానమూ కనిపించవు. నిస్సహాయతా, పరారీతత్వమూ మాత్రమే కనిపిస్తాయి. ఆమెను చూస్తుంటే 'అడవిగాచిన వెన్నెల' జ్ఞాపకం వస్తుంది. ఆమె మీద ఎందుకో ఆప్యాయత కలుగుతుంది.

ఇవాళ ఎక్స్‌రే చూచి డాక్టరు రామం అన్నాడు "స్పాట్స్ అన్నీఇంచుమించు కవరైపోయినట్లే! రిమార్కబుల్ ఇంప్రూవ్‌మెంట్. సారథీ! ఇంకొక మాసంలో డ్యూటీలో జాయిన్ కాదలచుకున్నా కావచ్చు. అఫ్‌కోర్స్, ఉండవలసిన జాగ్రత్తలో

ఎలాగూ ఉండక తప్పదు"

"నీకు ఎలా కృతజ్ఞత తెలుపుకోవాలో తెలీదు రామం! నీకూ, నర్స్ నిర్మలకీ ఎంతో రుణపడి ఉన్నాను. ఆమెతో వ్యక్తిగతంగా మాట్లాడి థాంక్స్ చెప్పాలని ఉంది" అన్నాడు సారథి.

"ఏం, ఇంతవరకూ ఆమెతో ఎప్పుడూ మాట్లాడనే లేదా? "

"లేదు. ఆమె చాలా ముక్తసరిగా ఉంటుంది. అలా ఊరికే మాట్లాడేరకంగా కూడా తోచదు. అయినా నేను వచ్చినప్పుడు ప్రతిసారీ ఏలోటూ లేకుండా ఆదరంతో చూస్తుంది. అందుకే నాకు అభిమానం ఏర్పడింది. వ్యక్తిగా ఆమె మీద ఆసక్తి కూడా కలిగింది..!"

"కలిగిందీ! నీకు ఆడవాళ్ళ జోలి పనికిరాదని చెబుతూనే ఉన్నానుగా" అన్నాడు నవ్వుతూ రామం.

"జోలి అంటే కేవలం మనిషిగా కూడా ఆసక్తి చూపించడానికి వీల్లేదా? "

"అందులోనే ప్రమాదం ఉంది మరి. ప్రారంభంలో అంతా అమాయకంగానే



ఉంటుంది"

"అది కాదు నా అభిప్రాయం, ఆమెను చూస్తే ఒక కుతూహలం. క్షయ మూలంగా నేను పోగొట్టుకొన్నదేమిటో అర్థం చేసుకుని, సమాధానపడటానికి ప్రయత్నం చేస్తు న్నాను. మరి ఏ వ్యాధీ లేని నిర్మల లాంటి వాళ్లు జీవితంలో ఎలా సమాధానపడుతు న్నారా? అనిపిస్తుంది. అందుకే ఆసక్తి చూపించాను"

రామం నవ్వేశాడు. సారథి వైపు అదో విధంగా చూచాడు.

"సారథీ! ఏమిటి నువ్వనేది! నల్లనివన్నీ నీళ్ళూ, తెల్లనివన్నీ పాలు అని తప్ప అంత కంటే నువ్వు తెలుసుకోలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. నిర్మలా ఈజ్ ఎ బిచ్! కొంచెం రేటు ఎక్కువే అనుకో. నీకు ఒంటికి పడ దనే తప్ప నువ్వు కావాలంటే అందుబాటు లోనే ఉంది" అన్నాడు.

సారథికి తల తిరిగినట్లయింది.

"మరి అలాంటిదాన్ని నీ నర్సింగ్ హోంలో..." సందేహం వెలిబుచ్చాడు సారథి.

"అలాంటి వాళ్ళే పనికొస్తారు. బిజినెస్ లైక్‌గా, సైంటిఫిక్‌గా ఉంటారు. హృదయ సంబంధమైన జబ్బులు వాళ్ళకు రావు. రొమాన్స్‌కి ఇమ్యూన్‌గా ఉంటారు. లేని పోని ఊహలతో ఆశలతో తలనొప్పి తెచ్చు కోరు, తెచ్చిపెట్టరు"

ఆ ప్రస్తావన అంతటితో ముగిసింది. నిర్మలతో మాట్లాడాలని మళ్ళీ రామంతో అనలేదు. తిరిగి వస్తూ తనలో నిర్మల పట్ల కలిగిన అభిప్రాయాన్ని గూర్చి తర్కించుకు న్నాడు. ఆలోచించే కొద్దీ తన మొదటి అభి ప్రాయానికి, రామం చెప్పిన వివరాల వల్ల వచ్చిన భంగపాటు, ఏమీ లేదు. నిర్మల పట్ల కలిగిన ఆప్యాయత ఇప్పుడు జాలిగా మారింది. పాపం! ఏం చేస్తుంది. ఈ మనుష్యులూ, ఈ వ్యవస్థ ఆమెనట్లా తీర్చిది ద్దాయి..! కానీ..

..జాలి? ఎందుకు జాలి? ఆమె మర్యా దస్తురాలు కాలేకపోయిందనేనా? ఆమె ఎవణ్ణో కట్టుకుని, వాడి అధికారానికి లోబడి బ్రతకటంలేదనేనా? ఆమె బ్రతుకుతున్న విధానం, ఆమెకు తృప్తినిస్తూ ఉందో? లేదో? తనకేం తెలుసు? సమాజానికి ఒక మార్గం, ఒక నీతి ఉందని భ్రమ పడతా ముగాని, సమాజంలోని మనుష్యుల్లో ఒకరి మార్గం మరొకరిది కాదు! అందరిలోనూ రెండు ముఖాలు ఉన్నాయి. ఒకటి సమాజపరంగానూ, మరొకటి వ్యక్తిగతంగానూ ఉంటుంది. సమాజ పరంగా ఉండేది ముసుగు మాత్రమే! దాని వెనుక ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళుంటారు.

నిర్మల వేసుకున్న ముసుగు పెళ్ళికాని

నర్సుగా - బాగానే ఉంది. వ్యక్తిగతంగా ఆమె జీవిస్తున్న జీవితమూ ఆమెకి బాగానే ఉండవచ్చు. బాగా లేదనడానికి సారథి, తనెవ్వరు? తనకి నర్సుగా ఆమె చేసిన సేవ, యువతిగా కలిగించిన ఆహ్లాదమూ, నిజంకాక అబద్ధమెలా అవుతాయి? ఆమె యవ్వనము 'అడవిగాచిన వెన్నెల' అనుకుని ఆప్యాయత ననుభవించడం కానీ, ఆమె రహస్య జీవితాన్నిగూర్చి విని జాలిపడటం కాని, పై నిజాన్ని మరీ దగ్గరగా అందుబాటులోకి తెచ్చుకునే ప్రయత్నంగా దాని తాలూకు సౌందర్యాన్నీ, విలువనీ నాశనం చేస్తుంది. చంద్రుణ్ణి భూమిమీద నుంచే, దూరం నుంచే చూడాలి. దగ్గరకు వెడితే ఏముంది? నా జాలీ, జోక్యం అవతలివాళ్లకు అక్కరలేదు!

అందుకే ఎదురుగుండా నిత్యమూ కనుపించే ఆ గుడిసెలోని స్త్రీ విషయంలో కూడా. వివరాలు తెలుసుకోవడం అనవసరమే!

★ ★ ★

స్నేహితుడు విశ్వాన్ని రైలెక్కించడానికి సారథి స్టేషన్‌కెళ్లాడు. విశ్వం ఇంజనీరింగు చదివాడు. నాలుగేళ్లు నాగార్జునసాగర్‌లో పనిచేశాడు. తాత్కాలికమైన ఉద్యోగమేనని పనిలోంచి తొలగించారు. ఏడాదికి పైగా ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్లీ ఉద్యోగం దొరకలేదు. ఎన్నో ఆశలు పెట్టుకుని చదివించారు తల్లిదండ్రులు. ఆర్థికంగా శక్తి లేకపోయినా తెలివైన కుర్రవాడనీ, ఇంజనీరింగులో సీటు వచ్చిందనీ, ఉన్నదంతా ఊడ్చిపెట్టి పస్తులుండి చదివించారు. ఇద్దరూ ఒక ఊరివారే. విశ్వం కుటుంబం తనకు తెలుసు.

విశ్వం ఒక కొయ్యపెట్టె. ఒక మడత మంచం పట్టుకొచ్చి- "అందులో పుస్తకాలున్నాయి, రెండు వస్తువులూ అట్టేపెట్టు. తిరిగి వచ్చాక తీసుకుంటాను" అన్నాడు.

"ఏం, ఉద్యోగం దొరికిందా? ఏ ఊరెడుతున్నావ్? "

"ఉద్యోగం దొరకలేదు. శ్రీకాకుళం వెడుతున్నాను"

"ఎందుకు శ్రీకాకుళం? "

"అంతకంటే ప్రస్తుతం చేసే పనేంలేదు గనక"

చివరకు విశ్వం వివరించాడు. వెళ్ళి విప్లవకారులతో కొంతకాలం గడుపుతాడట. ఈ వ్యవస్థలో యువకులకూ, ప్రజ్ఞావంతులకూ అవకాశం లేదు. రాజకీయంగా, నైతికంగా కుళ్ళిపోయిన ఈ వ్యవస్థని మార్చడం సాధ్యం కాదు. దీన్ని కూకటివేళ్లతో పెళ్ళగించాలి. దీన్ని తుడిచిపెట్టాలి. మసి చెయ్యాలి. శ్రీకాకుళం నుంచీ ఈ దావాగ్ని వ్యాపిస్తూ వస్తూంది. విశ్వం ఈ ధోరణిలో ఆవేశంగా మాట్లాడాడు.

"ఇంతకూ నువ్వెళ్ళి చేసేదేమిటి? "

"రక్తం కళ్ళజూడటం. ఈ వ్యవస్థ మూల స్తంభాలని కూలద్రోయటం. ప్రజావిరోధుల గుండెల్లోకి తూటాలు పేల్చడం"

"వాళ్లెవరో నీకు తెలీదు. అంటే వ్యక్తిగతంగా, ఎరుగని మనుష్యుల్ని వాళ్ళు ధనవంతులని తెలిసినంత మాత్రాన, విప్లవ సిద్ధాంతం కోసం చంపబూనటం, హృదయావేశంతో సంబంధం లేని ఆ పని, కేవలం యాంత్రికమైనది కదా! అది నిన్నూ యంత్రంగా మార్చివేస్తుంది. నువ్వూ ఒక కీలుబొమ్మవే అవుతావు. వ్యక్తిత్వం, వెర్రి సిద్ధాంతాలకు బలిపెట్టాక, మిగిలేదేమీ ఉండదు..." సారథి వాదన.

"నువ్వు ఎవళ్ళని మనుష్యులంటున్నావు? వాళ్ళు మనుష్యులు కారు. రాక్షసులు! హృదయావేశం అంటే వ్యక్తిగతమైన ద్వేషం లేకుండా విప్లవం కోసం కర్తవ్యం నిర్వహించడమే కదా ఉత్తమ మార్గం... యుద్ధంలో సైనికుడు అలానే చేస్తాడు. సైనికుడు ఆజ్ఞలు శిరసావహించాలి గాని, యుద్ధరంగంలో ఒక్కొక్కరూ సొంతంగా ఆలోచించడం ప్రారంభించకూడదు. ఆ పరిస్థితిలో

వ్యక్తిత్వం ప్రశ్నే లేదు!" అని విశ్వం సమాధానం.

"అసలిదంతా ఒక భ్రమ, ఒక ఎండమావిని చూచి పరుగెత్తడం. మీరు సాధించబోయే నూతన వ్యవస్థలో మానవ సంబంధాలు కందెన వేసిన చక్రంలా సులువుగా ఆప్యాయంగా పరివర్తిస్తాయి అనుకోవడం, అనుకునేంత వరకే బాగుంటుందన్నది గాని, అందులో నిజంగా నాకు నమ్మకం కలగడంలేదు. విప్లవంలో హుకుంలు జారీచేసేవాళ్ళే రేపు విప్లవానంతరం ఆ అలవాటు వదులుకోలేక, తమ చెప్పుచేతల్లో ఉండేవాళ్ళని అలాగే ఉపయోగించుకుంటూ, వాళ్ళనీ, ప్రజలందర్నీ బానిసలుగా చూస్తారు.. అప్పుడేమవుతాయి నీ ఆశలూ, ఆశయాలూ? "

సమాధానంగా విప్లవాత్మక మార్క్సిజమ్‌ను గురించి విశ్వం ఎంతో వాదించాడు. అలాంటి పర్యవసానం ఉండదన్నాడు. చివరకు ఒక్కమాట అన్నాడు. "పోనీయ్ సారథీ! భవిష్యత్తును గూర్చి, విప్లవకారుల మనఃపరిణామాన్ని గూర్చి మనం ఇప్పుడెందుకాలోచించడం! ఈనాటి పరిస్థితిలో, నాకు స్వయంగా ఇంతకంటే చెయ్యవలసిన మంచి పని మరొకటి కనిపించదు! ఏదైనా ఉంటే నువ్వు చెప్పు, చేస్తాను. ఉద్యోగం ఇస్తే చెయ్యనన్నానా? కబుర్లు చెప్పి కపట నాటకాలాడుతూ, నీతులు వల్లిస్తూ వ్యవస్థని చేజిక్కించుకుని, యువకుల్నీ, అమాయకుల్నీ, పేదవారినీ హింసిస్తున్న రాక్షసులపై యుద్ధం ప్రకటించడం, ఇప్పటికిదే కర్తవ్యం. ఇదే జీవితం, రేపటి సంగతి అక్కరలేదు. భవిష్యత్తు బాగుంటుందనే ఆశతోనే ముందుకు వెడదాం. అందుకు శ్రీకాకుళం వెళ్ళే ఏర్పాటు చేసుకున్నాను. అక్కడ నన్ను ఆహ్వానించే మిత్రులున్నారు..." అంటే ఇక్కడ లేరనేగా భావం!

సారథికి అతని మనఃస్థితి అవగాహన అయింది. అతనితో స్టేషన్‌కి వెళ్ళాడు. గార్డు విజిల్ ఇచ్చాడు. రైలు కదిలింది. విశ్వం ముందుకు సాగిపోతూండగా నిలబడి చూస్తున్నాడు సారథి. ఇంతలో రైలు ఆగిపోయింది. ప్లాట్‌ఫారమ్ మీద సంచలనం, జనం పరుగెత్తారు. గుంపుగా చేరారు. సారథి అటువైపు వెళ్ళాడు. ఎవరో పన్నెండేళ్ళ కుర్రాడు రైలందుకోవడానికి పరుగెత్తి రైలుకీ, ప్లాట్‌ఫారమ్‌కీ మధ్య ఇరుక్కుపోయాడు. బయటికి తీశారు. అతని రెండు కాళ్ళూ విరిగిపోయాయి. రక్తపు ముద్ద అయిపోయాడు. అంతా అయిదు నిముషాల్లో అయిపోయింది. రైలు బయలుదేరింది. సారథి వెనక్కి నడిచాడు. విశ్వం మళ్ళీ కనిపించలేదు. రైలు వెళ్ళిపోయింది.

తిరిగి వస్తూంటే కాళ్ళు తెగిన ఆ రక్తపు ముద్ద కళ్ళకు కట్టినట్టయింది. ఆ కుర్రాడు బ్రతుకుతాడా? బ్రతికినా కాళ్ళులేని వాని జీవితం ఎలా ఉంటుంది? విశ్వం రైలెక్కి వెడుతూండగా అలా జరగటం శుభసూచకంగా లేదే!

★ ★ ★

సారథి మళ్ళీ ఉద్యోగంలో చేరాడు.

ఏకాంతం వదిలి మనుష్యుల్లో పడ్డాడు.

క్షయ నయమైందని డాక్టరు చెప్పిన తర్వాత మానసికంగా తనలో వచ్చిన మార్పు సారథికి చికాకు కలిగిస్తోంది. ప్రొద్దుటిపూట పదింటికి ఆఫీసుకి బయలుదేరే దాకా పూర్వంలాగే వరండాలో కూర్చుని పేపరు ముందు పెట్టుకుని ఆ గుడిసెలోని స్త్రీని గమనిస్తూ ఉంటాడు. కాని సాయంత్రాలు మాత్రం ఒక్కోరోజు ఆమె స్నానం చేసే వేళకు ఇల్లు చేరుకోలేకపోతున్నాడు. క్షయ మూలంగా ఏకాంతవాసం చేసిన రోజుల్లో ఏర్పరచుకున్న సిద్ధాంతాల్నీ, జాగ్రత్తల్నీ అతను మరచిపోలేదు. కానీ ఆఫీసుకు వెళ్ళి రావడంలో సినిమాలకు వెళ్ళడంలో అతని మనస్సు ఉద్వేగాన్ని అనుభవిస్తూ కోర్కెలని ఆకట్టుకో

కత్తుల వంతెన!



ఆర్.ఎస్. సుదర్శనంగారి 'ఎరుపు' వస్తు పరంగా సామాన్యంగా కనిపించినా, దృశ్యాత్మకంగా, సంభాషణాత్మకంగా మలిచిన తీరు గుండెను కదిలిస్తుంది! ఈ 'ఎరుపు' కథ బ్లాక్ & వైట్ స్టోరీ. జీవితంలో తెల్లటి నలుపుని తెలిపే ఓ నలుపు తెలుపు కథ! ఎర్రగా తెల్లారిన చీకటి కథ..! చీకటి మింగేసిన వెలుగు కథ..! ఘనీభవించి గడ్డకట్టిన నెత్తుటి 'చుక్కై' పాఠకుడి గుండెల్లోకి దిగబడిపోయిన కథ!

సెక్స్ మనసుకి సంబంధించిందా? శరీరానికా? మనసు మనసుగా, అందుకోలేని శిఖరాగ్రాన్ని దేన్నో శారీరక అనుభవం అందుకుంటోందన్న సిద్ధాంతాన్ని తీర్మానించుకున్న ఓ మగాడి కథ..!

ప్రేమకీ, కాంక్షకీ.. మనసుకీ, శరీరానికీ మధ్య వంతెన కట్టి సారథికి చేరువై ఆ సాంగత్యంలో, సంయోగంలో కరిగి ప్రవహించి.. చివరికి రక్తంగా ఘనీభవించిన ఆడది రాజమ్మ ఉరఫ్ రాజ్యలక్ష్మి..! అవును, తుమ్మెదపై వాలి మరణించిన పువ్వు రాజమ్మ!

మనసుని చంపుకున్నదానికి, శరీరాన్ని చంపుకున్న దానికి పెద్దగా వ్యత్యాసం కనపడని సారథి.. మనసనేది లేకుండా, రొమాన్స్‌కి ఇమ్యూన్‌గా కేవలం శరీరంతో సుఖం అందించే 'బిచ్' నిర్మల మీద జాలిపడ్డాడు! మనసుపడి, అతని మోహంలో మునిగి తేలి 'నలుగురి దారిలో నడవాలిగా, అందుకే తాళికట్టిన మొగుడితో వెళ్ళిపోతున్నా' అంటూ అంతే నిర్మోహమాటంగా వెళ్ళిపోవాలనుకున్న రాజమ్మ..! లవ్..లస్ట్..లైఫ్... అవును, లైఫ్ ఈజ్ పారడాక్సికల్!!

అంది దూరమైన ద్రాక్ష పుల్లనా కాదు, తియ్యనా కాదు.. వేదన! విరహ(మోహ) వేదన, మరణవేదన. ఓ ఉన్మాదపు జాగ్రదవస్థ. ఓ సంకల్పిత ప్రతీకార చర్య! అతనికి విరహమా? వీడలేని మోహమా? కామమా? నిజానికి, వదులుకున్నవన్నీ పోగొట్టుకున్నట్టు కాదు, పిడికిలిలో బిగించినవన్నీ పొందినట్టు కాదు. వియోగాన్ని తట్టుకోలేని వాడు 'మద్యాన్ని' ఆశ్రయించటం, విరహాన్ని తట్టుకోలేనివాడు 'కవిత్వాన్ని' ఆశ్రయించటం.. ప్రేమైక జీవనశైలి. కానీ, ఈ కథలో వ్యామోహాన్ని తట్టుకోలేనివాడు 'కత్తి'ని (తనని చంపుకోవడానికి కాదు, ప్రేమని చంపటానికి) ఆశ్రయించడమే జీవన విషాదం..!

కన్పిస్తూ, కన్పించకుండా.. అందీ, అందకుండా కవ్వించిన ఓ మోహ స్వప్నం..! దేహానికీ - దాహానికీ మధ్య, కోరికకీ - కట్టుబాటుకీ మధ్య కత్తుల వంతెన. రాజమ్మ రమించిన సౌందర్యమా? చెరచిన మోహమా? ఏమో! మోహం (విషం) పూసిన కత్తి అంచుమీద వాలి గాయపడిన ప్రేమ (తేనె) చిలుక ఆమె. తనని తాను (ప్రేమలో) పోగొట్టుకున్నప్పుడు తను ప్రేమించి, తనని (వ్యా)మోహించిన వాడి చేతిలో ప్రాణాలు పోగొట్టుకోవాల్సి రావటం జీవితానికి విషాదకర వ్యాఖ్యానం!

ఆమె ఒక కాంక్షాతప్త హృదయంలో దాగి ఎగిసిన ఓ రహస్యమోహపు అగ్నికణం..! జ్వలించిన మోహం రగిల్చిన విస్ఫోటన శకలం..! ఆమె ఓ అవ్యక్తావ్యక్త గాఢానురక్తి..! తన ప్రేమే ముల్లై తనలోకే దిగబడి రక్తంతో ఒళ్ళంతా ఎర్రబడిన గులాబీ రాజమ్మ..! ప్రేమతో వశమై, మోహమే పాశమై, తనువే శవమై..! గొంతులో దిగబడిన 'కత్తి' మరణించే ఉంటుంది! ప్రేమలో మోహం కల్తీ.. మోహంలో స్వార్థం కల్తీ.. స్వార్థంలో హింస కల్తీ.. బతుకులో చావు కల్తీ.. మరి 'చావు'? అదొక్కటే కల్తీలేనిదా? ఏమో!! ఈ కథ చదివిన పాఠకుడి గుండెల్లో ఇదీ అని చెప్పలేని వేదన సుళ్ళు తిరుగుతుంది. ప్రేమలోనూ, మోహంలోనూ పరవశత్వమూ, వివశత్వమూ తప్ప వివేకం ఉండదు. అందుకే ప్రేమలు విషాదాలుగానూ, వ్యామోహాలు వికృతాలుగానూ, క్రూరత్వాలుగానూ పరిణమిస్తుంటాయి!

ఈ కథ ముగింపు సంఘటనాత్మకమా? మానసిక పరిణామాత్మకమా? విహ్వల విషాదమా? మనకి కలిగేది జాలా? బాధా? కోపమా? నిరసనా? అది పాఠకుడి మనోస్థితికి సంబంధించింది. మనసు, ప్రేమ, కాంక్ష.. ఇవేవీ విశ్లేషణకందవు. అవన్నీ అనుభూతులు.. అలాగే ఈ కథ కూడా!!

– డా. ఎస్. సుదర్శనం,
సినీ హాస్యనటులు

లేకపోతోంది. ఈ లోకంలో కనుపించే సౌందర్య సర్వస్వాన్నీ తనలో కలుపుకోవాలనే కోర్కె, శారీరకమైన సెక్స్ వాంఛగా మళ్ళీ మళ్ళీ తలెత్తుతూ ఉంది. కాని క్షయతో తూట్లుపడిన ఊపిరితిత్తులూ, నీరసంతో వగర్చే పళ్ళూ, శరీరం యొక్క అల్పత్వం, ఆ కోర్కెని అపహాస్యం చేస్తున్నది. ఈ దేహంతో అనంతమైన సౌందర్య పిపాస తీరదు. శారీకమైన సెక్స్ ఒక ఉపశాంతి మాత్రమే! నిజానికి ఉపశాంతి కూడా కాదు! ఇది తనకు తెలిసినప్పటికీ, వ్యాధి నయమై శరీరం పుంజుకోవడం వల్ల, శరీరం చేస్తున్న ఆందోళన, మృత్యుభయం లేదన్న ధీమా వల్ల అణచుకోవడానికి వీలు లేనిదిగా ఉంటోంది.

మనిషి- అంటే మనస్సు - గొప్ప అవకాశవాది. అందుకే శ్మశానవైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం అన్నారు. ఏ తాత్త్విక దృక్పథమూ, రాజకీయ వాదమూ, సామాజిక సిద్ధాంతమూ మనిషిని నియంత్రించలేవు, అవసరానికీ ఉపయోగపడతాయి తప్ప. విశ్వం పరిస్థితులకు, మనస్తత్వానికీ విప్లవ రాజకీయాలు పనికివచ్చాయి. నిర్మలకు బహుశా శాస్త్రీయ దృక్పథమూ, స్త్రీ స్వాతంత్ర్య సిద్ధాంతాలూ ఉపయోగపడతాయి. క్షయ రోగిగా తనకు సర్వమూ మానసికమేనన్న తత్త్వం వచ్చినట్లు.. కాని తనింకా క్షయరోగినే నన్న సంగతి మరచిపోకూడదు. మరిచిపోతే ప్రమాదం..

"అయ్యగారూ! మనకు గుడ్లు సప్లయి చేసే ఆడమనిషి ఓ పది రూపాయలు ఎడ్వాన్సు కావాలంటోంది. ఉన్న కోళ్ళు పొదుగుతున్నాయంట. కొత్త పెట్టలు కొంటానికి డబ్బు పెట్టుబడి కావాలంట. ఆ మనిషయితే, నమ్మకంగా తాజాగుడ్లు ఇస్తది. రెండు రోజుల్నించి, ఎక్కడెక్కడో తిరిగొస్తున్నా మంచివి దొరకటంలే"

"ఎవరా మనిషి? ఎక్కడుంటుంది? "

"ఇక్కడే మనింటి వెనకాల గుడిసెలో" అంటూ పళ్ళికిలించాడు వెంకయ్య.

"ఎవరు? " అని మళ్ళీ అడిగాడు సారథి.

ఎవరో చప్పున తెలిసినా, వెంకయ్య నవ్వు చిరాకు కలిగించింది.

"మీరు మేడమీద వరండాలో కూచుంటే ఆ కనిపించే గుడిసెలో ఉంటాది. మీరు చూసే ఉంటారు"

"ఆ.. ఎవరావిడ? ఆమె భర్త ఏం చేస్తాడు? "

"వాడు లారీ డ్రైవరు. కట్టుకున్నవాడు కాదు. లేవదీసుకొచ్చిన బాపతు"

"ఏ ఊరు? "

"చిలకలపూడి"

"బందరు దగ్గర చిలకలపూడేనా? "

"ఆ అదే!.. అయితేనేం మంచి మని



షండీ.. మరి డబ్బిస్తారా? తనే వచ్చి అడుగుతానంటుంది. అదే గాకుండా.. ఆఫీసులో ఏమైనా స్వీపరో, నీళ్ల మనిషో, పని ఇప్పిస్తే జాగర్తగా చేసుకుంటానంటది.. మీతోవచ్చి కష్టసుఖాలు చెప్పుకోవాలంట"

"అలాగే.. ఈ పదీ పట్టుకెళ్లి ఇవ్వు"

మరుసటిరోజు రాత్రి భోజనం చేసి కూర్చున్నాడు సారథి. ముందర బల్లమీద తమలపాకులూ, వక్కపొడి, సున్నం ఉన్నాయి. వెంకయ్య ఆమెని ప్రవేశపెట్టాడు. వంట ఇంట్లో పనుందని వెళ్లిపోయాడు.

తమలపాకు చేతిలోకి తీసుకుని తొడిమ గిల్లుతూ "ఏమిటి? " అన్నాడు సారథి.

"ఇది తీసుకోండి" అన్నదామె.

తలెత్తి చూచాడు. పదిరూపాయల నోటు ఇవ్వబోతోంది.

"అవసరం లేదు. కోళ్లు కొన్నాను. డబ్బు అవసరం లేదు" అన్నది వివరిస్తూ.

దగ్గరగా చూస్తే ఆమె చాలా నాజూకు మనిషిగా, దూరంనుంచీ తను ఊహించిన దానికంటే ఆకర్షణీయంగా కనిపించింది. ఆమె చిరునవ్వుతో, దగ్గరగా వచ్చి నోటు తనవైపుకి చాచి నిల్చుంది.

తమలపాకుని ఎడమచేతిలోకి మార్చుకుని, ఆ నోటు తీసుకుని పళ్లెంలో పెట్టాడు.

"మరి వెంకయ్యతో అలా చెప్పడమెందుకు? "

"వెంకయ్యకు డబ్బు విషయం చెబితే గాని, ఇక్కడకు తీసుకురాడనీ"

సారథి ఆమె చొరవకు ఆశ్చర్యపడి, అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆమె పళ్లెంలోని ఆకులకు సున్నం రాసి, చుట్టి, వక్కపొడి పోసి చేతికందించింది. వ్రేళ్లు తాకాయి.

"ఏమిటలా చూస్తున్నారు? మేడమీద నుంచీ ప్రొద్దస్తమానం అలా చూస్తూ కూర్చుంటే ఎవళ్లయినా ఎలా సహిస్తారు? " అన్నదామె.

ఆమె తమలపాకు చిలుకలు చుట్టుతూ, అందిస్తూ ఉంది.

"నువ్వెలా సహించావ్? " అన్నాడు ఈసారి ఆమె చేతిని పట్టుకుని వదల్లేదు సారథి.

"అబ్బ, వదలండి.. వెంకయ్య వస్తాడు"

"వెంకయ్యేగా ఇక్కడికి తీసుకొచ్చాడు? "

"ఇహ నే వెళ్తాను"

"అంతలోనే? నువ్వు వచ్చిన పనేమిటో చెప్పకుండానే? "

"మీ డబ్బు మీకిచ్చాను. మిమ్మల్ని చూశాను. ఆపైన మీ దయ"

"నీ పేరేమిటి? "

"రాజమ్మ, రాజలక్ష్మి"

"అయితే రాజలక్ష్మీ, నీకేం ఉద్యోగం కావాలి? నువ్వెంతదాకా చదువుకున్నావ్? "

"అయిదో తరగతి.. మీ పాదాల దగ్గర ఏ ఉద్యోగమైనా సరే.. మీ బాంచను" అన్నది నవ్వుతూ మధ్య కొంటెగా.

"సరే, నువ్వు తెలంగాణా కూడా చూశావన్నమాట? "

"ఆ.. అన్నమాట! ఏడాది ఉన్నం దొరా!" అన్నది తెలంగాణా యాసలో.

"తాంబూలం వేసుకో రాజలక్ష్మి"

"ఏదీ మీరివ్వందే!"

సారథి లేచాడు. వెళ్లి గది తలుపు గడియ పెట్టి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

తర్వాత ఆమె ఇంచుమించు రోజూ వస్తూనే ఉంది. సారథి ఏమీ ఇవ్వబోయినా, చీరెలువంటి బహుమానాలు కాని, వస్తువులు కాని ఆమె తీసుకోవడానికి నిరాకరించింది. గుడిసెలో కాపురమున్నా తనకు దారిద్ర్యం లేదన్నది. వెంకయ్యకు మాత్రం అతని జీతంగాక అదనంగా ఇవ్వమని ఆమె సలహా.

శారీరకమైన 'సెక్స్' మానసికమైన ఆకర్షణ స్థాయిని అందుకోలేదన్న సారథి సిద్ధాంతం కొత్త అనుభవంతో, నిరాధారమని తేలింది. మనసు మనస్సుగా



అందుకోలేని శిఖరాగ్రాన్ని దేనినో ఈ అనుభవం అందుకుంటోంది. సారథికి ఇప్పుడు సందేహాలూ, ఊహలూ, రావడం లేదు. ఆమె రాకకు ఎదురు చూడడమే మనుగడకి అర్థం, పరమార్థంగా ఉన్నది. నిజానికి ఈ అనుభూతి శరీరాన్ని, మనస్సునీ అధిగమించిన దివ్యానుభూతిగా ఉంది..

ఒకనెల గడిచింది. సారథికి రాత్రిపూట దగ్గు వస్తోంది. రాజలక్ష్మి ఇప్పుడు మూడు నాలుగు రోజులు వరుసగా వెంకయ్యచేత కబురు పెట్టితేగాని, రావడం లేదు. వచ్చినప్పుడు "మీ ఆరోగ్యం జాగ్రత్త! మీరు డాక్టర్ని చూశారా? " అంటున్నది.

సారథికి డాక్టరు దగ్గరకు వెళ్లడానికి మనస్కరించడం లేదు.

సారథికి మగపిల్లవాడు పుట్టాడని టెలిగ్రాం వచ్చింది.

రాజలక్ష్మితో చెప్పాడు.

"ఇహనేం! వెళ్లిరండి.. మీ ఆవిడ కూడా వచ్చేస్తుంది తొందరలోనే!"

సారథి ఆలోచిస్తున్నాడు. ఏమీ అనలేదు.

"వచ్చేనెలలో మేం కూడా వెళ్లిపోతున్నాం" అన్నదామె.

"ఎక్కడికి? "

"మరో ఊరు"

"నువ్వు వెళ్లడం దేనికి? వెడితే అతను వెళ్లనీ, ఈ ఊళ్లో మంచిల్లు చూస్తాను. అక్కడ ఉందుగాని, నువ్వేం నాకు భారం కాదు" అన్నాడు సారథి.

ఆమె నవ్వుతోంది. బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుని

"మంచివారే! నా భర్త నన్నలా వదలి వెళ్తాడా! నన్ను చంపేస్తాడు? "

"నీ భర్తా? నిన్ను లేవదీసుకుని వచ్చాడుగా. అతనికేం అధికారం? "

"కాదు, దైవసాక్షిగా తాళికట్టిన భర్త"

"మరి వెంకయ్య అలా చెప్పాడేం? "

"వెంకయ్యకు అలా చెబితేగాని అర్థం కాదు! మీతో స్నేహం చేసుకోవడానికి ఎన్ని పాట్లు పడ్డాననీ"

"మరి నీ భర్త ఉండగా నువ్వు చేస్తున్న దేమిటి? "

"ఆయన లోకం చూపించిన మొగుడు, నువ్వు మనస్సుకి నచ్చిన వాడివి"

"మరి నాతో ఉండక, అతనితో వెళ్లిపోతానంటావేం? "

"అది అంతే! నలుగురూ నడిచే దోవన నడవొద్దా? "

సారథి ప్రాధేయపడ్డాడు. అలిగాడు. ఆశలు పెట్టాడు. ఆస్తి వ్రాసి ఇస్తానన్నాడు. రాజలక్ష్మి ససేమిరా అన్నది.

ఆ రాత్రి ఆమె వెళ్లిపోయాక అతనికి రక్తం వాంతి అయింది. బేసిన్‌లో ఆ ఎరుపు మీద కొళాయి త్రిప్పి, నోరు కడుక్కుని వచ్చి పడుకున్నాడు.

రాజలక్ష్మికి కబురు చెయ్యగా, చెయ్యగా నాలుగు రోజులకి వచ్చింది. ఆమె భర్త ఆ తెల్లవారు జామున వస్తాడట. మరుసటి రోజే తను వెళ్లిపోతుందట. వచ్చే నెలదాకా ఆగదట.

సారథి ఆపిల్ పండు ముక్కలు కోస్తున్నాడు. కత్తి పదునుగా ఉంది. వేలుకోసుకున్న రక్తం చివ్వుమని, ముక్కలకు అంటింది.

"మీ రక్తం అంటిన ముక్క నేను తినాలి" అన్నది రాజలక్ష్మి.

ఆ రాత్రి అతని కౌగిట్లో మైమరచి కన్నుల మూసిన క్షణంలో, కత్తి ఆమె గొంతులో గాఢంగా దిగబడింది.

సారథిని పోలీసులు పట్టుకున్నారు.

విశ్వాన్ని పోలీసులు కాల్చేశారు.

'మృత్యోర్మా అమృతంగమయ'



నిర్వహణ :
డా. వేదగిరి రాంబాబు



- కె.ఆర్. మీర

కామెర్లు

మలయాళ కథ

ఆమెకి నిజంగా పచ్చకామెర్లే. అందువల్ల అంతా పసుపు రంగులోనే కనబడింది. అక్కడక్కడ నెరిసిన అతని జుట్టు, మెరిసే కళ్ళు, శుభ్రంగా వున్న గోళ్ళు అంతా పసుపు రంగులోనే కనబడ్డాయి. అతన్నికైతే ఒక కొత్తరకం వైరల్ జ్వరం. అందువల్ల ఆమె ఉంగరాల జుట్టు, పాలిపోయిన బుగ్గలు, నుదిటి మీద నల్లబొట్టు- అంతా ఊదా రంగులో కనబడ్డాయి. లాడ్జిలోని గదిలో కూర్చున్నారు వాళ్ళు. అతడు నిజంగా ఒక పసుపురంగు మనిషి అని ఆమె అనుకుంది. ఆమె ఒక ఊదా రంగు మనిషి అని అతడు నమ్మాడు. కానీ నిజంగా వాళ్ళు అప్పుడు కేవలం ఒక ఆడ, మగా మాత్రమే! ఆవిడకి సుమారు ముప్పై అయిదేళ్లు ఉంటాయి -విడాకులు తీసుకున్న స్త్రీ, ఇద్దరు పిల్లల తల్లి- అతనైతే భార్య, ఇద్దరు పిల్లలు వున్నవాడు- నలభై దాటినవాడు!

వాళ్లను ఆ చిన్న లాడ్జికి తీసుకొచ్చినది స్త్రీ పురుషుల మధ్య వుండే సహజమైన లైంగిక ఆసక్తే. మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అంటుకుంది వాళ్ళకు ఆ రోగం. ఆసుపత్రిలో కామబాధితులు కాని వారెవ్వరు? చనిపోయినవారి వేల వేల శరీరాల్లో నుంచి చెదిరిన కోరికలు ఆసుపత్రి వాతావరణంలో తేలియాడుతూ వుంటాయి కదా. హఠాత్తుగా ఒకరోజు పాత రోటి మీద నాచులా వానాకాలంలో మొలకెత్తే కుక్కగొడుగుల్లా అనుకూల వాతావరణంలో కోరికలు మొలకెత్తుతాయి. అసలే ప్రేమరాహిత్యం వల్ల బాధపడే మనుషులు- పైగా రోగులు. శరీరం రకరకాల నైరాశ్యాలతో మరుగుతూ ఆవిరిగా మారి వాతావరణంలో లీనమవుతూ ఉంటుంది. ప్రేమ కనికట్టు తెలిసిన వారెవ్వరైనా పెదవులపై మంత్రాలతో ఆ ఆవిరిని మళ్ళీ శరీరంగా మారిస్తే బాగుంటుందనే ఆశ ఉంటుంది. ఆ పెదవులపై పొగాకు మచ్చ వున్నా, నోటికి దుర్వాసన వున్నా అప్పుడు వాటి గురించి పెద్దగా పట్టించుకోరు. ఈ మనుషుల సంగతి అంతే.

అంటు రోగుల వార్డులో కలిసారు వాళ్ళు. ఇతర వార్డులకు లేని గాజు తలుపులు వున్నాయి ఆ వార్డుకి. తలుపు పైన ఎర్రరంగులో 24 అనే సంఖ్య రాసి వుంది. ఆ పక్కనే ఓ.పి. గోడవారగా రోగులు కూర్చునే కుర్చీలు. గేటుని ఆనుకుని ఉంది అవుట్ పేషెంట్ విభాగం. అవసరమైతే మార్చురీ కూడా దగ్గరే.

ఆమె ముందు వచ్చింది ఆ రోజు. బయట సన్నటి వానతుంపరలు పడుతున్నాయి. తుంపరల్లో తడుస్తూ పరుగెత్తుకొచ్చాడు అతడు. చేతి రుమాలుతో ముఖం వత్తుకుని ఆమె ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని తలయెత్తి ఆమె కళ్లలోకి చూశాడు. అతన్ని అంతవరకు ఎప్పుడూ చూడలేదామె. అయినా ప్రేమ వ్యవహారాల్లో జరుగుతున్నట్టు, అతన్ని ఎక్కడో చూశాను కదా అనిపించింది ఆమెకి. అత

నికి కూడా ఆమె పరిచయస్తురాలిగానే తోచింది. వాళ్ళ చూపులు, చాలాసార్లు కరచాలనం చేస్తూ వెళ్ళాయి. ఆలోగా ఒక రోగి అటెండర్తో గొడవపడినప్పుడు అతడు ఏదో ఛలోక్తి విసిరి నవ్వాడు. ఆ మాటకి ఆమె కూడా చిరునవ్వు నవ్వింది. ఆ తరువాత ఆమె పక్కనే కూర్చున్న ఆవిడ ఏదో చెప్పినప్పుడు పకపకా నవ్వకుండా ఉండలేకపోయింది. అప్పుడు ఆమెకు ఎవరో గుర్తుకొచ్చారు. ఆ జ్ఞాపకాల్లోనుంచి తేరుకుని ఒక నిట్టూర్పుతో తలయెత్తి చూసినప్పుడు పక్క కుర్చీలో వున్నాడు అతడు. అతడు కూడా ఏదో ఆలోచిస్తూనే వున్నట్టు కనబడ్డాడు. ఏం ఆలోచిస్తున్నాడు అతడు? జబ్బు గురించా- మరణం గురించా- లేకపోతే తన భార్య గురించా? తను చనిపోతే అనాథలుగా మారే పిల్లల గురించా? ఏమో!

హఠాత్తుగా గుర్తు వచ్చింది ఆమెకి పొద్దున పిల్లలను బడికి పంపే హడావిడిలో తయారుచేసిన టీ తాగలేదనే సంగతి. అప్పుడు ఆమె వైపు తిరిగి అడిగాడు అతడు.

"ఒక టీ తాగుదామా? "

ఉలిక్కిపడింది ఆమె. వెంటనే జవాబు చెప్పలేకపోయింది. ఆమె ముఖం ఎర్రబడింది.

"మన నెంబర్ వెంటనే రాదు" అతడు మళ్ళీ అన్నాడు.

తను చులకనైనట్టు తోచింది ఆమెకి. టీ తాగలేదనే బాధ తన ముఖం మీద అంత ప్రస్ఫుటంగా కనబడుతోందా అనే ఆలోచనతో ముఖం మరికొంత ఎర్రబడింది. ఏది ఏమైనా చాలా కాలం తరువాత ఒక మగాడ్ని మెచ్చుకుని చిరునవ్వు నవ్వి అంది "వెళ్దాం."

వానతుంపర్లకు తడిసిన రోడ్డు మీద నడుస్తువుంటే, భర్త నుండి విడాకులు తీసుకున్నాక, తను ఒక మగాడితో కలసి నడవటం అదే మొదటిసారని గుర్తు వచ్చింది. తను ఇచ్చే అంత ఉన్నత గౌరవానికి అతడు అర్హుడేనా అనే అనుమానం కూడా కలిగింది. పొడుగు మనిషి అతడు. పూర్తి ఆత్మవిశ్వాసంతో గట్టిగా అడుగులు వేస్తున్నాడు కానీ లోలోపల ఏదో నిరాశ ఉన్నట్టు తోచింది ఆమెకి. ఆడవాళ్ళ నైరాశ్యం వాళ్ళ కళ్ళ చుట్టూ నల్లటి వలయాల్ని ఏర్పరుస్తుంది - మగాళ్ల నైరాశ్యం వాళ్ళ అడుగుల్లో తెలుస్తుంది. ఆమె కళ్ళచుట్టూ నలుపు తేలివుండేది. అప్పుడప్పుడు తలయెత్తే అస్వస్థతలు ఏ మందుకూ లొంగటం లేదనే బాధ ఆమెది. రక్త పరీక్షలు చేయించి, చేయించి విసుగు వచ్చేసింది. ఆరోజైనా డాక్టరుగారు రోగకారణం కనుక్కొని సరైన మందులు ఇవ్వకపోతే డాక్టరు వద్దకు వెళ్ళటం మానేయాలని కూడా, ఆసుపత్రికి బయలుదేరినప్పుడు అనుకున్నదే- కానీ అప్పుడు ఊపిరి పీల్చటానికి ఇబ్బంది పడుతూ ఇన్‌హేలర్ వెతుకుతూ తనవద్దకు వచ్చిన పెద్దకొడుకుని చూసి నిర్ణయం మార్చుకుంది. తను లేకపోతే నిద్రపోలేక రాత్రంతా ఇబ్బంది పడే వాడి వీపు నిమిరేది ఎవ్వరు? దెబ్బలాడుకునే పిల్లలను విడదీయడానికి వాళ్ళకు కొత్తబట్టలు కొనటానికి, వాళ్ళ పుట్టినరోజులు గుర్తుంచుకుని స్కూలుకి చాక్లెట్లు ఇచ్చి పంపటానికి, వాళ్ళ ముఖాల్లో చిరునవ్వు నింపటానికి వేరెవ్వరున్నారు?

"మీ ఇల్లెక్కడ" అతడు అడిగాడు.

ఆమె జవాబు చెప్పలేదు- తన పిల్లలు గురించే ఆలోచిస్తోన్న ఆమె, ఆ ప్రశ్న బహుశా వినలేదేమో.

అతడు కొంత కంగారు పడ్డాడు. ఆమెని ఒకసారి పరిశీలనగా చూశాడు. ముప్పై అయిదేళ్లు దాటిన స్త్రీ ఆమె- కొబ్బరి చీపురుతో ఊడ్చిన వాకిలిలా గీతలు తేలిన పొట్ట- ఆత్మ విశ్వాసం కోల్పోయిన



రొమ్ములు - అందాల కొలతలకు లొంగని పిరుదులు- అలాంటి శరీరంతో కూడిన స్త్రీని ఇష్టపడే మగాడెవ్వరు? ఈ రోజుల్లో యవ్వనపు చివరి మెట్లమీద వుండే స్త్రీల సంగతి బాధాకరమే!

టీ కొట్టు చేరుకున్నారు వాళ్లు. ఖాళీగా వుండే ఒక మూలలో కూర్చున్నారు.

"నేను మిమ్మల్ని ఎక్కడో చూశాను" అన్నాడు.

"ఎల్. ఐ. సి. లో ఉద్యోగం చేస్తున్నాను"

అతడు చిరునవ్వు నవ్వాడు.

"మీరేం చేస్తున్నారు? "

"అధ్యాపకుణ్ణి. మీ జబ్బేమిటి? "

"తెలియదు" -ఆమె బాధగా నవ్వింది.

"మీ జబ్బేమిటి? "

"ఒకరకం వైరల్ జ్వరం- ఇంచుమించు నయమైనట్టే -అయినా అప్పుడప్పుడు టెస్టు చేయించుకోవాలి"



ఆలోగా టీ వచ్చింది. మాట్లాడకుండా టీ తాగారు వాళ్ళు. బిల్లు చెల్లించినది అతడే.

ఆసుపత్రికి తిరిగి వచ్చేటప్పుడు వాళ్ళు అసలు మాట్లాడుకోలేదు. డాక్టరు రక్తప రీక్ష, మూత్రపరీక్ష చేయించమన్నాడు. ఆమె డాక్టరుని కలిసి బయటకు వస్తున్న ప్పుడు డాక్టరు గదిలోకి ప్రవేశించాడు అతడు. వీడ్కోలు చెప్తున్నట్టు అతన్ని ఒక సారి చూసింది. వెంటనే అతనిలోని ఏదో ఒక అస్వస్థత తనలోకి సంక్రమించినట్టు అనిపించింది ఆమెకు. ఎన్నిరకాల రోగాలు ఈ ప్రపంచంలో- కొన్ని ముట్టుకుంటే అంటుకుంటాయి, మరికొన్ని చూపుల ద్వారా అంటుకుంటాయి, కొన్ని గాలి ద్వారానూ- వీటన్నిటికి డాక్టరు దగ్గర మందుంటే బాగుండేది.

రక్తపరీక్ష కోసం వరసలో నిలబడింది ఆమె. అక్కడికీ వచ్చాడు అతడు. పరుగు లాంటి నడకతో వచ్చిన అతని కళ్ళు ఎవ రి కోసమో వెతుకుతున్నట్టు కనబడ్డాయి. అక్కడక్కడ నెరిసిన జుట్టుతో ముఖం నిండా బతుకు బాధ్యతలు గీసిన గీతలతో వచ్చే అతన్ని చూసి ముచ్చట వేసింది ఆమెకి. కానీ అతని కళ్ళు వెతికేవి తననే నని వెంటనే గుర్తుకొచ్చి ఆమె ముఖం తిప్పుకుంది. అయినా కొంత ఆనందం కలి గింది. చాలా కాలం తరువాత ఒక మగాడి కళ్ళు తనను వెతుకుతున్నాయని తెలిస్తే ఆనందంతో గుండె నిండని ఆడది ఉండదుగా.

అతడు ఆమెను సమీపించాడు. తనకూ రక్తపరీక్ష రాశారని చెప్పాడు. కాని రిజల్టు వచ్చేటప్పటికి మూడు గంటలవుతుంది. అందువల్ల సాయంత్రం వరకు ఉండి రిజల్టు డాక్టరుకి చూపించి వెళ్ళటం మంచిది అని అన్నాడు.

"రిజల్టు తీసుకుని నేను వెళ్ళిపోతాను. మరో రోజు వచ్చి డాక్టరుని కలుస్తాను"- అని ఆమె అంది.

అతని ముఖం వాడింది "మరో రోజు రావటం ఎందుకు? ఆ పని ఈ రోజే చేయవచ్చు కదా? " అతడు అడిగాడు. ఆమె వైపు చూడకుండా ఉండడానికి చాలా ప్రయత్నించాడు. చూస్తే తన చూపులు ఆమె ఒంటికి అంటుకుపోతాయి అనీ ఆమె తనను ఒక స్త్రీలోలుడుగా లెక్క వేస్తుంది అనీ భయపడ్డాడు. నలభైయ్యేళ్ళు దాటిన మగాళ్ల సమస్య ఇదే! వాళ్ళు స్త్రీలను ఉత్త శరీరాలుగానే చూడగలరు. తనతో గడిపి నప్పుడు ఈ స్త్రీ తనకేం విలువ కడుతుం దని ఆందోళన చెందుతూ ఉంటారు. నిజం చెప్పాలంటే కొంత వయసు వచ్చిన మగాళ్ల సంగతి కూడా కష్టమే!

పరీక్షకి రక్తమిచ్చి బయటకు రాగానే ధైర్యం కూడబెట్టుకుని అతడు అన్నాడు "మనం చిన్నవాళ్లమై ఉంటే ఒక సినిమాకి వెళ్లి ఉండవచ్చు"

అరనవ్వు నవ్వింది ఆమె. కాసేపు పోయాక అడిగింది. ఈ టైంలో సినిమా ఎక్కడ ఉంటుంది ఎదురుగా కనబడింది ఒక సినిమా పోస్టర్- మధ్యాహ్నం ఆటది ఆ పోస్టర్- ఒక తమిళ సినిమా- సినిమా హాలు వెతికి పట్టుకున్నారు- టికెట్టు తీసు కుని పక్క పక్క సీట్లల్లో కూర్చున్నారు. తమిళ సినిమా కనుక వాళ్ళకి మాటలు అర్థం కాలేదు. అయినా పాటలూ డాన్సులూ ఆస్వాదించారు. ఇంటర్వెల్ తరువాత అతడు మెల్లగా ఆమె భుజం మీద చేయి వేసుకుని కూర్చున్నాడు. ఆమె అభ్యంతరం చెప్పలేదు. కాసేపు పోయాక అతని భుజం మీద తల వాల్చింది ఆమె.

సినిమా తరువాత హోటలుకు వెళ్లి భోజనం చేశారు. హోటల్ మెట్లు దిగుతు న్నప్పుడు తల తిరుగుతున్నట్లు తోచింది ఆమెకి. అంతా పసుపు రంగులో కనబడు తున్నట్టు- కంగారుపడ్డాడు అతడు. ఆమె నుదుటి మీద, మెడ మీద చేయి వేసి



ఒంటి వెచ్చదనం చూశాడు. ఎక్కడైనా కాసేపు విశ్రాంతి తీసుకుంటే మంచిదని అన్నాడు. ఆమె కూడా ఒప్పుకుంది. అలా ఆ లాడ్జిలో చేరారు వాళ్ళు.

తెల్లదుప్పటి పరిచిన పరుపు మీద పడుకుంది ఆమె. ఆమె అరచేతులు నిమురుతూ పక్కనే కూర్చున్నాడు అతడు. పాపం! ఇద్దరూ ఇద్దరే. ప్రేమించడానికి అతితక్కువ సమయం మిగిలినవారు ప్రేమించడానికి సిగ్గుపడేవారు, ధైర్యం లేనివారు. అయినా ప్రేమను వదిలేసుకునే ధైర్యం లేనివారు!

అతని చేతుల నుంచి చూపు మరల్చలేకపోయింది ఆమె. ఒకసారైనా మురికి అంటని లేలేత పసుపు వేళ్లు అతనివి. ఆమె ఇంతక్రితం చూసి ఉన్న చేతుల్లా నల్లని గోళ్లు కావు అతనివి.

ఆమె చేతులు గరుకుగానే ఉండేవి. గిన్నెలు తోమటం వల్లనూ బట్టలు ఉతకటం వల్లనూ ఆమె నఖాలపై నల్లని పొర ఉండేది. అతని భార్య గోరులు ఎలా ఉంటాయి అని ఆలోచించింది ఆమె. అతనైతే అప్పుడు ఆమె భర్త గురించి ఆలోచించాడు. అతడు ఎలా ఉంటాడు? ఆమెని ఎందుకు వదిలేశాడు? ఎవరు ఎవరిని వదిలేసినట్టు-

మెల్లగా ఆమె బుగ్గలను తాకాడు అతడు. ఆ అరచేతిని గట్టిగా పట్టుకుంది ఆమె.

"ఇప్పుడు ఎలా ఉంది? పసుపు చూపు కొంత తగ్గిందా" అతడు ఆత్రుతగా అడిగాడు.

"లేదు" ఆమె నవ్వింది "మరి మీకు"

"నాకు జ్వరం కదా కంటికి ఒకవైపు ఎరుపు - మరోవైపు నలుపు"

ఆమె నవ్వింది. అతడు కూడా నవ్వాడు. ఒక ఆడా ఒక మగా వేరెవ్వరు లేని గదిలో కూర్చుని నవ్వటం ప్రారంభిస్తే ఏదైనా జరగవచ్చు. ఏడ్చే దాకా నవ్వ వచ్చు. నవ్వు ఒక కనికట్టు. నవ్వుతుంటే ఆమె అందంగా ఉన్నట్లు అతనికి, అతడు అందగాడని ఆమెకి అనిపించింది. మొత్తానికి ఆ రోజు పొద్దున పరిచయమైన ఆ అంటురోగులు తమ ఇల్లు మరిచి ఊరు మరిచి సంప్రదాయం మరిచి ఆ గదిలో కలిశారు. వాళ్లు నిద్రలేచి బయటకి వచ్చినప్పుడు మెడికల్ కాలేజిలోని ఒ.పి. మూసేశారు. ఆకాశంలోని నక్షత్రాల ఒ.పి. తెరచి ఉంది.

ఇల్లు చేరాక ఆమె జబ్బు ముదిరింది.

"ఏమైందమ్మా" ఆమెకి దగ్గరగా వచ్చి కూర్చుని చిన్న కొడుకు అడిగాడు.

"ఏం లేదురా. అంతా పసుపుగా కనబడుతోంది. ఫర్వాలేదులే. తగ్గిపోతుంది"

రాత్రికి మరీ వికటించింది రోగం. ఆమె పిల్లలు కంగారుపడ్డారు. పొరుగింటి వారిని నిద్రలేపారు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు వాళ్లు. జబ్బు కామెర్లేనని నిర్ధారించారు డాక్టర్లు. రెండు మూడు వారాలు ఆసుపత్రిలో ఉంది ఆమె. మైకంలో ఉన్న ఆమె మళ్ళీ మళ్ళీ అతన్ని చూసింది... అప్పుడు కూడా అతడు పసుపు రంగులోనే కనబడ్డాడు-

అనువాదం :
ఎల్.ఆర్. స్వామి

పసుపు రంగు జుట్టు- కళ్ళు- చెవులు- పెదవులు- అంతా పసుపు రంగే!

జబ్బు నయమై ఇంటికి వచ్చాక ఒక రోజు మళ్ళీ కనబడ్డాడు అతడు- మల్లెతీగకి చుట్టుకుని రెపరెపలాడే ఒక పేపరు ముక్కలో కనబడ్డాడు...

పచ్చకామెర్ల వల్ల మరో అధ్యాపకుడు కూడా చనిపోయాడని కాబోలు రాసి ఉంది. దాని కింద పసుపు రంగులో అతని ఫోటో...

సత్య విచారణ

- కీ.శే. చలం

తెలుగు కథ

మా డివిజన్ పోలీసు వాళ్ళందరమూ కింద నించి పైదాకా నల్లమందు తిని నిద్ర పోతున్నట్లున్నామని సూపరెంటెండెంటు నించి గూటింపులు తీవ్రంగా వచ్చినరోజే 'టోలుగేటు' పక్కన ఓ మొండెమూ, గాడి బావి దగ్గర తలా దొరికాయి. యింక యీ కేసన్నా శ్రద్ధ వహించి ఆచూకీ తియ్యక పోతే, 'సస్పెన్షన్' దాకా వస్తుందని మూడు రోజులు నిద్రాహారాలు లేకుండా తిరిగి దోషుల్ని గుర్తించాను. కానీ వాళ్లు నలుగురూ మాయమైనారు.

ప్రచ్ఛన్న రూపంలో వాళ్ళ జాడలు పసిగడుతూ పల్నాటి సీమను పడ్డాను. వేళకు తిండి లేక బళ్ళల్లోను, బస్సుల్లోనూ కునికిపాట్లు తప్ప నిద్ర లేక, నా పాత స్నేహితుడు చలి జ్వరం మళ్లీ కొంచెంగా పలకరించగా, చివరికి వాళ్లనందుకున్నాను. యింక వల వేసి వాళ్లని పట్టాలి. పూర్తిగా అలసిపోయినాను. విసుగు పుట్టింది. బతుకంటే ధైర్యం చచ్చింది.

నా ఆరుగురు పిల్లలూ, భార్యా తిండి లేక గిలగిలలాడడమూ, అందులో నలుగురు ఆడపిల్లలూ ఐదేసి వేలు అర్పించమని కాళీ అవతారాల్లాగా నా గుండెల మీద కూచోడమూ, వీటి వల్ల పస్తాయించాను గాని, లేకపోతే ఆ క్షణాన వెధవ నౌకరీకి ఒక్క పెద్దసలాము చెప్పి, మా పూర్వుల యాయవారం చెంబునాశ్రయించి వుందును. నౌకరీల్లోకల్లా నీచమైన నౌకరీ పోలీసు నౌకరీ.

రాత్రులు పూరి వెలుపల అడవిలో నాకు కావలసిన పెద్ద మనుషులు నలుగురూ చేర్తారని తెలిసి, యీల వేస్తే అందేట్టు జవాన్లని దాక్కోమని చెప్పి నేను గొంగడీ కప్పుకుని బైలుదేరాను.

ఆ చలికాలపు సాయంత్రం గుడిశ వెనక నుంచి చింత తోపులో ఏదో యెర్రగా కాలుతోంది. పడమటి మూల నేననుకున్నట్టే తలుపు బిగించివుంది. దొంగ దగ్గుతో వొణుకుతో పొదకింద మఠం వేశాను. ఆ కాస్త వెలుతురూ మాయమయింది. చింతల్లోంచి పురుగులు కీచుమంటున్నాయి.

గబ్బిలాలుగావును నల్లగా నలుపులో రెక్కలు కొట్టుకుంటూ భూతాల్లాగా లేచిపోతున్నాయి. అక్కడక్కడ జరజరమని యెండుటాకుల మీద అనుమానంగా పాకుతున్నాయి ఏవో, ఈల నోట్లో పెడితే పదిమంది యములవంటి జవాన్లు వస్తారనే ధైర్యమే లేకపోతే, వాళ్లు నా పిరికితనానికి నవ్వుతారనే భయమే లేకపోతే వెంటనే పరిగెత్తుదును భయంకరమైన ఆ చోటు నుంచి. దూరం నించి పాట పాడుకొంటూ నెత్తిన కడవ పెట్టుకుని ఒకామె వచ్చింది. ఆ పాట వింటేనే నాకు భయంతో వొళ్లు వొణికింది.

చింతల చీకట్లో, ఆకాశపు సంధ్య యెరుపుల్లో, హత్యల రక్తంలో, క్రూరుల ముద్దుల్లో, నరబలుల పాపంలో నానింది ఆ గొంతు. కానీ ఆ భయంలోనించి ఆనందం కలుగుతోంది. ఆ కంఠస్వరపు లోతు, ఆ మాటల పటుత్వం, ధీరత్వం, నల్లని స్త్రీ నల్లని చీర కట్టుకుని చింత నీడల చీకట్లో



నుంచుని, ఆగి, నా వంక తిరిగింది.

"ఎవరు? " ఎంత ధైర్యం, పొగరుబోతు తనం!

మూలిగాను. దగ్గాను.

"ఎవరు తాతా నువ్వు? "

"నేను తాతను కాను"

నవ్వింది. ఏం ధైర్యం? ఆ గుడిశే నాదై, ఆ రేగిచెట్టు కింద చీకట్లో ఎవరో దగ్గితే, కడవ పారేసి వెనక్కి విరుచుకుపడుదును నేనైతే.

"అంతా మోసమే!"

కనిపెట్టిందా యేవిటి?

"జబ్బుగా ఉంది"

"ఏ వూరు? "

బొంకాను.

"ఎవరు? "

"బొంకాను"

"ఎక్కడికి వెడతావు? "

"ఎక్కడికేముంది, యింత ప్రపంచంలో"

"యిక్కడికే నన్నమాట!"

కనిపెట్టిందా? బెదిరింపా?

"చలి, చలి"

పళ్ళు పటపటమనిపించాను. కడవ దింపి తడిక వూడదీసి, దీపం వెలిగించింది.

"అక్కడే వుండు పిలిచిందాకా? "

కడవలోంచి కల్లు కంపు కొడుతోంది. గదిలో సద్దుతోంది...

"రా, తాతా"

"తాతని కానంటే!"

"రా, పడుచూ"

పకపకా నవ్వింది. చుట్టూ చింతలూ, నేపాళాలూ, చిటిరేగి పొదలు, గుడ్లగూబలూ నవ్వాయి. గుడిశె నాలుగుపక్కలా చూశాను.

ఒక మూల పొయ్యీ, తాళ్ళూ, నాలుగు గోనెలూ గొంగళ్ళూ, ఒక పెద్ద పెట్టీ, మూడు కుండలూ- అంతే. ఏమీ అనుమానాస్పదంగా లేదు. నన్నామె కళ్ళు పరీక్షించడం, 'ఫీలై' నేనామె వొంక తిరిగి చూశాను. ముప్పైయేళ్లుంటాయి. వక్షము చాలా ఎత్తు, అంత ఎత్తూ, బలుపూ, బిగువూ ఐన రొమ్ముని నేనెప్పుడూ చూడలేదు.

నడుము సన్నము, ఆ గుండ్ర మొహాన్నీ, ఆ పెదవుల్నీ, మొహంమీద పడే జుట్టులో కనబడని కళ్లనీ, ఆ వొంటి రంగునీ చూస్తే రాతితో చెక్కిన విగ్రహం ప్రాణం ధరించి కదులుతోందనిపిస్తోంది. జుట్టులోంచి కళ్లు కనపడకపోయినా చూపులు మాత్రం సూటిగా, వాడిగా గుచ్చుకుంటున్నాయి.

ఆ భుజాల ఎత్తూ.. తొడల జవజవా.. ఆ కంఠం గుండ్రతనమూ.. ఆ వెంట్రుకల బిరుసూ చూస్తే... పురాతనపు రాక్షసాంగనల ఆకర్షణ యిట్లా వుండేదేమో అనిపించింది. చప్పున నా కళ్లనించి తిరిగి పొయ్యి వెలిగించి, దీపం గుమ్మం అవతలగా బైటపెడుతూ నా వంక చూసి, చిరునవ్వుతో 'పురుగులు' అంది. బైట దీపం లోపల కొత్తవాడున్నాడని తెలిపేందుకని నాకేం తెలుసు?

పొయ్యి మంటలు గంతులేస్తున్నాయి. వాటికి తాళమేస్తూ చీకట్లు, గోడల మీద నీడలు నాట్యమాడుతున్నాయి. బొద్దింకలు చెదిరి పరుగెత్తుతున్నాయి. బూజు కళ్ల మీదికి వేళ్లాడుతోంది.

"తాతా, గంజి తాగుతావా? " అంది బియ్యం కడుగుతూ.

నవ్వుతోందా?

"తాగనూ మరి! సాయింత్రం నుంచి ఆకలిగా వుంది. పొద్దున ఆ కోమటి తల్లి పోసింది ఇంత చద్ది అంబలి అంతే"

పొయ్యి మీద బియ్యం వేసి "యిప్పుడే వొస్తా కూచో" అని, చెంబూ, నీళ్ళు పట్టుకుని వెళ్లింది.

పొయ్యి కెదురుగా కూచున్నాను. వొస్తారా వాళ్లు? నేనున్నానని భయపడి వెనక్కి పోతారా? యీ ఆడమనిషి వుంటుందనుకోలేదు. వాళ్లే రావడం, యీల వేసి పట్టించడం అనుకున్నాను. కానీ..!

పావుగంటలో వొచ్చింది. తలలో తెల్లని పూలేవో పెట్టింది. వాటి వాసనతో గుడిసె నిండింది. నల్లని బూజుపట్టిన మూకుడు పెట్టి దాంట్లోనే గంజి పోస్తోంది. మనస్సు పట్టలేక పోయినాను. పుట్టింది బ్రాహ్మణ పుట్టుక మరి!

"అది కడుగుదూ!"

పక్కున నవ్వింది.

"అలవాటు లేదు గావును!" అని కడిగింది. ఎంత ఆచారాలు వొదిలినా విస్తరి చుట్టూ నీళ్ళు చుట్టటం మానలేదు. చెయ్యన్నా కడుక్కోకుండా ఆ మూకుడులో మెతుకులు ఏరదామంటే, చెయ్యి సాగదు. కాని వొణికానా, సందేహించానా, ఈ శ్రమంతా వృధే! ముక్కు మూసుకుని, మూకుడెత్తి ఔషధమల్లే తాగాను.

"యేం తాతా, మాయకోమటిదాని వుత్త అంబలే రుచిగా వున్నట్టుందే!"

అంటూ నవ్వింది.

"యిది వేడిగా అన్నా వుంది"

"మూతి కాల్తుంది, జాగ్రత్త.

యింకొంచెం తాగుతావా? ”
“వొద్దు”
కుండెడు గంజి అవలీలగా లోపల పోసేసింది.
“యివాళ పిట్టలు దొరకలేదు”
“ఎట్లా దొరుకుతాయి? ”
పైన చూసింది. గాండీవమంటి విల్లు బద్ద వుంది.
“నన్ను తినాలని మృగమేదన్నా అప్పుడప్పుడీ గుడిసెలో దూరుతుంది. నేను దాన్నే కోసుకుతింటాను”
ఆ బెదిరింపుతో హడిలిపోయినాను.
నేను గుడిసె బయిటకి పోయి చుట్టూ చూశాను. నా గుండె కొట్టుకుంటోంది. చప్పున అట్టా చీకట్లోకి పరిగెత్తుకుపోతే తోక జాడించి, ఈ గుడిసెలో పడుకుని బైటకి రాగలనా? కానీ దోవ తెలీదు. ఎక్కడికి పోను? జవాన్లు వొచ్చి కాచుకుని వున్నారా? కానీ వాళ్ళ సహాయం అడుగుతానా? ఆడదానికి దడిసి పరిగెత్తి, యింక గౌరవం వుంటుందా? దైవాన్ని నమ్మి, నా వుద్యోగాన్ని తిట్టుకుంటూ కూచున్నాను. నా పక్కన వొచ్చి అది కూచుంది.
“తాతా! చుట్ట కాలుస్తావా? ”
తాత కానంటే ఏమిస్తుందో?
“అలవాటు లేదు”
“పొడుం”
“లేదు”
“బీడీ”
“ఊహూఁ”
“తాంబూలం అలవాటనుకుంటా”
అంటూ నవ్వింది.
“నువ్వు వొక్కత్తెవూ వూరిబైట యిట్లా వొంటరిగా కాపురమున్నావేం”
“వూళ్లో కుక్కల్ని చూస్తే నాకిష్టం లేదు”
“కుక్కలూ!”
“రెండు కాళ్ళ కుక్కలు”
“ఎందుకా కోపం? ”
“కుక్కలు గనక”
“నీకు పెళ్లి కాలా? ”
“అయింది”
“ఏడీ? ”
“ఆకలేసి, తినేశాను”
“తరవాత ఏం తింటున్నావు? ”
“దోవన పోయేవాళ్ళని” నవ్వింది.
“నీకు పెళ్లయిందా, తాతా!”
దగ్గరగా జరిగింది.
“పెళ్ళే నాకు!”
“కాలేదా? ”
“లేచిపోయింది”
“ఐతే, ఎట్లా తాతా!”
“పిల్లనిప్పిస్తావా? ”
“పిల్లెందుకు నీకు? నా యీడుదాన్ని కట్టుకో”
“వుందా? ”
“వెతకడమెందుకు? నేనున్నానుగా? ”
“నువ్వే!”
“ఏం? నేను బావుండలా? ”
దగ్గరగా ఆనుకుని కూచుని, ఒక చెయ్యి నా మెడ మీద, ఒక చెయ్యి నా వొళ్ళో జారనిచ్చింది.
“ఈ అడవంతా మన రాజ్యం. నీకు రోజూ గంజి కాచిపెట్టి, ఈ కడవలోది... అబ్బో తాతవుకావే? ” అని చప్పున దూరంగా జరిగింది. ఆమె స్పర్శతో నా వొళ్లు పులకరించింది. మళ్ళా వచ్చి ఎదురుగా కూచుంది. పమిట నేలమీదికి జారింది. రవిక పక్కకి తొలిగింది. కళ్లు తిప్పలేక బలవంతంగా చూపుల్ని పైకి లాగుతూ బాధపడుతున్న నా కళ్లకేసి చూస్తూ చంపల కింద చేతులేసుకుని కూచుంది.
ఆ ప్రయత్నంతో నేను నా భార్యనీ, చిన్నమ్మాయి ముద్దుమాటల్నీ, మా సూప రెంటెండెంటు ముఖాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటున్నాను. లేచి-
“పడుకొందాం రా, తాతా! పొద్దుపోయింది” అంది.
గుడిసెలో మూల గొంగడి నాకిచ్చింది.

తడిక దగ్గరగా తను పరుచుకుంది.

"యిటువేపు దొల్లకేం. ఆడదాన్ని... నీ సంగతి నాకు తెలుసు"

నేను మాట్లాడలేదు. నాకాశ్చర్యం ఎక్కువౌతోంది. నిద్ర మాత్రం పోకూడదు. కళ్లు మూశానా మళ్లీ ఎక్కడో కళ్లు తెరవడం. పడుకున్నాను. ఎంతోసేపు చీకట్లో చూస్తూ, అప్రయత్నంగా కునుకుపట్టింది గావును మెల్లిగా చెయ్యి నా గొంగడీ కిందికి దూరడం నన్ను లేపింది. చప్పున చెయ్యి పట్టుకున్నాను.

"నేనే తాతా"

"ఐతే, ఏమిటిది? " అని బిగ్గరగా కేకేశాను.

"అమ్మో, తాతవు కాదే. చెయ్యి విరిచేశావు"

నా పక్కన పడుకుని దగ్గరగా జరిగింది. నాపైన బరువుగా ఒక కాలూ చెయ్యీ వేసింది.


"తాతా, నన్ను పెళ్ళాడరాదూ? " అంటూ నవ్వింది. ఆ నవ్వు నా నరాల్ని లాగుతోంది.

"సరే, రేపొద్దున కదా!"

"కాదు, యిప్పుడే అందాకా వుండగలనా? "

ఎందుకో చెయ్యిని మళ్లీ గొంగడి కిందికి పోనిస్తోంది? అనుకుంటుండగానే ఆమె పెదవులు నా పెదవుల్ని నొక్కుతున్నాయి. జవాబు చెప్పడానికి వీల్లేకుండా నాపైకి బాగా వంగి ఒక చేత్తో నా చేతి మీదిగా మెడ కిందికి పట్టుకుని, బలమంతా నా మీద ఆనించి రెండోచేత్తో గొంగట్లో వెతుకుతోంది.

ఆమె జుట్టు నా మొహాన్ని కప్పింది. ఆ అడవి పువ్వులు ఘుమ్మన్నాయి. కల్లుతో నిండిన శ్వాస నా మొహాన్ని ముక్కుల్ని కప్పేసింది. ఆమెని కావలించుకోవడానికి నా చెయ్యి పైకి లాక్కోపోయాను. కానీ గట్టిగా రొమ్ముతో అదుముతూ చెయ్యిని రానీలేదు. బావుంది. ఎంతో సౌఖ్యంగా వుంది. కదలకుండా పడుకున్నాను. కాని ఆమె చెయ్యి, మెల్లిగా పాములాగా జరుగు



కథాసాహిత్యంలో చలం స్థానం అచంచలం. డెబ్బై, ఎనభై ఏళ్ల క్రితమే అత్యంత ఆధునిక భావజాలంతో కథలు రాసిన వాళ్లలో చలం ఒకరు. స్త్రీ స్వేచ్ఛ కోసం కలాన్ని హలంగా మార్చి మెదడు పొరలపై భావవికాస సేద్యం చేశారాయన. నేటితరం రచయితలు, పాఠకుల కోసం ఆయన ఎప్పుడో రాసిన 'హత్య విచారణ' ఈ ప్రత్యేక సంచికలో అందిస్తున్నాం..

తోంది. వెతుకుతోంది. జొరబడుతోంది. నా వళ్లు ఝుల్లుమని ఆమె వేళ్ళ కింద వొణుకుతోంది. కానీ మగాణ్ణి, స్వేచ్ఛ లేకుండా ఆమె చేతుల మధ్య చిక్కి...

"నిన్ను చూడగానే, నీ దొంగ దగ్గునీ, నీ పెద్ద ఛాతినీ, నీ పెద్ద మీసాల్నీ, నీ మాయ వొణుకుని కనిపెట్టాను. నాకు నీమీద ఎంతో మనసు కలిగింది! ఇంక వెళ్లవొద్దు. ఒంటరిదాన్ని ఈ కారడవిలో! పగలూ రాత్రీ ఎప్పుడూ యిట్లా..."

యింక వినరాని మాటలు, నా రక్తం పొంగించే మాటలు, చెవులు మూసుకోవాలనుకుంటూ, చెవులు విప్పి వినే ఆ మాటలు, మగవాడి అహంభావాన్ని హెచ్చించే మాటలు, జన్మసార్థకమయిందనుకునే మాటలు ముద్దుగా రహస్యంగా మాట్లాడింది. కానీ ఆ చెయ్యి తీసేస్తోంది. వొదిలించుకుంటోంది. ఏమిటి చల్లగా? నా గుండెలు కొట్టుకోవటం ఆగాయి. బాబోయి నా రివాల్వరు లాగేసింది! చప్పున నా బలమంతటితోనూ తిరగబడ్డాను. కలియబడ్డాను. వొదులుతున్న చేతుల్ని పట్టుకున్నాను. దాని భుజాలు పట్టుకుని వొంచాను. కానీ పాములాగా, చుంచులాగా, నున్నగా జారింది. తప్పించుకుంది. దాంట్లో గుళ్లున్నాయి. పేలితే! నా మీదే పేలితే! వెతికి ఒక చెయ్యి పట్టుకున్నాను. యింక మల్లయుద్ధమయింది. ఎట్లయితేనేం ఆమెని కింద చేసి నేను పైన కూచున్నాను. చేతులందనీయదు. కోపమొచ్చి కొట్టాను. కొరికింది. ఇద్దరి శ్వాసలూ, గుడిసెలో ఆ తోపు నిశ్శబ్దంలో గంభీరంగా వినపడుతున్నాయి. ఎంతసేపు! దొంగ ముండా! గొంతు నొక్కాను.

చంపెయ్యాలనే! మగాణ్ని! దీన్ని గెలవలేనూ! ఎంత బలముంటేనేం ఆడది గెలవగలదా? చప్పున పట్టు వదిలింది. చేతులూ మెడా వేళ్లాడేసింది. చచ్చిందా! మూర్ఛా! ముందు రివాల్వర్వేదీ! మీద కూచుని చేతులు వెతికాను. రెవిక విప్పి వెతికాను. ఏదీ! కోపంలో చీరె వూడదీసి పారేశాను. లేదు. నేను చేస్తున్న పని చూసి కొంచెం కాలం కిందటి సంగతి జ్ఞాపకం వచ్చి నవ్వొచ్చింది. గుండెల మీద చెయ్యేశాను. కొట్టుకుంటున్నాయి. స్పర్శ సుఖంతో చెయ్యి అక్కడే ఆగింది. వెచ్చగా ఆ గట్టి చర్మం.. కావలించుకుంటే.. కానీ రివాల్వరు. ఒక్క వూపు వూపింది. కింద పడ్డాను. చప్పున లేచింది. దూరంగా వెళ్ళి పక్కన గుడిసె మారుమోగేట్టు నవ్వింది.

చప్పున దూకాను. పెద్ద కొయ్యతో తల మీద దెబ్బ పడ్డది. కింద పడ్డాను.

"ఈసారి దొంగల్ని పట్టుకోవడానికి వచ్చినప్పుడు రివాల్వరు సరిగా దాచుకో. వేసింది పాత వేషం. మాట్లాడేది బ్రాహ్మణ మాట!"

చప్పుల ఈల వేసి వూదాను. తలమీద ఇంకో దెబ్బ పడ్డది.

ఆస్పత్రిలో కళ్లు తెరిచాను.

"ఏమయింది? "

"ఎవరూ? "

"అదీ!"

"ఆ మనిషి"

"ఎవరూ లేరే!"

"ఆ గుడిసెలో ఏం దొరకలా? "

"ఒక చీరా, రవికా" V



- నోబెల్ గ్రహీత
నదీన్ గార్డిమర్

నిషి

ఆఫ్రికా కథ

వీళ్ళ జిమ్మడిపోను..!!

ఒక మగవాడికి ఏ ఆడదాన్తోనూ పొస గట్లేదు. కొన్నాళ్లసలు ఒంటరిగా బతకాలని నిర్ణయించుకున్నాడు.

ప్రేమ కోసం రెండుసార్లు పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళైన కొత్తలో తన పుస్తకాల మొదటి పేజీల్లో మొదటి భార్య ఇద్దరి పేర్లూ కలిపి రాసింది. ఇప్పుడా పుస్తకాలన్నీ పారేశాడు. రెండో భార్య తామిద్దరూ ముచ్చటపడి కొనుక్కున్న చిత్రాలనీ పింగాణీ వస్తువులనీ వైన్‌సీసాలతో సహా తనతో పట్టుకుపోయింది. ఇంట్లో ఆమెకు సంబంధించిన చెత్తాచెదారమంతా వదుల్చుకున్నాడు.

సెలవు మీద ప్రయాణమయ్యాడు ఒంటరిగా.

డబ్బిచ్చి తోడు కుదుర్చుకోవచ్చు. అలాంటివాళ్ళు తన డబ్బు తింటూ వేరొకడితో సంబంధం పెట్టుకోవచ్చు. 'నూరేళ్ళూ నీతోనే కలిసుంటా' అని పెళ్ళిరోజు ప్రమాణం చేసిన భార్యలే ఇలా చెయ్యగా లేంది, వేశ్యలు చెయ్యరని ఏముంది?

ఒక విడిదికి వెళ్ళాడు. అది సముద్రతీరంలో ఉన్న అందమైన బీచ్. అక్కడి ఈతకొలన్లలోకి సముద్రం అలల్ని విసురుతూ ఉంటుంది. ఇసుక లేదు ఆ బీచ్‌లో.

ఉడకబెట్టిన కుడుముల్లాంటి రాళ్ళమీద మనుషులు పడుకొని ఉంటారు. ఒళ్ళంతా సుగంధతైలాలు పట్టిస్తుంటారు. వాళ్ళు పడుకున్న పరుపులు సముద్రపు ఉప్పువల్ల రంగు వెలిశాయి. అయితేనేం, వాటికి రంగు తేవడానికి స్త్రీలు ఉన్నారుగా!

కొంతమంది జుట్టు పైకి దువ్వి ముడేసి ప్లాస్టిక్ పూలతో అలంకరించుకుంటారు. కొంతమంది విరబోసుకుంటారు. ఈతకొట్టి సముద్రంలోంచి బైటకొస్తుంటే తడి ఒళ్ళు నిగనిగా మెరుస్తుంది! జుట్టు చివర్లనుంచీ కారే నీళ్ళు ముత్యాలబిందువులు పేర్చినట్టు శరీరమంతా రాలిపడతాయి.

వారి ఎదలు అనాచ్ఛాదితం. త్రికోణాకారంలో ఉండే బికినీ ఒకటే ఒంటిమీది బట్ట. వెనుకవైపు బికినీని పిరుదుల మధ్యగా లాగి సన్నని దారంతో ముడివేస్తారు. అందువల్ల అతను ఒడ్డు మీద పడుకొని చూస్తుంటే సముద్రంలోకి వెళ్ళేవాళ్ళు పూర్తి నగ్నంగా కనిపించేవాళ్ళు. ఈత కొట్టాక ఎంతో ఉల్లాసంగా తనవైపు వస్తుంటే వారి ఎదలు నాట్యమాడేవి. వాళ్ళు తుండుగుడ్డ కోసమో సన్‌స్క్రీన్ కోసమో వంగినపుడు చూడాలి!! కొంతమంది ఎండకు నల్లబడకుండా ఉండడానికి గుండెలమీద క్రీమ్ రాసుకుంటారు. సన్‌బర్న్ వల్ల శరీరమంతా నలుపుదేరినా, ఎదలు మాత్రం తెల్లగా ఆహ్వానిస్తున్నట్టుండేవి. ఇంకొంతమంది చనుమొనలు ఎండకి కందిపోయి ఎర్రటి స్ట్రాబెర్రీల్లా ఉండేవి.

అక్కడ మగవాళ్లూ ఉన్నారు. కానీ అతని కళ్లకి వాళ్ళు కనిపించలేదు. కళ్లు మూసుకొని సముద్రపు అలల సవ్వడి వింటుంటే స్త్రీల వాసనా, వారి లేపనాల వాసనా ఆ సవ్వడితో పాటు గాలిలో

తేలుతూ వచ్చేవి.

ప్రతిరోజూ చాలాసేపు ఈత కొట్టేవాడు. లోతులోకి వెళ్తే తెల్లటి నురగలు కక్కే అలల మీద అత్యంత వేగంగా సర్ఫింగ్ చేసేవాళ్ళు తన తలమీంచే ఝూమ్మని దూసుకెళ్ళేవారు. ఒడ్డుకు దగ్గరగా లోతు లేని చోట ఈత కొడితే అక్కడ నగ్నంగా ఉండే తల్లులు పసిపిల్లలకి స్నానం చేయిస్తూ ఉండేవారు. నాజూకు చేపల్లా ఈదుతున్న ఆడవారి పక్కన తన కండలు తిరిగిన శరీరం షార్క్‌చేపలా అనిపించేది.


ఈత తర్వాత అక్కడే రాళ్ళ మీద పడుకునేవాడు. రాళ్ళు గట్టిగా వీపుకి పొడుచుకుంటూ ఉండేవి. అయినా, సుతిమెత్తటి శరీరంగల ఆడవాళ్ళ పక్కన పడుకోవటం కన్నా ఈ రాతి శయనమే సుఖమనిపించేది. అలాగే పడుకొని నిద్రపోయేవాడు. తన తలవైపున ఎవరో నడుస్తున్నట్టుంటే మెలకువ వచ్చేది. కళ్ళు తెరిస్తే నున్నటి కాళ్ళు కనిపించేవి. అప్పుడప్పుడూ వారి జుట్టు నుంచీ చుక్కలుగా నీళ్ళు మీదపడి మెలకువ వచ్చేసేది.

మగవాళ్ళు ఒడ్డున ఒంటరిగా కూర్చున్నప్పుడు సాధారణంగా ఏంచేస్తారో అదే చేసేవాడు. గులకరాళ్ళను నీటిమీద పిల్లిమొగ్గ లేయించడం! మిగతా సమయంలో నిర్మానుష్య ప్రదేశాలకి వెళ్ళి అక్కడి రాళ్ళనీ రప్పల్నీ పిల్లలు చూసినట్టు కొత్తగా వింతగా చూస్తుండిపోయేవాడు.

ఆ రాళ్ళన్నీ నిజంగా రాళ్ళు కాదు. పగిలిపోయిన బీరు సీసా ముక్కల్ని సముద్రం మెరిసే రంగురాళ్ళలా మార్చింది. పచ్చలూ, నీలాలూ- ఇలా పనికిరాని గాజుముక్కల్ని తన అలలతో కడిగి విలువ పెరిగేలా చేసింది. పిల్లలు వాటిని టోపీల్లో, బొక్కెనల్లో ఏరుకొని ఏదో నిధి దొరికినంత సంబరంగా తీసుకెళ్ళేవాళ్ళు. వారిలాగే అతను కూడా..! రంగురాళ్ళ వ్యాపారిలా వాటిని ఎండకు ఎదురుగా, పక్కగా మార్చి మార్చి చూసుకుంటూ అన్ని వైపులనుంచీ రంగులు మారటం గమనిస్తూ ఉండేవాడు.

అలా అతనికి ఒకరోజు వజ్రాల మధ్య నీలపురాయి పొదిగిన ఉంగరం ఒకటి దొరికింది.

నీళ్ళకింద నాచులో కూరుకుపోయి ఉందది. చేతులతోనే తవ్వి తీశాడు. గాజు ముక్క కాదు. చాలా విలువైంది. ఒడ్డు మీద దొరకలేదు కాబట్టి ముందురోజు అక్కడున్న ఆడవాళ్ళు పారేసుకున్నారనటానికి వీల్లేదు. ఎవరి ప్రియురాలో, లేదా ఎవరో ధనవంతుడి కుర్రపెళ్ళామో చిన్న పడవలో వెళుతూ నీటిలో చెయ్యి పెట్టినపుడు జారిపడిపోయి ఉంటుంది. మిగిలిన నగలన్నిటినీ జాగ్రత్తగా చూసుకొని ఇదొక్కటీ ఎందుకు అజాగ్రత్తగా వదిలే



సిందో.... ఓడలోకి వెళ్ళాక చూసుకుందేమో! ఇంత ఖరీదైన, విలువైన ఉంగరానికి ఖచ్చితంగా బీమా చేయించే ఉంటారు! ఈపాటికి వాళ్ళకి ఆ బీమా డబ్బులు కూడా వచ్చేసుంటాయి....

చాలా అందమైన ఉంగరం అది. కోడిగుడ్డు ఆకారంలో పెద్ద నీలం. దాని చుట్టూ వజ్రాలు. వ్యాసానికి అటూ ఇటూ రెండు దీర్ఘచతురస్రాకారపు వజ్రాలు. ఇలాంటి ఉంగరం ధరించిన వేలు ఎంత నాజూగ్గా ఉండుంటుందో! ఆ వేలు ఉన్న చేయి... ఆ చేయి ఉన్న శరీరం... ఇంకెంత నాజూగ్గా ఉంటాయో...! తన తవ్వకాల్లో ఆరంగుళాల లోతు నుండి బయటపడ్డ ఈ నిధి యజమానురాలు తన పక్కనే నిలబడి చూస్తున్నట్టనిపించింది అతనికి.

రెస్టారెంట్ దగ్గరికొచ్చాడు. అక్కడి స్త్రీలు ఒంటికి రకరకాల నూనెలు రాసుకుంటున్నారు, పిల్లల ఒళ్ళు తుడుస్తున్నారు, చిన్న అద్దాల్లో చూసుకుంటూ కనుబొమలు దిద్దుకుంటున్నారు, వెయిటర్ టేబుల్ మీద తెచ్చిపెట్టిన సలాడ్లు, తెల్లవైన్ సీసాల మధ్య ఒళ్ళంతా కదిలిపోయేలా నవ్వుతున్నారు. నల్లకళ్ళద్దాలు పెట్టుకొని ఫ్యాషన్ పుస్తకాలు చదువుతున్నారు. వీళ్ళల్లో ఉంగరం యజమానురాలు లేదని అతని మనసు గుసగుసలాడింది. అందర్నీ పరీక్షగా చూస్తూ రిసెప్షనిస్టు దగ్గరికి వెళ్ళి ఉంగరం పోయిందని ఎవరైనా ఫిర్యాదు చేశారేమో కనుక్కున్నాడు. ఎవరూ చేయలేదు, ఇంత విలువైన వస్తువుని పోలీసుల దగ్గరికి తీసుకెళ్ళమంది రిసెప్షనులోని అమ్మాయి.

ఇంత ఖరీదైన ఉంగరంతో ఈ కొత్త ప్రదేశంలో పోలీసుల దగ్గరికి వెళ్తే కస్టమ్స్‌కి తెలీకుండా అమ్మటానికి ఇక్కడికి తెచ్చాడని వాళ్లు తననే అనుమానించే అవకాశం ఉంది. అదీగాక ఉంగరం కోసం ఎవరూ రాకపోతే అది ఎవరో పోలీసువాడి జేబులోకి వెళ్ళిపోతుంది. అందుకే అతను దాన్ని తన జేబులోనే వేసుకున్నాడు. బీచ్‌దగ్గర రాళ్ళమీద పడుకొని ఆలోచించాడు.

చివరకు ఒక నిర్ణయానికి వచ్చి అక్కడి ప్రాంతీయ వార్తాపత్రికలో ప్రకటన ఇచ్చాడు.

'ఒకటో తారీఖు మంగళవారంనాడు బ్లూహొరైజన్ బీచ్‌లో ఉంగరం దొరికింది'

దాంతోబాటు తన హోటల్ రూమ్‌నంబర్, ఫోన్ నంబర్ ఇచ్చాడు. అంతే. లెక్కలేనన్ని ఫోన్‌కాల్స్.

మగవాళ్ళు చేస్తే ఆ ఉంగరం తల్లిదో స్నేహితురాలిదో అని చెప్పేవాళ్ళు. అది ఎలా ఉంటుందో చెప్పమంటే మాత్రం అవకాశం దొరికింది కదాని వజ్రపుటుంగరం అంటారే గానీ సరైన వివరాలు చెప్పలేకపోయేవారు. కొంతమంది అబద్ధాలు చెప్తున్నారని కనిపెట్టేసేంత తేలిగ్గా మాట్లాడేవాళ్ళు.

ఆడవాళ్ళు ఫోన్ చేస్తే కొంతమంది ఏడుపుగొంతు పెట్టేవాళ్ళు. అతనికి అర్థమైపోయేది.

మధ్యవయస్కులైతే తమ కథంతా చెప్పటం మొదలుపెట్టేవాళ్ళు. విసుగొచ్చి కాల్ మధ్యలోనే కట్ చేసేసేవాడు. కానీ యవ్వనవతులు అనిపించినా, ఫోన్లో తటపటాయిస్తున్నా, గొంతు తియ్యగా ఉన్నా తన హోటల్‌రూమ్‌కి రమ్మనేవాడు.

ఒకటే ప్రశ్న - ఉంగరాన్ని వర్ణించండి.

తన గది వరండాలో వాళ్ళ ముఖాల మీద వెల్తురు పడేలా కుర్చీ వేసి కూర్చోబెట్టేవాడు. ఒకే ఒక అమ్మాయి తను



నిజంగా ఉంగరం పోగొట్టుకుందని నమ్మబలికింది. దాని పోలికలు చెప్పి చివరికి ఈ ఉంగరం, తన ఉంగరం ఒకటి కాదని సారీ చెప్పి వెళ్ళిపోయింది. కొంతమందిది సహజ అందం, కొంతమందిది రెచ్చగొట్టే అందం, కొంతమందివి రెచ్చగొట్టే దుస్తులు!! వాళ్ళు చెప్పేది కల్పన అని అతను తెలుసుకోగలిగితే అతన్నుంచీ ఇంకేదో పొందాలని ఆబగా దగ్గరకొచ్చే వాళ్ళు. అందర్నీ నెట్టేసేవాడు. ఆ ఉంగరం వారసత్వంగా సంక్రమించింది కాబట్టి ఆ రాళ్ళ పేర్లు కొంతమంది తెలీదని చెప్పే వాళ్ళు. పేరు తెలీకపోతే పోయె, కనీసం ఆకారం చెప్పమంటే ఎన్ని నాటకాలాడే వాళ్ళు..!! సిగ్గుగా నవ్వేసి ఊరికే వచ్చామనీ, సరదాగా అనిపించిందనీ అక్కడే కూర్చునేవాళ్ళు. కోపంతో అరిచినా, తిట్టినా కదిలేవాళ్ళే కాదు. అలాంటివాళ్ళని వదిలించుకోవటానికి తల ప్రాణం తోకకొచ్చేది.

ఒకరోజు ఒక ఫోన్-- ఆ గొంతు వింటూనే అందులోని మధురిమకు మూర్ఛపోయాడు. ఖచ్చితంగా నటో గాయనో అయ్యుంటుంది ! పత్రికా ప్రకటన చూసింది. తన ఉంగరం పోయి చాలా రోజులైంది. దొరుకుతుందన్న ఆశ లేదు. లక్షోవంతు అవకాశమైనా పోగొట్టుకోవడం ఇష్టంలేక ఈ ఫోన్ చేస్తోంది. సరే, హోటల్‌కి రమ్మన్నాడు.

ఆమె వయసు ఖచ్చితంగా నలభై ఉంటుంది. జన్మతః వచ్చిన అందం. ఆకుపచ్చని కళ్ళు. జుట్టు నల్లగా ఉంచుకోవడానికి ఎటువంటి రంగు నూనెల సహాయమూ ఇంకా అవసరం పడలేదు. నెమలికి నడినెత్తి మీద కిరీటం ఉన్నట్టు ఆమె తన నల్లటి జుట్టును నున్నగా దువ్వి నడినెత్తి మీద ముడేసింది. రొమ్ములు కలిసే చోట ముడత రాలేదు. పొగరుబోతుల్లా నల్లటి డ్రస్‌లో బిగుతుగా కనిపిస్తున్నాయవి. ఆమె వేళ్ళు....అసలు అలాంటి వేళ్ళకోసమే ఉంగరాలు తయారు చేస్తారు....

"....... ఇలా చెయ్యి తెరిచి చూశాను. ఉంగరం లేదు! అది నీళ్ళలో మునిగిపోవటం ఆఖరిక్షణంలో కనబడింది......" చెప్పుకుపోతోంది ఆమె.

"ఎలా ఉంటుందది? "

ఆమె మాటల పరంపర ఆగిపోయింది. శూన్యంలోకి చూసింది.

"పెద్దది. ప్లాటినం, బంగారం కలిపి చేసింది. ఎన్నో సంవత్సరాలు మన శరీరాన్ని అంటిపెట్టుకొనున్న వస్తువు గురించి ఎక్కువ పట్టించుకోం! దాని లక్షణాలూ వివరాలూ గమనించం...."

క్షణంసేపు ఆగి కొనసాగించింది "చాలా పెద్ద వజ్రం. ఉహూc...చాలా వజ్రాలు. ఓ పచ్చ, కొన్ని కెంపులూ కూడా ఉండాలి. ఏమో, అవి ముందే రాలిపోయి ఉండచ్చు.."

అనువాదం : విహెచ్‌కే

ఆమె చెప్తుండగానే అతను బల్ల సొరుగులోంచి ఒక పొట్లం తీసి

"ఇదిగో నీ ఉంగరం" అని ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె చూపు మరల్చలేదు. నీటిలో చేయి చాచినట్టు నెమ్మదిగా అందుకుంది. తన మధ్యవేలికి పెడదామని చూసింది - పట్టలేదు - ఇంద్రజాలంలా మెరుపువేగంతో ఉంగరంవేలికి మార్చింది. దానికి సరిగ్గా సరిపోయింది.

అతను ఆమెను భోజనానికి తీసుకెళ్ళాడు. ఇంకెప్పుడూ వాళ్ళా ఉంగరం గురించి మాట్లాడుకోలేదు. ఆమె నిధి సంగతేమోగానీ, అతని నిధి అతనికి దొరికింది! ఆమె ఇప్పుడతని మూడో భార్య!!!



అంతిమ అధ్యాయం

పది సంవత్సరాలు గడచిపోయాయి.

కాలం రోజులనే పావురాలను కాజేస్తూనే వుంది.

జమ్మూ నగరపు సరిహద్దులు కేన్సర్ మూలాలకి మల్లేనే వ్యాపిస్తూ వున్నాయి. జనసంఖ్య పెరుగుతూనే వుంది.

తావీ నది నీరు అమితానందంతో వున్న బిచ్చగానిలా అన్నీ చూస్తూ- వింటూ ముందుకి సాగిపోతూనే వుంది.

పట్టు ఇంటి సైరన్ కూసిందే తడవుగా, కార్మికుల గుంపు బయటికి రాసాగింది. వారిలో రాము ఒకడు. ఇవేళ అతను చాలా సంతోషంగా వున్నాడు. తనకి లభించిన జీతం నోట్లు జేబులో వున్నాయి. దానితోపాటు డాక్టరు గారు రాసి ఇచ్చిన మందుల చీటీ కూడా జేబులోనే వుంది.

మందులషాపు నుంచి మందులు కొని, తిన్నగా అతను ఇంటికి వచ్చేడు.

చిన్నచెల్లెలు రాజీ వంటింట్లో వంటపనిలో నిమగ్నమయింది. అమ్మ మంచంలో కూచొని ఏదో కుడుతోంది. మందులకు ఖర్చు చేయగా మిగిలిన జీతం డబ్బు అమ్మ ముందు వుంచుతూ అన్నాడు రాము.

"ఇప్పటికీ నువ్వు మందు తాగకపోతే, నేను నీతో మాట్లాడనే మాట్లాడను! ఆc!..."

రాణి పళ్లతో దారాన్ని తెంపి, కుడుతున్న గుడ్డని కాస్త మీదకి ఎత్తి, అంది.

"నాకోసం మందులు కొనటానికి డబ్బు ఇలా వెచ్చిస్తూ పోతూవుంటే, ఇల్లు గడిచేదెలా నాయనా? నీకు కొంతయినా వివేకం లేకుంటే ఎలా? ఆడపిల్ల పెళ్లికి నాలుగు డబ్బులు వెనకెయ్యకపోతే ఎలా చెప్పు? "

"అన్నీ అవే జరిగిపోతాయిలే, అమ్మా! ముందు నీ ఆరోగ్యం బాగుపడనియ్!"

"దిక్కుమాలిన ఆరోగ్యం ... ముందు పెళ్లి కావలసిన ఆడపిల్ల గురించి ఆలోచించు!"

రాజీ పొయ్యి వూదుతోంది. అమ్మ మాటకి కస్సుమని లేచింది, "అమ్మా! నువ్వేం మాట్లాడుతున్నావు? "

ఆమెకి అమ్మ చెప్పే ఈ మాట నచ్చదు. ఎప్పుడు చూసినా, తననే తిట్టిపోస్తూ వుంటుంది.

ఇంతలో ఎవరో తలుపు తట్టిన చప్పుడయ్యింది. ముగ్గురి దృష్టి తలుపు వేపు మళ్లింది.


ఎదురుగా దుష్యంత్ నిలబడి వున్నారు. రాణి, రాము- లేచి నిలబడ్డారు.

దుష్యంతే రాముని పనిలో చేర్పించారు. అందుకే, రాముకి దుష్యంత్ అంటే చాలా గౌరవం!

"రండి!" అన్నాడు రాము.

"ఏరా రామూ! నీ నౌకరీ ఎలా సాగుతోంది" అంటూ దుష్యంత్ ఇంట్లోకి వచ్చి

- వేద్‌రాహీ



డోగ్రీ కథ

కుర్చీలో కూచున్నారు.

"అంతా సజావుగానే వుంది!" జవాబిచ్చేడు రాము. "కాని చాచాజీ! అమ్మకి మీరు కాస్త నచ్చజెప్పండి! అమ్మ మందులు వేసుకోవడంలేదు"

"సరే! ఆమెకి నేను నచ్చచెబుతానులే. నువ్వు షాపులో కాస్త కూచో! నేనిప్పుడే వస్తాను"

దుష్యంత్ పుస్తకాల షాపు పెట్టారు. అయితే ఆయన మాత్రం షాపులో వుండేది చాలా తక్కువ!

దుష్యంత్ రాజీవేపు చూశారు. రాణికి అర్థయ్యింది.

ఏదో ముఖ్యమయిన విషయం గురించి మాట్లాడుతారులావుంది! ఆమె దుష్యంత్‌కి బాగా దగ్గరగా వచ్చి కూచుంది.

దుష్యంత్ ఓరచూపులు చూశారు రాజీ వేపు. ఆయన చాలా మెల్లగా రాణితో అన్నారు.

"ఇవేళ రాత్రికి చరణ్ వస్తున్నాడు. నిన్ను కలవాలనుకుంటున్నట్లు అతడు కబురు పెట్టాడు"

రాణి స్తబ్దతతో దుష్యంత్‌వేపు చూడసాగింది. చరణ్ పేరు వినగానే ఆమె మనసు బాధతో మూల్గింది.

"అతను ఇవేళ రాత్రికి మాత్రమే ఇక్కడ ఉంటాడు" చెప్పారు దుష్యంత్.

"అతను ఇక్కడకి ఎప్పుడు వస్తాడు? " రాణి వణికే స్వరంతో అడిగింది.

"అతను ఇక్కడికి రాడు. నువ్వే అతని దగ్గరకి వెళ్లాల్సివుంటుంది!"

"ఎక్కడికి? "

"ముస్లింల మత గురువు గుహ దగ్గరకి!" అన్నారు దుష్యంత్.

"ముందుగా నువ్వు కోవెలలోకి వెళ్లు. అక్కడ భగవంతుని ముందు తల వంచి, వెనుక తలుపులోంచి బయటికి వెళ్ళిపో! అక్కడ రాతిబండల వద్ద అతను నిన్ను పోల్చుకుంటాడు. ఎవరికీ తెలీకూడదు. దేశంలోని పోలీసు లందరూ అతని వెంట పడుతున్నారు" లేస్తూ, లేస్తూ తిరిగి దుష్యంత్ "చీకటిపడగానే నువ్వు అక్కడకి చేరుకో!" అనేసి, అక్కణ్నించి వెళ్లిపోయారు.

కాని రాణి కదలలేదు, మెదలలేదు ఎక్కడయితే కూచుందో, అక్కడే అలాగే కూచుండిపోయింది.

"చాచాజీ ఏమన్నారమ్మా? " రాజీ అడిగింది.

"ఏమీలేదు! ఆయన మామయ్య కూతురు పెళ్లట! ఏదో అడగాలని వచ్చారు"

తర్వాత రాణి వెళ్లడానికి సిద్ధమవుతోంది.



ఏన్నో ఏళ్ల తర్వాత తాను మంచి దుస్తులు వేసుకోవాలని, ఆమెకి అనిపించింది.

గుండెలు జోరుగా కొట్టుకోసాగాయి. అద్దాన్ని తన ముందు ఉంచుకొని, తల దువ్వుకోసాగింది.

ఆమె దృష్టికి కణతలమీద తెల్లని వెంట్రుకలు కనిపించాయి.

చికాకు పడింది. ఇహ కళ్లకి కాటుక పెట్టుకోసాగింది. అప్పుడే చటుక్కున తనకి అనిపించింది, 'చీకట్లో అతన్ని చూడటమయినా జరుగుతుందోలేదో!'

రాజీ అమ్మ దగ్గరకి వచ్చి, అంది.

"అమ్మా ఈవేళ నువ్వెంత అందంగా వున్నావో!"

రాణి ముసిముసి నవ్వులు కురిపిస్తూ, రాజీ వేపు చూసింది. రాజీకూడా చిరునవ్వు నవ్వింది.

చీకట్లు కమ్మడానికి కాస్త ముందుగా ఆమె ఇంట్లోంచి బయలుదేరడానికి సిద్ధమైంది.

"అమ్మా నువ్వు మందులు వేసుకోలేదు? " అంది రాజీ.

"నేను వేసుకోను. కాలువలో విసిరేయ్!" అనేసి రాణి బయటకి నడిచింది.

ఎత్తు నుంచి దిగి, ఆమె 'ముస్లిం మత గురువు తాలూకు గుహ' చేరుకుంది. అక్కడ ఒకరిద్దరు తప్ప ఎక్కువ మంది లేరు.

అక్కడ భక్తితో తలవంచి, వెనుక తలుపులోంచి బయటికి వచ్చేసింది. చీకట్లు కమ్ముకున్నాయి. తాను రాళ్ల దగ్గరకి వచ్చి నిలబడింది. చీకటిగా ఉంది.

చెట్ల ఆకులు ఊపిరి బిగబట్టి ఉన్నాయి. హఠాత్తుగా ఆమెకి ఎవరిదో గొంతు వినిపించింది "రాణి!" అంటూ! తుళ్లిపడి ఆమె ముందుకి సాగింది.

"ఇటు... ఇటు!" మళ్లీ అదే గొంతు.

ఆమె హృదయం వశం తప్పింది. ఆమె ఎడమవేపు చూసింది. రాతిబండలమధ్య ఓ సన్నని కాలిమార్గం. ఆమె అదే తోవని అనుసరించింది. హఠాత్తుగా దబదబ శబ్దం వినిపించింది. చరణ్ ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. ఆమె అతణ్ని పోల్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"నువ్వు వచ్చేశావా, రాణీ!" అది చరణ్ కంఠస్వరం. ఆ చీకట్లో అతని ఆకృతి ఆమెకి కనిపించడంలేదు.

"ఇంకా ముందుకి వచ్చేసెయ్!" అనేసి చరణ్ ముందుకి తోవతీశాడు. వేగంగా కొట్టుకుంటున్న హృదయలయని శాంతింపజేస్తూ ఆమె కూడా అతణ్ని అనుసరించసాగింది. ముందున్న రాతి బండలమధ్య ఏకాంత ప్రదేశంలో చరణ్ ఆగిపోయాడు.

"ఇక్కడకి వచ్చెయ్!" అతను అన్నాడు.

రాణి నెమ్మది, నెమ్మదిగా ముందుకి నడిచింది.

"రాణీ!"

"చరణ్!"

అనువాదం : నిర్మలానంద

"ఆఁ! నేను చరణ్‌నే, రాణీ!"

ఇద్దరూ ఒకర్నొకరు దగ్గరగాలాక్కొని, గట్టిగా ఆలింగనం చేసుకున్నారు పిచ్చెక్కినవారిలా.

రాణి అతణ్ని హత్తుకుంటూనే, బాధాతప్త హృదయంతో అతికష్టమ్మీద అంది.

"నీకు నా జ్ఞాపకమే కలుగలేదా, పదేళ్లపాటు నువ్వింత కఠినంగా ఎన్నడూలేవు. చరణ్ ఎక్కడికి వెళ్లిపోయావు? నాకు చెప్పు, నువ్వెక్కడికిపోయింది? " అంది.

"నేను నిన్ను ఒక క్షణం సేపు కూడా మరువలేదు రాణీ! నువ్వు ఎన్నడూ నాతోనే, నాలోనే వున్నావు!" అని బదులి

చ్చాడు చరణ్.

ఇద్దరూ తామెక్కడున్నది మర్చిపో యారు. ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగిపో యారు.

తర్వాత రాణి ఏడ్వసాగింది వెక్కిళ్లు పెడ్తూ.

చరణ్ కళ్లనిండా కన్నీరు నిండిపో యింది. కాస్సేపటికి ఇద్దరూ స్పృహలోకి వచ్చారు.

ఇద్దరూ వేర్వేరు కాలేదు, నేల మీద పడుకొని ఉన్నారు. ఒకరి బాహువుల్లో ఒకరు ఏకమయి, ఒకరిలో ఒకరు కరిగి పోతూ.

నెమ్మదిగా అంది రాణి, "నాకు నిన్ను చూడాలని ఉంది చరణ్!"

"నేను సయితం నిన్ను చూడాలనుకుం టున్నాను. ఆగు! నా జేబులో అగ్గిపెట్టె ఉంది."

ఇద్దరూ లేచి కూచున్నారు. పేంటు జేబులోంచి అగ్గిపెట్టె బయటికి తీసి అగ్గి పుల్లని వెలిగించబోయేడు చరణ్. అంతలో రాణి అతణ్ని వారించింది.

"అఖ్కర్లేదు. వెలిగించకు!"

"ఎందుకు? "

"మనం వెలుతురులో ఒకరినొకరం చూసుకోకపోయినట్టయితే, శాశ్వతంగా ఎప్పటిలాగానే ఉండిపోతాం, పదేళ్ల కిం దట ఎలాగో అలాగా!"

"నువ్వు సరిగానే చెప్పేవు రాణీ! నేను కూడా అదే ఆలోచిస్తూ వున్నాను. ఎం డలో మాడి నల్లగావున్న నన్ను చూసి, నువ్వేం అనుకుంటావో, ఏమో అని"

"నేను కూడా అదే ఆలోచించేను, నా తలవెంట్రుకల తెల్లదనాన్ని చూసి, నువ్వేం అనుకుంటావో ఏమో అని.

"నీ చిరునవ్వు తప్ప, నేనింకేం చూడన వసరం లేదు. ఆ నవ్వు వల్ల నీ రెండు బుగ్గలూ సొట్టలు పడ్తాయి"

"అలాంటప్పుడు నువ్వు ఆ విషయాన్ని నీ మనసులోనే ఎందుకు వుంచేసుకున్నా వు? వెలిగించు అగ్గిపుల్లని నీ కోరిక సైతం మనసులోనే వుండిపోకుండా. నీ ఆకృతి నా కళ్లలోనే వుంటుంది. బహుశా రా బోయే రోజులు ఇంత కష్టంగా వుండవు"

చరణ్ అగ్గిపుల్ల వెలిగించేడు. ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఇద్దరి పెదవు లమీద చిర్నవ్వు మెరిసింది. అగ్గిపుల్ల దానంత అదే ఆరిపోయింది.

ఇద్దరూ పిచ్చివాళ్లకి మల్లేనే ఒకర్నొకరు బిగియార కౌగిలించుకున్నారు.

"నువ్వు నిశ్చయంగా అలాగే వున్నావు"

"నీలో కూడా ఎలాంటి మార్పూ రాలేదు"

"మనం శాశ్వతంగా అలాగే వుండిపో

వాలి రాణీ! పదేళ్ల క్రితం లాగానే.."

"ఒక విషయం అడిగేదా? "

"అడుగు!"

"జైలు నుంచి విడుదలై, వచ్చేక నన్ను కలవడానికి నువ్వెందుకు రాలేదు? "

"నాకు జైలులోనే అనిపించింది. ఏమ నంటే- నిన్ను ఆ నరకం నుంచి బయటప డేసే సామర్థ్యం నాలో లేదు. నిన్నుపోలిన వేల-లక్షల రాణులు ఇదే నరకంలో మగ్గుతూనే వున్నారు. ఇలాంటివి ఇంకా ఎన్నో నరకాలు, వాటిల్లో కోట్లాది మంది నిరుపేద, అసహాయులైనవారు గింజుకుని, గింజుకుని చనిపోతున్నారు. పూర్తిగా ఒక వ్యవస్థే వారు ఇలా చావడానికి ఒత్తిడి చేసింది. నేనా పోరాటంలో చేరిపో యాను. అది ఈ వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడుతోంది"

"ఒక్కో విషయం నాకు బోధపడు తోంది. ఒక్కో విషయం నాకు అర్థం కాదు" రాణి నేరుగా చరణ్‌తో మాట్లాడసా గింది.

"ఈ పోరాటం ఎప్పుడు ముగుస్తుంది? నువ్వు ఎప్పుడు ఇంటికి తిరిగివస్తావు? "

ఫక్కున నవ్వేడు చరణ్.

తర్వాత ఇలా అన్నాడు, "ఇది ఓ సుదీర్ఘమైన పోరాటం. చాలా దీర్ఘమైన ప్రయాణం"

"ఈ యుద్ధంలో ఆ మంటల్లో లక్షలాది కోట్లాది మంది ఆహుతి అయిపోతూ వుంటారు. ఇంకా లక్షలాది కోట్లాది మంది ఇంకా ఆహుతికావలసే వుంది"

రాణి ఏడ్చేసింది. ఏడ్చి, ఏడ్చి అంది, "లక్షలాదిమంది - కోట్లాదిమంది విషయం నాకు తెలవదు గానీ, కాని నా మెడలో ఈ జంజాటాన్ని..." అంటూ ఆమె అర్థోక్తిగా ఆగిపోయింది.

చరణ్ ఆమె కన్నీటిని తుడుస్తూ జవాబి చ్చేడు.

"ఈ విషయానికి ఏదో ఒక కారణం తప్పక వుంటుంది. కాని నా లోపల ఆ



అగ్ని వుండి వుండక పోయినట్టయితే, ఎవరో అంటించిన అగ్ని ఎలా మండుతుంది? "

"నాకిదే పశ్చాత్తాపం తినేస్తూ వుంటోంది. ఒక్కోసారి ఇది ఆలోచిస్తే నాకు భయం పట్టుకొంటూ వుంటుంది. నీ తల్లి శాపం నాకు తప్పక తగులుతుంది. ఆ నిర్దోషిని ఎలాంటి అగ్నిలో నేను దహనం చేశాను. చరణ్, నా రాము క్షణమో, రెండు క్షణాల్లో ఆలస్యంగా ఇంటికి వచ్చేడంటే నేను గాబరా పడిపోతాను. అలాంటిది నువ్వు పదేళ్ల నుంచి మీ అమ్మకి నీ మొహాన్ని చూపించలేదు. ఆమె గుండెల్లో ఎలాంటి అగ్ని మండుతూ వుంటుందో? "

చరణ్ కళ్లు ధారాపాతంగా కన్నీరు కార్చసాగాయి. అతికష్టంమీద కన్నీటిని ఆపుకున్నాడు.

అతను మెల్లగా అన్నాడు.

"నేను ఇవాళే అమ్మని కూడా కలిసి వెళ్తాను" తర్వాత అతను ఆకాశం వేపు చూస్తూ అన్నాడు "రాణీ! అటు ఆకాశంలోకి చూడు! ఆ మూడు నక్షత్రాలూ ఒక్కచోట కనిపిస్తున్నాయి" రాణీ పైకి చూసి, జవాబు ఇచ్చింది.

"ఆఁ!... అది శ్రావణకుమార్? తాలూకా బైరంగీ!"

"చాలా ఏళ్లుగా నేను ఇదేవిధంగా ఆకాశం కింద నిద్రపోతున్నాను. కొన్నాళ్లు కలకత్తా నగర రోడ్లమీద, కొన్నాళ్లు అస్సాం తేయాకు తోటల్లో, మరికొన్నాళ్లు కేరళలోని సముద్రపు ఒడ్డున. ఆ మూడు నక్షత్రాలూ అన్నిచోట్లా నాకు కనిపిస్తూ వుంటాయి. నేను ఆలోచిస్తూ వుంటాను. నేనే ఒక బైరంగీని ఆకాశంలో వుంటానని దానికి ఒక వేపు నువ్వు, రెండోవేపు మా అమ్మ. మధ్యలో వున్న మూడవ నక్షత్రంలా నేను ఈ బైరంగీని లేపి వుంచేను ఆకాశంలో. నేను వెళ్లిపోతున్నాను. ఎన్నటికీ ముగింపు లేని ప్రయాణం ఇది"

రాణి అతని గుండెల్లో మొహం వుంచి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

చరణ్ ఆమె కళ్లపై తన పెదాల్ని వొత్తేశాడు. ఆమె కన్నీటిని తాగేస్తూ, అన్నాడు "ఇంతలా ఏడవకు రాణీ! నా ప్రయాణం కష్టం అవుతుంది. తెల్లవారకముందే ఈ నగరంలోంచి బయటికి వెళ్లిపోవాలి. వెళ్తూ వెళ్తూ అమ్మని కూడా చూసి వెళ్తాను. ఆమె నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది"

రాణి అతని గుండెల్లో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చిందల్లా లేచి కూచుంది.

"సరే! నువ్వెళ్లు! ఈ మాత్రం కూడా తక్కువేం కాదు నువ్వు నాకు ఇచ్చి వెళ్తున్నది"

"ఈ వేళప్పుడు నువ్వు ఇంటికెలా వెళ్తావు? "

"ఇక్కడే కూచుంటాను. ఉదయం కాగానే వెళ్లిపోతాను.

చరణ్ లేచి నిలబడ్డాడు. రాణి కూడా లేచి నిలబడింది.

"తిరిగి ఎప్పుడొస్తావు? "

"చెప్పలేను"

"ఎప్పుడైనా వస్తావుగదా? "

"వస్తాను"

"నేను నీ కోసం ఎదురుచూస్తూ వుంటాను. ఎన్నటికీ చూస్తూనే వుంటాను"

చరణ్ తన పెదాలతో, రాణి పెదాలపై చుంబించాడు. ఇద్దరూ ఒకరికొకరు గాఢంగా హత్తుకున్నారు.

ఇహ చరణ్ నెమ్మది నెమ్మదిగా నడక సాగించేడు. రాణి చూస్తూ వుంది. అతను ఆ చీకట్లోనే కనిపించసాగాడు.

చివరికి రాతిబండల మధ్య అతను మాయమైపోయాడు. గాఢంగా నిట్టూరుస్తూ, రాణి తన కన్నీళ్లని తుడుచుకోసాగింది. Ⓥ

- స్కైబాబ

మౌనం

తెలుగు కథ

అయాల-

పొద్దన లేసి చాయ్ తాగుతున్న. సెల్ మోగింది. ఎత్తిన.

"హలో!" అన్నది కమ్మని గొంతు. ఆత్రంగ 'హలో' అన్న.

"సమీర్ గారేనా? " మల్లా అదే కమ్మ దనం.

"అవునండీ! మీరూ!? " అన్న.

"అస్సలామలేకుమ్! మేరా నామ్ ఆఫ్రీన్! మీ కథ 'చందా' చదివాను. చాలా బాగుం దండీ! ఒక అమ్మాయి సున్నిత మనస్త త్వాన్ని బాగా రాశారు" అన్నదా గొంతు.

"అవునా! థాంక్సండీ!" అన్న. తన గురించి అడగాలనిపించినా కాస్త వెనకా ముందాడిన.

"మీ కథలు ఈ మధ్య చదివానండి. బాగున్నయ్. ఈ కథ మరీ బాగుంది..."

"అవునా!... మీరేం చేస్తుంటారు? "

"ప్రస్తుతం ఖాళీనే... మీరు? "

"నేనేదో చిన్న జాబ్ చేస్తుంటానండీ హైదరాబాద్‌లో! మీరెక్కడ? "

"మాది కర్నూలండీ!"

ఇలా మొదలైంది ఆఫ్రీన్‌తో పరిచయం.

ఎంత మధురమైన గొంతు ఆఫ్రీన్‌ది! అసలు ఆ గొంతు అలా వినుకుంట ఉండి పోవాలనిపిస్తుంది. తొలిసారి విన్నప్పుడె ఫిదా అయిపోయిండు తను. ఏ రోజైనా తనతోటి మాట్లాడకుంటే ఏందో పోగొట్టు కున్నట్లుండేదాకా వచ్చింది నా పరిస్థితి. తను గూడ నాతో మాట్లాడకుండ ఉండలే కపోతున్నదని సమజైంది నాకు. కాని తను అలాంటి విషయాల్లో అస్సలు బైట పడేది కాదు.

బహార్ : వసంతం

అయాల- చానా హుషారుగ వినిపిం చింది ఆఫ్రీన్ గొంతు.

"ఏంటంత హుషారు? " అడిగిన.

"అవును ఇవాళ చాలా హ్యాపీగా ఉన్న" అన్నది.

చానాసేపు చానా ఖుషీగ అవోఇవో మాట్లాడుకున్నం. ఆఖర్ల నేనన్న-

"ఇవాల ఇంత ఖుషీగ ఉన్నవు గదా! నేనొకటి కోరుకోనా? "

"కోరు.. నువ్వేం కోరినా ఇచ్చేస్తా. ఫోన్ లోనే కదా!" అన్నది గలగలా నవ్వుతూ...

"నిన్ను చూడాలని ఉంది ఆఫ్రీన్!" అన్న.

అవతలివైపు వెంటనే మౌనం ఆవరిం చింది... ఏమైందో నాకు సమజ్ కాలే-

"ఏమైంది ఆఫ్రీన్? మౌనంగయ్ పోయి నవ్? " అన్న పరేషాన్‌గా.

"ప్చ్.. వద్దు.. ఇప్పుడే వద్దు.. నీతో మాట్లాడుతూ ఉంటే హాయిగా ఉంది దోస్త్! నీ దోస్తానా తర్వాత, కాస్త హుషా రయ్యాను... నీ కథల్లో కూడా నా భావా లెన్నో చూసుకున్నాను. మనం ఇప్పుడే కలుసుకోవద్దు దోస్త్! ఇలాగే హాయిగా ఉంది. కలుసుకుంటే లోకరీతులు, షర తులు, అడ్డుగోడలు, నీతినియమాలు, అందవికారాలు అన్నీ చుట్టేస్తాయి. వాటి మాయలో పడిపోతాం. లోకం మాయలు ఎంత క్రూరమైనవి దోస్త్! అవి మనుష లకు, మంచికి విలువ లేకుండా చేశాయ్.



అవంటే అసహ్యం నాకు..." చెప్పుకుపోతు న్నది ఆఫ్రీన్. ఆ గొంతులోని ఆప్యాయత, ఆ మనసులోని స్వచ్ఛత ఆస్వాదిస్తూ ఉండిపోయిన నేను.

"ఏయ్... ఏమైంది? " అని తను అరి చిందాంక బైటపడలేకపోయిన.

"ఓహ్.. ఓకే.. ఓకే.. అలాగే. నీతో ఏకీభవిస్తున్న ఆఫ్రీన్. నువ్వన్నట్లే చేద్దాంలే..." అన్న.

"షుక్రియా!" అంటూ మల్లా గలగలా నవ్వింది ఆఫ్రీన్. ఆ నవ్వు ఒక వెన్నెల జలపాతం!

ఆఫ్రీన్‌లో నేను ఎన్ని సుగుణాలు గమనించిన్నో!



ఇట్లనే ఫోన్‌ల ములాఖతైన కొందరు అమ్మాయిలతో నా సంభాషణకి, ఆఫ్రీన్‌తో మాట్లాడినదానికి చాలా తేడా ఉండేది. ఒక్కో అమ్మాయి నాతో మాట్లాడినప్పుడు చాలా తొందర్లోనే నీకు ఏ హీరో ఇష్టం? అనడిగేది. మొదట్లో సమజ్‌గాకపోయేది. తర్వాత్తర్వాత సమజయ్యిందేందంటే- నేను ఇష్టపడే హీరోని బట్టి నా అందమో, కలరో, హైటో, వెయిటో అంచనా వేసేటోల్లు ఆ అమ్మాయిలు. ఇహ నేను గూడా ఆ జ్ఞానం పొంది వాళ్లు ఎట్ల ఉన్నరొ తెలుసుకుంటానికి మీకు ఏ హీరోయిన్ ఇష్టం అని అడిగి తెలుసుకునేటోన్ని. అట్లనె ఏ హీరో ఇష్టం అని వాళ్లను అడిగి ఎట్లాంటి రూపం ఉన్నవాళ్లని ఇష్టపడుతున్నరో గూడ అర్థం చేసుకునేటోన్ని. ఇదో ఇంట్రస్టింగ్ గేమ్!

నాకు పెళ్లి కాలేదన్న విషయం ఈజీగ పట్టేసేటోల్లు కొందరు. ఇంకాపెళ్లి కాకపోవడమేందని ప్రశ్నించేటోల్లు. అట్లా బ్లాంక్‌లో ఉంచేవాన్ని. ఆ బ్లాంక్‌నెస్ వారికి భలే ఇంట్రస్టింగా ఉండేది. అమ్మాయిల్లోని హుషారుని ఎంజాయ్ చేసుకుంట వస్తున్న. ఐతే ఇందుల కొంతమంది మాత్రం చాటర్‌బాక్స్ లెక్క ఎప్పుడు చూసినా వాగుతనె ఉంటరని సమజైంది. ఎక్కువమంది తమ అలవాట్లని, ప్రత్యేకతల్ని మహా గొప్పగా చెప్పుకోడం వినుకుంట నవ్వుకునేటోన్ని.

ఆఫ్రీన్ మాత్రం వీళ్లలోకి చానా ప్రత్యేకమైంది. సాహిత్యం గురించి, పాటల గురించి, సమాజంలోని దొంగ విలువల గురించి ఇంట్రస్టింగా మాట్లాడేది. నాకు కూడా ఆ ఆలోచనలు పంచుకోవడం, చర్చించడం పట్ల ఆసక్తిగా ఉండేది.

ఉండంగ ఉండంగ ఆఫ్రీన్‌కు నాకు మధ్య దగ్గరితనం పెరిగిపోయింది. రోజుకు రెండు మూడుసార్లు మాట్లాడుకోవడం నించి గంటలు గంటలు మాట్లాడుకోవడం దాంక వొచ్చింది. ఒక్కోసారి ఆఫ్రీన్ గురించే ఆలోచిస్తూ పరధ్యానంగా ఒకటి చేయబోయి ఇంకోటి చేసేటోన్ని..

'దిల్ యె నాదాన్ తుఝె హువా క్యాహై
ఆఖిర్ ఇస్ దర్ద్‌కీ దవా క్యాహై'
(ఓ బేల మనసా! ఏమైందే నీకు
ఇంతకీ గాయానికి మందేమిటో చెప్పు)
- అంటూ గాలిబ్‌ను యాది తెచ్చుకొని నా మనసును నేనే ప్రశ్నించుకునేటోన్ని...

ఖిజా (పత్‌ఝడ్): శిశిరం

అయాల - ఏదో హమ్ చేసింది ఆఫ్రీన్. గొంతేదో విచారంగ ఉన్నట్లనిపించింది.

"నువ్వు పాటలు పాడతవా? " అన్న ఆశ్చర్యంగ.

"పాడుకుంటుంటాను" అన్నది.

"ఓహ్.. మరిన్నాళ్లు చెప్పనేలేదు? ఒక పాట పాడు- చూద్దాం" అన్న.

"ఇన్నాళ్లు మీతో మాట్లాడించడంలోనే ఆనందం పొందేదాన్ని కదా.. నేను పాటలు పాడుకుంటా ఉంటే ఆ టైమంతా మీరు మాట్లాడరు కదా.. అదీ విషయం! సరేగానీ ఏ పాట పాడను.. నాకిష్టమైందా? మీకు నచ్చిందా? " అన్నది.

"తేడా ఏందంటవ్? " అన్న

"నాకిష్టమైంది మీకిష్టమైంది ఒక్కటయ్యే అవకాశముండదు కదా.." అన్నది.

"అదేంటి... నీకిష్టమైందే పాడు, అప్పుడు జెప్త" అన్న.

పాటెత్తుకుంది. ఏదో విషాద గీతం. అట్లనె వింటూ లోకాన్ని మరిచిపోయిన. ఆ గొంతు పలికిన దుఃఖానికి నా కళ్లల్ల సన్నటి నీటి తెర.

"ఏమైంది ఆఫ్రీన్... ఇయాల ఎందుకంత బాధగా ఉన్నవ్? " అడిగిన.

"ఏమీలేదు. ఇవాళేదో మూడ్ బాగలేదు" అన్నది, ఆ గొంతులో ఎంతో బాధ.

"చాలా బాగా పాడుతున్నావు తెల్సా? సూపర్బ్. ఎక్కడిదా పాట? " అడిగిన.

"నేనే రాసుకున్నది" అన్నది మామూలుగ.

పరేశానైన. "అవునా.. నువ్వు పాటలు కూడా రాస్తవా? నీ పాటలు నీతో పాడించి ఒక సీడీ చేస్తే బాగుంటది తెల్సా!" అన్న హుషారుగ.

నిరాసక్తంగా ఓ నవ్వు నవ్వింది. "ఉంటాను, మళ్లీ మాట్లాడతాను" అన్నది.

ఊకుండిపోయిన.

సర్మా : హేమంతం

అయాల- ఫోన్ చేసి ఒకటే ఏడుపు.

"ఏమైంది ఆఫ్రీన్! ఏమైందమ్మా! ఎందుకు ఏడుస్తున్నవు చెప్పు.. ఊరుకో.. మంచిది కదూ.. ఆఫ్రీన్.. ఆఫ్రీన్..." అనుకుంట ఎంతగనమో ఊకొబెట్టంగ మెల్లమెల్లంగ వెక్కుకుంట వెక్కుకుంట ఊకున్నది.

"ఆఫ్రీన్!"

"ఊఁ!"

"ఏమైందమ్మా! ఎందుకు అంతగనం ఏడుపొచ్చింది? చెప్పు!" అని అనునయించిన.

"ఇంట్లో నేనందరికీ భారమైపోయిన. ఈ మధ్య అందరూ విసుక్కుంటున్నారు. చాలా బాధగా ఉంది..." అంటూ మళ్లీ వెక్కడం మొదలుపెట్టింది.

"ఏడవకు ఆఫ్రీన్! తర్వాత చెబుదువులే.." అని టాపిక్ మార్చి వేరే విషయాలు మాట్లాడించుకుంట కాసేపటికి అవో ఇవో జోకులేసి నవ్వించిన.

రాత్రి పడుకునేటప్పుడు ఆలోచించిన- ఎందుకు అంతగనం ఏడ్చి ఉంటదా.. అని. మాటల్ల తమది షానా గరీబ్ కుటుంబం అని సమజైంది. తండ్రి బావర్చి (వంటలు చేసే మనిషి). పెండ్లిల్ల సీజన్ అప్పుడు చేతినిండా పని. మిగతా రోజుల్ల చానా తక్కువ పని. దాంతోటి బతుకు అంతంత మాత్రమే. ఆఫ్రీన్ పెద్దది. తర్వాత ఒక తమ్ముడు, ఒక చెల్లె. అమ్మ హౌస్‌వైఫ్. బహుశా ఆఫ్రీన్ పెండ్లి చేయలేక ఏదైనా మాటలు అన్నరేమో. టెంత్ తోనే చదువు మాన్పించేసిన్రు. కాని కొంచెం తెలివి వొచ్చినంక పట్టుబట్టి మల్ల చదువు మొదలుబెట్టిందంట. తర్వాత గూడ ఏవేవో కోర్సులు పూర్తి చేసిందట. ఇప్పుడు జాబ్ సెర్చింగ్‌లో ఉంది.

ఆశ్చర్యకరమైన విషయమేందంటే- మా మాటల్లోకి ఎప్పుడు గూడ తమ ఇబ్బందుల గురించి గాని, తన అవసరాల గురించి గానీ అస్సలు రానియ్యకపోయ్యేది



ఆఫ్రీన్.

అట్లనే ఇంకో విషయం- ఇన్నాళ్ల నుంచి మాట్లాడుతున్నా గూడ ఒక్కసారన్నా నువ్వెట్ల ఉంటవు? అని మాత్రం అడగలే. పరేశాననిపించేది తనకు. దాంతో తను ఎట్ల ఉంటదని అడగాల్నంటే ఇబ్బందిగుండేది. అప్పటికీ ఉండలేక రెండు మూడు సార్లు అడిగేసిండు తను. 'ఎప్పుడో ఒకప్పుడు చూస్తావు కదా- వెయిట్ చెయ్ సమీర్!' అంటది. ఒకసారి 'ఎలా ఉంటానో చెప్పడం అవసరమా?' అని నిలదీసింది. ఏం చెప్పగలను? నిజమే... అవసరమా!?

కాని మనసు మాత్రం ఊకునేది కాదు. ఆఫ్రీన్ ఎట్ల ఉంటదో చూడాల్నని ఒకటే తడ్పాయించేది. ఈ తడ్పాయింపు ఆఫ్రీన్‌కి ఎందుకు లేదా అనే డౌటొచ్చేది. ఉంటుందేమో... కాని ఆడవాళ్లు అంత జల్ది బైటపడరు. అంత ఈజీగా బైటపడితే ఈ మగవాళ్ల దూకుడుకు హద్దులుండవు గదా!

శరదృతువు : పండువెన్నెల

"హేయ్! నీకు ఈ రోజు ఒక సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్న" అన్నది.

"ఏందది!? " అన్న కొంచెం ఆసక్తిగ.

"ఈ మధ్య నన్ను చూడాలని నీ మనసు ఒకటే ఆరాటపడుతున్నదని సమజైంది నాకు... నా ఫోటో ఒకటి పంపిద్దామనుకుంటున్న ఒకేనా!" అన్నది.

"ఓహ్.. షుక్రియా ఆఫ్రీన్!" అన్న యమ ఖుషీగ.

"నీ మెయిల్ ఐడి ఎస్సెమ్మెస్ చెయ్" అన్నది.

"ఠీక్ హై" అన్న.

ఇగ ఆలోచనల్ల పడిపోయిన...

ఎలా ఉంటుంది ఆఫ్రీన్? చూస్తానికి అంతగ బాగలేకుంటె? రూపానికి- గొంతుకి, నవ్వుకి ఏమిటి సంబంధం? రూపం ఎలా అయినా ఉండనీ... భావాలు ముఖ్యం కదా... అసలు ఆఫ్రీన్‌ను కలవకుంటనే ఉండిపోతే...! ఇట్లనే ఇష్టమైనప్పుడల్లా మనసార మాట్లాడుకుంట... మరో లోకంలోకి తేలిపొయ్యే పాటలు వినుకుంట... సెలయేటి గలగలల ఆ నవ్వులో తానమాడుతూ సోలిపోతే చాలదా!? అసలు రూపం చూస్తే తప్ప ఇష్టపడనివ్వని భావజాలం ఎక్కడ నించి రూపొందింది? దాన్ని ధ్వంసం చేయలేమా? ఏమో...! తను గూడ మగవాడే కదా...! అంత సులువు కాదనుకుంట!

సరె, ఆఫ్రీన్ అందవికారంగనె ఉందనుకో- లోకం నిర్ణయించిన ఆ అందవికారానికీ ఆమె గొంతు పలికే స్వచ్ఛతకీ ఉన్న తేడాని ఎలా చూడాలె? మనం దేని పక్షం వహించాలె? అవును, ఆఫ్రీన్ చూడడానికి- లోకం చూడడానికి- 'అందం'గా లేదనుకో... లోకం అంటే ఇక్కడ తనే కదా! ఓ.కె. తను చూడడానికే అందంగ లేదనుకో...! అయితే ఏమిటి చింత! ఎలా ఉంటేనేం... ఆ ఒక్క గొంతుచాలు, ఆత్మీయతను ఒలికించడానికి. ఆ ఒక్క నవ్వు చాలు, హాయి తీరాల్లో ఓలలాడించడానికి. ఆ ఒక్కపాట చాలు, ఆవలి ఒడ్డుకి చేర్చడానికి- ఇట్లా ఆలోచించుకున్న తర్వాత మనసుకి హాయిగా అనిపించింది-

గలగలా నవ్వుకి రూపమేముంటుంది?

గొంతు మాధుర్యానికీ దేహానికీ సంబంధమేముంటది?

చల్లని చూపు రూపాన్ని బట్టి ప్రసరించదు కదా...

వీచే కమ్మని గాలి ఆకారాన్ని పట్టించుకుంటుందా?

భూమి- తన మీద సంచరించే జీవుల అందచందాలను బట్టి ఆదరించదు కదా...

ఇట్ల ఏదో కవిత అల్లుకుంట ఉండిపోయిన.



అవాళ ఈవినింగ్ నాలుగ్గంటలకి ఎస్సెమ్మెస్ వచ్చింది, ఫొటో పంపిన అని.

మజ్జానం అన్ని ఆలోచనలు చేసి గూడ, ఒక్క ఉరుకు ఉరికిన ఇంటర్‌నెట్ సెంటర్‌కు. మెయిల్ ఓపెన్ చేసిన. వాళ్ల తమ్ముడి మెయిల్ నుండి వొచ్చిన ఓ ఫొటో! ఓహ్... ఎంత అందంగా ఉంది ఆఫ్రీన్! గెడ్డానికి చేయి ఆనించి సూటిగ నన్నే చూస్తున్నదా! అన్నట్లు ఫీలయిన.

మనసంత ఖుష్ ఐపోయింది. మొత్తానికి ఎట్లుంటదో అన్న సస్పెన్స్ విడిపోయింది. ఒక కలర్ ఫొటో ప్రింట్ తీయించుకొని మరీ ఇంటికొచ్చిన.

ఆఫ్రీన్ ఫోన్- “ఎలా ఉన్న?” అని.

“తెరె చెహెరే పె ఓ నూర్ హై ఆఫ్రీన్!
జిస్ కె లియె సదియోc సె తరస్తా ఆరహా హూc మైc!”

(నీ ముఖంపై ఆ కళ ఉంది ఆఫ్రీన్!
దేనికోసమైతే నేను తరాల నుంచి తపిస్తూ వస్తున్నానో!)- ఫొటో చూసిన



ప్పటి నుంచి మనసులో మననం చేసుకుంటున్న 'షేర్' చెప్పిన.

"ఒఫ్ఫో...హ్! ఇంకా..." అన్నది మురిపెంగా ఆఫ్రీన్.

"తెరి నజర్ నె ముఝె ఇత్నా ప్యాసా బనాదియా ఆఫ్రీన్

జైసె- కడి ధూప్ మె పైదల్ మీలోంసె తడప్‌తా ఆరహా హూc మైc!"

(నీ చూపు నన్నెంతగా దాహార్తున్ని చేసిందంటే ఆఫ్రీన్!

మైళ్ళ నుంచి మండుటెండలో కాలినడకన తల్లడిల్లుతూ వస్తున్నంతగా!) -అంటూ మల్లొక షేర్ ట్రై చేసిన.

"హేయ్... ఇంక చాలు!" అన్నది గలగలా నవ్వేస్తూ.

"అంత అందంగా ఉండి గూడా ఎందుకు ఆ విషయం చెప్పడం ఇష్టముండదు నీకు? " అడిగిన.

"హహ్హా... ఏదోలే...!" అన్నది.

"మరి నా ఫొటో పంపనా? " అన్న.

"నేనడగలేదు కదా" అన్నది.

"పంపుతాలే" అన్న.

"అది నీ ఇష్టం" అన్నది.

"అబ్బాహ్! నీకు ఇంత ఆత్మాభిమానం ఎందుకు ఆఫ్రీన్? మనసుల ఏ మూలనో నన్ను చూడాల్నని లేదా? ఏ మాత్రం బైటపడవెందుకు? " అన్న.

"హేయ్! అన్నీ నువ్వే నిర్ణయిస్తే ఎట్ల? నేనలా అనుకోవడం లేదు. మనం కలిసిందాక ఓపిక పట్టగలను నేను" అన్నది.

"నీ ఇష్టం" అన్న

బర్సాత్ : వర్ష రుతువు

"హే ఆఫ్రీన్! ఆఫీసు పనిమీద అనుకోకుండా కర్నూలు వస్తున్నా"

"అవునా! నిజమా!" అన్నది ఆఫ్రీన్.

"నిజం. ఇందాకనే మా సార్ చెప్పిండు. వెంటనే ఓకే అన్న, నిన్ను కలవొచ్చు కదా అని. ఏమంటవ్? "

"ఓ. కే.. వచ్చెయ్ సమీర్! ఈ క్షణం నుంచే నీ కోసం వెయిట్ చేస్తా!"

రెండోరోజు పొద్దున్నె కర్నూలుకు పయనమైన. అంతకుముందు చానాసార్లు కర్నూలుకు పోయిన గాని, ఈపాలి ఒకటే ఆత్రంగుంది. చాన ఖుషీగ ఉంది. ప్రయాణం ఎక్కువసేపు జరుగుతున్నట్లు... బస్ చానా స్లోగా పోతున్నట్లు ఫీలింగ్....

మధ్య మధ్యలో ఆఫ్రీన్‌కి ఫోన్ చెస్తనే ఉన్న. తను గూడ చాన హుషారుగా మాట్లాడుతున్నది.

"హేయ్... ఎక్కడి దాంక ఒచ్చినవ్? "

"జడ్చర్ల" అన్న.

"ఇంక అక్కడేనా? "

"అవునూ.. ఎక్కడ కలుద్దాం? " అన్న.

"మా ఇంటికొచ్చేస్తున్నవ్!" అన్నది.

"ఇంటికా! ఎవరు లేరా? " అన్న.

"ఉన్నారు. చెల్లె, మా అబ్బా ఊరికెళ్లారు. అమ్మీ, తమ్ముడు, నేను ఉంటాం"

"మరి... ఫ్రీగా మాట్లాడుకోలేం కదా! నువ్వు బైటికి రావొచ్చు కదా? "

"ఇన్నాళ్లకు నాకు ఇష్టమైన దోస్త్ నన్ను కలవబోతున్నారు. కాబట్టి నాకు చాలా పనులున్నాయి. అతని కోసం నా చేతుల్తో నేనేదైనా స్పెషల్ తయారుచేయాలి. ఏదైనా సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకుంటున్నా. కాబట్టి అతన్ని మా ఇంటికే ఆహ్వానిస్తున్నా. మా ఇంట్లో వాళ్లకు కూడా పరిచయం చేయాలి. అర్థమైందా!" అన్నది.

"ఓహ్.. సరేలే. ఆ తర్వాత మనిద్దరం బైటకెళ్దామా మరి" అన్న.

"ఓ. కె. తర్వాత నీ ఇష్టమే" అన్నది.

కొద్దిగా మనసు నిమ్మలమైంది. సరేలే అనుకున్న. ఇంట్ల ఏం చెప్పి ఉంటుంది? ఏం సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నది? మనసు నిండా ఆలోచనలు ముసురుకున్నయ్.

మొత్తానికి కాలాన్ని సాగలాగుకుంట కర్నూలు వచ్చింది. మల్ల ఫోన్ చేసిన.

"హేయ్ ఆఫ్రీన్! ఎక్కడికి రావాలె? "



అన్న.

"కర్నూల్లోకి ఎంటరయ్యావా? "

"అవును"

"బస్టాండ్‌లో దిగి హైద్రాబాద్ ప్లాట్ ఫాంలో ఉండు. నువ్వేం డ్రస్ వేసుకున్నవ్ చెప్పు, చేతిలో ఏమైనా వుందా? "

"బ్లూ చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్, భుజానికి ఓ ఖాకీ కలర్ బ్యాగ్ ఉంటది" అన్న.

"ఓ.కె. నేను మా తమ్మున్ని పంపు తున్నా. వాడు నిన్ను పికప్ చేసుకుం టాడు"

"నువ్వు రావొచ్చు కదా ఆఫ్రీన్? " అన్న ఇబ్బందిగా.

"నువ్వు రా చెప్త" అన్నది.

మొత్తానికి బస్టాండ్‌లో వాళ్ల తమ్ముడు నన్ను గుర్తుపట్టి స్నేహంగా పలకరిం చిండు. తన పేరు సలీం అని చెప్పిండు. నన్ను తోడ్కొని షేరింగ్ ఆటోలో వాళ్ల ఇంటికి తీసుకెళ్లిండు.

నాలో ఏదో టెన్షన్... ఆత్రం...

అదొక ముస్లిం గరీబ్ బస్తీ. సాదాసీదా ఇల్లు...

తలుపు కొట్టిండు సలీం. నేను ఆత్రంగా చూస్తున్న. ఒక యాభై ఏండ్ల ఆడామె తలుపు తీసింది. "హమారె అమ్మీ" అన్నడు సలీం.

"ఐసా!" అంటూ సలాం చేసిన. "వాలే కుమ్ సలాం" అన్నదామె కొంగును తల నిండా కప్పుకొని పక్కకు తొలుగుతూ.

లోపలికి దారి తీసిండు సలీం. చిన్న హాలు. అక్కడ గూడా ఆఫ్రీన్ కనిపించలె. ఒక గోడకు ఏసున్న రెండు కుర్చీల దిక్కు చూపెట్టి "బైఠో" అన్నాడు సలీం. వాళ్ళమ్మ లోపలికెళ్తూ "ఆఫ్రీన్!" అని పిలిచింది.

"ఆఁ... ఆరిమ్!" ఆఫ్రీన్ కమ్మని గొంతు.

పాణం లేసొచ్చింది నాకు, ఆ గొంతు ఫోన్‌ల కాక బైట ఫస్టుసారి వినేసరికి. క్షణాల్లోనే తనను ఎదురుగా చూడబోతు న్నానన్న ఉత్కంఠ నన్ను కూర్చోనివ్వడం లేదు. ఆ హాల్లోకి తలుపు ఉన్న గదివేపు చూస్తున్న. పర్దా వేసి ఉంది. లోపట అంతగనం తయారవుతున్నదా ఏంది అన్న డౌటొచ్చింది.

గర్మా : గ్రీష్మం

అంతలో- మెల్లగా పర్దా జరుపుకుంటా ముందుకొచ్చింది చక్రాల కుర్చీ ఒకటి. అందులో ఉంది ఆఫ్రీన్! ఫొటోలో చూసిన చిరునవ్వు మోముతోనే కుర్చీని నా దిక్కు చేతుల్తో నడిపించుకుంట-

"హాయ్!" అన్నది సంతోషంగా.

ముఖం, చేతులు తప్ప మిగతా బాడీ అంతా కుర్చీకి అతుక్కుపోయి ఉంది. సల్వార్‌లో కాళ్లు మరీ సన్నగా చచ్చుపడి పోయి ఉన్నయ్. కడుపు కూడా మరీ కుదించుకుపోయి కుర్చీలోకి దిగబడిపోయి ఉంది. షాక్‌కి గురైన నా మనసు మెద డును మొద్దుబారుస్తున్నది. 'హాయ్'కి రిప్లై ఇవ్వడం కూడా మర్చిపోయి అట్లనే చూస్తుండిపోయిన.

నేను అంతలా షాక్‌కి గురికావడం ముందే ఊహించినదానిలా చూస్తూ నా ముందుకొచ్చి ఆగింది ఆఫ్రీన్. నా కళ్లల్లోకి చూస్తున్న ఆమె కళ్లల్లోకి నీళ్లు పొంగుకొస్తు న్నయ్. ఆఫ్రీన్ కన్నీళ్లకు నా కళ్లు కూడా కన్నీళ్లను కలిపినయ్! అప్రయత్నంగా నా హృదయంలోంచి ఒక షేర్ వెలువడింది-

తుమ్హారీ ఐసీ ములాఖాత్ కీ

కోయీ అందాజా న హోతో క్యా హువా ఆఫ్రీన్!

హమారా సాత్ దేనేకే లియే

హాజిర్ హై యహాఁ మెరా దిల్ ఔర్ మేరీ జాన్!

(నువ్విలా ఎదురు పడతావని ఊహించ కుంటేనేం ఆఫ్రీన్!

నీకు తోడివ్వడానికి నా మనసు, నా ప్రాణం సిద్ధంగా ఉన్నాయ్!)

ఇటలీ కథ

వైద్యాంతము

కంపార్ట్‌మెంట్‌లోకి ఒక పొడుగాటి ఆవిడ ఉల్లాసంగా ఎక్కింది. నల్లని దుస్తులు, టోపీ అంచు నుంచి కళ్ళదాకా వేలాడుతున్న పల్చటి ముసుగు ఆమె భర్త చనిపోయి ఎన్నోరోజులు కాలేదని చెప్పకనే చెబుతున్నాయి.

ఖాళీగా ఉన్న వేరే సీట్లలో కూర్చుంటుందిలెమ్మని ప్రైవేట్ టొమగ్రా తల తిప్పేశాడు. అయితే ఆమె అటూఇటూ చూసి నేరుగా వచ్చి టొమగ్రా పక్కనే కూర్చుంది.

గౌరవనీయురాలైన ఒక స్త్రీ ఇలా చేయడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. కిటికీ పక్కసీటు కోసం అయ్యుంటుందని సరిపెట్టుకున్నాడు.

విరగబూసిన పూలతోటలా ఉన్న శరీరం ముప్ఫై ఏళ్ళుంటాయని చెప్తోంది.

నల్లగా దిద్దిన కనుబొమలూ, ఎర్రటి లిప్‌స్టిక్, ఎటో చూస్తున్నట్టున్న అభావమైన కళ్ళూ, కొద్దిగా పౌడర్ అద్దడం వల్ల పాలరాతిలా నునుపైన చెక్కిళ్ళూ ఆమె వయసు నలభై అంటున్నాయి.

ప్రైవేట్ టొమగ్రా పదాతిదళంలో ఈ మధ్యనే చేరాడు. మొదటిసారి సెలవుమీద ఈస్టర్ పండక్కి ఇంటికెళ్తున్నాడు. సైన్యంలో చేరినా ఆ వయసు యువకుల్లో ఉండే సహజమైన బిడియమింకా పోలేదు. ఆమె విగ్రహం అతన్ని భయపెట్టింది. చోటు సరిపోదేమో అన్నట్టు సీట్లో ఒదిగి కూర్చున్నాడు. ఆ సర్దుకోవడంలో ఆమె శరీరం నుంచి ఓ పరిమళం అతని ముక్కుపుటాలకు సోకింది. ఏదో చవకబారు సెంట్ కాబోలు. అది పూసుకుని చాలాసేపైందేమో, చెమటతో కలిసిపోయింది దాని వాసన!

ఆమె ఎత్తుకు తగ్గ లావుంటుందేమోనని టొమగ్రా సందేహపడ్డాడు. కూర్చున్నాక చాలా నాజూగ్గా ఉందని అర్థమైంది. ఆమె తను ధరించిన లెదర్‌జాకెట్ తీస్తుంటే చేతులు తగుల్తాయని ఒక మూలకి ఒదిగిపోయాడు.

కానీ ఆమె ఎంతో చాకచక్యంగా ఆ జాకెట్ విప్పి మడతపెట్టి తన ఒళ్ళో పరచుకుంది. తెల్లటి చేతులూ, పిక్కలూ బయటపడ్డాయి. వెండిలా మెరుస్తోన్న పర్సుమీద రెండు అరచేతులూ ఉంచి తల వెనక్కు వాల్చింది.

ఇలా ఇద్దరికీ సీటు చక్కగా సరిపోవడంతో టొమగ్రాకి ఆమె శరీరం అందుబాటులో ఉంది ఎవరి గౌరవానికీ భంగం కలగకుండా! తన యూనిఫాం ఆమె వైఖరిలో ఎటువంటి అయిష్టతనూ కలిగించలేదు.

వేరే సీట్లలో కూర్చోకుండా తన పక్కనే ఎందుకు కూర్చుంది? ఈ ప్రశ్నకి సమాధానం ఏమైవుంటుందా అనుకుంటూ ఆలోచనలో పడేప్పటికి అప్పటిదాకా కుంచించుకుపోయిన టొమగ్రా కండరాలు నెమ్మదిగా పూర్వస్థితికి చేరుకున్నాయి. నిజం చెప్పాలంటే, వాటి అసలు పరిమాణంకన్నా మించి వ్యాకోచించసాగాయి. అలా పరుచు

- ఇటాలో కాల్వినో



కున్న కాలుమీది ప్యాంటుగుడ్డ ఆమె సిల్క్ స్కర్ట్‌కి తగులుతోంది.

మోకాలి కిందనుంచీ ఇద్దరి కాళ్ళూ తాకుతున్నాయి- ఒకరిలోంచి ఇంకొకరిలోకి అలలు ప్రవహిస్తున్నట్టు!

ఆ స్పర్శను రైలు కుదుపులు విడగొడుతున్నాయి, కలుపుతున్నాయి. ఆమె చేతుల్లాగే మోకాళ్ళు కూడా లావుగా బలంగా ఉన్నాయని తెలుస్తోంది టొమగ్రాకి. రైలు మెలికలు తిరుగుతూ వెళ్తుంటే టొమగ్రా అటూఇటూ జరిగి సర్దుకొని కూర్చుంటున్నట్టు అనిపిస్తుంది చూసేవాళ్ళకి. కానీ అతను ఆమెకు కాళ్ళు తగిలించే ప్రయత్నంలో ఉన్నాడని వాళ్ళిద్దరికీ మాత్రమే తెలుసు!

ఆమె టోపీనుంచి తలచుట్టూ వేలాడుతోంది పల్చటి ముసుగు. ఆ ముసుగు వెనక కళ్ళుమూసుకొని ఒళ్ళో ఉన్న పర్సుని చేతుల్తో గట్టిగా పట్టుకొని నిద్ర నటిస్తోంది. లేకపోతే ఒక మగాడు - అందునా సైనికుడు -ఇందాకట్నుంచీ చేస్తున్న పనులకి అడ్డుచెప్పట్లేదంటే ఏంటి అర్థం? టొమగ్రాకి కొంచెం ధైర్యమొచ్చింది.

తన పిక్క కండరాన్ని పిడికిలిలా బిగించి దాంతో ఆమె పిక్కని కొట్టాడు. ఒక్కక్షణం ఊపిరి స్తంభించిపోయింది. ఇది మెరుపువేగంతో చేసిన పని. వెంటనే ప్యాంటు సర్దుకుంటున్నట్టు కాలు పొడవుగా జాపి ప్యాంటుగుడ్డ సరిచేశాడు చేత్తో. ఆమెనించి ఎటువంటి ప్రతిఘటనా లేదు.

కాలు జాపడంతో వారి పిక్కల మధ్య స్పర్శాబంధం తెగిపోయింది. ఎంతో కష్టపడి ఏర్పరచుకున్న ఆ స్పర్శ పోవడంతో ఉసూరుమన్నాడు టొమగ్రా. ఇంకొంచెం ధైర్యం తెచ్చుకొని ఏదో వెతుకుతున్నట్టు ప్యాంటుజేబులో చెయ్యిపెట్టాడు. ఇప్పుడు వారిద్దరి మధ్యా అతని చెయ్యి! ఇదీ చాలా వేగంగా చేసిన పనే. ఆమెను తాకాడో లేదో తెలీదు.

చేతిని బయటికి తియ్యడం మర్చిపోయినట్టు జేబులోనే ఉంచేశాడు. అయితే అతి చొరవతో తనెంత ముఖ్యమైన అడుగువేశాడో, ఎంతటి ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాడో గ్రహించాడు. ఆమె అరిస్తే? లేచి గోలచేస్తే తన పరువేంగాను?

జేబులో చేతికి ఆమె జఘనం మెత్తగా తగుల్తోంది. ప్రతి వేలికీ, ప్రతి కణుపుకీ ఆ స్పర్శ తెలుస్తోంది. ఇప్పుడు చెయ్యి ఎలా కదిలించినా ఆమెను సమాజం ఒప్పుకోని చోట తాకాల్సొస్తుంది.

జేబులోనే నెమ్మదిగా చేతిని తిప్పాడు. ఇప్పుడతని అరచేయి ఆమెవైపు ఉంది. ఆమెనలా తాకాలనుంది టొమగ్రాకి. అయితే చెయ్యి మెలికపడింది. ఇలా ఎక్కువసేపు ఉంచలేడు కాబట్టి త్వరత్వరగా ఆమెనెక్కడ తాకుతున్నాడో తెలీకుండా తన వేళ్ళు అదిలించాడు.

ఆమె ఏం ఎరగనట్టు మౌనంగా ఎలా ఉండగలుగుతోంది? కనీసం అసంకల్పితంగా జరిగినట్టైనా పక్కకి సర్దుకోవాలి కదా? అంటే ఇక అనుమానం లేదు, ఆమె తనని ప్రోత్సహిస్తున్నట్టే! లేదా అతను నిజంగానే జేబులో అగ్గిపెట్టో, టికెట్టో వెతుకుతున్నాడని ఆమె పట్టించుకోవటం లేదా?

ఇదిగో - ఇప్పుడుగనక టొమగ్రా చేతులకే పరకాయప్రవేశవిద్య తెలిసుంటే ఆమెచర్మంలోంచి కణాల్లోంచి సూక్ష్మాల దాకా చొచ్చుకెళ్ళి మనసులో తనగురించి ఏమనుకుంటోందో తెలుసుకునేవాడు. 'ఇవి ప్రాణమున్న నా వేళ్ళు, నువ్వు పట్టించుకోకుండా వదిలెయ్యడానికి ప్రాణంలేని మేకులు కాదు' అని అరిచి చెప్పేవాడు. మొత్తానికి నాలుగంచెలుగా చేతిని జేబులోంచి బైటకు తీశాడు. మళ్ళీ ప్యాంటు సరిచేసుకుంటున్నట్టు నడుముపట్టీ దగ్గ



ర్నుంచీ మోకాలిదాకా సాపు చేశాడు. ఈ ప్రయత్నంలో ఇద్దరి తొడల నడుమా సన్నటిదారిని కూడా సాపు చేశాడు!

టొమగ్రాకూడా ఆమెలానే సీటుమీదకి వెనక్కి తలవాల్చాడు. అయితే ఈ భంగిమ ఆమెకు కల్పించినంత రక్షణ తనకు కల్పిస్తుందా? తను చేతులు కదిలిస్తుంటే అది నిద్రలో చేస్తున్నాడని వేరే వాళ్ళు అనుకోగలరా?

తన మోకాలిమీద ముడిచిన అరచేతి నుంచి నిద్రలో దానికదే విడివడినట్టు చిటికెనవేలుని జాగ్రత్తగా బయటికి తెరిచాడు. ఆ వేలు అలా దూరంగా జరిగి ఆమె మోకాలుమీద ఆని రైలుకుదుపులకు వృత్తాలు చుట్టింది.

కళ్ళు సగంతెరిచి చూస్తుంటే నల్లటి సిల్కుస్టాకింగ్ కనిపిస్తోంది కానీ అదే శరీరభాగమో కనుక్కోవటం ఒక్కవేలుతో కుదరటంలేదు. సురక్షితమా కాదా అని కాసేపు ఆగాడు. ఇప్పుడు ఉంగరంవేలు, మధ్యవేలు, చూపుడువేలు ఒకటొకటే చిటికెనవేలికి తోడయ్యాయి. మొత్తం నాలుగు వేళ్ళు కదలని మెదలని ఆమె మోకాలిమీద ఉన్నాయి.

ఎదురుసీట్లోవాళ్ళు ఇది గమనిస్తే బావుండదేమో అని సందేహపడ్డాడు. సైనికుల గురించి చిలువలు పలువలుగా వింటూనే ఉన్నా మరీ ఇంత అసభ్యంగా ప్రవర్తిస్తారా అని వాళ్ళు ఛీకొడతారేమో! తప్పంతా తన చేతిదే అయినట్టు, బుద్ధికే మాత్రం తెలియనట్టూ చటుక్కున చెయ్యి వెనక్కు తీసేసుకున్నాడు చూసేవాళ్ళ కోసం.

ఆ చేతిని ఇద్దరిమధ్యా తాను ఏర్పాటుచేసిన సన్నటిదారిలో దాచిపెట్టాడు. ఇప్పుడది ఆసరా కోసం తడుముతోంది. సీతాకోకచిలుక పూవుపై మృదువుగా వాలినట్టు అతని అరచేయి ఎక్కడో వాలింది వారి తొడల మధ్య! ముసుగులోంచి ఆమె చూపుని చదవటం సాధ్యం కావట్లేదు. పిల్లి తరిమిన ఎలుకలా మళ్ళీ చెయ్యి వెనక్కొచ్చేసింది!

ఆమె పిసరంత కూడా కదల్లేదు. ఇది కావాలేమో? ఇంకోసారి చేస్తే? మళ్ళీ చెయ్యివేస్తే తనను అందరిమధ్యా దోషిలా నిలబెట్టాలని ఎత్తుగడ వేస్తోందేమో? సరే, ఇంకోమార్గం వెతకాలి.

తాపీగా చేతిని సీటువెనకాల బార్లాజాపాడు. రైలుని తన పని చేసుకోనిచ్చాడు కాసేపు. చెయ్యి కిందకి జారి ఆమె నడుము దగ్గరకి చేరింది. నిటారుగా కూర్చోవటానికి వెనక్కి జరిగినపుడల్లా టొమగ్రా వేళ్ళు ఆమెకు తగలటం యాదృచ్ఛికం అనుకుంటారందరూ.

ఆమె కిటికీలోంచి బయటకు చూస్తోంది. టక్ టక్ మనేలా పర్సుని మూస్తోంది, తెరుస్తోంది. తన చర్యలకి సమ్మతి తెలియజేస్తోందా? లేదా ఇంక చాలు, మర్యాదగా ఆపెయ్ అంటోందా?

అనువాదం : మోహిత

ప్రైవేట్ టొమగ్రా తనచెయ్యి ఆమె నడుముని ఎక్కడో పట్టుచిక్కించుకుందని గ్రహించాడు. ఇక ఈ సైనికుడు వెనుదిరగడు. ఆమె మాత్రం మైనంబొమ్మలా ఏ భావమూ తెలియనివ్వటం లేదు.

పీతలా టొమగ్రా చెయ్యి పక్కకి పాకీ పాకీ ఆమె తొడమీదకొచ్చి ఆగింది. ఎదుటివాళ్ళకి కనిపిస్తుందా? లేదు, ఆమె తన ఒళ్ళో ఉన్న జాకెట్ ని అతని చేతిమీద కప్పింది. ఇక టొమగ్రా చెయ్యి విజృంభించింది. ఆమె కిటికీలోంచి బయటకు చూస్తూనే ఉంది. టొమగ్రా ఓరకంట ఆమె చెవికీ, గౌనుకాలరుకీ మధ్య పచ్చగా మెరుస్తున్న మెడమీది చర్మం చూస్తు

న్నాడు. చెవికింద నరం కొట్టుకోవటం కని పిస్తోంది. ఇంత స్పష్టంగా జవాబు చెప్తుంటే తనింకా భయపడ్తాడేంటి?

ఆమె హఠాత్తుగా తలతిప్పింది. టొమగ్రా అదిరిపడి తన గుప్పిట్లో చిక్కు కున్న ఆమె శరీరభాగాన్ని వదిలేసి తలవె నక్కు వాల్చి కళ్ళు టక్కున మూసేసుకు న్నాడు. అందుకే ఆమె కళ్ళల్లో మెరుపును అతను గమనించలేకపోయాడు.

అది టొమగ్రా శరీరంలో అంగం కానట్టే, దానికి స్పర్శాజ్ఞానం లేనట్టే నల్లటిలెదర్‌జా కెట్ కింద చెయ్యి నిస్త్రాణగా ఉండిపో యింది.

ఆమె తలతిప్పింది తనవంక చూడటా నికి కాదని గ్రహించేప్పటికి ఆ చేతిలో మళ్ళీ రక్తం ప్రవహించటం మొదలైంది. దాంతోటే ధైర్యంకూడా. చెయ్యి ఆమె స్కర్ట్ అంచున ఉంది. ఇంకొక్క అంగుళం ముందుకి కదిలించినా అది ఆమె మోకాలి మీదనుంచి బయటకు కనిపిస్తుంది. ఇంత టితో తన పర్యటన అయిపోయింది. ఇక వెనక్కు తిరగాలి. పాపం సైనికుడని ఆమె జాలిపడి ఇప్పటిదాకా అనుగ్రహించింది కాబోలు.

వెనక్కు మరలుతుంటే గమనించాడు- ఆమె లెదర్‌జాకెట్ తన కాళ్ళని పూర్తిగా కప్పి ఉంచేటట్టు జారవిడిచిందని! తనచే తిని ఈ గుహలో బంధించేసింది. ఇది సైనికుడిమీద నమ్మకంతోటా, అతన్ని ఇత రుల చూపులనుంచి తప్పించటానికా? అసలు అతనికేం కావాలి? ఊరికే నిమర డంతో సరిపెట్టుకుంటాడా లేక.....?

టొమగ్రా 'సరిపెట్టుకోను' అనుకున్నాడు. స్కర్ట్‌నిదాటి వెళ్ళింది అతని చేయి. ఆమె నిద్రపోతోంది(?) మళ్ళీ! ఈ నిద్రని గౌర వించి తను ఆగిపోవాలా? లేదా అంగీకా రసూచనగా తీసుకొని కృతజ్ఞత తెలుపుకో వాలా? ఇన్ని ప్రశ్నలకూ అతనికొకటే జవాబు దొరికింది. తను ఆగడు.

ప్రైవేట్ టొమగ్రా చేతులు చాలా బొద్దుగా, చిన్నగా, అసలు ఎముకలు న్నాయా అనిపించేంత మెత్తగా ఉంటాయి. అటువంటి చెయ్యి నెమ్మదిగా, మృదువుగా తనను తడుముతుంటే ఆమె ఒళ్ళు మొద టిసారిగా చిన్నగా జలదరించింది తన్మయ త్వంతో.

ఆ పులకింతకి టొమగ్రా ఉలిక్కిపడి చేతిని తీసేసుకున్నాడు. ఆమెకి తన చర్యలు తెలుస్తున్నాయనమాట!

ఇప్పుడతని రెండుచేతులూ అతని మోకాళ్ళమీదే ఉన్నాయి. ఆమె రాక ముందు ఎలా కూర్చున్నాడో ఇప్పుడలాగే కూర్చున్నాడు. తన ప్రవర్తన తనకే నచ్చ లేదు. ఇదంతా కలా నిజమా? మళ్ళీ కాలుజాపి ప్యాంటు సవరదీసి రెండోసారి నాటకానికి తెర ఎత్తుదాం అనుకున్నాడు.

ఇంతలో రైలు సొరంగమార్గంలోకి ప్రవే

శించింది. కంపార్ట్‌మెంట్ చీకటైపోయింది ఒక్కసారిగా. టొమగ్రా పిరికి కోడిపెట్టలా మళ్ళీ ఆమెమీద చెయ్యివేశాడు. తామిద్దరి మధ్యా ఇప్పటికే ఒకరకమైన దగ్గరితనం ఏర్పడిపోయిందంటే అతనికి నమ్మశక్యంగా లేదు. ఆమె వక్షమ్మీదకి చేతిని పోనిచ్చాడు. తహతహలాడుతున్న ఆ చేతిని దాని ఇష్టానికి వదిలేసి అమితానందాన్ని అనుభవిస్తున్నాడు. ఆమె ఊఁ అంటే చాలని ఆబగా ఎదురుచూస్తున్నాడు.

ఆమెలో చిన్న కదలిక. కానీ అతనిచర్యకు వ్యతిరేకంగా. అంతే! టొమగ్రా నత్తలా తన సీట్లో ముడుచుకుపోయాడు. సొరంగంలో వెలిగే సిగ్నల్ లైట్‌ని చూసి భయపడింది కావచ్చు! లేదా అతను చాలా ఎక్కువ చేశాడనుకుందా? కాదు కాదు- వాళ్ళిద్దరి మధ్యా జరుగుతున్న సంఘటనలకి ఆమె ఈపాటికి ప్రతిఘటించలేదంటే, ఇదంతా నిజమే, ఆమెకు ఇష్టమే అని టొమగ్రా ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ ఆలోచనల్తో చాలా సమయం వృథా అయిపోయింది.

అతను అంతకుముందు ప్రయాణించినపుడు ఈ సొరంగం చాలా పొడవైనదని గుర్తు. ఆలస్యం చేయకుండా మళ్ళీ ఆమె మీద చెయ్యివేశాడు. కాసేపటికే మసకవెలుతురు కనపడి క్షణాల్లో సొరంగమార్గం ముగిసింది.

రైలు ఆఖరిస్టేషన్లవైపు వెళుతోంది. బోగీ క్రమంగా ఖాళీ అవుతోంది. ఈసారి రైలు ఆగినపుడు సైనికుడూ ఆమె తప్ప మిగిలినవారందరూ దిగేశారు.

టొమగ్రా అనుకున్నాడు- ఇంకా ఈమె నా పక్కనే ఎందుకు కూర్చుంది? నా చర్యలు నచ్చకపోతే వెళ్ళి వేరే సీట్లో కూర్చోవచ్చు కదా?

అతను సాహసించి ఒకడుగు వేయాలంటే ఏవో అదృశ్యబంధాలు ఆపుతున్నాయి. తలుపు దగ్గర ఇద్దరుముగ్గురు పొగతాగుతూ నుంచున్నారు, సంజెచీకట్లకి పెట్టెలో లైటు వెలిగింది -అందుకాగాదేమో. తను దిగాల్సింది చివరి స్టేషన్లో. ఇంకా చాలా టైముంది. లేచి కర్టెన్లు వేద్దాం అనుకున్నాడు. ఎవరైనా చూస్తే 'నిద్రపోవడానికి' అనుకుంటారు.

ప్రైవేట్ టొమగ్రా అస్థిమితంగా కర్టెన్లు వేస్తున్నాడు, తీస్తున్నాడు. చివరికో నిర్ణయానికి వచ్చి పరదాలతో తమ కూపేని మూసేశాడు. వెనక్కి తిరిగి చూసేప్పటికి ఎప్పుడు కదిలిందో ఏమో ఆమె సీటు మీద జారగిలబడి ఉంది. ఆమెచూపు మాత్రం ఇంకా తన కళ్ళకి చిక్కట్లేదు. టొమగ్రా ఆమె మీదుగా వంగి కిటికీలు కూడా వేసేశాడు. ఇంకేంచేయాలో తోచలేదు. మళ్ళీ కర్టెన్లవైపు కదిలాడు. ఈ అస్థిరత వల్ల లాభం లేదని ఆగిపోయాడు. అతనికి గొంతు చించుకొని తన మనసులో మాట చెప్పాలనుంది: "మీరు నన్ను చూసి జాలిపడుతున్నారు కదూ? సైనికులంటే ఒంటరిగా ఉంటారు, ప్రేమరాహిత్యంతో బాధపడుతుంటారనుకుంటున్నారు కదూ? అయితే చూడండి, నేను మీవల్లే వెనక్కి మరలలేని కోరిక అంచుకి చేరుకున్నాను. అందుకే ఇలా, ఇందులో నా తప్పేంలేదే"

అంతా ఆలోచిస్తే ఈమెకు జరగబోయేది ముందుగా తెలిసిపోయుంటుంది అనుకున్నాడు. అలవిగాని కామంతో ఆమె మీద పడ్డాడు!

రైలు వెళుతూనే ఉంది. టొమగ్రా కాసేపటికి లేచాడు. తన ముఖానికి దగ్గరగా ఉన్న ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమెవి నీలికళ్ళు. ఇంత జరిగినా ఆమె తలమీది టోపీ చెక్కుచెదరలేదు.

వర్షం మొదలైంది.

ప్రైవేట్ టొమగ్రాకి మళ్ళీ భయం పట్టుకుంది- తనకసలు అంత ధైర్యం ఎక్కణ్నుంచీ వచ్చిందా అని!!

V



ఉర్దూ కథ

సౌత

- ఇక్బాల్ మతీన్

అతని ఉత్తరాన్ని అందుకొని మడత విప్పగానే అందులోంచి గులాబీ పువ్వు రెక్కలు జారి నా పాదాల మీద పడ్డాయి.

ఆ పూలరేకుల్ని సహరా ఏరింది.

ఆ పూలరేకుల్ని నా చేతిలోకి తీసుకోవాలన్న కోరిక నా మనస్సులో ఎంత బలీయంగా ఉన్నా వంగి ఆ పూల రేకుల్ని నేను ఏరలేకపోయాను. సిగ్గు నా చెంగు పట్టుకొంది. ఆ ఉత్తరాన్ని కూడా నేను పూర్తిగా చదవలేకపోయాను. సంబోధన మీద నా దృష్టి పడింది. అంతే, చెంపలు కెంపులయ్యాయి. ఉత్తరాన్ని రవిక లోపల పెట్టేసి పైట సర్దుకున్నాను.

గులాబీ రేకుల్ని ఏరి సహరా నాకివ్వలేదు. జాగ్రత్తగా వాటిని చెంగున కట్టేసుకొంది. అదిగో అలాంటి చెడ్డపని అంటేనే నాకు కిట్టదు. నా చేతుల్లో పెట్టేస్తుందనుకున్నాన్నేను. వాటిని అందుకోగానే పిడికిలి గట్టిగా మూసేసి దాచేయాలనుకున్నాను.

కిద్వాయి కాటేజ్‌లో ప్రతీ పొదరింటి దగ్గరా జనాలు వెదజల్లిన ముత్యాల్లా కనిపిస్తున్నారు. ముత్యాల్లాగున్నారని ఎందుకు చెప్పానంటే అంతా తెల్లని దుస్తుల్లో మెరిసిపోతున్నారు.

అంతేకాదు ముత్యాలతో పోలికకి మరో కారణం కూడా ఉంది. మేమంతా గేట్ దాటి లోపలకి ప్రవేశించాక మోటారు వాహనాల పార్కింగ్ చోటు నుంచి గార్డెన్‌లోకి వెళ్లాలనుకుంటే ఈ మెట్ల మీదుగా వెళ్లవలసి ఉంటుంది. మేమంతా ఈ మెట్ల దారి పట్టాం. కావాలనే నేను అందరికంటే వెనక్కి ఉండిపోయాను. అంత పెద్ద ఎత్తులో నిల్చొని ఆ ప్రకృతి సౌందర్యంలో వెలిగిపోతూన్న తెల్లనిదుస్తుల యాత్రికుల సముదాయాన్ని తిలకిస్తున్నాను. వాళ్ళంతా ఆ మెట్ల మీద అందమైన ముత్యాలమాలలా కనిపించారు. ఈ మాల గార్డెన్‌లోకి వెళ్ళగానే విడిపోయి ముత్యానికి ముత్యం చెల్లాచెదురైపోతున్నాయి.

అలీమ్ వెనక్కి తిరిగి తిరిగి నన్ను చూడాలన్న ప్రయత్నం కూడా చేశాడు. కాని నేను అతని దృష్టి నుంచి తప్పించుకొంటూ అతన్నే చూస్తున్నాను.

రెండు కళ్ళు ఆ నిండు సభలో ఎవ్వరికీ తెలియని విధంగా ఇంకెవరినో వెదుకుతున్నాయి. కంగారుతో, వ్యాకులతతో, భయంతో. ఈ రెండు కళ్ళూ ఏ రెండు కళ్ళనయితే వెదుకుతున్నాయో ఆ రెండు కళ్ళూ, గార్డెన్లో సురక్షితమైన ఒకానొక మూలలోంచి పూలగుత్తుల మధ్యలో దాగి ఉండి తమనే చూస్తున్నాయని గ్రహించగానే లోకంలో ఉన్న సంపదలన్నీ పొందినంత తృప్తిని పొందాయి.

నేను అలాంటి సంపదలతో తులతూగుతున్న సంపన్నురాలిని.

అలీమ్‌నే చూస్తూ ఉండడంలో నాకెంతో తృప్తిగా ఆనందంగా ఉంది. నా కళ్ళకి హాయిగా ఉంది. అలీమ్ కళ్ళలో ఉండే విహ్వలతని చూడగానే కలిగిన ఆనందం

కూడా నా కళ్ళల్లో ఉంది.

నా ఈ దొంగాటలతో విసిగిపోయే అలీమ్ నాకో ఉత్తరం రాసాడు. ఈ ఉత్త రాన్ని సహరా ద్వారా నాకు పంపాడు. నేను మళ్ళీ సురక్షితమైన పొదరిల్లు కోసం వెదుకుతూ తిరుగుతున్నాను. ఎవరికీ కని పించకుండా ఉండాలని నా ఉద్దేశ్యం. అందులో కూర్చొని అలీమ్ నాకు రాసిన ఉత్తరంలోని ఒక్కొక్క మాటనీ నా కళ్ళ లోకి తెచ్చుకోవాలి.

సహరా ఏరిన ఆ గులాబీ రెక్కలు మళ్ళీ గుర్తొచ్చాయి. రంగు రంగుల పువ్వులెన్నో నవ్వుతూ ఉంటే అటువైపు వెళ్ళాను. ఆ పూల సమూహం నాకు ఆశ్రయమిచ్చింది. ఆ పువ్వుల మాటున కూర్చొని అలీమ్ ఉత్త రాన్ని తెరిచాను. అలీమ్ ఆ ఉత్తరంలో ఇలా రాశాడు.

"రూహీ, నా ప్రాణమా!

నేను గార్డెన్‌లోకి అడుగుపెట్టగానే నీ కోసం ఈ పువ్వుని కోమలమైన ఒక కొమ్మ నుంచి తుంచాను. దీన్ని పొడవైన నీ నల్లని కురుల రాత్రికి కాంతితో మెరిసే ఓ చిన్ని సితారని చేద్దామని భావించాను. కాని నువ్వు నాకు అందుబాటులో ఉంటే గదా. నువ్వేమో నాకు కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్నావు.

ఈ పువ్వు నుదుటన రేకులుగా విడిపొ మ్మని రాసి ఉంది. అందుకే దాన్ని నేను నిర్దయతో కోసాను. వాటిని నువ్విప్పుడు చెదిరిపోకుండా మాత్రం ఉంచు.

నీ అలీమ్"

ఆ పూలరేకులు చెదిరిపోవడమే కాకుం డా సహరా చేతులు వాటిని నా పాదాల వద్దనే ఏరాయి. నేనేమో విలవిల్లాడిపో యాను. పూలరాశిలోంచి నేను బయటికి రాగానే కేవలం చూపులతోనే నన్ను ప్రేమి స్తున్నాడా అన్నట్టు అలీమ్ నన్ను చూసా డు. చీట్లపేక ఆడుతున్న అతని కళ్ళు పేక ముక్కల మీద లేవు.

కానిప్పుడు నా మనస్సులోను, మస్తి ష్కంలోను అలీమ్ లేడు. సహరా ఉంది. నా చూపులు ఆమెను వెతుకుతున్నాయి. అకస్మాత్తుగా ఆమె నాకు కనిపించింది. అలీమ్ వెనకనే కూర్చొని పేకాటలో కార్డు ల్ని డిస్కార్డ్ చెయ్యడంలో అతనికి సలహా లిస్తోంది.

★ ★ ★

సహరా అలీమ్‌తో ఎంతగా కలిసిపో యింది. గొలుసులో ఒక లింక్‌ని ఇంకొక రింగ్‌తో కలిపే కొక్కెంలాగ నాకు అలీమ్‌కి మధ్య సహరా గొళ్ళెంలా తయారయింది.

కేవలం ఇంత చిన్న విషయానికే సహ రాకి వ్యతిరేకంగా.. నేనెందుకిలా ఏమిటే మిటో ఆలోచిస్తున్నాను? ! బహుశా నా లోపల దాగివున్న స్త్రీ మేల్కొందా? ఆ స్త్రీ తన జీవితాన్ని పణంగా పెట్టి కూడా తన ప్రేమలోని ప్రతి అణువుని తెలుసుకోవా లని అనుకుంటోందా? ఇంక అలీమ్ అయితే ఆ వంశం మొత్తం మీద బాగా ఎండ కాస్తున్న సూర్యుడిలాంటివాడు. అందరికీ ప్రియుడు. కానీ, ఆ సూర్యుడు నావాడు కదా.

'నావాడు' ఔను నేనలాగే అనుకుంటు న్నాను. "ఆ కార్డు విసిరెయ్-" సహరా కేక నన్ను, అలీమ్‌ని తుళ్ళి పడేటట్టు చేసింది. ఆ వెంటనే అలీమ్ ఆ ముక్కని కిందికి కొట్టాలనుకొన్నాడు. కాని ఇంతలో సహరా అతని చేతిని పట్టుకొని ముక్క వెయ్యనివ్వ కుండా అడ్డుకుంది.

"ఏం చేస్తున్నావు నువ్వు. ఏ కార్డుని కిందికి విసిరేయాలో కూడా తెలియదు నీకు" అని అంటూ అలీమ్ చేతిలో ఉన్న సగం తెరిచిన గుండ్రని విసనకర్ర లాగ పేర్చి ఉన్న పేకముక్కల్లోంచి ఏ ముక్క నైతే పారేయడానికి కొంచెం మీదికి లాగి ఉంచాడో మళ్ళీ దాన్ని సహరా - సరి చేసింది. "ఇదుగో ఈ ముక్కని కొట్టు" అని అధికార పూర్వకంగా అంది.

అలీమ్ కూడా మారుమాటాడకుండా ఆ ముక్కని విసిరేశాడు.

సహారా నన్నే డిస్కార్డ్ చేయించినట్టుగా నాకనిపించింది.

ఆ తర్వాత అలీమ్ నా వైపు చూడ్డం తగ్గిపోయింది. నాకు జరిగిన ఈ అవమానాన్ని సహించలేకపోయాను. అక్కడ్నుంచి మౌనంగా బయటికి వచ్చేసాను. డిస్కార్డ్ చేసిన ముక్క గురించి ఆటగాడు పట్టించుకోనట్టే అలీమ్ మస్తిష్కం లోంచి ఇప్పుడు నేను కూడా తొలగిపోయాను.

అక్కడ్నుంచి లేచి వచ్చేస్తున్నప్పుడు సహారా నన్ను బలే విచిత్రంగా చూసింది. నాతో ఏదో చెప్పాలనుకున్నట్టుగా, అయినా చెప్పడానికి వీలుకాలేదన్నట్టుగా ఆమె కళ్ళు చెప్పాయి.

ఎవ్వరికీ కనిపించకుండా ఓ మూల కూర్చుని బాగా ఏడవాలని ఉంది నాకు. ఓ మూలకి వెళ్ళినా కన్నీరు ఉబకలేదు.

ఆఠీన్ రాణిని అలీమ్ డిస్కార్డ్ చేసాడు.

'అది నువ్వే - అది నువ్వే అది నువ్వే'

'నేను కాదు - నేను కాదు - నేను కాదు' నా నోటి నుంచి నెమ్మదిగా ఈ మాటలు వెలువడ్డాయి. నా బుగ్గల మీంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"ఇదేమిటి పిచ్చిదానా-" నా కళ్ళ మీద మృదువైన చేతుల స్పర్శ. ఆ చేతులు సహారావి. నేను విలవిల్లాడిపోయాను.

"నీకు పుణ్యముంటుంది. నన్నొంటరిగా ఉండనీ సాహీ"

"కాని నువ్వక్కడ్నుంచి లేచి ఎందుకిలా వచ్చేసావ్? "

"నీకేం, నా ఇష్టం"

"చాల్లే మాట్లాడేవ్, రా నాతో నేను చేసిన దాంట్లో తప్పు లేదు"

సహారా ఒక్కక్షణం ఆగి మళ్ళీ అంది - "నీకు తెలుసా, అందరి కళ్ళూ మీ ఇద్దర్నే చూస్తున్నాయి. మిమ్మల్ని మీరు మర్చిపోయి ప్రవర్తిస్తున్నారేమిటి మీరిద్దరూ? దగ్గరగా ఉన్నప్పుడు ఒకరితో ఒకరు తిన్నగా మాట్లాడలేకపోతున్నారు. మాటలు కరువైపోయినట్టుగా మూగబోతున్నారు. ప్రేమించుకోలేదన్నట్టుగా జీవితమంటే భయపడి పోతున్నారు"

నా మనస్సు స్థిమిత పడుతూన్నట్టయింది. అలీమ్, నేను మేమిద్దరం కలుస్తాం. మాట్లాడుతాం. అందువల్ల వచ్చిన కష్టనిష్ఠూరాలు మాకు చెందుతాయి. అంతేగాని మా మంచిచెడ్డల్ని గమనిస్తూ ఇంత జాగ్రత్తగా మమ్మల్ని కాపాడుతూందంటే ఇందులో సహారాకి కలిగిన లాభమేమిటి? ఆమె ఒత్తిడి చేసినందువల్ల మళ్ళీ నేను అందర్లోనూ కలిసిపోయాను.

ఇంక పేకాట ఆపేద్దాం అని అన్నవాళ్ళలో అలీమ్ మొదటివాడు. ఆట ఆపేసాక దాగుడుమూతలు ఆడదామని అన్నారు. కాని మా అమ్మాయిలమంతా వద్దని అనేసాం.

అలీమ్ కళ్ళతోనే యాచించాడు నన్ను వొప్పుకోమని. దాంతో నేను వొప్పుకోవడమే కాకుండా అమ్మాయిలందరి చేతా వొప్పించాను. ఆట మొదలయింది. నేను ఓ మూలగా ఉండే పూల చెట్లవైపు దారితీసాను. నేనెప్పుడూ ఆ పొదరింట్లోనే ఉంటాను. ఆ చోటు నాకు ఆశ్రయమిస్తుంది. అందరితో బాటు కొంతవరకు పరుగెత్తి ఆ తర్వాత కుందేలు లాగా అందులోకి దూరిపోయాను.

మిగతా అమ్మాయిలు అబ్బాయిలు- అంతా కిద్వాయి కాటేజి పొదరిళ్లలో దాక్కుంటూ బయటికి వస్తూ ఇటూ అటూ తిరుగుతున్నారు. దొంగ అయిన అమ్మాయి నేను ఈ పొదరింటిలో దాగున్నట్టు చూసిందేమోనని నా అనుమానం. ఇంకో చోటుకి వెళ్ళి దాక్కుందామని అనుకుంటున్నాను. ఇంతలో వెనక నుంచి ఎవరో నన్ను తటాలున పట్టుకొని కదలకుండా చేశారు. నా నోట్లోంచి కేక వస్తూ



వస్తూన్నదల్లా ఆగిపోయింది. నేనిప్పుడు దొంగనయ్యానని తెలిసిపోయింది. కాని నన ్ను పొదివి పట్టుకొన్న దొంగ ఎవరనుకొన్నారు. అతను నా సర్వస్వాన్నీ దోచుకొన్న దొంగ.

ఇవ్వవలసిన బాకీని ఇచ్చేస్తున్నప్పుడు కలిగినంత తృప్తిగా, నేను దోచుకోబడుతూన్నప్పటికీ నవ్వుతూ హాయిని అనుభవిస్తున్నాను. వయ్యారాలు పోతున్నాను. ప్రతి రాత్రీ నా నిద్రని అతను దొంగిలిస్తున్నాడు. ఇప్పుడీ పూలపొదరిల్లు వరకూ వచ్చేసాడు కిద్వాయి కాటేజిలో నా విశ్రాంతి స్థలాన్ని దోచుకోడానికి. ఈ పొదరింట్లో నేను దాక్కొని ఉంటే ఎవ్వరూ నన్ను చూడలేరు. నాకోసం విలవిలాడిపోతూన్న అతని దృష్టిని నేను సులువుగా

గమనించగలను. అంత చక్కని అవకాశాన్నిచ్చిన మంచి పొదరిల్లు నాది.

“ఇష్!” మాట్లాడవద్దని అతను నాకు సైగ చేసాడు. వినీ వినిపించనట్టుగా చెవిలో అన్నాడు - “జీవితమంతా మనమిద్దరం ఇలాగే దాక్కొని ఉందాం”

అలీమ్ నా సమీపంలో ఉన్నాడనే అనుభూతికే నావొళ్లు వేడిగా అయింది. ఇప్పుడతను నన్ను, తన కళ్ళల్లో పెట్టుకోవడంతో నావొంట్లోంచి జ్వాలలు వస్తున్నట్టుగా ఉంది. నేను సంపూర్ణంగా సమూలంగా కదిలిపోతున్నాను. ఊగిపోతున్నాను. నా అణువణువునా అగ్ని ప్రవహిస్తున్నట్టుగా ఉంది. నా కణతలు అదిరిపోతున్నాయి. నా గుండెల చప్పుడు నాకు గట్టిగా వినిపిస్తోంది.

ఆ తర్వాత అలీమ్ పెదవులు నా మెడ మీద కుప్పిగెంతులు వేస్తున్నట్టుగా నాకు అనిపించింది. అతని బాహువుల్లో బందీనై జీవితాంతం గడపాలని ఉవ్విళ్లూరుతూ ఉంటాను. అలాంటి నేను ఆ బాహుబంధనాన్ని విడిపించుకోవాలని ఇప్పుడు విలవిల్లాడిపోతున్నాను. అందుకే ఎంతో ప్రయత్నం చేసాను. కాని ఆ బాహువులు నన్ను మరింత గట్టిగా బంధించేస్తున్నాయి.

మేమిద్దరం ఈ ఆనందంలో మునిగి ఉన్నాం అంచేత మా వెనుకనే ఎల్లప్పుడు ఉండే మా అదృష్టదేవతని మర్చిపోయాం. మా దగ్గర్లోనే ఎవరిదో అలికిడి అయింది-

“ఎవరో వస్తున్నారు - ఎవరో వస్తున్నారు!” అని అలీమ్ నన్ను వదిలేసి పక్కకి జరిగాడు. రక్తం ఉప్పొంగినందు వల్ల బుగ్గలు ఎర్రగా కందిపోయాయి. ఒకానొక భయం పొంచి మా ప్రేమ కలాపాల మీద వెనక నుంచి దెబ్బ కొట్టింది. నిజానికి అదే మా ప్రేమ కలాపాల పోషణకర్త కూడా. నేను చెమటతో స్నానం చేసినట్టయ్యాను. ఇది ఎలాంటి క్షణం, ఎలాంటి ఘడియ. పిడుగులాగ మామీద విరుచుకుపడింది.

ఎవరో వస్తున్నారు అని దయతో చెప్పిందెవరు నా ఈ రహస్యాన్ని తెలుసుకొని నన్ను లోకం దృష్టిలో నుంచి కాపాడ్డంలో చేయూత నిస్తున్న వాళ్ళన్నా సరే నాకు భయంగానే ఉంది.

“నువ్వు ఇంకో చోటుకి వెళ్ళిపో రూహీ ఎవరన్నా చూసేస్తారేమో? ” ఈ గొంతు ఎవరిదో నాకు తెలిసిపోయింది. ఇది సహరాది. నా సాహీది. అలీమ్ కీ నాకూ మధ్యనున్న సాధనం ఒక సంబంధం ఒక వారధి. రెండు లింకుల్ని కలిపే గొళ్ళెం.

“మీరు చేసిన పని ఏం బాగాలేదు” ఆమె మళ్ళీ అంది. అలీమ్ ఆమెని అయిష్టంగా చూసాడు. అయినా సాహీ అలీమ్‌ని అసలు పట్టించుకోలేదు.

సాహీ ఈ విధంగా మమ్మల్ని వెంటాడుతూ ఉండడం నాకూ ఏం నచ్చలేదు... ఇంతకీ ఆమె ఎవరు మమ్మల్ని నీడలా వెన్నంటుతూ ఉండడానికి? ఆమె మాతో ఇలా మైత్రిని చూపిస్తుందంటే ఆమె ఉద్దేశ్యం ఏమిటై ఉంటుంది? నా కయితే ఆమె మీద ఏదో అనుమానం కలుగుతోంది. ఆ అనుమానం ఇప్పుడు నమ్మకంగా మారిపోయింది. ఎందుకంటే నేను చుట్టూ చూసాను.

మా వైపు ఎవ్వరూ రాలేదు. సహరాకి మా ఇద్దరి మీద ఈర్ష్య. అంచేత మా ఇద్దర్నీ కలుసుకోనివ్వకుండా ఎవరో వచ్చారని బెదిరించింది. అయితే నేనెందుకు భయపడ్డానంటే రెండు హృదయాలు కలుసుకొంటున్న సందర్భాల్లో మూడో వ్యక్తి వస్తే అతనొక్కడే వచ్చాడులే అని ధీమా పడకూడదు. ఎందుకంటే అతను ఒంటి వాడు కాదు.

లోకమంతా అతని వెనక ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం ఎవ్వరూ లేరు.

అలీమ్ లేచి మరో వైపు వెళ్ళసాగాడు. అది చూసి దొంగగా ఉన్న జకియా అతని

వెంటబడింది. ఆమె ఇంక అలీమ్‌ని పట్టు కుంటుదన్నంతలో రాబీ చేతికి చిక్కింది. రాబీ ఆ దగ్గర్లోనే ఒక చెట్టు చాటున దాగి ఉంది. జకియా రాబీని గట్టిగా అల్లుకు పోయి అరిచింది-

"రాబీ దొంగ రాబీ దొంగ అంతా బయటి కొచ్చేయండి. రాబీ దొరికి పోయింది"

ఎక్కడెక్కడ ఎవరెవరు దాగి ఉన్నారో వాళ్ళంతా ఒకేసారి బయటికి వచ్చారు - ఎక్కడ్నుంచో ఊడిపడ్డారా అన్నట్టు.

నేను కూడా లేచాను. వెంటనే సహరా నా చెయ్యి పట్టుకొని అంది - "నీకేమ యింది రూహీ జాగ్రత్త సుమా, ఎవరన్నా చూస్తే... అంతేకాదు - అంత దగ్గరగా తిరగడం కూడా అంత మంచిది కాదు."

నేను ఉడుకుమోత్తనంతో చెయ్యి విదు ల్చుకొన్నాను. అమ్మాయిలంతా ఉన్నచో టుకి పారిపోయాను. ఆ తర్వాత నేను దొంగనుంచి తప్పించుకోవడం కంటే అలీమ్ నుంచి తప్పించుకోడానికే ఎక్కు వగా ప్రయత్నించాను. దాగుడుమూత ఆట మళ్ళీ మొదలయింది.

ఆ తర్వాత నాకంట పడిందేమిటంటే సాహీ అలీమ్‌తో ఏదో చెబుతోంది. అలీ మ్‌కి ఆమె మాటలు నచ్చలేదన్నట్టుగా ఉంది. మేమిద్దరం కలిసాం గదా. అది అంత మంచి పనికాదు, అనే బహుశా చెబుతూ ఉండవచ్చు.

అలీమ్‌ని కలిసి స్పష్టంగా చెప్పేయాలను కున్నాను. ఇప్పుడు నీ ఉత్తరంలోని ప్రతి మాటకీ ఒక్కొక్క ఏడాది చొప్పున బాధప డ్డానికి నాకిష్టమే. అంతేగాని ఈమె ఇలా నీకూ నాకూ నీడలా వెన్నంటి తిరగడ మంటే మాత్రం నాకు నచ్చదు. నిజం చెప్పాలంటే నాకు సాహీ అంటే వొళ్ళు మండుతోంది.

★ ★ ★

మధ్యాహ్న భోజనాలకు వేళ కావడంతో పిలిచారు. మేమంతా ఒకచోట హాజరవు తున్నాం. అందర్లో ఉంటూండగా అలీమ్ నాతో మాట్లాడ్డానికి ఇష్టపడడు. కాని కొన్ని విషయాలు మాత్రం చాలా మంచివే ఉన్నాయి. భోంచేస్తున్నప్పుడు ఒకటి రెండుసార్లు ఎవరికీ కనిపించకుండా తన ప్లేటులోని కొన్ని వంటకాల్ని నాప్లేట్లో వేసాడు.

ఈ ఆనందమే కాకుండా మానసికమైన ఒకానొక విహ్వలత కూడా అతని సామీ ప్యంలో కలుగుతూ ఉంటుంది. ఇది నన్నెంతగానో బాధిస్తూవుంది. అంచేతనే ఎప్పుడు అవకాశం దొరుకుతుందా 'సాహీ నుంచి నన్ను రక్షించు' అని ఎప్పుడు అత నితో చెప్పేద్దామా అని ఎదురు చూస్తు న్నాను.

ఒకానొక దొంగ ఇంట్లో ప్రవేశించి ధనం మూట కట్టుకొని చప్పుడు కాకుండా నెమ్మ దిగా నడచిపోతాడు అంతకు ముందే తెరచి వుంచిన ద్వారం వైపు. అలాగే సాహీ కూడా నా హృదయానికి దగ్గరగా మెసలుతూ ఉంటుంది.

అలీమ్ పంపిన ధనాన్ని పట్టుకొని సాహీ నా హృదయంలోకి ప్రవేశించింది. ఆ ధనాన్ని నేను అతిప్రయత్నంతో ఎంతో భద్రంగా దాచుకొన్నాను. కాని ఆమె మాత్రం ఆ ధనాన్ని పోగుచేసుకొని నెమ్మ దిగా పిల్లిలాగ చప్పుడు కాకుండా తీసుకొని వెళ్ళిపోయింది. మొదట ఏ ద్వారం నుంచి అయితే ఆమె వచ్చిందో తిరిగి వెళ్ళిపోడా నికి వీలుగా దాన్ని తెరచివుంచింది.

కానీ మధ్యాహ్న భోజనవేళలో ఆమె అక్కడ లేదు. నేనామెను బాగా వెదికాను. నా ఫ్రెండ్స్ అందర్నీ అడిగాను. ఆ అమ్మా యిలంతా గాబరాపడ్డారు. అనుకోకుండా ఇలా ఎక్కడికి వెళ్ళినట్టు? ఎందుకు వెళ్ళి నట్టు? ఈమె కాకుండా మరో అమ్మాయి ఎవరన్నా అయివుంటే ఎక్కడో తిరుగుతూ ఉంటుందిలే ఆమే తిరిగి వస్తూందిలే అని



అంతా ఒకే అభిప్రాయానికి వస్తారు.

రాబీ నాతో ఏమని చెప్పిందంటే సాహీ మెట్లెక్కుతూ మీదికి వెళ్ళిందట. అలా వెళ్తున్నప్పుడు ఆమె కళ్ళు వర్షిస్తున్నాయని కూడా చెప్పింది.

"అయితే పద, మేడపైకి వెళ్ళిచూద్దాం. ఆమె స్కూటరుందా లేదా? " అంటూ మేం మీదకి చేరుకున్నాం. మోటార్లు పార్క్‌చేసిన చోట సాహీ వెస్పా లేదు.

ఆమె తప్పక తిరిగి వస్తుందనే నమ్మకం కలగడంతో మేం పార్క్‌లోకి వచ్చేసాం.

అయినా సాహీ ఏడుస్తూందనే మాటలు నా మస్తిష్కంలో విషపు బొట్టుల్లా ఒక్కటొక్కటే పడసాగాయి. 'సాహీ కళ్ళు సజలాలయ్యాయి' అని చెబుతూ రాబీ నాకు దూరంగా ఇంకా నిలబడి ఉన్నట్టుగానే ఉంది. అప్పటికీ నేను వినిపించుకోలేదన్నట్టుగా రాబీ నాచెవిలో 'ఆమె ఏడుస్తోంది' అని చెప్పినట్టయింది.

లంచ్ పూర్తవుతూందనగా సాహీ వచ్చింది. సాహీకోసం జాగ్రత్తగా దాచి ఉంచిన భోజనాన్ని ఎంతో ఆప్యాయంగా రాబీ సాహీ కోసం టేబుల్‌మీద పెట్టింది.

రాబీ చేసిన ఈ పనికి మిగతా మా అమ్మాయిలందరితో బాటు నాకు కూడా ముల్లు గుచ్చినట్టయింది.

ఎలాంటి పని చేసింది రాబీ! స్నేహమంటే ఇదే. ప్రేమంటే ఇదే! ఇదే నా హృదయాంతరాల్లోకి కూడా ప్రవేశిస్తుంది. ఎవ్వరికీ తెలియకుండా. సాహీ విషయంలో నిజానికి నేనే ఇవన్నీ చెయ్యాలి.

ఆమె కళ్ళలోని ఈ కన్నీరు, ఈ తడి ఇటు నా తోను అటు అలీమ్‌తోను ఆమె నెరపుతూన్న స్నేహానికి, మైత్రికి సాక్ష్యాలు. అంతేకాదు. అప్పుడప్పుడూ నా మస్తిష్కంలో రూపం మార్చుకొని ఎంతో పెద్దదిగా కనిపిస్తున్న దానికి కూడా ఇది సాక్ష్యమే. అయితే సాహీ చూపిస్తున్న మైత్రి, విరోధం ఈ రెండింటి మధ్యలో ఉన్న దూరమెంత? అనేది పూర్తిగా నేను చెప్పలేకపోతున్నాను. పాపమిప్పుడు సాహీకి మౌనంగా భోంచేసే పరిస్థితి కలిగినందుకు నాకెందుకోగాని ఒక విధమైన ఓదార్పు లభించినట్టయింది.

నా మనస్సులో సాహీపట్ల ఇలాంటి భావం అంతకంతకీ చిగుర్లు వెయ్యడం ప్రారంభించింది. నాకున్న ఈ భావంలో ఆమె పట్ల సానుభూతితోపాటు అసహ్యం కూడా కలిసి ఉంది. అంతేగాని ఆమెపట్ల ప్రేమభావం మాత్రం లేదు.

ఈ కిద్వాయి కాటేజి గేట్‌లోకి ప్రవేశించిన వాహనాల్ని ఓపక్క నిలిపి ఉంచడానికి గార్డెన్లోకి వెళ్లేటప్పుడు ఈ మెట్లన్నీ దాటి వెళ్ళాలి. ఈ కిద్వాయి కాటేజ్‌లో మెట్లమీంచి దిగుతూ ఉన్నప్పుడు కావాలనే నేను అందరికంటే వెనక్కి ఉండిపోయాను. ఆ ఎత్తులోకి వెళ్ళాక అక్కడ నిల్చొని తెల్లగా అందంగా మెరిసిపోయే ప్రయాణీకుల్ని చూసాను. ఆ ప్రయాణీకుల గుంపు గోళాకారపు మెట్ల మీద ముత్యాలమాలలా తయారయింది. ఈ మాల గార్డెన్లోకి చేరుకోగానే తెగిపోయి విడిపోతుంది. అందులోని ముత్యాలు ఒక్కటొక్కటిగా విడిపోయి దూరదూరంగా పడి చెదిరిపోతాయి.

చెల్లాచెదురైన ఈ ముత్యాలు మాలగా ఏర్పడితే ఆ మాలలో అన్నిటికంటే కాంతివంతమైన ముత్యాలు నా దృష్టిలో ఏవయితే ఉన్నాయో ఆ ముత్యాలు మళ్ళీ అందులో కూర్చబడవని నా నమ్మకం.

ఆ ముత్యాలే అలీమ్, నేను, సాహీ..

★ ★ ★

సాహీ భోంచేసి, టేబుల్ దగ్గర్నుంచి లేచింది. ఆమె ఉదాసీనతను చూసాక నాకోరకమైన ఓదార్పు లభించినట్టయింది. ఏవేవో ఆలోచనలతో ఇటూఅటూ పచార్లు చేస్తున్నాను. చూడబోతే నేనీ కిద్వాయి కాటేజ్‌కి వచ్చింది ప్రియుని కౌగిలిలో

ఆనందం పొందడానికి కానట్టుగా ఉంది. అజ్ఞాత శత్రువు కబంధహస్తాల నుంచి తప్పించుకోడానికే అన్నట్టుగా ఉంది.

నేను ఈ ఆలోచనలతో ఉంటూ అనుకోకుండా సాహీ ఎదుటకి వచ్చాను.

మధ్యాహ్న భోజనాల తర్వాత పెద్దలు, వృద్ధులు అంతా కొంతసేపు విశ్రమిద్దామని తీర్మానించారు. ఈ విశ్రమించడంలో సగం సగం నడుం వాల్చి ఏవేవో తినడాల దగ్గర్నుంచి తమలపాకుల డబ్బా తెరచి పాను వేసుకొని బ్రేవ్‌మని తేన్చడాలలాంటి పనులు కూడా ఉన్నాయి. జీవితం మరీ విసుగు అనిపించినప్పుడు విహారయాత్రల్లోనూ, పరిహాస వినోదాల్లోను, ఉత్సవాల పరదాల్లోను ఇలాంటి పెద్దలంతా చల్లని నీడనిచ్చే చెట్ల కిందకి చేరి కొంచెం సేపు విశ్రమిస్తారు. అయితే ఇలాంటి సందర్భాలలోనే ఉత్సాహవంతులైన యువకులు దీర్ఘాలోచనల్లోనూ పడతారు. మనోల్లాసాలలోనూ మునుగుతారు.

అంతేకాదు, అందంగా ఇటూ అటూ తలలూపే పూలరెమ్మల మీద, ఆ పువ్వుల్లోంచి పైకెగిరే సుగంధం మీద ఏ పెద్దల డేగ దృష్టి పడుతుందో ఆ పెద్దలంతా కొంచెంసేపు సావకాశంగా ఊపిరి పీల్చుకొని మళ్ళీ లేవడానికే ఇప్పుడీ విధంగా కూర్చొని విశ్రమిస్తున్నారా అన్నట్టు కూడా ఉంది. ఈ విశ్రాంతి వేళలో పువ్వులు బాగా ఊగుతాయి. ఆ సుగంధం ప్రతీ ఒక్కరికీ ప్రేమ సుగంధంగా మారుతుంది.

మధ్యాహ్న విందు తర్వాత ఇదిగో ఈ తతంగమే జరుగుతోంది కిద్వాయి కాటేజ్‌లో. ఒకానొక లోకం కునుకుపాట్లతో ఊగుతోంది. మరొక లోకం ఇంతకంటె మంచిసమయం మరి దొరకదనే ఆత్రుతతో అవకాశాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నారు. ఈవిధంగా అవకాశం కోసం ఎదురుచూసిన వాళ్ళంతా పద అంటే పద అని బయలుదేరారు అలా ఇటూ అటూ ఒకసారి తిరిగొద్దామని.

ఎందుకంటే సాయంకాలం కాగానే అక్కడ్నుంచి అందరూ తిరిగి వెళ్ళిపోతారు. అటూ ఇటూ తిరగాలంటే ఇదే చక్కని అవకాశం.

అయితే ఈ ఆలోచన ఎంతో చిన్న గొంతుతో గుసగుసల రూపంలో నోట్లోంచి బయటికొచ్చినా ఆ తర్వాత అదొక పెద్ద నినాదంలా మన్నన పొందింది. దాంతో ఆ పెద్దలు, వృద్ధులు తుళ్ళిపడి లేచారు.

"వద్దు బాబూ వద్దు. లంచ్ తర్వాత తిరగడాలేమిటి తెలివితక్కువ పనిగాని. లంచ్ తర్వాత విశ్రమించాలి. లేదన్నారూ ఇక్కడే ఏ పేకముక్కలో పట్టుకొని కూర్చొని ఆడుకోండి"



"ఊపిరి సలపనంతగా లంచ్ మేమేం చెయ్యలేదు లెండి. మహా అయితే మీరిప్పుడు తింటూన్న టిఫిన్ అంత కూడా మేం తినలేదు"

వృద్ధులు, యువకులు అంతా నవ్వారు. ఈ మాటలెవరన్నారా అని అంతా అటు తిరిగి చూసారు. సాహీ ఈ మాటలంటూ నవ్వవలసిన సందర్భమే అయినా నవ్వడం మరచిపోయినట్టుగా అక్కడికి వచ్చి నిల్చుంది.

★ ★ ★

మేమంతా అటూ ఇటూ తిరగడానికి బయలుదేరాం. కిద్వాయి కాటేజి ఆవరణ దాటబోతున్నంతలో గేటువైపు నుంచి ఎవరో నా చెయ్యి పట్టుకొన్నారు. నేను కొంచెం ఆగి పక్కకి చూసాను.

అలీమ్ నావైపే చూస్తున్నాడు. నన్నే చూస్తున్నాడు. నన్ను విడిచిపెట్టి అతను ఒక్క క్షణం కూడా బతకలేడన్న విషయాన్ని అతని చూపు చెబుతోంది.

నేను అటు వస్తున్నానని నా కళ్ళతోనే అతన్ని ఓదార్చేను. కాని గేట్‌ని చాటుగా చేసుకొని దాక్కొని ఉన్న సాహీ మీద దృష్టి పడగానే అలీమ్ మా దగ్గరికి పరుగెత్తుకొచ్చేసాడు. అతని వాలకం చూస్తూ ఉంటే మేమిద్దరం కలిస్తే అతనికి భయంలా ఉంది.

మా ఇద్దరి తలల్ని ఒకదానితో ఒకటి కలిపి మెల్లగా తాకించాడు. ఆ తర్వాత ఎంతో ఇష్టంతో సాహీ రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఎంతో మృదువుగా నొక్కాడు. ఆ తర్వాత బుగ్గలు నిమిరాడు- "ఎక్కడి పిచ్చి మాలోకమో దీన్ని తప్పుగా భావిస్తోంది!"

సాహీ నా చెయ్యి విడిచిపెట్టి ముందుకు వెళ్లింది. అలీమ్ వెనక్కి ఉండిపోయాడు. నడిబజార్లో నా ముఖమ్మీద ఉమ్మేసాడా అన్నట్లయింది ఆ క్షణంలో నా పరిస్థితి.

నేనేమో సాహీ మీద దయ చూపించాలని బయలుదేరాను. అలాంటి సాహీ తన పక్కన నిల్చొనే తాహతు కూడా నాకు కన్పించలేదు.

అలీమ్ నన్ను ఎంతో ఎత్తులోనుంచి కిందికి తోసేసినట్టయింది. నా చెయ్యి పట్టుకొని లాక్కెళ్ళి మరీ కిందికి తోసేసినట్టుగా నాకనిపించింది.

సాహీ నాతో ఏదో చెప్పాలనుకుంటున్నది- ఎంతో దీనంగా. నా కాళ్ళు పట్టుకొని మరీ బతిమాలుతుందా అన్నట్టు కనిపిస్తోంది. బహుశా... బహుశా ఆమె అలీమ్‌ను కోరుకొని నా దగ్గర్నుంచి తీసుకుపోవాలని చూస్తుందేమో. కాని అలీమే తనకితానుగా పరిగెత్తుకొని వచ్చి ఆమె ముందు నిల్చున్నాడు. దాంతో నేను చేసిన తప్పులకి సాహీ నన్ను చెంపదెబ్బ కొట్టిందా అన్నట్టు అనిపించింది నాకు.

క్షణ మాత్రంలో మరొక్కసారి మొత్తం వ్యవహారం తారుమారయింది. అలీమ్ నా వాడా లేక సాహీకి చెందుతాడా? ఈ ప్రశ్న నేను వేసుకోవాలా లేక సాహీయా? - అని నేనాలోచిస్తున్నాను. కన్నీరు నిండిన కళ్ళతో సాహీ ఎప్పుడయితే మా అందరి మధ్యలోంచి తప్పుకొని పరారయిందో ఆ క్షణంలో నేనేమనుకున్నానంటే, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు సాహీని చూసి నవ్వవచ్చుననీ, సాహీమీద జాలి చూపించవచ్చుననీ. కాని ప్రస్తుతం నా పరిస్థితే అలా మారిపోయింది. ఇప్పుడు సాహీయే కాదు. ప్రతీ వ్యక్తి నన్ను చూసి జాలిపడతారు. సాహీ తొందరగా అడుగులు వేసింది. నేను వెనకబడిపోయాను.

బహుశా ఆమె అందర్లో కలిసిపోయి ఉంటుంది. నేను వెనక్కి తిరిగి చూసాను.

జయాపజయాల్ని లెక్కిస్తూ ఏదో నష్టపోయినవాడిలాగ మౌనం వహించాడు అలీమ్. నేను కూడా అతన్ని ఎందుకూ పనికిరానివాడిలాగ తీసిపారేసాను. నా లోపల ఉన్న స్త్రీ మళ్ళీ మేల్కొంది. ఆ స్త్రీ,

పురుషుని అడుగులకి మడుగులొత్తుతుంది గాని మరొక స్త్రీ ముందు మాత్రం ఏనాడూ తల వంచడానికి ఇష్టపడదు. అందునా తన ప్రేమని లాగేసుకొనే స్త్రీ ముందు అసలు ఆ పని చెయ్యదు.

నా ఆత్మాభిమానం దెబ్బతింది. నా ప్రేమని మరొక స్త్రీ లాగేసుకొంది. నన్ను ప్రేమించే ఆ పురుషుడు కూడా నా చేతిని విడిచిపెట్టి ఆమె దగ్గరకి వెళ్ళిపోయాడు.

"రూహీ, ఆగు!"

వెనకనుంచి అలీమ్ పిలిచాడు. ఆ పిలుపులో లోకంలో ఉన్న దుఃఖము, బాధ అంతా ఇమిడిపోయినట్టుగా ఉంది. సాహీ నన్నూ అలీమ్‌నీ విడిచిపెట్టి బహుశా మిగతా వాళ్ళలో కలిసిపోయి ఉండవచ్చు.

అలీమ్‌ను వెనక్కి వదిలివేయాలనే నాకూ అనిపించింది. కానీ సాహీ కంటే ముందుకు పోవడం నా వశం కాదు. అయినప్పటికీ అడుగులు వేసాను.

అలీమ్ పిలుపు చాతకపక్షి కూతలా వినిపించింది. ఆ కూత నా లోపల్నుంచే వస్తూందా అన్నట్టుగా నాకు చాలాసార్లు అనిపించింది. ఆ కూత నా నోట్లోంచే బయటికి వస్తూన్నట్టుగా, నా చెవుల్లో బాధని నింపుతుందా అన్నట్టుగా అనిపిస్తోంది.

కాని ఇవాళ నేను అలీమ్ పిలుపుని వినీ వినిపించుకోనట్టుగా ఊరుకొన్నాను. ఆ పిలుపులోని బాధ గురించి నాకేమీ తెలియదన్నట్టుగా ఊరుకొన్నాను.

మిగతా మా బృందంలోని వాళ్ళంతా గార్డెన్లోంచి అలా ముందుకు పోతున్నారు. ఎదురుగుండా దూరంగా చెట్ల వరుసలు కనిపిస్తూన్నాయి. ఆ చెట్ల మధ్యలోకి మా బృందమంతా చేరుకుంది. చుర్రుమనిపిస్తోన్న ఎండలో నుంచి ఆ చెట్ల నీడలోకి నా పాదాలు అడుగుపెట్టాయి. అలీమ్ మాత్రం ఇంకా ఎండలోనే ఉన్నాడు.

అంతలో రెండు పిట్టలు దగ్గరున్న మొక్క మీద నుంచి పైకెగిరి చెట్టుకొమ్మని చేరుకున్నాయి. అక్కడ మళ్ళీ కామక్రీడలో మునిగిపోయాయి.

నా చూపులు వాటి మీద నిలిచాయి. అంతలో వెనకనుంచి నా కళ్ళు ఎవరో మూసారు. నేను తప్పించుకోవాలని ప్రయత్నించాను. భుజం దగ్గరి చోళీకి గొలుసు తగుల్కొంది. అలీమ్ ఎప్పుడు వచ్చాడో నేను గమనించలేకపోయాను. అతని పాదాల చప్పుడు నాకు వినిపించలేదో లేకపోతే నా గుండెల చప్పుడులో అతని పాదాల చప్పుడు కలిసిపోయిందో, అతని రాకని గుర్తించలేదు.

ఆ చెట్లకి కొంచెం దూరంలో పల్లంలో ఒక పొద వెనక భాగంలోంచి చిన్న కేక ఒకటి వినిపించింది. నేనూ, అలీమ్ విడిపోయాం. ఆ కేక మూలుగుగా మారింది.

కాని నేనింకా నా మంటలోనే మండిపోతున్నాను. నా అస్తిత్వమే మూలుగుతోంది. గాయపడిన నా మనస్సు మూలుగుతోంది. గాయపడిన నా ప్రేమ మూలుగుతూంది.

అనువాదం:
కాలిపు వీరభద్రుడు

అలీమ్ నుంచి విడిపోయాక నేనెంతో నిర్దయతో ముందుకి పోసాగాను. అయితే ఆ మూలుగు, ఆ బాధ మరొక్కసారి నా గుండెల్ని పట్టుకొంది.

పాపం, ఎవరో ఆ మూలుగుతున్నవాళ్లు- దగ్గర్లోనే ఉన్నారు. అక్కడికి వెళ్లమనాలి అనే ఉద్దేశంతో వెనక్కి తిరిగి అలీమ్ వైపు చూశాను.

అతను అర్థం చేసుకున్నాడు. "నువ్వు కూడా రా. చూసొద్దాం..." అని అన్నాడు.

అయితే, జీవితాంతం నేను అలీమ్ సామీప్యాన్ని కోరుకుంటున్నప్పటికీ కనీసం

ప్రస్తుతానికి మాత్రం అతనికి దూరంగా ఉండాలనుకొన్నాను. అప్పటికిగానీ నాకు కోపం వచ్చినట్లుగా అతనికి అర్థం కాదు. అదీగాక అతనుగాని నాకు దగ్గరగా ఉన్నట్టయితే, నా కోపాన్ని తెలియజెయ్యడం నాకు చేతగాని పని.

రాను అన్నట్టుగా తల అడ్డంగా ఊపాను. కొంచెంసేపాగి బతిమాలుకుంటున్నట్టుగా నన్ను చూశాడు. కాని నేను ముఖం తిప్పేసుకోవడంతో అతను ముందుకు వెళ్ళాడు. పొదరిల్లు దగ్గరగా వెళ్ళి ఆ పల్లపు భూమిలోకి తొంగి చూసి, తటాలున ఆగిపోయాడు.

"ఏమిటలా ఉండిపోయావు?" నేను దూరం నుంచే అడిగాను. నన్ను దగ్గరికి రమ్మని సైగ చేశాడు.

మొదట్లో నేను కొంచెం ఆలోచించాను. మళ్లీ మూలుగు వినిపించడంతో నా పాదాలు వాటంతటవే ముందుకు కదిలాయి. దగ్గరగా వెళ్ళాను. అలీమ్ నాకు ఊతగా ఉండి తొంగి చూడ్డంలో నాకు సహకరించాడు.

అక్కడ సాహీ ముళ్ళల్లో చిక్కుకుపోయి పడి ఉంది.

నా వొళ్ళంతా మంటలు పాకినట్టయింది. అలీమ్‌తో అన్నాను- "అందులోకి నువ్వా గెంతు. గెంతి ఆవిడ్ని తీసుకు రా. పాపం, ఇప్పుడు నడిచే స్థితిలో కూడా ఉన్నట్టు లేదు. ఎత్తుకొని లేవనెత్తితే గట్టెక్కుతుంది"

ఈ వ్యంగ్యపు బాణాల్ని అలీమ్ సహించాడు. మాట్లాడకుండా నెమ్మది నెమ్మదిగా జాగ్రత్తగా కిందికి దిగాడు. అతను చేస్తున్న ఈ పని నాకేమాత్రమూ నచ్చలేదు. నా మనస్సులో ఏముందో గ్రహించి కూడా అతను ఏమాత్రమూ పట్టించుకోలేదు. 'నేనేం దిగి ఆమెను తీసుకురానులే' అని కనీసం మాటమాత్రంగా కూడా అతను అనలేదు.

అలీమ్ ఒంగి ఆమెను పట్టుకొని లేవనెత్తాడు. ఆమె అతని మెడలో తన రెండు చేతుల్నీ పెనవేసి వేలబడింది ఉయ్యాల్లాగా- నన్ను మరింత ఏడ్పిస్తున్నట్టుగా. నేను మండిపోయాను.

ఇంతటి కఠినాత్మకమైన పద్ధతిని ఇంత బాహాటంగా సాహీ ఎన్నడూ అవలంబించలేదు. నా పరిస్థితి ఇప్పుడెలా ఉందీ అంటే నా శవంపై ఉన్న గుడ్డని చివరిసారిగా చూడ్డానికి వీలుగా నేనే తొలగించినట్టుగా అయింది.

నా శవం ముఖమ్మీద ఉండే దుఃఖం గుర్తుల్ని నేను చదువుతూ ఉండగా సాహీ నా శవం ముఖాన్ని చూడ్డానికి అసహ్యపడి మళ్ళీ ఆ గుడ్డని కప్పేసింది.

ఆమెను పట్టుకొని అలీమ్ బయటికి వచ్చాడు. ఆమె కూడా అతన్ని ఆసరాగా చేసుకొని కుంటుతూ నెమ్మదిగా నా వరకూ వచ్చింది. ఆ వెంటనే, ఒక్కసారిగా గెంతులు వేసింది. ఆ తర్వాత చప్పట్లు కొడుతూ నవ్వసాగింది.

నా పరిస్థితి చాలా దయనీయంగా తయారయింది. గట్టిగా చాచి నా చెంప మీద కొట్టినా, బల్లెంతో నా గుండెల్లో పొడిచినా ఇంతకంటే బావుండేది.

నా మనస్సులో ఒకటి కాదు, ఎన్నో పిస్టళ్ళని ఆమె పేల్చివుంటే నాకు కూడా ఆమెతో సమానమైన అస్తిత్వం ఉంది అని నేననుకొనేదాన్ని. కాని సాహీ ఇలాంటి పనులేవీ చెయ్యలేదు.

నా ఆత్మాభిమానాన్ని, నా జీవితాన్ని, నా ప్రేమని ఆమె పాదాల మీద పడేటట్టు చేసింది. అవమానించింది. ఇలా దెబ్బకొట్టడమే కాకుండా నాతో ఆటలాడాలన్న పద్ధతిలో చప్పట్లు కొడుతూ నవ్వసాగింది.

నేనింక ఆగలేకపోయాను. ఒకానొక భావప్రేరణతో నా చెయ్యి మీదికి లేచింది. ఇంక ఆమె బుగ్గ మీద నా అరచెయ్యి తగులుతుందనగా అలీమ్ నా చేతిని పట్టే



సుకున్నాడు.

ఈ విధంగా అలీమ్ ఆమెని వెనకేసుకు రావడం నాలో రగులుతున్న అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. నేను ఊగిపోయాను.

ఆ తర్వాత నాలో ఉన్న ధైర్యం, సంయమనం కట్టలు తెంచుకున్నాయి. బాగా ఏడ్చేశాను. ఆ కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడమే మంచిదనుకొన్నాను.

విలవిల్లాడిపోతూన్న నన్ను చూసి సాహీ బిక్కచచ్చిపోయింది. ఆ తర్వాత ఒక్కసారిగా ఆమె తలని నా గుండెలకు ఆనించింది.

బొంగురుపోయిన కంఠంతో అంది- "రూహీ, నాకిప్పుడెంతో ఆనందంగా ఉందే పిచ్చిదానా. ఇవాళ నేను నీ ఆనందాలు నీకిచ్చేటంత సమర్ధురాలినయ్యాను. అయితే ఆ ఆనందాలన్నింటినీ ఇప్పటివరకు నా

కోసమని ఉంచేసుకున్నాను. అందుకే నువ్వు నన్ను తప్పుగా భావించావు. నీకీ విషయం తెలుసా? ఇవాల్టి వరకు నేను అందరికీ ఆనందాన్నే పంచి ఇచ్చాను. దుఃఖాలన్నిటినీ నాలోనే దాచుకున్నాను.

ఫాల్దా ఒకనాడు నా వొడిలో మల్లె మొగ్గలు పోసి ఎవ్వరికీ తెలియకుండా జకియాకి ఇచ్చి రమ్మన్నాడు. వీటిని నేనుంచుకోకూడదా అని కూడా నేనతన్ని అడగలేక పోయాను.

ఈద్ గృహంలో అర్ఫాన్ నా చేతిని పట్టుకొని ఎంతో ఇష్టంతో నన్ను దగ్గరికి లాక్కున్నాడు. నేను చేతిని విడిపించుకొని అలసిపోయిన దానిలాగా గట్టిగా ఊపిరి పీలుస్తూ అతని దృష్టి నుంచి తప్పించుకున్నాను. ఇంత చిన్న దుస్సంఘటనకే నా మనస్సు ఏమిటేమిటో ఊహించేసుకుంది. అతను ఎడమ వైపు తోటలోని పొదలో ఎవరి కోసమో ఎదురు చూస్తున్నాడు. ఈ సంగతి నేను గుర్తించినా ఏమీ తెలియనిదానిలాగా చూడనట్టుగానే అటుగా వెళ్ళిపోసాగాను. అతను ఒక్కుదుటున నా దగ్గరికి వచ్చాడు. ఎంతో ఇష్టంగా నాతో అన్నాడు- “సాహీ చిన్న మాట. ఈ ఈద్ కార్డ్ రాబీకి ఇచ్చేసి రావా. నేను నీ కోసం...

నేను ఈద్ కార్డ్ పట్టుకొని వెళ్ళాను. రాబీ చేతిలో పెట్టాను. ఈ నీటిబొట్లు ఎక్కడ్నుంచి వచ్చాయే సాహీ అని ఆమె అడిగింది. అవి నీటిబొట్లు కావు. నా కన్నీటి బొట్లు. అర్ఫాన్ రాసిన అక్షరాల్ని అస్పష్టం చేసేసాయి.

ఆ తర్వాత, తర్వాత... అలీమ్ కూడా నా సహాయంతో నీకు సందేశం పంపడం ఆలస్యం చేసేసాడు. ఈలోగా నేనే అతని వెనక పడి కొంతదూరం వెళ్ళాను కూడా”

సాహీ తన చెంగు ముడిలోంచి గులాబీ పువ్వు రెక్కల్ని బయటికి తీసింది. నా పిడికిల్ని విప్పి ఎంతో భద్రంగా వాటిని నా చేతిలో పెట్టి మళ్ళీ నా పిడికిలి మూసేసింది.

ఆ సమయంలో ఆమె కళ్ళల్లో కన్నీటి సముద్రమే నాకు కనిపించింది. ఆ సముద్రం ఎంతో గంభీరమైనది. లోతైనది. ఆ లోతు నాలాంటి దానికి తెలియనిది.

వెళ్ళిపోడానికి సాహీ అటు తిరిగింది. మెలికలు తిరిగే నాగుపాములాంటి ఆమె నల్లని కురుల్లో రెండు పెద్ద గులాబీలు నవ్వుతున్నాయి.

అలీమ్ రాసిన ఆ ఉత్తరంలోని అక్షరాలు నా కళ్ళముందు మెదిలాయి. ఆ ఉత్తరాన్నే సాహీ నాకు తెచ్చి ఇచ్చింది. నీ కోసమే నేను ఈ పువ్వుని కోమలమైన ఒకానొక కొమ్మ నుంచి కోసాను. పొడవైన నీ నల్లని కురుల రాత్రికి మెరిసిపోయే ఒకానొక తారను చేద్దామని.

కాని ఈ పువ్వులతో ఆమెకేం సంబంధం?

అయినా నేను నా చేతిని ముందుకు చాచి పాముల్లా మెలికలు తిరిగే ఆమె రెండు జడల్నీ పట్టుకున్నాను. ఆ వెంటనే సాహీ ఆ పువ్వుల్ని తన జడల్లోంచి జారి పడిపోకుండా చేతులతో అదిమి పట్టుకొంది.

ఆమె వెంటనే నాగినిలా వెనక్కి తిరిగి విలవిల్లాడిపోతూ నన్ను చూసింది.

“ఈ పువ్వులంటే నీకంత ఇష్టమా?”

“అవును. ఈ పువ్వులే నన్నింత పిచ్చిదాన్ని చేసాయి రూహీ. అందుకే నిన్ను నవ్వించడానికి బదులుగా ఏడిపించినదాన్ని అయ్యాను”

నేను ఆమె మెడలో రెండు చేతులూ వేసి “నాకు చెప్పవూ?” అని అడిగాను.

ఆమె తన పెదవుల్ని నా చెవి దగ్గరకి తెచ్చి నెమ్మదిగా అంది-

“కొద్దిసేపటికి ముందు అతను ఈ పొద పక్కనే నా కోసం ఎదురు చూస్తూ నిల్చు

న్నారు. నేనలా వెళ్తూ వుంటే ఈ పువ్వులు నాకిచ్చి ముఖం కిందికి దించుకున్నారు.

'ఈ పువ్వులెవరికివ్వాలో తొందరగా చెప్పండి' అని వెంటనే నేనడిగాను.

ఆయన మూగబోయారు. మళ్ళీ నేనడిగాను- 'మాట్లాడరేమండీ. వీటిని నేనెవరికివ్వాలి? '

పాపం, ఆయనెంతో వివశులై అన్నారు- 'ఈ పువ్వులు నీకివ్వడానికి నే తగనా? " అని. అలా అంటూన్నప్పుడు అతని కళ్ళల్లోంచి రాలిన కన్నీటిబొట్లు ఆ పువ్వుల గుండెల్లో ఇంకిపోయాయి. నా చేతుల్ని ముందుకు చాచి అతని చేతిలోని పువ్వుల్ని తీసుకున్నాను. నా కురుల్లో ముడుచుకున్నాను'

సాహీ చెప్పడం ఆపి, నా కళ్ళల్లోకి తొంగిచూడసాగింది.

నేను కూడా ఆమె కళ్ళల్లోకి తొంగిచూసాను.

కన్నీటి సముద్రం సాహీ కళ్ళల్లోనే ఎక్కడో ఇంకిపోయింది. ఇప్పుడా కళ్ళలో శాంతి, సంతోషాల ఛాయలు అంతటా వ్యాపించి ఉన్నాయి.

"ఎవరే వాడు? " నాలో సహనం నశించింది. ఇంక ఆగలేక అడిగేసాను.

"కొంచెం మర్యాదగా మాట్లాడవే పిచ్చిదానా? " అంటూ సాహీ మళ్ళీ నా చెవి దగ్గర తన పెదవులు పెట్టి అంది- "నీ అన్నగారే!"

నేను విలవిల్లాడిపోయాను. ఆనందించనూలేకపోయాను. సాహీకి గిలిగింతలు పెట్టనూ లేకపోయాను.

"నువ్వు... నువ్వు... నాకు వదినవు...!"

"ఆc అవును" సాహీ మధ్యలోనే నా మాటల్ని ఆపివేసింది. తన జడల్లో తురుముకున్న ఆ పువ్వుల్ని సరిగ్గా ఉన్నాయో లేదో తన చేతులతో తడిమి మరొక్కసారి చూసుకొని సంతృప్తిచెంది అక్కడ్నుంచి తుర్రుమంది" కంటికి కనిపించకుండా.

"అన్నయ్యా!" నా పెదవుల వరకూ వచ్చిన ఈ మాటలు చెదిరిపోయాయి.

మొదటి వదిన చనిపోయి నాలుగేళ్ళయింది. అన్నయ్యకి ముగ్గురు కూతుళ్ళు కూడా. పెద్ద కూతురు సాహీ కంటే బహుశా ఏడాదో రెండేళ్ళో చిన్నదుంటుంది అంతే.

నా పిడికిల్లో గులాబీ పువ్వు రెక్కలున్నట్టు నేను మరచిపోయాను. కొన్ని నేల మీద పడి చెదిరిపోయాయి. అలీమ్ నన్ను కళ్ళు విప్పార్చి చూస్తూ అడిగాడు- "అసలు విషయమేమిటో చెప్పు" అని.

"పదండి, పోదాం.. మనం సాహీకంటే బాగా వెనకబడ్డాం"



- కె.కె. రఘునందన

వినోదం

తెలుగు కథ

"విన్నూ! విన్నూ! ప్లీజ్.. ఈ తడి దుస్తుల్లో నిన్ను చూస్తుంటే నాకెలాగనిపిస్తుందో తెలుసా? అసలు నువ్వేనా అని అనుమానంగా ఉంది. ఏదీ.. ఒక్కసారి ఇటు చూడు" అని ముందుకి అడుగేస్తూ తన వైపు వస్తున్న శ్రీవారు స్వరూప్‌ని కొద్దిగా కోపంగా చూసింది వినోద. ఒకింత గాఢంగా నిట్టూర్చి "ఏమిటీ.. నేను మీ కళ్ళకి ఈ తడి దుస్తుల్లో.. చాలా అందంగా! ఏదీ.. మరోసారి అనండి చూద్దాం" అంది నడుంమీదకి చెయ్యేస్కుని.

"ఆహా! అలా వయ్యారంగా నువ్వు నిల్చుంటే, ఒక్కో నీటి బిందువూ నీ నడుం దాటి వెళుతూ వుంటే.. నిన్ను నేను అమాంతం.." అంటూ ఒక్కసారిగా ముందుకి కదిలాడతను.

"ఆగండాగండి. మరొక్క అడుగు ముందుకి వేయడానికి వీల్లేదు. అసలు నన్నూ నా అవతారాన్నీ చూస్తుంటే మీకు వెటకారంగా ఉంది కదూ" అందామె కొర కొర చూస్తూ.

"హాస్యానికి కాదు విన్నూ! నిజంగానే.."

"ఏది నిజం? పనిమనిషి రానందుకు పనిష్మెంట్‌గా గిన్నెలు తోముకుని చెమటతో నేను చిత్తడి అయిపోతే, మీరేమో సౌందర్యారాధన ప్రారంభించారా మహాశయా!" ఈసారి వ్యంగ్యం తొంగిచూసింది ఆమె గొంతులో.

"అయితే మాత్రం.. నీ అందాలు మెరవటం లేదూ? "

"అందమా.. నా బొందా? ఈ వేసవి కాలంలో మా ఆడాళ్ళకి శిక్షే! మీ మగరాయుళ్ళ స్వేచ్ఛ మాకు లేదే!" చాలా విచారంగా అంది వినోద.

"ఆ మాటంటే నవ్వుతారెవరైనా! ఈ అపార్ట్‌మెంట్‌లో ఆడాళ్ళని చూడోసారి. పగల్లేదు, రాత్రిలేదు.. నైటీల్లోనే దర్శనమిస్తారు! నువ్వూ వేసుకోవచ్చు కదా!"

అతని మాట వింటూనే "ఆ గోనెసంచుల్లోకి దూరటం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఈ ఎండాకాలం రోజుల్లో మాత్రం మనిద్దరం చాలా దూరం సారూ! దయచేసి నన్ను కరిగించి, పొంగించి, లొంగదీసుకునే ప్రయత్నాలు విరమించుకోండి. సరేనా? " అందామె.

అది హెచ్చరికో, షరతో అర్థంకాలేదు స్వరూప్‌కి.

"ప్లీజ్.. విన్నూ! నువ్వింత కఠోర నియమ నిబంధనలు పెడితే మహా కష్టం. నే తట్టుకోలేను" వేడుకోలుగా చెప్పాడా మాటను.

"నో.. నో.. అసలు మీకీ చపల బుద్ధులు ఎలా పుడుతున్నాయో? అబ్బ.. ఈ గుండంలో ఉండలేకపోతున్నాం. ఒకటే ఉక్కబోత. దయచేసి ఇప్పుడు మీ మనసును ఆధ్యాత్మికం వైపు మళ్లించండి"

"అంతదాకా మడికట్టుకుని కూచోవాల్సిందేనా? "

"మహారాజులాగ! ఈ కాలంలో నాకు ఇటువంటివంటే మాచెడ్డ చిరాకు" కరాఖండీగా చెప్పేసిందామె.

డంగైపోయాడు స్వరూప్. అదేం

మాయోగానీ, ఉక్కబోత రోజుల్లో సరస సల్లాపాలకి పూర్ణబిందువు పెట్టేస్తుంది వినోద. ఏకాంతంగా అవకాశాలు చేజి క్కినా సరే, ఉపయోగించుకోడానికి ముందుకి రాదు. ఈ విషయంలో మాత్రం భర్తకామె బద్ధ విరోధే! అసలే ఎండలు ఫెళ్ళుమంటున్నాయి. ఆరంభంలోనే పక్క లు దూరం చేస్తుంది వినోద. కంటిమీద కునుకు శూన్యం స్వరూప్‌కి!

శారీరక - మానసిక ఆరోగ్యానికీ, ఉత్సా హానికీ, కంటినిండా కమ్మని కునుకుకీ సరసం ఒక చక్కటి సాధనమని ఆయు ర్వేదం ఏనాడో చెప్పింది. కానీ స్వరూప్ పాలిట ఈ కాలమే ఓ గండమయింది. శ్రీమతి ఆంక్షలు, నిబంధనలు దారుణమై నాయి. 'వెన్నెల్లో విహరించడానికి ఇది అనువైన కాలం' అని చెబితేససేమిరా కాదనేస్తుంది. చుట్టూ అపార్ట్‌మెంట్లవారి కళ్ళన్నీ ఎక్స్‌రే తీస్తాయంటుంది. కరెంటు కట్ అయిందంటే చాలు.. జనమంతా ఉండేది టెర్రస్‌పైనే! ఇదంతా చూశాక అత నికి ఓ చక్కటి ఆలోచన వచ్చింది.. "వినూ! ఇన్నాళ్ళూ ఇక్కడ స్వేచ్ఛ ఉండద న్నది నిజం. వెన్నెల్లో విహరించాలన్న కోరిక తీరటం లేదు. అందుకని మన సొంతూరు ధర్మవరం వెళదాం. అక్కడ మన ఇంటి డాబామీద హాయిగా ఉండొచ్చు. పిల్లల్ని మీ అమ్మ చూసుకుం టుంది" అని ప్రతిపాదించాడు.

"ఏమిటీ? సరస సల్లాపాలు వెన్నెల్లో పొందడానికి ఊరు వెళ్ళటమా? బాగుం ది! ఇప్పుడు పిల్లలను కంప్యూటర్ క్లాసెస్‌కి, స్పోకెన్ ఇంగ్లీషు కోచింగ్‌కి పంపాల్సి ఉంటుంది. అయినా పూర్వం పల్లెటూళ్ల కావు. మనం మేడ ఎక్కగానే ఆకతాయిల కళ్ళన్నీ మనమీదే.." అని కళ్ళల్లో కర్ర పెట్టిన చందంగా మాట్లాడిందామె.

ఏం చేయాలో తెలీని పరిస్థితి అతనిది!

★ ★ ★

వేసవికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. వేసవి వస్తే చాలు, ఎందరో యాత్రలకు బయలుదేరతారు. రైల్వే, ఆర్టీసీలు ప్రయా ణీకుల కోసం మరిన్ని అదనపు వాహనా లను ఏర్పాటు చేస్తాయి. డబ్బున్నవా ళ్ళంతా విడిది కోసం ఊటీ, కొడైకెనాల్, అరకు వ్యాలీ, హార్సిలీహిల్స్ వంటి చల్లని ప్రాంతాలకి వెళ్లి ఎంజాయ్ చేస్తారు. కమ్మ ని కొత్త ఊరగాయ రుచిచూడాలన్నా, మ ధురమైన తాటిముంజల చల్లదనాన్ని అను భవించాలన్నా ఈ కాలమే మజాగా ఉంటుంది. కానీ సరసానికి మాత్రం.. ఎండలు శిఖండి రూపు దాలుస్తాయి. భార్యాభర్తల నడుమ శల్యసారథ్యం వహి స్తాయి. చెప్పాపెట్టకుండా ఉండే అనధికార కరెంట్ కోత, ఆకులకు సంకెళ్ళు పడ్డట్లుగా చెట్లు మౌనం వహించటం.. గాలి కరువై

3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు సెప్టెంబరులో

ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 20, 21, 22 తేదీలలో మూడో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగే ఈ మహాసభలలో కవి సమ్మేళనాలు, గ్రంథావిష్కరణలు, పుస్తక ప్రదర్శనలు, తెలుగువెలుగుల చిత్రప్రదర్శన, జానపద కళారూపాల ప్రదర్శనలు మరెన్నో ఉంటాయి. ఆసక్తి కలిగిన భాషాభిమానులు పూర్తివివరాలకు **9440172642, 9440167697** చరవాణి నెంబర్లలో లేదా ఈ టపా : prapanchatelugu@gmail.com లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలియజేస్తున్నారు.



ఉక్కిరిబిక్కిరి అయ్యే శరీరాలు సరసానికి ఏమాత్రం సహకరిస్తాయి?

వినోద వాదన ఇదే! స్వరూప్‌కి ఇన్నిరోజులూ యుగాలే! అన్నిటినీ చూస్తుంటే అతని ఒళ్ళు మండిపోతోంది. ఈకాలం పోయేదెన్నడు? తన భార్య తన చేతుల్లో ఒదిగేదెన్నడు?

★ ★ ★

వినోదది అలవిగాని అందం. ఆమెలో సోయగాలన్నీ తొణికిసలాడుతుంటాయి. నాజూకు శిల్పంలా తీర్చిదిద్దాడు ఆ బ్రహ్మ.

పుట్టింటి నుంచి ఆమె ఏ సంపదతోనూ అడుగుపెట్టలేదు.. సౌందర్యమనే సంపదతో తప్ప! ఆమె ఉన్నది కాకపోయినా ఒంపుసొంపులున్నది. అందుకే స్వరూప్ ఆమెను మదిలో నిలిపేసుకున్నాడు. అతనెవరినీ కాంక్షించడు. పైచూపులు చూడడు. పరిచయం పెంచుకోడు. ఎంతవరకు ఉండాలో అంతవరకే! అంత నిష్టగా ఎందుకున్నాడంటే, భార్యగా వినోద పంచిపెట్టే ప్రేమాభిమానాలే!

అందమైన భార్య, పనస తొనల్లాటి పిల్లలు. పైగా, మనస్పర్థలకు తావులేదు. చిన్నపాటి తగవులు వచ్చినా, ఎవరో ఒకరు తగ్గిపోయి సరదాగా కలిసిపోతారు.

మరి ఎక్కడో ఏదో లోటు చేయడం ఆ భగవంతుడికి పరిపాటి కాబోలు! వచ్చిన చిక్కల్లా- మొదట్లో అత్యంత వైభవంగా భోగభాగ్యాలనందించిన వినోద... ఎండలొచ్చాయంటే చాలు.. మహా తిప్పలు పెడుతుంది. కిస్సులిమ్మంటే బుస్సుమంటూ నాగులా లేస్తుంది. దగ్గరవుదామంటే దూరంగా తోసేస్తుంది.

ఒకసారి “విన్నూ! నీకేమయినా పిచ్చెక్కిందా? వేసవంటే నీకు ఎందుకంత శత్రుత్వం? ” అని నిలదీశాడు స్వరూప్.

“సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నా! చిన్నప్పటి నుంచీ నాకు ఈ కాలమంటేనే చెడ్డ చిరాకు. మా అమ్మ నన్ను తాకినా నాకు కోపం వచ్చేది. మన పెళ్ళయిన వెంటనే ఎండలు మొదలయ్యాయి. సరిగ్గా అప్పుడే పంతులుగారు అత్యద్భుతమయిన ముహూర్తముందంటూ.. తొలిరేయికి ఏర్పాట్లు చేయమన్నారు. మరి జన్మలో అటువంటి అమృత ఘడియలు రావని తొందరపెట్టారు. అసలే వేసవి పొడ గిట్టని నేను ససేమిరా వద్దనన్నాను. ఆ ముహూర్తం రద్దు చేసేదాకా అన్నం, నీళ్ళు ముట్టలేదు. మగపెళ్లివాళ్ళు తొందర పెడుతున్నారని, ఇప్పుడు బెట్టు చూపిస్తే బాగోదని బతిమిలాడినా భీష్మించుక్కూచున్నాను. ఆనాడే నా వేసవి వ్యతిరేకత వ్యక్తంచేశాను. ఇప్పటికయినా అర్థం అయిందా? ” అని సిగ్గువిడిచి మరీ చెప్పుకొచ్చింది వినోద. ఆమె చెప్పిందంతా విన్నాక, మరి సాహసించలేదతను.

★ ★ ★

టి.వి.లో వాతావరణం గురించి చెబుతున్నారు. అల్పపీడనం ప్రభావం వల్ల ఇరవై నాలుగు గంటలలో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ గట్టిగా చెబుతోంది.

అంతవరకూ ముఖం చాటేసిన మబ్బులు.. ఆకాశమంతా తేలియాడసాగాయి. శీతలంగా ఉంది వాతావరణం. ఆఫీసులో ఉన్నాడన్నమాటే గానీ, పనిమీద దృష్టిలేదు స్వరూప్‌కి. అతని మనసులో తీయని భావనలు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న స్పందనలు. పిల్లలు వైజ్ఞానిక యాత్రలకు స్కూలువాళ్ళతో కలిసి వెళ్ళారు. అది గమనించే- ఇంట్లో ఒంటరిగా ఉండే వినోద, మారిన శీతల వాతావరణం.. స్వరూప్ సీట్లో నిలవలేకపోయాడు. వెంటనే సెలవు పడేసి వెళ్ళిపోయాడు.

అతను బైకు వేగంగా నడిపాడు. మూడు మూరల మల్లెలు కట్టించాడు. హల్వా వినోదకిష్టమని అరకిలో తీసుకున్నాడు. ఆత్రంగా ఇల్లు చేరాడు. లోపలికెళ్ళాడు.



షవర్ చప్పుడు! 'ఆహా.. జలకాలాట కాబోలు. ఇలా బయటకు రాగానే అలా అల్లుకుపోవాలి' అనుకున్నాడతను.

గడియ తీసుకొని వచ్చింది వినోద. అతను ముందుకెళ్ళబోతే, ఆగమంటూ సైగ చేసింది. తప్పన్నట్లుగా ముక్కుమీద వేలుంచింది.

"ఇంకా ఏమిటి నీ అభ్యంతరం? ఇంత చల్లటి వాతావరణంలో కూడా.."

"ముందు మూలనున్న ఆ చాపందు కోండి. బీరువాలో పాత చీర కూడా.."

"పాత చీరా! ఎంచక్కా కొత్త చీర కట్టుకో"

"అబ్బ! మీకన్నీ విప్పి చెప్పాలి. ఈ ఆటంకం నేను కల్పించింది కాదు మహా

శయా.. ప్రకృతి" అని ముసిముసిగా నవ్వుకుంది.

అప్పటిగ్గానీ అర్థంకాలేదు స్వరూప్‌కి.. ఆ అడ్డంకి మగవారి పాలిట శనిలాటిదని! హతవిధీ!

"సెలవు పెట్టి వచ్చారు కాబట్టి, ఇంక వలలుడి వేషం వేయండి" అని భార్య మరోసారి నవ్వుతూంటే అతనికి మండిపోయింది. మల్లెలు, హల్వా పొట్లాలు టేబుల్ మీద పడేశాడు.. నిరాశగా నీరుగారిపోతూ.

★ ★ ★

మూడురోజుల తర్వాత, మళ్లీ సూర్య ప్రతాపం మొదలు. యధా ఎండ.. తథా భగభగ!

"ఈ విషయంలో ఇంత హైరానా పడ్డం అనవసరం. ఏసీ పెట్టుకో.. నీ సమస్య పరిష్కారం అయిపోతుంది" అని ఆ వివరాలు ఏకరువు పెట్టాడు కొలీగ్ కోదండం లంచ్ అవర్‌లో. అదే విషయాన్ని ఇంటికి రావటంతోనే చెప్పాడు స్వరూప్.

"మీ గొర్రెతోక బెత్తెడంత జీతానికి ఎ.సి. ఒక్కటే తక్కువైంది. కరెంట్ బిల్ గూబ గుయ్యిమనిపిస్తుంది. ఇవన్నీ దండగమారి పనులు"

వినోద జవాబు విన్నాక, ఆ ఆలోచనకి స్వస్తి పలికాడు. ఇంక వరుణదేవుడొక్కడే తనకు దిక్కనుకున్నాడు స్వరూప్. రుతుపవనాల కోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూడసాగాడు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా వార్తలను ప్రసారం చేస్తూనే ఉంది. ఒకసారి రుతుపవనాలకి అనుకూలంగా వాతావరణం ఉందని, మరో రోజు-ఇప్పట్లో చినుకులు రాలే అవకాశాలు లేవని.. ఇలా రకరకాలుగా! స్వరూప్ పరిస్థితి డోలాయమానంగా ఉంది. సవ్యంగా సంసారంలో సరస సరిగమలు పలికిద్దామనుకుంటే మార్గాలన్నీ మూసుకుపోయి, గడ్డు కాలం దాపురించిదనుకున్నాడు.

ఆకాంక్షగా ఎదురుచూస్తున్న రైతన్నల కోసం వరుణ యాగం చేసేందుకు కోట్లు ఖర్చుపెట్టడానికి సైతం వెనుకాడ్డంలేదు ప్రభుత్వం. తొలకరి జల్లులకోసం.. రైతు మాట దేవుడెరుగు.. స్వరూప్ అనే అభాగ్యుడొకడు అందరికంటే ఆదుర్దా పడుతున్నాడన్న విషయం బల్ల గుద్ది చెప్పవచ్చు. వరుణ జపం చేస్తున్నది అతగాడే! ఎండలంటే ఏమాత్రం పొడగిట్టని భార్యకోసం.. ఆ ఎర్రని ఎండలు ఆవిరయిపోయి, కారు మబ్బులు కమ్మేసి, నేలంతా వర్షధారలతో తడిసి ముద్దవ్వాలని అనుకుంటున్నాడు. ఆ క్షణమే భార్య 'పవళింపు సేవ'కు పచ్చ జెండా ఊపుతుందని అతని భావన!

ఎప్పుడూ అదే యోచన. అదే ఆరాటం. అదే ఉత్సుకత. ఇంకా.. స్వరూప్‌కి బుర్రంతా చిరాగ్గా ఉంది. భార్య అతని సరసన చేరి సరిగ్గా మూడు మాసాలయింది!

ఎండలు రక్కసి పట్టు వీడడం లేదు. వాటిమీద ఎక్కడలేని కోపం తన్నుకొస్తోంది అతనికి. కానీ నిస్సహాయుడు కదా!

★ ★ ★

అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది స్వరూప్‌కి. తలుపులు, కిటికీలు టపటపా కొట్టుకుంటున్నాయి. భయంకరమైన ఈదురుగాలులు.. ఉరుములు.. మెరుపులు.. ఎక్కడో పిడుగులు.. హోరుమంటూ వర్షం! కుంభవృష్టి. ఒక్కసారిగా కలవరంగా వినోద లేచింది.

"అదేంటి.. వానా? మేడమీద బట్టలుండిపోయాయి" కంగారుగా అంది.

"నేను తెచ్చేశాగా.." అని ఒక్క ఉదుటున ఆమెను లాగబోయాడు స్వరూప్.

"అరె.. ఏమిటా దూకుడు? ప్లీజ్! వదలండి" అంటూ గింజుకుంది.

"వదిలేది లేదంతే. సమ్మర్‌కి గుడ్‌బై" అని భార్య చేయి పట్టుకున్నాడతను.

అనుకూల వాతావరణంలో, తనను మనువాడిన మగాడు పిలుస్తుంటే ఏ భార్య అల్లుకోదు చెప్పండి?



ఆ భార్యాభర్తల మధ్య మాటలు సన్యసించాయి. చేతులు ఉద్యమించాయి.

"ఏమండీ.. లేవండి. ఏమిటలా కిందపడ్డారు? అసలే ఉక్కబోతతో ఛస్తుంటే, కరెంట్ పోయింది కూడా" అని వినోద అంటుంటే తెలివిలోకి వచ్చేశాడతను.

'అయ్యో.. కలా? '

ఒక్కసారిగా పాల పొంగుపై చన్నీళ్ళు చిలకరించినట్లైంది. వరుణా! నీ కరుణ లేదా? గ్రీష్మ రుతువంతా శూన్యమాసమేనా? స్వరూప్‌లో వైరాగ్యం మొదలయింది.

భార్య వైఖరికి, అతనిలో అనుకోని స్తబ్ధత ఆవరించింది. ఇదివరకటి ఆత్రం, ఉద్విగ్నత మటుమాయమైపోయి ఓ మొద్దు రాచిప్పలా తయారయ్యాడు. వాతావరణ శాఖ చెప్పేది ఏదయినా, పట్టనట్లే ఉన్నాడు. రుతుపవనాలు చురుగ్గా కదలాడినా, మందకొడిగా ఉన్నా అతనికి ఒకటే! ఆఫీసుకి వెళ్ళటం, రావటం.. రెండే పనులు! భర్త ప్రవర్తన చిత్రంగా తోచింది వినోదకి.

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించాయి. మబ్బులతో ఆకాశం.. పొగచూరిన ఇంటికప్పులాగుంది.

ప్రభుత్వం చేస్తున్న వరుణయాగ ఫలితమో, ప్రకృతిమాత చల్లని చూపో తెలీదు కానీ.. వానలు మొదలయ్యాయి, రైతన్నల కడగండ్లు తుడవడానికి.. వర్షం.. మెల్లమెల్లగా సన్నని చినుకులతో మొదలైన వాన కుండపోతగా మార్పు చెందింది. ఎంచక్కా ముసుగు తన్ని పడుకున్నాడు స్వరూప్. ఆదివారం ఆఫీసు కూడా లేదు! దుప్పటిని సర్రున లాగినట్లైంది. దుప్పటిని కప్పేసుకున్నాడు. మళ్ళీ అదే విధంగా జరిగింది!

"ఏయ్! ఏమిటదీ? లే లే.. అబ్బ.. నన్ను తగలద్దు ప్లీజ్! అసలే ఉక్కబోత. ఉష్.." అని అతను మళ్ళా దుప్పటిని లాక్కోబోతే..

"ఏమిటీ.. అయ్యగారికి ఉక్కబోతా.. బయటంత వర్షం దంచి కొడుతుంటే.." అంది ప్రేమగా వినోద.

"అబ్బే! ఏ వానలూ లేవు. ఉత్తదే. ఒకటే ఎండలు. భగభగ.. నిప్పుల కొలిమి. నీకేమయినా కల వచ్చిందేమో? " అంటూనే ఏమీ తెలీనట్టుగా మొహంపెట్టాడు స్వరూప్.

"కల కాదు మహాశయా! అక్షరాలా నిజం. నా మాటలు నాకే అప్పగిస్తున్నారు కాబోలు. ఇదిగో గిల్లి చూపిస్తున్నా"

"అమ్మో!" ఒక్కసారిగా అరిచాడతను.

"సారీ.. సారీ.."

"వేసవంతా నన్నేడిపించి, ఇప్పుడు నన్ను మెప్పించాలనా? నాకు కోపం రాదూ? "

"మళ్లీ వేసవి వచ్చేదాకా మీ కోపాన్ని దిగమింగుకోండి. ఇప్పుడు నేనిచ్చే అందమైన అనుభూతుల్ని అందుకోండి"

"అసలు నన్నేడిపించడానికి కారణం? "

"విరహము కూడా సుఖమే కాదా.. అన్నాడో కవి. నాకెలాగూ వేసవంటే గిట్టదు. అందుకనే ఆ మూడు నెలల కాలం వియోగంలో గడుపుతాను. అప్పుడే జీవితంలో కొత్తదనం తొంగిచూస్తుంది. ఒక రకమైన అందముంటుంది. ప్రేమ కూడా పెరుగుతుంది. ఎప్పుడూ ఒకేలాగ ఉంటే మజా ఏమిటి చెప్పండి? "

"ఇదా దీని వెనకనున్న రహస్యం? అయితే జీవితాంతం నాకీ శిక్ష తప్పదు!"

"నెలకు మూడు వానలు కురవాలని కోరుకోండి. అప్పుడు వేసవన్నదే మన దరికి చేరదు. అటు రైతన్నలకీ ఇటు మీకూ.. ఉభయులకీ లాభమే!" అందామె భర్త గుండెల్లో గువ్వలా ఒదిగిపోతూ!

"సరే.. ఇప్పటికయినా మోక్షం లభించింది" అని ఆమెతో 'సై సై' అన్నాడతను. బయట వాన చప్పుడు.. కమ్మని సంగీతాన్ని వినిపిస్తోంది!

మనసాయెరా

ప్రకృతి ప్రేమ



ప్రకృతి కన్య
ఆకుపచ్చ చీరకట్టి
వసంతపు వయ్యారాలు పోతూంటే
కొమ్మకొమ్మన
కోయిలమ్మల సంగీతసభలు
చిగుళ్లు చేసిన
పుప్పొడి సంతకాలు
'జీవకోటి' రాస్తున్నట్టు
ప్రాణవాయువు సరఫరా చేస్తున్నట్టు
గమ్మత్తయిన 'జీవనరేఖ'
ఒంటరయిన కొండకు అండగా
ఓదారుస్తున్నట్టు జలపాత ధ్వని
అప్పుడప్పుడు కురుస్తున్న మంచు
అడవినంతా కప్పిన శ్వేతకంబళి
అక్కడక్కడ అమాయకపు గిరిపుత్రులు
వన్యమృగాల్ని ప్రేమించే
పూర్వీకుల వారసత్వపు దస్తావేజు
నా కలని చెదరనీయకు
నా ఆశకు నిప్పుపెట్టకు
నా ప్రకృతిప్రేమకు ఎసరు పెట్టకు
మనిషీ! మనసారా సహకరించు!!

– గుడిమెట్ల గోపాలకృష్ణ

శేష ప్రశ్న



ఇంట్లో ఇద్దరే!
ఇల్లంతా నిశ్శబ్దం
ఒకే గొడుగు కింద
ఉండడం ముఖ్యం కాదు
ఒకే చినుకై తడుస్తున్నారా?
ఒకే చెట్టుకింద
తల దాచుకున్నారన్నమాటే గానీ
ఒకే చలై వణుకుతున్నారా?

మన ప్రమేయం లేకుండానే
రుతువులు ఒకదాన్ని తరుముతూ వేరొకటి
కదిలిపోతూనే ఉంటాయ్ రథచక్రాల్లా

ప్రశ్నంతా ఒక్కటే...
వాళ్లిద్దరూ
ఒకే గాలై వీస్తున్నారా?
ఒకే నీరై ప్రవహిస్తున్నారా?
ఒకే నిప్పై రగులుతున్నారా?
ఒకే నేలై పరుచుకున్నారా?
ఒకే నింగై విస్తరిస్తున్నారా?

సమాధానం కోసం వెదుకులాటే
జీవితం? !

– డా. ఎస్వీ సత్యనారాయణ

నేనెవరిని? - 19

రూ.100/- బహుమతి

1	2	3	4	5	6

నేను ఆరు అక్షరాలతో విరహులకు బాధావహమైన వాటిలో ఒకదాన్ని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో.. 1. నాలుగు, ఒకటి అక్షరాలు కలిస్తే భార్య తండ్రి, భర్త తండ్రి. 2. ఐదు, ఒకటి అక్షరాలు కలిస్తే సుగ్రీవుని భార్య. 3. ఒకటి, రెండు అక్షరాలు కలిస్తే పర్వతం. 4. రెండు, మూడు అక్షరాలు కలిస్తే సంగీతంలో తాళంలాగే ప్రధానమైన అంగం.. ఒక తెలుగు నటి. మరి నేనెవర్ని?

1	2	3	4	5

నేను ఐదు అక్షరాలతో కామోద్రేకం కలిగించే వ్యక్తిని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో.. 1. ఒకటి, నాలుగు, ఐదు అక్షరాలు కలిస్తే దేవత, దేవుడు. 2. రెండు, నాలుగు, ఐదు అక్షరాలు కలిస్తే మన్మథుడు. 3. నాలుగు, రెండు అక్షరాలు కలిస్తే సుగ్రీవుని భార్య. 4. ఒకటి, రెండు అక్షరాలు కలిస్తే ప్రసిద్ధ టీవీ యాంకరు. నేనెవరినో చెప్పండి.

1	2	3	4	5

నేను ఐదు అక్షరాలతో ఉన్న నేను ప్రేమికులకు ఏకాంతాన్ని ఇస్తాను. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో.. 1. రెండు, ఐదు అక్షరాలు కలిస్తే తాలు, లోపల గింజలేని ధాన్యం. 2. ఒకటి, నాలుగు అక్షరాలు కలిస్తే చాలామందికి ప్రీతికరమైన అల్పాహారం. 3. మూడు, నాలుగు అక్షరాలు కలిస్తే తీరం. 4. రెండు, మూడు అక్షరాలు కలిస్తే గుబురుగా అల్లుకున్న మొక్కలు, తీగల గుంపు.. పెద్ద తుప్ప. ఇంతకీ నేనెవర్ని?

నేనెవరిని?-18 జవాబులు, విజేత - 80 పేజీలో..

పంపినవారి పేరు: ------------------------------------

వయసు (   ) చిరునామా: ------------------------------

----------------పిన్ : ----------- ఫోన్ : ----------------

నిబంధనలు

✷ 'నేనెవరిని?' ఇదే పేజీలో పూర్తిచేసి పంపాలి. ✷ ఇచ్చిన ఆధారాలకు అనుగుణమైన పదాన్నే గళ్లలో నింపాలి. ✷ తుడుపులు, కొట్టివేతలు ఉండరాదు. ✷ ఆల్ కరెక్ట్ రాసినవారే విజేతగా నిలుస్తారు. ✷ మా 'కీ'తో సరిపోలిన పూరణలనే పరిగణనలోకి తీసుకుంటాం. ✷ ఎక్కువ మంది సరైన జవాబులు రాస్తే డ్రా ద్వారా విజేతను ఎంపిక చేస్తాం. ✷ ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. ✷ ఒక్కొక్కరు ఎన్ని కూపన్‌లైనా పంపవచ్చు. ✷ విపుల వినోదిని, నేనెవరిని? , చతురంగం, చతురప్రవేశిక - ఒకే కవరులో పంపవచ్చు

పంపాల్సిన చిరునామా : **నేనెవరిని?**
విపుల, ఈనాడు కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్ - 082

చివరి తేదీ 18

నేనెవరిని?– 18 కి
సరైన సమాధానాలు రాసిన వారిలో డ్రా
ద్వారా ఎంపికైన ఈ విజేతకు
రూ.100/- త్వరలోనే అందుతాయి.

ఇందన మల్లిఖార్జునరావు
టాటా టవర్ రోడ్ ఎదురుగా,
రాజనాల సుబ్బారావు వీధి,
తంగెళ్లమూడి, ఏలూరు- 534 005

నేనెవరిని? - 18 జవాబులు

1	2	3	4	5
మ	ను	మ	సి	ద్ధి

1	2	3	4	5	6
శి	వ	రా	మ	రా	జు

1	2	3	4	5	6	7
పు	రా	ణ	పు	రు	షు	డు

1. తిప్పావఝుల వెంకట నారాయణ, మల్కాజిగిరి, 2. పి. ఆర్. నాయుడు, తిరుపతి, 3. వి.వి. సత్యనారాయణశెట్టి, తిరుపతి, 4. డా. శివభూషణం, కర్నూలు, 5. కణుగుల గ్రీష్మ, శ్రీకాకుళం, 6. పి. ప్రభావతి, హైదరాబాద్, 7. గేదెల రామారావు, ఏలూరు, 8. కరణం శివానందరావు, బెంగళూరు, 9. ధరణి పద్మాసన, హైదరాబాద్, 10. తల్లాప్రగడ భాస్కరరావు, న్యూ నల్లకుంట, 11. బి. విశ్వనాథరావు, సైదాబాద్, 12. కన్నేపల్లి నారాయణమూర్తి, శ్రీకాకుళం, 13. ఎస్. నాగశ్వేత, బెంగళూరు, 14. డా. సి. జనార్దన సింగ్, నల్లకుంట, 15. డా. చిన్నం వెంకటేశ్వర్లు, నందిగామ, 16. ఎస్. మంజుల కుమారి, కుప్పం, 17. పి. కుసుమ కుమారి, రాయకుదురు, ప.గో. జిల్లా, 18. ఎం. రామచంద్రరావు, హిల్‌కాలనీ, నల్గొండ జిల్లా, 19. కె. ప్రభావతీదేవి, పెదడోర్నాల, ప్రకాశం జిల్లా, 20. కె. భానుమతీదేవి, వనస్థలిపురం, 21. సి. నిర్మల, తిరుపతి, 22. టి. లక్ష్మీకుమారి, మచిలీపట్నం, 23. ఎ. అరుంధతి, కడ్కీ, పుణె, 24. గరికపాటి శ్రీచైతన్యకృష్ణ, కాకినాడ, 25. సిహెచ్. వి. కృష్ణమాచార్యులు, సైనిక్‌పురి, హైదరాబాద్, 26. బి.వి. నరసింహారావు, పేరాల, ప్రకాశం జిల్లా, 27. అవధానం రంగనాథం, బెంగళూరు, 28. ఇందిరా భోగెల, రాయగడ, ఒడిశా, 29. కె. సుజాత, రాయగడ, ఒడిశా, 30. జి. జయచంద్ర గుప్త, కర్నూలు, 31. గండ్లూరి బలరామశాస్త్రి, నాచారం, 32. నందెపు హనుమంతరావు, పోతవరం, తూ.గో. జిల్లా, 33. పసుమర్తి క్రిష్ణారావు, హైదరాబాద్, 34. నెల్లుట్ల సుదర్శనరావు, నిజాంపేట, 35. ఆంధ్ర అచ్యుతరామయ్య, తణుకు, 36. వెలసిరి రమాదేవి, నల్గొండ, 37. రామకూరు లక్ష్మి, శ్రీకాకుళం, 38. ఆర్. నాగేశ్వరరావు, శ్రీకాకుళం, 39. సిహెచ్. ఎస్. రామచంద్రమూర్తి, తాడేపల్లి, గుంటూరు జిల్లా, 40. ప్రతాపురంరామానుజాచారి, హన్మకొండ, 41. జె. రాజగోపాలరావు, ఎ.ఎస్. రావునగర్, 42. శివలెంక భ్రమర, మెహదీపట్నం, 43. పొణుకుమాటి లీలా ప్రవీణ, కొత్తనాగులూరు, కృష్ణాజిల్లా, 44. తుమ్మల వరలక్ష్మి, రామకృష్ణాపురం, విజయవాడ, 45. ఆలూరు ఎల్. సౌమ్య, శ్రీకాళహస్తి, 46. ఎం.వి. జోగేశ్వరశర్మ, అరసవిల్లి, శ్రీకాకుళం జిల్లా, 47. చెరుకువాడ హర్ష, విజయవాడ, 48. జయశేషసాయి, సామర్లకోట, తూ.గో. జిల్లా, 49. యల్లాప్రగడ కృష్ణమూర్తి, కొత్తపేట, 50. బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా, 51. పి.వి. రవికుమార్, తిరుపతి, 52. యు. నరసింహమూర్తి, లాలాపేట, సికింద్రాబాద్, 53. పి.వి. రమణారావు, మల్కాజిగిరి, 54. బి. సన్నీ, కడప, 55. బి. శ్రీనివాసరావు, చందానగర్, 56. బి. శాంతి, విజయవాడ, 57. పాలగుమ్మి విశ్వనాథం, కానాజిగూడ, సికింద్రాబాద్, 58. జి. కరుణ ప్రభాకర్, తిరుపతి, 59. యు. విజయశేఖర రెడ్డి, కూకట్‌పల్లి, 60. అల్లం అనిత, పరకాల, వరంగల్ జిల్లా, 61. కె.ఇ. నిలమంగై, ఈస్ట్ ఆనంద్‌బాగ్, 62. వి. భూలక్ష్మి, రాజమండ్రి, 63. సిహెచ్. కోటయ్య శాస్త్రి, కాకినాడ, 64. పి.ఆర్. శోభారాణి, ఏలూరు, 65. ఎన్.సి. సీతాదేవి, ఆత్రేయపురం, 66. ఎమ్. ప్రవల్లిక, తుని, 67. పప్పు కామేశ్వరరావు, అమలాపురం, 68. కె. నాగభూషణం, మల్కాజిగిరి, 69. బి.జె.పి. రామకృష్ణ, కాట్రేనికోన, 70. గెడ్డం భవాని, వీరవరం, తూ.గో.జిల్లా, 71. పి. సుజాత, గుంటూరు, 72. అనంతుల సుబ్బారావు, గుంటూరు, 73. రావి లలిత, ప్రసాదంపాడు, 74. పక్కి శ్రీదేవి, మెట్టపల్లి, విజయనగరం జిల్లా, 75. పి. దేవసేనమ్మ, సిద్ధార్థనగర్, హైదరాబాద్, 76. వల్లభ సైమన్, మచిలీపట్నం, 77. పిశిపాటి శైలజ, నవులూరు, గుంటూరు జిల్లా, 78. పాలకుర్తి సుధీర్‌కుమార్, మాదాపూర్, 79. టి.ఆర్. బాలకృష్ణారావు, రాజమండ్రి, 80. వేదుల నరసింహమూర్తి, గుడిమల్కాపూర్, 81. పి.యస్.వి. సుబ్బారావు, రాజమండ్రి, 82. చుండూరు అప్పల నరసింహం, కొడిగెనహళ్లి, బెంగళూరు, 83. ప్రతాప చంద్రశేఖర్, కరీంనగర్, 84. పంతం తమ్మయ్యదొర, గెద్దనాపల్లి, తూ.గో. జిల్లా 85. కొక్కెరగడ్డ అన్నపూర్ణ, మానేపల్లి, తూ.గో. జిల్లా, 86. కె.వి. లక్ష్మణరావు, మానేపల్లి, తూ.గో. జిల్లా, 87. పత్తుల అమృత నిరంజని, మచిలీపట్నం, 88. కాకర్లమూడి కృష్ణప్రసాద్, తణుకు, 89. బుద్ధకవి రాధ, కర్నూలు, 90. సూరి నాగరాజు, రామవరప్పాడు, కృష్ణా జిల్లా, 91. పి. సూర్యకిరణ్, కొత్తపేట, హైదరాబాద్, 92. మద్దూరి లక్ష్మీరాజ్యం, ఎర్రగడ్డ, 93. సౌదామినీ నాగరాజన్, విశాఖపట్నం, 94. ప్రమోద్‌కుమార్ సింగరాజు, రామంతాపూర్, 95. కొత్తపల్లి సుధాదేవి, చీరాల, 96. లింగాల సాంబశివరావు, మందపాడు, కృష్ణా జిల్లా, 97. బైటారు ఇందిర, హైదరాబాద్, 98. మంచాళ శ్రీలక్ష్మి, విశాఖపట్నం, 99. మండవ సూర్య, కొత్తగూడెం, 100. యమ్. అలమేలు, మల్కాజిగిరి, 101. వి. రమాదేవి, బెంగళూరు, 102. నందూరి, నాగేశ్వరరావు, బేగంపేట, 103. ఇ. రోహిణి, తాడేపల్లిగూడెం, 104. ఆర్. రామలక్ష్మి, మాదాపూర్, 105. కె. లక్ష్మీకమల, విజయవాడ, 106. గుర్రపు పురుషోత్తం, హనుమకొండ, 107. కరణం సుధీంద్రరావు, కర్నూలు, 108. పి. లక్ష్మీప్రసన్న, గుడిమల్కాపూర్, హైదరాబాద్, 109. తటవర్తి రామకృష్ణ, తాళ్లగడ్డ, హైదరాబాద్, 110. వడ్లమన్నాటి విమల, దిల్‌సుఖ్‌నగర్, 111. ఎం. విజయలక్ష్మి, ఒంగోలు, 112. ముళ్లపూడి స్వాతి, విజయనగరం, 113. సరిపల్లి నాగభూషణరావు, విజయనగరం, 114. గగనం రామలింగస్వామి, అనకాపల్లి, 115. కొత్తపల్లి సృజన, టెక్కలి, 116. ఎ. శ్రీకాంత్, మహబూబ్‌నగర్.



పరామర్శ

మనసును మెలిపెట్టే కథలు

ప్రపంచ భాషల్లో వెలువడుతున్న కథలను తెలుగు పాఠకులకు అందించి వారి మనోవికాసానికి దోహదం చేయాలన్న ప్రఖ్యాత పత్రికాధిపతి రామోజీరావు సంకల్పాన్ని 'విపుల' సాకారం చేస్తూ వస్తోంది. చలసాని ప్రసాదరావు సంపాదకత్వం నెరపిన రోజుల నుంచి ఇప్పటివరకూ 'విపుల'ను విడవకుండా చదువుతూ వస్తున్న నాకు అద్భుతంగా కనిపించే అంశాలు రెండు- సాహిత్య విలువలతో లవలేశమైనా రాజీపడకపోవడం, పత్రిక ప్రమాణాలను ప్రాణప్రదంగా పరిరక్షించడం. మనోహరమైన చిన్నారి ముఖచిత్రంతో అలరించిన 'విపుల' జులై సంచికలో నన్ను బాగా ఆకట్టుకున్న కథలు రెండు. కథకుల ఫైల్‌లోని 'గొప్పోళ్ళ న్యాయం', 35 ఏళ్ళనాటి విపులకథ 'తపోఫలం'. ఈ రెండూ మనసుని మెలిపెట్టే కథలు.



చట్టం సంపన్నుల చుట్టం అన్నది స్వాతంత్ర్యానికి పూర్వం లింగరాజు వంటి సమరయోధులు జైలులో ఉన్న రోజుల్లోనే కాదు ఆరున్నర దశాబ్దాల అనంతరం స్వపరిపాలనలో కూడా అక్షరాలా నిజమే. గతం కంటే వర్తమానం మరింత అధ్వానం. అంతకంటే ఈ కథల్లో నాకు కనిపించిన సారూప్యం మహిళ మనస్తత్వాన్ని ఇద్దరు రచయితలూ అర్థం చేసుకొని తమ పాత్రలను నిర్వహించిన విధానం. స్త్రీల అంకితభావానికీ, త్యాగశీలానికీ, విధేయతకూ 'గొప్పోళ్ళన్యాయం'లో ఎల్లి, 'తపోఫలం'లో లాఖూ నిదర్శనం. మానవనైజాన్ని కాచివడబోసిన చేయి తిరిగిన రచయితల కథలు ఈ రెండూ నాకు బాగా నచ్చాయి.

